ప్రశ్నోపనిషత్

శ్రీమత్ శఙ్కర భగవత్పాద విరచిత భాష్య సమేతా

తెలుగు అనువాదము

యల్లాప్రగడ వేంకట మల్లేశ్వరరావు

ఓం శ్రీ గణేశాయ నమః

ప్రశ్నోపనిషత్

ప్రార్థన

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవా భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః । స్థిరైరఙ్గైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః ||

స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః । స్వస్తి నస్తార్ క్ష్యో అరిష్టనేమిః । స్వస్తి నో బృహస్పతిర్దధాతు||

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః||

<u>**మంత్రార్థం**</u>

ఓం. ఓ దేవతలారా మంగళకరమైన విషయాలనే చెవులద్వారా విందుముగాక! యజ్ఞ కార్యాలలో నిమగ్నమై కన్నులతో మంగళకరమైన వాటినే చూచెదముగాక! సుస్థిరమైన అంగాలతో దేవతలను స్తుతిస్తూ దేవతల మేలుకొరకై జీవితాన్ని గడిపెదముగాక!

ప్రాచీనుడైన ఇంద్రుడు మాకు మంగళకరుడగుగాక! సర్వాన్ని ఎరిగిన పూష (సూర్యుడు) మాకు మంగళకరుడగుగాక! అరిష్టాలను తొలగించే గరుడుడు మాకు మంగళకరుడగుగాక! బృహస్పతి మాకు మంగళమును చేకూర్చుగాక!

ఆధ్యాత్మిక, ఆధి భౌతిక, ఆధి దైవిక తాపములు (మా యందు) ఉపశమించుగాక!

-:0:-

ఓం గణేశాయ నమః

ప్రశ్నోపనిషత్

ప్రథమః ప్రశ్నః

శంకరుల ఉపక్రమ భాష్యం

మంత్రోక్తస్యార్థస్య విస్తరానువాదీదం బ్రాహ్మణమారభ్యతే| ఋషిప్రశ్నప్రతివాచనాఖ్యాయికా తు విద్యాస్తుతయే| ఏవం సంవత్సరబ్రహ్మచర్యసంవాసాదితపోయుక్తైర్గ్రాహ్యా, పిప్పలాదవత్సర్వజ్ఞకల్పైరాచార్యైః వక్తవ్యా చ, న యేన కేనచిదితి విద్యాం స్తౌతి| బ్రహ్మచర్యాదిసాధనసూచనాచ్చ తత్కర్తవ్యతా స్యాత్ —

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మంత్ర భాగంలో చెప్పబడిన మంత్రాల అర్థాన్ని విస్తారంచేసి చెప్పడం కొరకు ఈ బ్రాహ్మణాన్ని ప్రారంభిస్తున్నారు. (అథర్వణ వేదానికి చెందిన మంత్రభాగంలోనిది ముండకోపనిషత్తు. ఆ ముండకోపనిషత్తులోని మంత్రాలను, అథర్వణ వేదంలోని బ్రాహ్మణ భాగంలో వివరంగా వ్యాఖ్యానం చేసి చెప్పారు. వాటినే ఈ ప్రశ్నోపనిషత్తుగా ఇపుడు అధ్యయనం చేయబోతున్నాం). చెప్పే విద్యయొక్క గొప్పదనాన్ని కీర్తించే ఉద్దేశ్యంలో ఈ వివరణను ఋషులు ప్రశ్న మరియు సమాధాన రూపంలో వ్యాఖ్యానించారు. సంవత్సరకాలం పాటు బ్రహ్మచర్యదీక్షను పాటించి, ఆశ్రమ నివాసం, తపస్సు మొదలైన సాధనలు కలిగిన సాధకులు, పిప్పలాదుల వంటి సర్వజ్ఞులైన ఆచార్యులనుండి మాత్రమే, ఆత్మజ్ఞానాన్ని గ్రహించగలిగారు. అంతేకాని, ఈ ఆత్మజ్ఞానమనేది మరే సాధారణ పద్ధతిలో గ్రహించగలిగిన ఇతర జ్ఞానాల వంటిది కాదని చెప్తూ, ఆత్మజ్ఞానం యొక్క ఘనతను ప్రస్తుతిస్తున్నారు. కాబట్టి, ఇందుకొరకు బ్రహ్మచర్యం మొదలైన సాధనాలను సూచించడం ద్వారా వాటిని శ్రద్ధగా పాటించవలసి యున్నందున (కథా క్రమాన్ని ఇలా ప్రారంభిస్తున్నారు).

[బ్రహ్మవిద్యను బోధించిన ముండకోపనిషత్తులో, పరబ్రహ్మ మరియు అపరబ్రహ్మ అనే రెండు రకాలైన విద్యల గురించి ప్రస్తావన ఉంది. వీటిలో అపరబ్రహ్మ గురించిన విద్య, కర్మలు మరియు ఉపాసనలకు సంబంధించినది. ఇందులో కర్మలను గురించి వేదాలలోని సంహితాభాగంలో వివరించగా, ఉపాసనల గురించి ఈ ప్రశ్నోపనిషత్తులోని 2వ మరియు 3వ ప్రశ్నలలో చెప్తున్నారు. 1వ ప్రశ్న కర్మలు మరియు ఉపాసనల పట్ల విముఖతను కలిగించేలా వాటి ఫలితాలను వివరించి చెప్తోంది. 4వ ప్రశ్న

ముండకోపనిషత్తులోని 'యథా సుదీప్తాత్పావకాద్విస్ఫులిఙ్గాః' (ముం.ఉ. 2-1-1) అంటూ మొదలయ్యే రెండు మంత్రాలకు విస్తారమైన వ్యాఖ్యానాన్ని ప్రకటిస్తోంది. 5వ ప్రశ్న ముండకోపనిషత్తులో 'ప్రణవో ధనుః ....' (ముం.ఉ. 2-2-4) అని చెప్పిన ఉపాసనా విషయాన్ని విస్తారం చేసి చెప్తోంది. 6వ ప్రశ్న ముండకోపనిషత్తులోని 'ఏతస్మాజ్జాయతే ప్రాణో' (ముం.ఉ. 2-1-3) అన్న మంత్రంలోని మిగిలిన భాగాన్ని వివరంగా చెప్తోంది. - ఆనందగిరి]

{ఇప్పుడు మనం అధ్యయనం చేయబోతూన్న ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తులో చెప్పబడిన మంత్రాలకు విపులమైన వ్యాఖ్యానమే. అందుచేత, ముందు ముండకోపనిషత్తును అధ్యయనం చేసిన తరువాత ఈ ప్రశ్నోపనిషత్తును అధ్యయనం చేస్తే లేదా రెండింటినీ కలిపి అధ్యయనం చేస్తే పాఠకులకు విషయం మొత్తమూ సమగ్రంగా విపులంగా అవగాహనకు వస్తుంది.}

ఓమ్. సుకేశా చ భారద్వాజః శైబ్యశ్చ సత్యకామః సౌర్యాయణీ చ గార్గ్యః కౌసల్యశ్చాశ్వలాయనో భార్గవో వైదర్భిః కబన్ధీ కాత్యాయనస్తే హైతే బ్రహ్మపరా బ్రహ్మనిష్ఠాః పరం బ్రహ్మాన్వేషమాణా ఏష హ వై తత్సర్వం వక్ష్యతీతి తే హ సమిత్పాణయో భగవన్తం పిప్పలాదముపసన్నాః || || 1-1 ||

భారద్వాజుని పుత్రుడైన సుకేశుడు, శిబి కుమారుడైన సత్యకాముడు, గర్గుని వంశానికి చెందిన సూర్యుని మనుమడు, అశ్వలాయుని కుమారుడైన కౌసల్యుడు, భృగు వంశానికి చెంది విదర్భలో జన్మించినవాడు మరియు కత్య వంశస్థుడైన కబంధీ. వీరందరూ బ్రహ్మమందు ఆసక్తిని, బ్రహ్మమందే నిష్ఠను కలిగి, పరబ్రహ్మమును అన్వేషిస్తున్నవారై, 'ఇతడే అదంతా (ఆ బ్రహ్మమును గురించిన సమస్త జ్ఞానాన్ని) బోధించగలడు' అని (తలచినవారై) పూజనీయుడైన పిప్పలాదుని వద్దకు సమిధలు చేతబట్టి సమీపించారు.

శంకరుల భాష్యం

సుకేశా చ నామతః, భరద్వాజస్యాపత్యం భారద్వాజః| శైబ్యశ్చ శిబేరపత్యం శైబ్యః, సత్యకామో నామతః| సౌర్యాయణీ సూర్యస్యాపత్యం సౌర్యః, తస్యాపత్యం సౌర్యాయణిః ; ఛాందసం సౌర్యాయణీతి ; గార్గ్యః గర్గగోత్రోత్పన్నః| కౌసల్యశ్చ నామతః, అశ్వలస్యాపత్యమాశ్వలాయనః| భార్గవః భృగోర్గోత్రాపత్యం భార్గవః, వైదర్భిః విదర్భేషు భవః| కబంధీ నామతః, కత్యస్యాపత్యం కాత్యాయనః ; విద్యమానః ప్రపితామహో యస్య సః ; యువప్రత్యయః| తే హ ఏతే బ్రహ్మపరాః అపరం బ్రహ్మ పరత్వేన గతాః, తదనుష్ఠాననిష్ఠాశ్చ బ్రహ్మనిష్ఠాః, పరం బ్రహ్మ అన్వేషమాణాః కిం తత్ యన్నిత్యం విజ్ఞేయమితి తత్ప్రాప్త్యర్థం యథాకామం యతిష్యామ ఇత్యేవం తదన్వేషణం కుర్వంతః, తదధిగమాయ

ఏష హ వై తత్సర్వం వక్ష్యతీతి ఆచార్యముపజగ్ముః| కథం ? తే హ సమిత్పాణయః సమిద్భారగృహీతహస్తాః సంతః, భగవంతం పూజావంతం పిప్పలాదమాచార్యం ఉపసన్నాః ఉపజగ్ముః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

సుకేశా సుకేశుడనే పేరుగల **భారద్వాజః** భారద్వాజుని కుమారుడు. **శైబ్యశ్చ** శిబి కుమారుడు **సత్యకామః** సత్యకాముడనే పేరుగల వాడు. **గార్గ్యః** గర్గ గోత్రానికి చెందిన **సౌర్యాయణీ** సూర్యుని పుత్రుడు సౌర్యుడు, ఆతని పుత్రుడు సౌర్యాయణిః సౌర్యాయణుడు. సౌర్యాయణీ అనడం (ఈ-కారాన్ని పలకడం) వైదిక ఛందస్సుగా స్వీకరించాలి. **కౌశల్యశ్చ** కౌశల్యుడనే పేరు గల **అశ్వలాయనః** అశ్వలుని కుమారుడు. **భార్గవః** భృగు వంశంలో జన్మించిన వాడైన భార్గవుడనే **వైదర్భిః** విదర్భ దేశస్థుడు. **కబంధీ** కబంధుడనే పేరు గల **కాత్యాయనః** కత్యుని కుమారుడు, ఈ పదంలోని యువ ప్రత్యయం కాత్యాయనుడనే పేరుచేత ప్రసిద్ధమైన అతని ప్రపితామహుడిని (తాతయొక్క తండ్రిని) సూచిస్తోంది. **తే హ ఏతే** వీరందరూ (ఈ 6 మంది) **బ్రహ్మపరా** అపరబ్రహ్మం పట్ల, అదియే పరబ్రహ్మమనే అభిప్రాయంతో, శ్రద్ధ కలిగిన వారు మరియు **బ్రహ్మనిష్ఠా** దానిని పొందేందుకు తగిన సాధనాలలో నిమగ్నులై **పరమ్ బ్రహ్మ అన్వేష్యమాణాః** పరమమైన బ్రహ్మాన్ని అన్వేషిస్తున్నవారు. (అంటే వారు అన్వేషించి అంతిమంగా తెలుసుకోవాలనుకొన్నది పరబ్రహ్మాన్ని గురించే. అయితే, వారు తమకు అనుభవానికి అందుతున్న అపరబ్రహ్మనే పరబ్రహ్మగా భావిస్తూ ఆ అపరబ్రహ్మకు సంబంధించిన సాధనలలో నిమగ్నమై ఉన్నారు). (ఆ పరబ్రహ్మం అంటే) ఏమిటది? ఏది శాశ్వతమో మరియు తెలియదగినదో దానిని పొందాలని, కష్టమైన ప్రయత్నం చేసి కోరికను సాధించుకొన్నట్లుగా, అన్వేషణ చేసినవారై, **ఏష హ వై తత్ సర్వమ్ వక్ష్యతి ఇతి** ఇతడే ఆ సమస్తమైన విషయాన్ని బోధిస్తాడు అనే నమ్మకంతో ఆచార్యుడిని సమీపించారు. ఏ విధంగా సమీపించారు? **తే హ సమిత్పాణయః** వారు సమిధలను చేతబట్టి **భగవన్తమ్ పిప్పలాదమ్** పూజనీయుడైన పిప్పలాదుడనే గురువును **ఉపసన్నాః** సమీపించారు.

{ఆరుగురు శిష్యులు ఉపాసనా మార్గాలను అనుసరించి అపరబ్రహ్మ తత్త్వాన్ని తెలుసుకొన్నవారు. అయితే, వారికి అనుభవానికి వచ్చిన ఈ అపరబ్రహ్మను మించినదీ, దానికే మూల కారణమైనదీ అయిన పరబ్రహ్మమనేది ఒకటున్నదనీ, ఆ పరబ్రహ్మమును తెలుసుకోవాలనే ఉత్సాహం కలవారై ఆ పరబ్రహ్మ గురించి ఎవరు బోధిస్తే తమకు ఆ తత్త్వం సమగ్రంగా అందుతుంది అని అన్వేషించారు. బ్రహ్మవిద్యను తెలుసుకొనగోరే శిష్యులకు ఉండాల్సిన అర్హతలను ఇది సూచిస్తుంది. ఏదో కాలక్షేపం కోసం తెలుసుకొనే లౌకిక విద్యల వంటిది కాదిది. ఈ పరబ్రహ్మను గురించి తెలుసుకోవాలంటే, సాధకుడు సంప్రదాయబద్ధమైన సాధనలతో కొంత మేరకు పరిణితి సాధించిన వాడై ఉండాలి. అలాగే ఇది సాధారణ గురువులచే బోధించబడే విషయం కూడా కాదు. కేవలం శ్రోత్రియుడు మరియు బ్రహ్మనిష్ఠుడు మాత్రమే అందుకు సమర్థుడు. శ్రోత్రియుడు అంటే అతడు బోధించే విషయాలకు వేదములే ప్రమాణాలై ఉండాలి. వేద ప్రమాణాలతో విభేదించే విషయాల గురించి అతడికి అభిప్రాయముండదు. అంతేకాదు, అతడు బ్రహ్మనిష్ఠుడై కూడా ఉండాలి. అంటే, కేవలం వేద ప్రమాణాలకు అనుగుణంగా విషయాలను

బోధించడం మాత్రమే కాదు, ఆ వేద వాక్యాల ద్వారా తెలియబడే పరమాత్మయందు నిరంతరం స్థితిని కూడా కలిగి ఉండాలి. అట్టి వాడిని బ్రహ్మనిష్ఠుడు అంటారు. అటువంటి లక్షణాలు కల ఆచార్యుని గురించి అన్వేషించి, అందుకు తగిన ఆచార్యుడు పిప్పలాద మహర్షి అని గ్రహించిన వారై, ఆయన సమీపానికి ఈ ఆరుగురు శిష్యులు చేరారు. ఏ అభిప్రాయంతో చేరారు? ఇతడైతే మాకు ఆ పరబ్రహ్మన్ని గురించి సమగ్రంగా బోధించగలడు అనే దృఢమైన నమ్మికతో చేరారు. ఏ విధంగా సమీపించారు? సమిధలను చేతబట్టి సమీపించారు. అంటే తమ సేవాభావాన్ని సమిధలను చేతబూనడం ద్వారా వ్యక్తపరుస్తూ సమీపించారు.}

తాన్హ స ఋషిరువాచ భూయ ఏవ తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా సంవత్సరం సంవత్స్యథ యథాకామం ప్రశ్నాన్పృచ్ఛత యది విజ్ఞాస్యామః సర్వం హ వో వక్ష్యామ ఇతి|| || 1-2 ||

వారితో ఋషి, "తపసుతోనూ శ్రద్ధతోనూ బ్రహ్మచర్యంతోనూ సంవత్సర కాలం పాటు (ఇక్కడ) గడపండి. తర్వాత మీకు తోచిన ప్రశ్నలు అడగండి. నాకు తెలిసినట్లైతే, అంతా మీకు తెలియచేస్తాను" అని అన్నాడు.

శంకరుల భాష్యం

తాన్ ఏవముపగతాన్ సః హ కిల ఋషిః ఉవాచ భూయః పునరేవ — యద్యపి యూయం పూర్వం తపస్విన ఏవ, తథాపిహ తపసా ఇంద్రియసంయమేన విశేషతో బ్రహ్మచర్యేణ శ్రద్ధయా చ ఆస్తిక్యబుద్ధ్యా ఆదరవంతః సంవత్సరం కాలం సంవత్స్యథ సమ్యగ్గురుశుశ్రూషాపరాః సంతో వత్స్యథ| తతః యథాకామం యో యస్య కామస్తమనతిక్రమ్య యద్విషయే యస్య జిజ్ఞాసా తద్విషయాన్ ప్రశ్నాన్ పృచ్ఛత| యది తద్యుష్మత్పృష్టం విజ్ఞాస్యామః| అనుద్ధతత్వప్రదర్శనార్థో యది - శబ్దో నాజ్ఞానసంశయార్థః ప్రశ్ననిర్ణయాదవసీయతే సర్వం హ వో వః పృష్టార్థం వక్ష్యామ ఇతి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

తాన్ ఆ విధంగా (తనను) సమీపించిన వారితో **సః ఋషిః** ఆ ఋషి **ఉవాచ హ** ఇలా అన్నాడు. "మీరు ఇప్పటికే తాపసులై యున్నప్పటికీ, **భూయః ఏవ** అదే విధంగా ఇక్కడ కూడా **తపసా** ఇంద్రియాలను నియంత్రించడమనే అభ్యాసంతోనూ, ప్రత్యేకించి **బ్రహ్మచర్యేణ** బ్రహ్మచర్య దీక్షతోనూ **శ్రద్ధయా** సత్యం పట్ల ధృడమైన నమ్మకాన్ని కలవారై (శాస్త్రం పట్ల మరియు గురువాక్యం పట్ల అత్యంత విశ్వాసం కలిగినవారై) **సంవత్సరమ్** సంవత్సర కాలం పాటు **సంవత్స్యథ** సరియైన రీతిగా, అంటే చక్కగా గురు శుశ్రూష యందు పరిపూర్ణమైన ఆసక్తి కలిగియుండి ఇక్కడే గడపండి. అలా గడిపిన తరువాత, **యథాకామమ్** మీకు తోచిన, మీ కోరికకు తగియున్న ఏ విషయాలను మీరు

తెలుసుకోవాలనుకొంటున్నారో వాటి గురించిన **ప్రశ్నాన్** ప్రశ్నలను **పృచ్ఛత** అడగండి. **యది విజ్ఞాస్యామః** మీరు ప్రశ్నించిన విషయాలు మాకు తెలిసినట్లైతే, **సర్వమ్ హ వః** మీరు అడిగినదంతా **వక్ష్యామః** తెలియజేస్తాము. 'యది' అన్న పదం ఆచార్యుని సత్యశీలతను, నిబద్ధతను తెలియజేస్తోంది (తెలియకపోయినా చెప్పడం అనేది గురువు తత్త్వం కాదని చెప్పడమే ఇక్కడ ఉద్దేశ్యం).

అథ కబన్ధీ కాత్యాయన ఉపేత్య పప్రచ్ఛ| భగవన్కుతో హవా ఇమాఃప్రజాః ప్రజాయన్త ఇతి || || 1-3 ||

ఆ తరువాత, కత్యుని వంశజుడైన కబన్ధుడు, (ఆచార్యుడిని) సమీపించి, "ఓ పూజనీయుడా! ఎక్కడ నుండి నిజానికి ఈ ప్రజలు పుడుతున్నారు?" అని ప్రశ్నించాడు.

శంకరుల భాష్యం

అథ సంవత్సరాదూర్ధ్వం కబంధీ కాత్యాయనః ఉపేత్య ఉపగమ్య పప్రచ్ఛ పృష్టవాన్ — హే భగవన్ , కుతః కస్మాత్ హ వై ఇమాః బ్రాహ్మణాద్యాః ప్రజాః ప్రజాయంతే ఉత్పద్యంతే ఇతి| అపరవిద్యాకర్మణోః సముచ్చితయోర్యత్కార్యం యా గతిస్తద్వక్తవ్యమితి తదర్థోఽయం ప్రశ్నః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అథ ఆ తరువాత, అంటే సంవత్సర కాలం ముగిసిన పిమ్మట, **కబన్ధీ కాత్యాయనః** కత్యుని వంశస్థుడైన కబన్ధుడు **ఉపేత్య** (ఆచార్యుడిని) సమీపించి **పప్రచ్ఛ** ఇలా ప్రశ్నించాడు. **భగవన్** ఓ పూజనీయుడా! **కుతః** ఎక్కడ నుండి **హ వై ఇమాః ప్రజాః** నిజంగా ఈ బ్రాహ్మణులు మొదలైన ప్రజలు **ప్రజాయన్తే** జన్మిస్తున్నారు? **ఇతి** అని (ప్రశ్నించాడు). (ఇలా ప్రశ్నించడంలో అభిప్రాయమేమంటే) అపర విద్యను (అంటే ఉపాసనలను) మరియు కర్మలను (వేదవిహితమైన కర్మలను) రెండింటిని కలిపి ఆచరించడం మరియు దాని ఫలితం అనేది చెప్పతగిన విషయం (కాబట్టి ఆ విషయాన్ని తెలియజేయండి అని ప్రార్థించాడు). అందుకోసమే (కబన్ధుడు) ఈ ప్రశ్నను అడుగుతున్నాడు.

{శిష్యుడు అడిగిన ప్రశ్న, 'ఈ ప్రజలందరూ ఎక్కడి నుండి జన్మిస్తున్నారు?' అని. అయితే కర్మలను ఉపాసనలను కలిపి ఆచరించిన వానికి ఏ ఫలితం కలుగుతుందో దాని గురించి చెప్తే శిష్యునికి కావలసిన సమాధానం దొరుకుందని శంకరులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యాఖ్యానం అంత సమంజసంగా అన్పించడం లేదేమో అనే సందేహం వచ్చే అవకాశం ఉంది. కొంచెం లోతుగా ఆలోచిస్తే విషయం తేలికగా అర్థమై, శంకరుల అభిప్రాయం సహేతుకమే అన్పించక మానదు. ప్రజలు ఎక్కడి నుండి పుడుతున్నారు అంటే, తల్లి గర్భం నుంచి పుడుతున్నారా లేక తండ్రి వీర్యం నుండి పుడుతున్నారా లేక

ఏదైనా ఊర్ధ్వలోకం నుండి ఊడిపడుతున్నారా అన్నది కాదు ఇక్కడ ప్రశ్న. ప్రజలు పుట్టడానికి అసలైన కారణమేదో దానిని తెలుసుకోవాలన్నది శిష్యుని ప్రశ్న. ఎక్కడనుండి అంటే ఏ కారణం వల్ల జన్మ కలుగుతోంది అని అర్థం చేసుకోవాలి. కర్మలు మరియు ఉపాసనలను ఆచరించిన వానికి, వాటి వల్ల ఫలితమనేది తప్పని సరిగా కలిగి తీరవలసిందే. అలా కలిగిన ఫలితాన్ని ఆ కర్మలను-ఉపాసనలను ఆచరించిన కర్త ఏ నాటికైనా అనుభవించి తీరవలసిందే. కర్మ శేషం మిగిలి ఉన్నంతకాలం, ఆ కర్మఫలాన్ని అనుభవించేందుకు జన్మలను పొందుతూ ఉండవలసిందే. కాబట్టి, ప్రజల జన్మలకు అసలు కారణం గతంలో వారు ఆచరించిన కర్మలు-ఉపాసనల యొక్క ఫలితాలే. అందుచేత, కర్మలు-ఉపాసనల వల్లే ఏయే ఫలితాలు కలుగుతాయో వాటిని గురించి తెలియజేస్తే, శిష్యునికి ప్రాణుల జన్మలకు కారణం తెలిసిపోతుంది. అందుచేత, శంకరులు కర్మలు-ఉపాసనల వల్ల కలిగే ఫలితాలను తెలియచెప్పడం ద్వారా శిష్యుని ప్రశ్నకు సమాధానం చెప్పినట్లేనని భావిస్తున్నారు.}

తస్మై స హోవాచ ప్రజాకామో వై ప్రజాపతిః స తపోఽతప్యత స తపస్తప్త్వా స మిథునముత్పాదయతే| రయిం చ ప్రాణం చేత్యేతౌ మే బహుధా ప్రజాః కరిష్యత ఇతి||

|| 1-4 ||

అతనితో (కబన్ధునితో) అతడు (ఆచార్యుడైన పిప్పలాదుడు), "సంతానాన్ని కోరి ప్రజాపతి తపాన్ని ఆచరించాడు. తపాన్ని ఆచరించి, అతడు ఆహారం-ప్రాణం అనే ఒక జంటను, 'ఇవి నాకు అనేకమైన ప్రాణులను ఉత్పత్తి చేస్తాయి' అని భావించి సృజించాడు." అని చెప్పాడు.

<u>శంకరుల భాష్యం</u>

తస్మై ఏవం పృష్టవతే స హ ఉవాచ తదపాకరణాయాహ — ప్రజాకామః ప్రజాః ఆత్మనః సిసృక్షుః వై, ప్రజాపతిః సర్వాత్మా సన్ జగత్స్రక్ష్యామీత్యేవం విజ్ఞానవాన్యథోక్తకారీ తద్భావభావితః కల్పాదౌ నిర్వృత్తో హిరణ్యగర్భః, సృజ్యమానానాం ప్రజానాం స్థావరజంగమానాం పతిః సన్ , జన్మాంతరభావితం జ్ఞానం శ్రుతిప్రకాశితార్థవిషయం తపః, అన్వాలోచయత్ అతప్యత| అథ తు సః ఏవం తపః తప్త్వా శ్రౌతం జ్ఞానమన్వాలోచ్య, సృష్టిసాధనభూతం మిథునం ఉత్పాదయతే మిథునం ద్వంద్వముత్పాదితవాన్ రయిం చ సోమమన్నం ప్రాణం చ అగ్నిమత్తారం ఇత్యేతౌ అగ్నీషోమౌ అత్రన్నభూతౌ మే మమ బహుధా అనేకధా ప్రజాః కరిష్యతః ఇతి ఏవం సంచింత్య అండోత్పత్తిక్రమేణ సూర్యాచంద్రమసావకల్పయత్||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

తస్మై ఆ విధంగా ప్రశ్నించిన వానితో (కబన్ధునితో) **స హ ఉవాచ** అ సందేహాన్ని పోగొట్టడానికి ఆచార్యుడు ఇలా అన్నాడు. **ప్రజాకామః** తాను సంతానాన్ని సృజించాలనే అభిప్రాయం

కలిగిన **వై ప్రజాపతిః** తానే సకల జగత్తునకు మూలముగా ఉన్న సాక్షిని అనే విజ్ఞానాన్ని కలిగియుండి, ఆ విధంగా ప్రవర్తిల్లుతూ అదే భావనను ఆలోచిస్తూ, కల్పం ప్రారంభంలో ఎటువంటి ప్రవృత్తి లేని హిరణ్యగర్భుడు, ప్రాణులను సృజించాలని అనుకొన్నవాడై, కదలని-కదిలే వాటికి ప్రభువుగా ఉండి, గతజన్మలోని అనుభవజ్ఞానాన్ని, వేదం ప్రకాశింపజేసిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకొని **తపః** సుదీర్ఘమైన తపస్సుని **అతప్యత** ఆచరించాడు (తీవ్రమైన ధ్యానావస్థను పొందాడు). తరువాత **సః** అతడు (ప్రజాపతి) ఆ విధంగా **తపః తప్త్వా** తపస్సును ఆచరించి, విన్న వేదజ్ఞానాన్ని సమీక్షించుకొని, సృజించడానికి సాధనరూపమైన, **మిథునమ్** ఒక జంటను **రయిం చ** చంద్రుడిని, ఆహారాన్ని, **ప్రాణమ్ చ** మరియు అగ్నిని, ఆహారాన్ని స్వీకరించే దానిని (అంటే సూర్యుడిని) **సః** అతడు **ఉత్పాదయతే** ఉత్పత్తి చేశాడు. **ఇతి ఏతౌ** ఈ అగ్ని(సూర్యుడు)-చంద్రుడు అంటే తినేవి-తినబడేవి అనే ఈ జంట **మే** నా కొరకు **బహుధా** అనేకమైన **ప్రజాః** ప్రాణులను **కరిష్యత** సృష్టిస్తాయి **ఇతి** అని ఈ విధంగా ఆలోచించినవాడై, అండోత్పత్తి క్రమంలో సూర్య చంద్రాదులను సృష్టించాడు.

{సంవత్సరకాలం పాటు గురువుకు సమీపంలో ఉండి సేవ చేస్తూ బ్రహ్మము గురించిన విచారణ చేసిన శిష్యుడు అడిగిన ప్రశ్నకు ఆచార్యుడైన పిప్పలాదుడు ఇలా సమాధానం చెప్పడం ప్రారంభించాడు. కల్పం ప్రారంభం కాగానే ప్రాణులను సృష్టించాలని ప్రజాపతి అనుకొన్నాడు. ప్రజాపతి అంటే హిరణ్యగర్భుడు లేదా బ్రహ్మ. ఆ హిరణ్యగర్భుడు ప్రాణులను ఉత్పత్తి చేయాలని సంకల్పించాడు. ఆ సంకల్పానికి అనుగుణంగా ఈ ప్రాణులను ఏ విధంగా సృష్టి చేయాలనే ఆలోచన మొదలుపెట్టాడు. ఆ ఆలోచనకు ఆధారంగా గడిచిన కల్పాలలో సృష్టి ప్రారంభించబడిన అనుభవాన్ని వేదం ప్రకటించిన విధంగా జ్ఞప్తి చేసుకొని ఆ అనుభవజ్ఞానంతో సుదీర్ఘమైన ధ్యానావస్థలో విచారణ చేశాడు. అలా విచారించిన మీదట, సృష్టికి సహకరించే సాధనాలుగా రయి-ప్రాణం అనే జంటను మొదట సృజించాడు. రయి అంటే చంద్రుడు, ప్రాణం అంటే సూర్యుడు లేదా అగ్ని. చంద్రుడు ఆహారానికి ప్రతీక. సూర్యుడు ఆహార స్వీకారానికి ప్రతీక. సకల ప్రాణుల ఉత్పత్తికి ఈ తినబడేది-తినేది అనే జంటయే ప్రాతిపదిక. ఈ ప్రాతిపదిక మీదనే జగత్తులోని సకల ప్రాణుల ఉత్పత్తి ఆధారపడి ఉంటుందని అభిప్రాయం. ఇక ఈ తినబడేది-తినేది అనే జంట గురించి మరింత విశ్లేషణ చేయడం ద్వారా వాటి యదార్థతత్త్వాన్ని తెలియపరుస్తూ, ఆచార్యుడు తన ఉపదేశాన్ని కొనసాగిస్తున్నాడు.}

ఆదిత్యో హ వై ప్రాణో రయిరేవ చన్ద్రమా రయిర్వా ఏతత్సర్వం యన్మూర్తం చామూర్తం
చ తస్మాన్మూర్తిరేవ రయిః || **|| 1-5 ||**

ఆదిత్యుడే ప్రాణం, చంద్రుడే ఆహారం. లేదా స్థూలమైనదీ మరియు సూక్ష్మమైనదీ అయిన ఇదంతా ఆహారమే. అందున స్థూలమైనది (సూక్ష్మమైన దానికి) ఆహారమే.

శంకరుల భాష్యం

తత్ర ఆదిత్యః హ వై ప్రాణః అత్తా అగ్నిః| రయిరేవ చంద్రమాః| రయిరేవాన్నం సోమ ఏవ| తదేతదేకమత్తా అగ్నిశ్చాన్నం చ ప్రజాపతిరేకం తు మిథునం ; గుణప్రధానకృతో భేదః| కథం ? రయిర్వై అన్నమేవ ఏతత్ సర్వం| కిం తత్ ? యత్ మూర్తం చ స్థూలం చ అమూర్తం చ సూక్ష్మం చ| మూర్తామూర్తే అత్త్రన్నరూపే అపి రయిరేవ| తస్మాత్ ప్రవిభక్తాదమూర్తాత్ యదన్యన్మూర్తరూపం మూర్తిః, సైవ రయిః అన్నం అమూర్తేన అత్త్రా అద్యమానత్వాత్||

తథా అమూర్తోఽపి ప్రాణోఽత్తా సర్వమేవ యచ్చాద్యం| కథం ?

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

వాటిలో (ఆ జంటలో) **ఆదిత్యః హ వై** సూర్యుడే నిజానికి **ప్రాణః** ప్రాణం, తినేది, అగ్ని. **రయిః ఏవ చన్ద్రమా** ఆహారమే నిజానికి చంద్రుడు. 'రయిః' అంటే నిశ్చయంగా ఆహారమే, అదియే చంద్రుడు. అదే ఈ తినేది-తినబడేది అనే జంట ఒక్కటే మరియు అదియే ప్రజాపతి. ప్రజాపతి ఒకడే అయినా ప్రధానగుణాల భేదంతో జంటగా అయ్యాడు. ఎలా అయ్యాడు? **ఏతత్ సర్వమ్** ఈ సమస్తమూ **రయిః వై** ఆహారమే. సమస్తమంటే? **యత్ మూర్తమ్** చ ఏది స్థూలంగా ఉన్నదో అదీ మరియు **అమూర్తమ్ చ** సూక్ష్మంగా ఉన్నది అదీ కూడా. స్థూలమైనవీ, సూక్ష్మమైనవీ అన్నీ ఆహారాన్ని గ్రహించేవే అయినా **రయిః వై** అవన్నీ నిజానికి ఆహారమే. **తస్మాత్** అందువలన అంటే స్థూలమైన వాటిని సూక్ష్మమైనవి ఆహారంగా గ్రహిస్తాయి కాబట్టి, **మూర్తిః** సూక్ష్మమైన వాటికి భిన్నమైన ఇతర స్థూలమైన రూపాలు అన్నీ కూడా **రయిః ఏవ** ఆహారమే.

అదే విధంగా, తినబడే ప్రతీదీ కూడా ఆహారాన్ని తినే సూక్ష్మమైన ప్రాణమే. అది ఎలా?

{రయి-ప్రాణం అన్న ద్వయాన్ని ప్రజాపతి ఉత్పత్తి చేశాడు అంటే, తనకు భిన్నమైన వేరొక పదార్థం నుండి వాటిని తయారు చేశాడని అనుకోవద్దు. ప్రజాపతియే తనను తాను రయి-ప్రాణం అనే జంటగా విభజించుకొన్నాడని గ్రహించాలి. రయి అనేది స్థూలత్వానికి ప్రతీక. అలాగే ప్రాణం అనేది సూక్ష్మత్వానికి ప్రతీక. అంటే సృష్టిలోని స్థూలంగా కనబడుతూ రూపాన్ని సంతరించుకొన్న సకలాన్ని రయిగా స్వీకరించాలి, సూక్ష్మంగా ఉండి రూపం లేని సకలాన్ని ప్రాణంగా స్వీకరించాలి. ఇక్కడ దేనిని స్థూలమనీ, దేనిని సూక్ష్మమనీ తెలుసుకోవడానికి కొలబద్ద ఏమీ లేదు. ప్రతిదీ దాని కన్నా సూక్ష్మమైన వాటికన్నా స్థూలమైనదే. అలాగే ప్రతిదీ దాని కన్నా స్థూలమైన వాటికన్నా సూక్ష్మమైనదే. మరి రయి అంటే తినబడేది అనీ, ప్రాణం అంటే తినేది అని గత మంత్రంలో చెప్పారు కదా దాని సంగతేమిటి అనే సందేహం కలగవచ్చు. స్థూలమైన ప్రతిదీ దానికి సూక్ష్మమైన వాటిలో లయమయ్యేదే, ఆహారమే అంటే

తినబడేదే. అంటే, సకల రూపాలకు కూడా వాటికన్నా సూక్ష్మమైన రూపాలు ఉండి తీరుతాయి కాబట్టి ప్రతి ఒక్కటి కూడా ఆహారమే అంటే తినబడేదే అవుతుంది. ఆ విధంగా ఆలోచిస్తే సృష్టిలోని ప్రతి ఒక్కటి కూడా ఆహారమే అవుతుంది. ఇదే తరహాలో సూక్ష్మమైన ప్రతిదీ దానికన్నా స్థూలమైన దాన్ని తనలో లయం చేసుకొనేదే, అంటే తినేదే. కాబట్టి, సృష్టిలోని ప్రతి ఒక్కటి కూడా తినేదే. ఇది ఎలాగ జరుగుతుందో ఉదాహరణతో తర్వాత మంత్రంలో వివరిస్తున్నారు.}

అథాదిత్య ఉదయన్యత్ప్రాచీం దిశం ప్రవిశతి తేన ప్రాచ్యాన్ప్రాణాన్రశ్మిషు సంనిధత్తే| యద్దక్షిణాం యత్ప్రతీచీం యదుదీచీం యదధో యదూర్ధ్వం యదన్తరా దిశో యత్సర్వం, ప్రకాశయతి తేన, సర్వాన్ప్రాణాన్రశ్మిషు సంనిధత్తే || || 1-6 ||

ఇక ఉదయించిన సూర్యుడు ఏ తూర్పుదిక్కులో ప్రవేశిస్తాడో, ఆ తూర్పు దిశలోనున్న సకల ప్రాణులను తన కిరణాలతో నింపుతాడు. ఏ దక్షిణ దిక్కులో, ఏ పడమర దిక్కులో, ఏ ఉత్తర దిక్కులో, ఏ అధో దిక్కులో, ఏ ఊర్ధ్వ దిక్కులో, ఏ సమస్తమైన అంతర దిక్కులన్నింటిలో ప్రకాశిస్తాడో, ఆయా దిక్కులలోని సకల ప్రాణులను తన కిరణాలతో నింపుతాడు.

<u>శంకరుల భాష్యం</u>

అథ ఆదిత్యః ఉదయన్ ఉద్గచ్ఛన్ ప్రాణినాం చక్షుర్గోచరమాగచ్ఛన్ యత్ప్రాచీం దిశం స్వప్రకాశేన ప్రవిశతి వ్యాప్నోతి, తేన స్వాత్మవ్యాప్త్యా సర్వాంతఃస్థాన్ ప్రాణాన్ ప్రాచ్యానన్నభూతాన్ రశ్మిషు స్వాత్మావభాసరూపేషు వ్యాప్తిమత్సు వ్యాప్తత్వాత్ప్రాణినః సంనిధత్తే సంనివేశయతి ఆత్మభూతాన్కరోతీత్యర్థః| తథైవ యత్ప్రవిశతి దక్షిణాం యత్ప్రతీచీం యదుదీచీం అధః ఊర్ధ్వం యత్ప్రవిశతి యచ్చ అంతరా దిశః కోణదిశోఽవాంతరదిశః యచ్చాన్యత్ సర్వం ప్రకాశయతి, తేన స్వప్రకాశవ్యాప్త్యా సర్వాన్ సర్వదిక్స్థాన్ ప్రాణాన్ రశ్మిషు సంనిధత్తే||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

అథ ఇక, **ఆదిత్యః ఉదయన్** సూర్యుడు ఉదయించి, అంటే ప్రాణుల కంటికి గోచరించేలా వచ్చి **యత్ ప్రాచీమ్ దిశమ్** తన స్వప్రకాశంతో ఏ తూర్పు దిక్కును **ప్రవిశతి** ప్రవేశిస్తాడో, వ్యాపిస్తాడో, **తేన** ఆ దిక్కునందలి సమస్తాన్నీ తన స్వరూపంతో వ్యాపించి **ప్రాచ్యాన్ ప్రాణాన్** తూర్పుదిక్కునందలి ఆహార రూపమైన ప్రాణులన్నింటినీ **రశ్మిషు** తన ప్రకాశరూపమైన కిరణాలలో **సంనిధత్తే** కలిపేసుకుంటాడు, అంటే తన స్వరూపంలో విలీనం చేసుకుంటాడు అని అభిప్రాయం. అదే విధంగా, ఏ దక్షిణ దిక్కులో, ఏ పడమటి దిక్కులో, ఏ ఉత్తర దిక్కులో, ఏ అధో దిక్కులో, ఏ ఊర్ధ్వ దిక్కులో మరియు ఏ అంతర దిక్కులైన మూలలు, అవాంతర దిక్కులు మరియ సమస్తమైన ఇతర దిశలలో ప్రకాశిస్తాడో, ఆయా వాటియందు తన స్వప్రకాశాన్ని వ్యాప్తి చేయడం ద్వారా సమస్త దిక్కులలోని సకల ప్రాణులను తన కిరణాలలో విలీనం

చేసుకుంటాడు. (అంటే ప్రాణమైన సూర్యుడు సకల చరాచర జగత్తును ఆహారంగా స్వీకరిస్తాడని గ్రహించాలి).

{ఇక, ఈ మంత్రంలో తినడం-తినబడటం అంటే ఏమిటో వివరిస్తున్నారు. తినడం అంటే తనకు వేరుగా ఉన్న మరొకదాన్ని తనలో లయం చేసుకోవడంగా భావించాలి. ఇందుకు ఉదాహరణగా సూర్యుడు తన కిరణాల వ్యాప్తి ద్వారా సమస్త దిక్కులలోని ప్రాణులను ప్రకాశింప చేయడాన్ని చూపిస్తున్నారు. ఆ విధంగా, జగత్తులోని సర్వము యొక్క ఉనికిని సూర్యుడు తన కిరణాలతో ప్రకాశింప చేసినట్లుగా, సకలమూ ప్రకాశింపబడేదే లేదా తినబడేదే.}

స ఏష వైశ్వానరో విశ్వరూపః ప్రాణోఽగ్నిరుదయతే|తదేతదృచాఽభ్యుక్తమ్||
|| 1-7 ||

ప్రాణము మరియు అగ్నిగా ఉత్పన్నమైన అతడే ఈ సకల ప్రాణులుగానూ, సకల రూపాలతోనూ ఉన్నాడు. ఇదే (ఈ క్రింది) ఋక్ మంత్రంచేత చెప్పబడింది.

శంకరుల భాష్యం

స ఏషః అత్తా ప్రాణో వైశ్వానరః సర్వాత్మా విశ్వరూపః విశ్వాత్మత్వాచ్చ ప్రాణః అగ్నిశ్చ స ఏవాత్తా ఉదయతే ఉద్గచ్ఛతి ప్రత్యహం సర్వా దిశః ఆత్మసాత్కుర్వన్| తదేతత్ ఉక్తం వస్తు ఋచా మంత్రేణాపి అభ్యుక్తం||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

సః ఏషః ఆహారాన్ని స్వీకరించే అతడే **ప్రాణః వైశ్వానరః** సకల ప్రాణులలో ప్రాణంగా గుర్తించబడి సకలానికి ఆత్మయైనవాడు. **విశ్వరూపః** విశ్వమంతటికీ ఆత్మయైనందున సకల రూపాలు కలిగినవాడు. **ప్రాణ అగ్నిః** ప్రాణము మరియు అగ్ని అయిన ఆతడే అంటే ఆహారాన్ని స్వీకరించేవాడే **ఉదయతే** అన్ని దిక్కులనూ తనలో ఐక్యం చేసుకొంటూ ప్రతిదినం ఉద్గమిస్తాడు, **తత్ ఏతత్** ఆ విషయమే **ఋచా** (ఈ క్రింది) మంత్రంచేత కూడా **అభ్యుక్తమ్** చెప్పబడింది.

{పైన చెప్పిన విధంగా జగత్తులోని సర్వస్వాన్ని తనలో లీనం చేసుకొనే వైశ్వానరుడనే ప్రాణమే సకల ప్రాణులలో విడివిడిగా ఉన్న ఆత్మ. అదియే సూర్యునిగా ప్రతిదినం ఉదయిస్తూ సకల దిక్కులలోనున్న ప్రాణులను తనలో లీనం చేసుకొంటోంది.}

విశ్వరూపం హరిణం జాతవేదసం పరాయణం జ్యోతిరేకం తపన్తమ్|
సహస్రరశ్మిః శతధా వర్తమానః ప్రాణః ప్రజానాముదయత్యేష సూర్యః|| || 1-8 ||

సకల రూపాలు కలదీ, కిరణమయమైనదీ, తేజోవంతమైనదీ, సకలానికి ఆశ్రయమైనదీ, ప్రకాశమే స్వభాంగా గలదీ, రెండవది లేనట్టిదీ, వెలుగులు పంచేదీ (తమ ఆత్మగా బ్రహ్మవేత్తలు తెలుసుకొంటారు). ఈ ఉదయించే సూర్యుడే, వేలాది కిరణాలు కలిగి అనేక రూపాలలో సకల ప్రాణులలో ఉన్న జీవం.

శంకరుల భాష్యం

విశ్వరూపం సర్వరూపం హరిణం రశ్మివంతం జాతవేదసం జాతప్రజ్ఞానం పరాయణం సర్వప్రాణాశ్రయం జ్యోతిః సర్వప్రాణినాం చక్షుర్భూతం ఏకం అద్వితీయం తపంతం తాపక్రియాం కుర్వాణం స్వాత్మానం సూర్యం విజ్ఞాతవంతో బ్రహ్మవిదః| కోఽసౌ యం విజ్ఞాతవంతః ? సహస్రరశ్మిః అనేకరశ్మిః శతధా అనేకధా ప్రాణిభేదేన వర్తమానః ప్రాణః ప్రజానాం ఉదయతి ఏషః సూర్యః||

యశ్చాసౌ చంద్రమా మూర్తిరన్నమమూర్తిశ్చ ప్రాణోఽత్తాదిత్యస్తదేతదేకం మిథునం సర్వం కథం ప్రజాః కరిష్యత ఇతి, ఉచ్యతే —

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

విశ్వరూపమ్ సకల రూపాలను పొందినది **హరిణమ్** కిరణాలతో నిండినది **జాతవేదసం** పరమ జ్ఞానం యొక్క ఎఱుక గలది **పరాయణమ్** సకలానికి ఆశ్రయమైనట్టిది **జ్యోతిః** సకల ప్రాణులలో చక్షురూపంగా ఉండేది **ఏకమ్** అద్వితీయం, రెండవది లేనిది, **తపన్తమ్** తపింపచేయడం అనే క్రియను నిర్వహించేది. (ఇటువంటి లక్షణాలు కలిగి) తమలో ఉన్న సూర్యుడిని బ్రహ్మవేత్తలు తెలిసి ఉంటారు. వారు తెలుసుకొన్న అతడు ఎవరు? **సహస్రరశ్మిః** వేలాది కిరణాలు కలిగి **శతధా వర్తమానః** వివిధ ప్రాణులలో ఉండి ప్రవర్తించే **ప్రాణః ప్రజానామ్** ప్రాణులలోని జీవంగా **ఏష సూర్యః** ఈ సూర్యుడే **ఉదయతి** ఉదయిస్తున్నాడు.

స్థూలంగా ఉండి ఆహారమైన చంద్రుడు మరియు సూక్ష్మమైన ప్రాణంగా ఉండి ఆహారాన్ని స్వీకరించే ఆదిత్యునితో కూడిన ఈ ఒక్క మిథునమే (జంటయే) సకల ప్రాణులను ఏ విధంగా పుట్టిస్తుంది అన్న విషయాన్ని (ఈ క్రింది మంత్రంలో) చెప్తున్నారు.

{ఆ సూర్యదేవతాకమైన ఆత్మ యొక్క లక్షణాలను ఈ మంత్రంలో నిర్వచిస్తున్నారు. వివిధ ప్రాణుల రూపాలను సంతరించుకొన్న ఈ ఆత్మ కేవలం జ్ఞానపుంజమే. అన్నింటికి అదే ఆధారం. అదికాక అలాంటిది మరొకటి లేనే లేదు. తనలో తానుండుటే కనుక క్రియ అనుకొన్నట్లైతే, ఆ ఒక్క క్రియను మాత్రమే దానికి ఆపాదించగలం. అన్నింటా ఉన్నట్టిది కనుక బ్రహ్మవేత్తలకు అది తెలిసినదై ఉంటుంది. ప్రాణులలో ఉదయించే ప్రాణమనబడే సూర్యుడు వాటితోపాటే ఉదయిస్తున్నాడు.

ఈ విధంగా రయిగానూ మరియు ప్రాణంగాను తనను తాను విభజించుకొన్న ప్రజాపతి, ఈ జంట ద్వారా ఏ విధంగా ప్రాణులను ఉత్పత్తి చేస్తాడు అనే విషయాన్ని క్రింది మంత్రంలో వివరిస్తున్నారు.}

సంవత్సరో వై ప్రజాపతిస్తస్యాయనే దక్షిణం చోత్తరం చ| తద్యే హ వై తదిష్టాపూర్తే కృతమిత్యుపాసతే తే చాన్ద్రమసమేవ లోకమభిజయన్తే| త ఏవ పునరావర్తన్తే తస్మాదేత ఋషయః ప్రజాకామా దక్షిణం ప్రతిపద్యన్తే| ఏష హ వై రయిర్యః పితృయాణః|| || 1-9 ||

సంవత్సరమే ప్రజాపతి. అతనికి దక్షిణం మరియు ఉత్తరం అనేవి మార్గాలు. ఎవరైతే క్రతువులు మరియు ఇష్టాపూర్తాలను నిర్వహిస్తారో వారు చంద్రలోకాన్ని నిశ్చయంగా జయిస్తారు. వారైతే తిరిగి వస్తారు (జన్మిస్తారు). అందువలన, సంతానాన్ని కోరిన ఋషులు దక్షిణమార్గాన్ని పొందుతారు. ఇదియే పితృయానం, అంటే (రయియే) ఆహారమే.

శంకరుల భాష్యం

తదేవ కాలః సంవత్సరో వై ప్రజాపతిః, తన్నిర్వర్త్యత్వాత్సంవత్సరస్య| చంద్రాదిత్యనిర్వర్త్యతిథ్యహోరాత్రసముదాయో హి సంవత్సరః తదనన్యత్వాద్రయిప్రాణైతన్మిథునాత్మక ఏవేత్యుచ్యతే| తత్కథం ? తస్య సంవత్సరస్య ప్రజాపతేః అయనే మార్గౌ ద్వౌ దక్షిణం చోత్తరం చ| ప్రసిద్ధే హ్యయనే షణ్మాసలక్షణే, యాభ్యాం దక్షిణేనోత్తరేణ చ యాతి సవితా కేవలకర్మిణాం జ్ఞానసంయుక్తకర్మవతాం చ లోకాన్విదధత్| కథం ? తత్ తత్ర చ బ్రాహ్మణాదిషు యే హ వై ఋషయః తదుపాసత ఇతి| క్రియావిశేషణో ద్వితీయస్తచ్ఛబ్దః| ఇష్టం చ పూర్తం చ ఇష్టాపూర్తే ఇత్యాది కృతమేవోపాసతే నాకృతం నిత్యం , తే చాంద్రమసమేవ చంద్రమసి భవం ప్రజాపతేర్మిథునాత్మకస్యాంశం రయిమన్నభూతం లోకం అభిజయంతే కృతరూపత్వాచ్చాంద్రమసస్య| తే ఏవ చ కృతక్షయాత్ పునరావర్తంతే ఇమం లోకం హీనతరం వా విశంతీతి హ్యుక్తం| యస్మాదేవం ప్రజాపతిమన్నాత్మకం ఫలత్వేనాభినిర్వర్తయంతి చంద్రమిష్టాపూర్తకర్మణా ప్రజాకామాః ప్రజార్థినః ఏతే ఋషయః స్వర్గద్రష్టారః గృహస్థాః, తస్మాత్స్వకృతమేవ దక్షిణం దక్షిణాయనోపలక్షితం చంద్రం ప్రతిపద్యంతే| ఏష హ వై రయిః అన్నం , యః పితృయాణః పితృయాణోపలక్షితశ్చంద్రః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అదియే (ఆ మిథునమే) **సంవత్సరః** సంవత్సరం అనబడే కాలం **వై ప్రజాపతిః** అదియే ప్రజాపతి. దాని వలనే (ఆ మిథునం వల్లనే) సంవత్సరం ఏర్పడింది. సూర్యచంద్రుల వలన కలిగే తిథులు-పగళ్ళు-రాత్రుల సముదాయమే సంవత్సరం. రయికి, ప్రాణానికి వేరుకానిదైనందున, సంవత్సరం కూడా ఈ మిథునంతో ఐక్యత్వం ఉన్నదే అని చెప్తున్నారు. అది ఎట్లా? **తస్య** సంవత్సరమే అయిన ఆ ప్రజాపతికి **దక్షిణమ్ ఉత్తరమ్ చ** దక్షిణం, ఉత్తరం అనే **అయనే** రెండు మార్గాలున్నాయి. ఇవి లోకంలో ప్రసిద్ధమైన ఆరు మాసాల లక్షణం కలిగిన అయనాలు లేదా మార్గాలు. ఈ దక్షిణ-ఉత్తర మార్గాలలోనే సూర్యుడు పయనిస్తూ, కేవలం కర్మలను మాత్రమే ఆచరించేవారికి మరియు ఉపాసనతో

కూడిన కర్మలను ఆచరించే వారికి ఫలితాలనిస్తాడు. ఏ విధంగా? **తత్** ఆ విషయమై **యే హ వై** బ్రాహ్మణులనుండి మొదలుకొని ఋషుల వరకు ఎవరైతే **తత్ ఉపాసతే** అలా అనుసరిస్తూ. రెండవ 'తత్' శబ్దాన్ని క్రియా విశేషణంగా తీసుకోవాలి. **తత్ ఇష్టా పూర్తే** ఇష్టి మరియు పూర్తం (ఇష్టి అనగా క్రతువులు నిర్వహించడం మరియు పూర్తం అనగా చెఱువులు, దేవాలయ నిర్మాణాదుల వంటి సంఘానికి శ్రేయాన్ని కలిగించే పనులు) చేయడం **ఇతి** వంటి వాటిని **కృతమ్** చేయడమనే ఉపాసనను నిర్వర్తిస్తారో వారు మాత్రమే, అంటే చేయబడని-శాశ్వతమైనదాన్ని ఉపాసించేవారు కాదు. (అంటే ఇక్కడ సూర్య గతిని అనుసరిస్తూ యాగములు, క్రతువులు చేయడం ద్వారా మరియు సంఘ శ్రేయస్సుకు అవసరమైన కార్యాలు చేయడం ద్వారా కర్మఫలాలను తయారు చేసుకొనే వారి గురించి మాత్రమే చెప్తున్నారు. అంతే కాని, శాశ్వతమైన పరబ్రహ్మాన్ని తెలుసుకొనేవారు చేయదగిన కర్మలు ఏవీ ఉండనందున వారు కర్మఫలాలను తయారు చేసుకోవడం అనేది లేనందువల్ల, వారి గురించి ఈ సందర్భంలో ప్రస్తావించడం లేదు అని అర్థం చేసుకోవాలి). **తే ఏవ** వారు (ఆ కర్మిష్ఠులు) మాత్రమే **చాన్ద్రమసమ్ లోకమ్** చంద్రలోకాన్ని, ప్రజాపతి యొక్క మిథునంలోని అంశ అయిన రయి, అంటే ఆహారమే రూపమైన లోకాన్ని **అభిజయన్తే** సాధించుకొంటారు. ఎందుకంటే, చంద్రలోకమనగా కర్మఫలానికి రూపం కాబట్టి (ఆ చంద్రలోకాన్ని పొందుతారు). కర్మఫలం నశించగానే **తే ఏవ** వారే ఈ లోకానికి (భూ లోకానికి) లేదా ఇంకా తక్కువ స్థాయి లోకానికి **పునరావర్తన్తే** తిరిగి వస్తారు. ఇదే విషయాన్ని ['ఇమం లోకం హీనతరం వా విశన్తి' (ముం.ఉ. 1.2.10)] ముండకోపనిషత్తు చెప్పింది. ఎలాగైతే ప్రజాపతిని **ఏతే** ఈ **ప్రజాకామాః** సంతానార్థులైన **ఋషయః** స్వర్గాన్ని పొందగోరే గృహస్థులు ఇష్టాపూర్త కర్మల ఫలంచేత ఆహారరూపమైన చంద్రునిగా తయారు చేశారో, ఆవిధంగానే **దక్షిణమ్** దక్షిణ మార్గమనే లక్షణం కలిగిన చంద్రుడిని కూడా వారు చేసిన కర్మల ఫలంగానే పొందారు. **ఏష హ వై రయిః** ఈ అన్నమే, ఆహారమే, **యః పితృయాణః** పిత్రుయానమనే లక్షణం కలిగిన చంద్రుడు.

{ఈ చంద్ర-సూర్యుల జంట అనబడే ప్రజాపతి వలననే కాలం అనేది నిర్మితమౌతోంది. కాలానికి సంవత్సరం ఒక కొలత. సూర్య చంద్రుల గతి వలననే పగళ్ళు-రాత్రులు-తిథులు-మాసాలు-అయనాలు అనే కాలమానాలు ఏర్పడుతున్నాయి. వాటి వలననే కర్మలు మరియు ఉపాసనలను ఆచరించేందుకు అనువైన పరిస్థితులు కలుగుతున్నాయి. సూర్య చంద్రుల గతిలోని ప్రత్యేకతల వల్ల సంవత్సరానికి ఆరు మాసాలు ఉత్తరాయణం మరియు ఆరు మాసాలు దక్షిణాయనం అనే రెండు మార్గాలు ప్రాప్తిస్తున్నాయి. కేవలం కర్మలను నిర్వర్తించడం వల్ల కర్మఫలాలు తయారుకాబడతాయి కాబట్టి వాటిని కృతం (చేయబడినవి) అంటారు. అంటువంటి కృతాలను చేసుకొన్నవారు దక్షిణ మార్గంలో కర్మఫలరూపమైన చంద్రలోకాన్ని అంటే రయిని పొందుతారు. అలాంటి వారు చేయబడిన కర్మఫలం పూర్తికాగానే తిరిగి అలా కాకుండా కర్మలతో పాటుగా దేవతానీకాన్ని ఉపాసించే వారు తిరిగి భూలోకానికి లేదా అంతకన్నా తక్కువ స్థాయి లోకాలకు వారి వారి కర్మశేషాలననుసరించి తిరిగి చేరుతారు. కాబట్టి,

రయి అంటే చంద్రలోకం కర్మఫలాలచే తయారు చేయబడినది అని అర్థం. అది ఆహారం. అంటే తినబడేది లేదా లయం కాబడేది. అంటే శాశ్వతమైనది కాదు అని తెలుసుకోవాలి.}

అథోత్తరేణ తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా విద్యయాఽఽత్మానమన్విష్యాదిత్యమ్ అభిజయన్తే| ఏతద్వై ప్రాణానామాయతనమేత దమృతమభయమేతత్పరాయణమ్ ఏతస్మాన్న పునరావర్తన్త ఇత్యేష నిరోధః| తదేష శ్లోకః|| || 1-10 ||

తరువాత తపస్సుచేత, బ్రహ్మచర్యం చేత, శ్రద్ధచేత, ఉపాసన చేత ఆత్మను అన్వేషించిన వారు, ఉత్తర మార్గంలో ఆదిత్యలోకాన్ని సాధిస్తారు. ఇదియే ప్రాణులకు ఆశ్రయస్థానం. ఇదియే అమృతం, అభయం. ఇదియే పరమోన్నతమైన స్థానం. దీనినుండి తిరిగి రారు. ఇది (అజ్ఞానులకు) నిరోధించబడినది. (తరువాత చెప్పబోయే) శ్లోకం దాని గురించే.

శంకరుల భాష్యం

అథ ఉత్తరేణ అయనేన ప్రజాపతేరంశం ప్రాణమత్తారం ఆదిత్యం అభిజయంతే| కేన ? తపసా ఇంద్రియజయేన| విశేషతో బ్రహ్మచర్యేణ శ్రద్ధయా విద్యయా చ ప్రజాపత్యాత్మవిషయయా ఆత్మానం ప్రాణం సూర్యం జగతః తస్థుషశ్చ అన్విష్య అహమస్మీతి విదిత్వా ఆదిత్యం అభిజయంతే అభిప్రాప్నువంతి| ఏతద్వై ఆయతనం సర్వప్రాణానాం సామాన్యమాయతనం ఆశ్రయః ఏతత్ అమృతం అవినాశి అభయం అత ఏవ భయవర్జితం న చంద్రవత్క్షయవృద్ధిభయవత్ ; ఏతత్ పరాయణం పరా గతిర్విద్యావతాం కర్మిణాం చ జ్ఞానవతాం ఏతస్మాన్న పునరావర్తంతే యథేతరే కేవలకర్మిణ ఇతి యస్మాత్ ఏషః అవిదుషాం నిరోధః, ఆదిత్యాద్ధి నిరుద్ధా అవిద్వాంసః| నైతే సంవత్సరమాదిత్యమాత్మానం ప్రాణమభిప్రాప్నువంతి| స హి సంవత్సరః కాలాత్మా అవిదుషాం నిరోధః| తత్ తత్రాస్మిన్నర్థే ఏషః శ్లోకః మంత్రః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

తరువాత **ఉత్తరేణ అయనేన** ఉత్తర మార్గంలో ప్రజాపతి అంశయైన ప్రాణం అనబడే ఆహారాన్ని స్వీకరించే **ఆదిత్యమ్** ఆదిత్యలోకాన్ని **అభిజయన్తే** జయిస్తారు. దేనిచే (జయిస్తారు)? **తపసా** తపస్సు చేత అంటే ఇంద్రియాలను జయించడం వలన. ప్రత్యేకించి **బ్రహ్మచర్యేణ** బ్రహ్మచర్యాన్ని పాటించడం చేత మరియు **శ్రద్ధయా విద్యయా** శ్రద్ధ-ఉపాసనల చేత ప్రజాపతిని తమ ఆత్మవిషయంగా, ప్రాణంగా, సూర్యునిగా, జగత్తులోని కదలని-కదిలే ప్రాణులయందుండే ఆత్మగా **ఆత్మానమ్** తమయందు **అన్విష్య** అన్వేషించడం ద్వారా ఆ ప్రజాపతియే తాము అని తెలుసుకొని ఆదిత్యలోకాన్ని జయిస్తారు. **ఏతత్ వై** ఇదియే **ప్రాణానామ్** సకల ప్రాణులకు సర్వసామాన్యమైన **ఆయతనమ్** ఆశ్రయం, విరామ స్థానం.

ఏతత్ ఇదియే **అమృతమ్** నశించడమనేది లేని స్థితి. అందుచేతనే **అభయమ్** భయమనేది లేనిది, అంటే చంద్రలోకంలో ఉన్నట్లుగా పెరగటం-తరగటం అనే భయాలు లేనట్టిది. **ఏతత్** ఇదియే **పరాయణమ్** కేవల ఉపాసకులకు మరియు కర్మలను-ఉపాసనలను కలిపి అనుష్ఠించిన వారికి కూడా అంతిమ గమ్యస్థానం. **ఏతస్మాత్ న పునః ఆవర్తన్తే ఇతి** కేవలం కర్మలను మాత్రమే అనుష్ఠించిన ఇతరుల లాగా, ఈ స్థానం నుండి తిరిగి రావడం అనేది (కేవలోపాసకులకు, కర్మోపాసకులకు) ఉండదు అని గ్రహించాలి. దీనివలన, **ఏషః** ఇది అజ్ఞానులకు **నిరోధః** నిరోధించబడినది. అంటే, అజ్ఞానులు ఆదిత్యలోకాన్ని పొందలేరు. వారు (అజ్ఞానులు) సంవత్సరాన్ని, ఆదిత్యుడిని, ప్రాణమైన ఆత్మను పొందలేరు. కాలరూపమైన సంవత్సరం అజ్ఞానులకు అడ్డంకే అవుతుంది. **తత్** ఈ అభిప్రాయాన్నే **ఏషః శ్లోకః** ఈ (క్రింది శ్లోకం) ప్రకటిస్తోంది.

{ఇంతకు ముందు మంత్రంలో అశాశ్వతమైన కర్మఫలాలతో కూడిన చంద్రలోకాన్ని కేవలం కర్మలు నిర్వర్తించేవారు పొందుతారని, ఆ చేయబడిన కర్మఫలం నశించగానే తిరిగి వారి వారి కర్మఫల శేషం కారణంగా ఈ భూలోకానికి కాని, ఇంకా తక్కువస్థాయి లోకాలకు కాని తిరిగి చేరుతారని చెప్పారు. మరైతే, కర్మలను ఉపాసనలకు జోడించి శ్రద్ధతోనూ ఆ ప్రజాపతినే తమ ఆత్మగా భావనచేసే వారు శాశ్వతమైన ఆదిత్య లోకాన్ని పొందుతారు. చంద్రలోకంతో పోలిస్తే, ఈ ఆదిత్యలోకం సూక్ష్మతరమైనది కాబట్టి, ఇది తనకు అన్యమైన ఇతరాన్నంతటినీ తనలో లయం చేసుకొంటుంది. అందుచేత, ఈ ఆదిత్యలోకం సకల ప్రాణులకు ఆశ్రయస్థానం. కేవలం ఉపాసనలను మరియు కర్మలతో కూడిన ఉపాసనలను అనుష్ఠించినవారికి మాత్రమే ఇది గమ్యస్థానం.}

పఞ్చపాదం పితరం ద్వాదశాకృతిం దివ ఆహుః పరే అర్ధే పురీషిణమ్| అథేమే అన్య ఉ పరే విచక్షణం సప్తచక్రే షడర ఆహురర్పితమితి|| || 1-11 ||

అతడు (ఆ ఆదిత్యుడు) ఐదు పాదములు కలవాడు, తండ్రి వంటి వాడు, పదిరెండు రూపాలు కలవాడు, స్వర్గలోకానికి పైన నీటితో నిండియున్నవాడు అని చెప్తారు. తర్వాత, మరైతే కొందరు, అతడు సర్వాన్ని తెలిసియున్న వాడని, ఆరేసి కమ్మీలు కల ఏడు చక్రాలతో విశ్వాన్ని స్థిరంగా ఉంచినవాడని చెప్తారు.

శంకరుల భాష్యం

పంచపాదం పంచ ఋతవః పాదా ఇవాస్య సంవత్సరాత్మన ఆదిత్యస్య, తైర్హ్యసౌ పాదైరివ ఋతుభిరావర్తతే| హేమంతశిశిరావేకీకృత్యేయం కల్పనా| పితరం సర్వస్య జనయితృత్వాత్పితృత్వం తస్య ; ద్వాదశాకృతిం ద్వాదశ మాసా ఆకృతయోఽవయవా ఆకరణం వా అవయవికరణమస్య ద్వాదశమాసైః తం ద్వాదశాకృతిం , దివః ద్యులోకాత్ పరే ఊర్ధ్వే అర్ధే స్థానే తృతీయస్యాం దివీత్యర్థః ; పురీషిణం పురీషవంతం ఉదకవంతం ఆహుః కాలవిదః| అథ

తమేవాన్యే ఇమే ఉ పరే కాలవిదః విచక్షణం నిపుణం సర్వజ్ఞం సప్తచక్రే సప్తహయరూపే చక్రే సంతతగతిమతి కాలాత్మని షడరే షడృతుమతి ఆహుః సర్వమిదం జగత్కథయంతి — అర్పితం అరా ఇవ రథనాభౌ నివిష్టమితి| యది పంచపాదో ద్వాదశాకృతిర్యది వా సప్తచక్రః షడరః సర్వథాపి సంవత్సరః కాలాత్మా ప్రజాపతిశ్చంద్రాదిత్యలక్షణో జగతః కారణం||

యస్మిన్నిదం ప్రోతం విశ్వం స ఏవ ప్రజాపతిః సంవత్సరాఖ్యః స్వావయవే మాసే కృత్స్నః పరిసమాప్యతే|

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

పఞ్చపాదమ్ అతనికి ఐదు ఋతువులు పాదాలు. సంవత్సరమే రూపంగా గలవాడైనందున ఆదిత్యునికి ఋతువులు పాదాలుగా వ్యవహరిస్తాయి. (మొత్తం ఋతువులు ఆరు కదా. మరి ఐదు ఋతువులు మాత్రమే ఎందుకు చెప్తున్నారనే సందేహానికి శంకరులు ఇలా సమాధానం చెప్తున్నారు). హేమంతం మరియు శిశిర ఋతువులను ఒక ఋతువుగా భావించారు. **పితరమ్** సకలాన్ని ఉత్పత్తి చేసినవాడైనందున తండ్రివంటి వాడు. **ద్వాదశాకృతిమ్** మాసాలనబడే పన్నెండు రూపాలుగా కలవాడు, అంటే 12 నెలలను అవయవాలుగా కలవాడు లేదా 12 మాసాలచేత నిర్మితమైన ఆకృతి కలిగిన వాడైనందున 'ద్వాదాశాకృతిమ్' అనబడేవాడు. **దివః** ద్యులోకానికి (ఆకాశానికి లేదా స్వర్గలోకానికి) **పరే** పైన **అర్ధే** స్థానంలో అంటే ద్యులోకానికి పైన మూడవ లోకంలో అని అభిప్రాయం. **పురీషిణమ్** జలంతో నిండిన వానిగా కాలజ్ఞులు (కాలం తత్త్వాన్ని తెలిసినవారు) **ఆహుః** చెప్పారు. **ఇమే పరే అన్యే ఉ** వీరికి అన్యులైన ఇతర కాలజ్ఞులైతే **విచక్షణమ్** నైపుణ్యం కలవానిగా, సర్వజ్ఞునిగా, **సప్తచక్రే** ఏడు అశ్వాలనబడే చక్రాలను కలిగి, ఎల్లప్పుడూ తిరుగుతూ ఉండి, **షడరే** ఆరు కమ్మీలు అనగా ఆరు ఋతువులతో కూడిన కాల స్వరూపంగా మరియు ఈ జగత్తు యావత్తూ దీనియందే **అర్పితమ్** స్థిరంగా రథం యొక్క ఇరుసులాగా స్థిరంగా కూర్చబడింది **ఇతి** అని **ఆహుః** చెప్తారు. ఐదు పాదాలు, పన్నెండు అవయవాలు కాని లేదా ఏడు చక్రాలు, ఆరు కమ్మీలైనా కాని, ఎలా చెప్పినా కాని, అది కాలస్వరూపమైన సంవత్సరమే అనగా చంద్రుడు-ఆదిత్యలక్షణమైన ప్రజాపతియే. అదియే సకల జగత్తునకు కారణం.

దేనియందైతే ఈ విశ్వమంతా నిలిచియున్నదో అదియే సంవత్సరం అనబడే ప్రజాపతి. అదియే ద్వాదశ మాసములనే అవయవాలుగా (భాగాలుగా) పరిణామం చెందినది.

{కాలరూపమైన ఈ ఆదిత్యలోకాన్ని ఈ మంత్రంలో వివరిస్తున్నారు. 5 ఋతువులు (హేమంత శిశిరాలను కలిపి ఒకే ఋతువుగా లెక్కించారు), 12 మాసాలుగా ఏర్పడిన సంవత్సరమనే ఈ కాల స్వరూపమైన ఆదిత్యలోకం స్వర్గానికి పైన జలంతో నిండి ఉంటుందని కొందరు కాల తత్త్వాన్ని తెలిసినవారు చెప్తారు. మరి కొంతమంది 7 అశ్వాలనబడే చక్రాలకు అమర్చబడిన 6 ఋతువులనే కమ్మీలతో ప్రయాణించే ఈ కాలమనే రథమే సమస్త విశ్వానికి ఆధారంగా ఉన్నదని చెప్తారు. ఎలా చెప్పినా కూడా, ఈ కాలమనేది ప్రజాపతియే తప్ప మరేమీ కాదు అని గ్రహించుకోవాలి.}

మాసో వై ప్రజాపతిస్తస్య కృష్ణపక్ష ఏవ రయిః శుక్లః ప్రాణస్తస్మాదేత ఋషయః శుక్ల ఇష్టం కుర్వన్తీతర ఇతరస్మిన్ || || 1-12 ||

మాసమే ప్రజాపతి. దానికి కృష్ణ పక్షమే రయి (ఆహారం). శుక్లపక్షమే ప్రాణం. అందువలననే ఈ ఋషులు శుక్లపక్షంలో యాగములు చేస్తారు. ఇతరులు మిగిలిన కాలంలో (కృష్ణ పక్షంలో) చేస్తారు.

శంకరుల భాష్యం

మాసో వై ప్రజాపతిః యథోక్తలక్షణ ఏవ మిథునాత్మకః| తస్య మాసాత్మనః ప్రజాపతేరేకో భాగః కృష్ణపక్ష ఏవ రయిః అన్నం చంద్రమాః అపరో భాగః శుక్లః శుక్లపక్షః ప్రాణః ఆదిత్యోఽత్తాగ్నిర్యస్మాచ్ఛుక్లపక్షాత్మానం ప్రాణం సర్వమేవ పశ్యంతి, తస్మాత్ప్రాణదర్శిన ఏతే ఋషయః కృష్ణపక్షేఽపీష్టం యాగం కుర్వంతః శుక్లపక్ష ఏవ కుర్వంతి| ప్రాణవ్యతిరేకేణ కృష్ణపక్షస్తైర్న దృశ్యతే యస్మాత్ ; ఇతరే తు ప్రాణం న పశ్యంతీత్యదర్శనలక్షణం కృష్ణాత్మానమేవ పశ్యంతి| ఇతరే ఇతరస్మిన్కృష్ణపక్ష ఏవ కుర్వంతి శుక్లే కుర్వంతోఽపి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మాసః వై మాసమే **ప్రజాపతిః** పూర్వం చెప్పబడిన మిథున రూపమైన ప్రజాపతి. **తస్య** మాసరూపమైన ప్రజాపతి యొక్క ఒక భాగం **కృష్ణపక్షః** కృష్ణ పక్షం **రయిః ఏవ** అది రయియే, అనగా చంద్రుడే, ఆహారమే. మిగిలిన భాగం **శుక్లః** శుక్లపక్షం **ప్రాణః** అదియే ప్రాణం, అంటే ఆదిత్యుడే, ఆహారాన్ని స్వీకరించే అగ్నియే. శుక్లపక్షం అంతటా ప్రాణమే నిండియున్నదని దర్శించడం చేత ప్రాణదర్శకులైన ఈ ఋషులు **శుక్లే ఇష్టమ్ కుర్వన్తి** శుక్లపక్షంలోనే యాగాన్ని చేస్తారు. కృష్ణపక్షంలో యాగం చేసినా కూడా (వారి దృష్టిలో అది ప్రాణంతో నిండిన శుక్లపక్షమే). ఎందుకంటే వారు (ఆ ఋషులు) కృష్ణపక్షాన్ని ప్రాణానికి వేరుగా దర్శించరు కాబట్టి. ఇతరులైతే ప్రాణాన్ని దర్శించ లేరు కాబట్టి వారు కేవలం కృష్ణపక్ష రూపాన్ని మాత్రమే చూస్తారు. అందుచేత, **ఇతరే** మిగిలిన వారు **ఇతరస్మిన్** కృష్ణపక్షంలోనే చేస్తారు. (ఒకవేళ) శుక్లపక్షంలో చేసినా కూడా (వారు ప్రాణాన్ని దర్శించే సమర్థత లేనందుచేత అది వారికి) కృష్ణపక్షమే అవుతుంది.

{సంవత్సరానికి 12 మాసాలు అని చెప్పిన మీదట, ఈ మాసాలలో శుక్ల-కృష్ణ పక్షాలనే విభాగాల యొక్క విశిష్టతను వివరిస్తున్నారు. కృష్ణ పక్షమంటే రయియేనని, శుక్ల పక్షమంటే ప్రాణమేనని భావించాలి. రయి అయిన కృష్ణపక్షం ఆహారం వంటిది కాబట్టి, అది శుక్లపక్షంలో లయిస్తుంది కాబట్టి, కాలజ్ఞులు అంతా శాశ్వతమైన శుక్లపక్షమేనని భావిస్తూ ఉపాసనాదికాలను అన్ని వేళలా నిర్వర్తిస్తుంటారు. అజ్ఞానులు మాత్రం భేదత్వాన్ని దర్శించడం చేత వారు చేసే ఉపాసనాదికాలు అన్నీ కృష్ణ పక్షంలో చేసినవే

అవుతాయి. అందుచేత, సాధకుడు కాలం యొక్క సమగ్ర స్వరూపాన్ని అర్థం చేసుకొని, అది అంతా ప్రజాపతియేననే భావనతో ఎల్లవేళలా కర్మలను ఉపాసనలను నిర్వర్తించాలి అని భావం.}

అహోరాత్రో వై ప్రజాపతిస్తస్యాహరేవ ప్రాణో రాత్రిరేవ రయిః ప్రాణం వా ఏతే ప్రస్కన్దన్తి యే దివా రత్యా సంయుజ్యన్తే బ్రహ్మచర్యమేవ తద్యద్రాత్రౌ రత్యా సంయుజ్యన్తే||

|| 1-13 ||

పగలు-రాత్రియే ప్రజాపతి. దానికి పగలే ప్రాణం. రాత్రియే రయి. పగలు భోగాలతో రంజించేవారు ప్రాణాన్ని వృథా చేస్తారు. ఎవరైతే రాత్రియందు భోగాలతో రంజించేవారు బ్రహ్మచర్యాన్ని పాటించినట్లే.

శంకరుల భాష్యం

సోఽపి మాసాత్మా ప్రజాపతిః స్వావయవే అహోరాత్రే పరిసమాప్యతే| అహోరాత్రో వై ప్రజాపతిః పూర్వవత్| తస్యాపి అహరేవ ప్రాణః అత్తా అగ్నిః రాత్రిరేవ రయిః పూర్వవదేవ| ప్రాణం అహరాత్మానం వై ఏతే ప్రస్కందంతి నిర్గమయంతి శోషయంతి వా స్వాత్మనో విచ్ఛిద్యాపనయంతి| కే ? యే దివా అహని రత్యా రతికారణభూతయా సహ స్త్రియా సంయుజ్యంతే మైథునమాచరంతి మూఢాః| యత ఏవం తస్మాత్తన్న కర్తవ్యమితి ప్రతిషేధః ప్రాసంగికః| యత్ రాత్రౌ సంయుజ్యంతే రత్యా ఋతౌ బ్రహ్మచర్యమేవ తదితి ప్రశస్తత్వాత్ రాత్రౌ భార్యాగమనం కర్తవ్యమిత్యయమపి ప్రాసంగికో విధిః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మాస రూపాత్మకమైన ఆ ప్రజాపతి, పగలు-రాత్రి అనే తన అవయవాలుగా పరిణామాన్ని పొందాడు. **అహోరాత్రో వై ప్రజాపతిః** పూర్వం వ్యాఖ్యానించినట్లే (పగలు-రాత్రియే ప్రజాపతి అని గ్రహించాలి). దానికి కూడా **అహః ఏవ ప్రాణః** పగలు అన్నదే ప్రాణం, ఆహారాన్ని స్వీకరించే అగ్ని. **రాత్రిః ఏవ రయిః** ఇది కూడా పూర్వం చెప్పినట్లుగానే (రాత్రియే రయి, అంటే ఆహారమే, చంద్రుడే అని గ్రహించాలి). **ప్రాణమ్ వై** పగలు రూపమైన ప్రాణాన్నే **ఏతే** వీరు **ప్రస్కన్దన్తి** విడిచిపెడుతున్నారు, వృథా చేస్తున్నారు లేదా వారినుండి వేరుచేసి వదిలేస్తున్నారు. ఎవరు? **యే** ఎవరైతే **దివా** పగటి కాలంలో **రత్యా** రతిక్రీడా విషయమై స్త్రీతో కూడి **సంయుజ్యన్తే** సంగమాన్ని జరుపుతున్న మూర్ఖులు ఉన్నారో వారు. అందుచేత, అలాటి కార్యం నిషిద్ధమని చేయరానిదని సందర్భోచితంగా చెప్పిన నియమం. **యత్ రాత్రౌ** (అందుకు సరియగు) రాత్రి సమయంలో **రత్యా సంయుజ్యన్తే** సంగమాన్ని జరిపితే **తత్** ఆ క్రియ **బ్రహ్మచర్యమ్ ఏవ** బ్రహ్మచర్యమే (అవుతుంది). ఇలా ప్రశంసించినందున రాత్రియందు భార్యతో సంగమం కర్తవ్యమే అన్నది సందర్భోచితంగా చెప్పిన నియమం.

{మరింకా కాల స్వరూపాన్ని లోతుగా విశ్లేషిస్తూ, పగలు-రాత్రి అనేవి కూడా ప్రజాపతి స్వరూపమేనని ఈ మంత్రంలో చెప్తున్నారు. పగలు అన్నది ఆహారాన్ని స్వీకరించే ప్రాణం అంటే ఇతరాన్ని తనలో లీనం చేసుకొనే కాలం. కాని, ఇది తెలియనందువల్ల, మూర్ఖులు ఆహారాన్ని స్వీకరించడం ద్వారా సంపాదించ వలసిన వీర్యాన్ని సంపాదించుకోకపోగా, విడిచిపెట్టి తమకు తాము హానిని కొనితెచ్చుకొంటున్నారు. ఇందుకు భిన్నంగా, తెలవికలవారు పగటి సమయంలో ఆహారాన్ని స్వీకరించి వీర్యాన్ని వృద్ధిచేసుకొని, రాత్రికాలంలో విడిచిపెడుతున్నారు. ఏ కాలంలో చేయతగిన కర్తవ్యాన్ని ఆ కాలంలో నిర్వర్తించడం వల్ల సాధకునికి వీర్యత్వం సిద్ధిస్తుంది. అకాలంలో చేసే కర్తవ్యాలు హానిని కలిగిస్తాయే కాని, వీర్యత్వాన్ని కలిగించవని అర్థం చేసుకోవాలి.}

అన్నం వై ప్రజాపతిస్తతో హ వై తద్రేతస్తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి|| || 1-14 ||

అన్నమే (ఆహారమే) ప్రజాపతి. దాని నుండియే ఆ రేతస్సు. దాని నుండియే ఈ ప్రాణులు పుడుతున్నాయి.

శంకరుల భాష్యం

ప్రకృతం తూచ్యతే సోఽహోరాత్రాత్మకః ప్రజాపతిర్వ్రీహియవాద్యన్నాత్మనా వ్యవస్థితః ఏవం క్రమేణ పరిణమ్య| తత్ అన్నం వై ప్రజాపతిః| కథం ? తతః తస్మాత్ హ వై రేతః నృబీజం తత్ప్రజాకారణం తస్మాత్ యోషితి సిక్తాత్ ఇమాః మనుష్యాదిలక్షణాః ప్రజాః ప్రజాయంతే యత్పృష్టం కుతో హ వై ప్రజాః ప్రజాయంత ఇతి| తదేవం చంద్రాదిత్యమిథునాదిక్రమేణ అహోరాత్రాంతేన అన్నరేతోద్వారేణ ఇమాః ప్రజాః ప్రజాయంత ఇతి నిర్ణీతం||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ప్రస్తుతం చెప్పబడుతోన్న పగలు-రాత్రి రూపమైన ఆ ప్రజాపతి ఒక క్రమమైన విధానంలో వరి, బార్లీ వంటి ఆహార రూపంగా పరిణామం చెందియున్నాడు. ఆ **అన్నమ్ వై** ఆహారమే **ప్రజాపతిః** ప్రజాపతి. అన్నం ప్రజాపతి ఎలా అవుతుంది? **తతః హ వై రేతః** దాని నుండియే రేతస్సు, అంటే ప్రాణుల ఉత్పత్తికి కారణమైన మానవబీజం **తస్మాత్** స్త్రీయందు ఉంచడం వలన **ఇమాః** మనుష్యాది లక్షణాలు కలిగిన **ప్రజాః ప్రజాయన్తే** ప్రాణులు మొదలైనవి పుడుతున్నాయి **ఇతి** అని, ఎక్కడనుండి ఈ ప్రాణులు పుడుతున్నాయి అని (1-3వ శ్లోకంలో కబన్ధుడు) అడిగిన ప్రశ్నకు గురువు ఇచ్చిన సమాధానం ఇది. ఆ విధంగా చంద్రుడు-ఆదిత్యుడు అనే జంట నుండి పగలు-రాత్రి వరకు క్రమంగా పరిణామం చెందిన ప్రజాపతి నుండియే అన్నము-రేతస్సు ద్వారా ఈ ప్రాణులు పుడుతున్నాయి అని నిర్ణయించి చెప్పారు.

{ఈ విధంగా ఒక క్రమంలో ప్రజాపతి తనను తాను రయి-ప్రాణం అనే జంటగా విభాగం చేసుకొని చంద్రాదిత్యలోకాలుగాను, కాల స్వరూపంగాగానూ రూపొంది, ఆ తర్వాత వరి మొదలైన

ఆహారధాన్యాలుగా పరిణామాన్ని పొందాడు. ఈ ఆహారం ప్రాణోత్పత్తికి కారణమైన రేతస్సుగా పురుషునియందు సంక్రమణం చెంది, స్త్రీ దేహంలో ప్రవేశించి, అందునుండి ప్రాణులు ఉత్పన్నమౌతున్నాయి. ఈ విధమైన పరిణామ క్రమాన్ని వివరించి చెప్పి, ప్రాణుల ఉత్పత్తి విధానాన్ని గురువు శిష్యుని ప్రశ్నకు సమాధానాన్ని బోధపరిచాడు.}

తద్యే హ వై తత్ప్రజాపతివ్రతం చరన్తి తే మిథునముత్పాదయన్తే| తేషామేవైష బ్రహ్మలోకో యేషాం తపో బ్రహ్మచర్యం యేషు సత్యం ప్రతిష్ఠితమ్ || || 1-15 ||

ఎవరైతే ఆ ప్రజాపతి వ్రతాన్ని అనుసరిస్తారో వారు పుత్రుడు పుత్రిక అనే జంటలను ఉత్పన్నం చేస్తారు. వారిది ఈ బ్రహ్మలోకం వంటి చంద్రలోకం. ఎవరియందు తపస్సు, బ్రహ్మచర్యం కలవో, ఎవరియందు సత్యం స్థిరంగా నిలిచి యున్నదో వారిదే (నిజమైన బ్రహ్మలోకం).

శంకరుల భాష్యం

తత్ తత్రైవం సతి యే గృహస్థాః| హ వై ఇతి ప్రసిద్ధస్మరణార్థౌ నిపాతౌ| తత్ ప్రజాపతేర్వ్రతం ప్రజాపతివ్రతం ఋతౌ భార్యాగమనం చరంతి కుర్వంతి, తేషాం దృష్టం ఫలమిదం| కిం ? తే మిథునం పుత్రం దుహితరం చ ఉత్పాదయంతే| అదృష్టం చ ఫలమిష్టాపూర్తదత్తకారిణాం తేషామేవ ఏషః యశ్చాంద్రమసో బ్రహ్మలోకః పితృయాణలక్షణః యేషాం తపః స్నాతకవ్రతాది బ్రహ్మచర్యం ఋతోరన్యత్ర మైథునాసమాచరణం యేషు చ సత్యం అనృతవర్జనం ప్రతిష్ఠితం అవ్యభిచారితయా వర్తతే నిత్యమేవ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

తత్ అది ఆవిధంగా కలిగిన గృహస్థులు **యే** ఎవరైతే **తత్ ప్రజాపతివ్రతమ్** ఋతుకాలమందు భార్యతో సంగమించడాన్ని **చరన్తి** చేస్తారో వారి ఈ ఫలితం కనబడుతుంది. ఇక్కడ **హ వై** అన్న నిపాతలు ప్రసిద్ధమైన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ఏమి ఫలితం? **తే** వారు **మిథునమ్** పుత్రులను మరియు పుత్రికలను **ఉత్పాదయన్తే** ఉత్పన్నం చేస్తారు (కుమారులను మరియు కుమార్తెలకు జన్మనిస్తారు). కనబడని ఫలితంగా, యాగాలు-సంఘ సేవా కార్యక్రమాలు-దానాలు చేసిన వారికి **ఏషః బ్రహ్మలోకః** ఈ బ్రహ్మలోకం వంటిదైన, పితృమార్గ లక్షణం కలిగిన చంద్రలోకం, మరియు **ఏషామ్** ఎవరియందైతే **తపః** విద్యాభ్యాసం ముగియగా నిర్వహించే స్నాతక వ్రతాదులను, **బ్రహ్మచర్యమ్** ఋతుకాలమందు తప్ప ఇతర కాలాలలో భార్యతో సమాగమం చేయకపోవడం అనే వ్రతాన్ని పాటిస్తారో **ఏషు** ఎవరియందు **సత్యమ్** శాశ్వతంగా అసత్యమనేది విడిచిపెట్టబడి ఉంటుందో, అట్టి వారికి.

{ఈ విధంగా ఎవరైతే ప్రజాపతి స్వరూపమైన ఆహారాన్ని స్వీకరించి, వీర్యాన్ని వృద్ధి చేసుకొని, దానిని స్త్రీయందు ప్రవేశింప చేయడమనే ఈ ప్రజాపతి వ్రతమనే దాన్ని నిర్వహిస్తారో వారికి పుత్రులు లేదా పుత్రికలు కలగడం అనే దృశ్యఫలితం (కనబడే ఫలితం) కలుగుతుంది. ఇక, వేదం చెప్పిన యజ్ఞ-యాగాది కర్తవ్యాలను నిర్వహించిన వారికి పితృమార్గ లక్షణమైన చంద్రలోకమనే అదృశ్యఫలం లభిస్తుంది. ఇది బ్రహ్మలోకం వంటిది మాత్రమే కాని నిజమైన బ్రహ్మలోకం కాదు. కాని, ఎవరైతే వేదవిధిని అనుసరించి విద్యాభ్యాసాన్ని ముగించుకొని, స్నాతకం మొదలైన వ్రతాలను నిర్వర్తించి, వివాహాది క్రతువులలో భార్యను పరిగ్రహించి, తగిన కాలాలలో సంగమించి, నియమబద్ధంగా ప్రజాపతి వ్రతాన్ని పాటిస్తారో వారు పొందే స్థితిగతులను తర్వాతి మంత్రంలో వివరిస్తున్నారు.}

తేషామసౌ విరజో బ్రహ్మలోకో న యేషు జిహ్మమనృతం న మాయా చేతి|| || 1-16 ||

ఎవరియందు కుటిలత్వం, అసత్యం, మిథ్యాచారం అనేవి ఉండవో వారిదే ఈ దోషవర్జితమైన బ్రహ్మలోకం.

<u>శంకరుల భాష్యం</u>

యస్తు పునరాదిత్యోపలక్షిత ఉత్తరాయణః ప్రాణాత్మభావో విరజః శుద్ధో న చంద్రబ్రహ్మలోకవద్రజస్వలో వృద్ధిక్షయాదియుక్తః అసౌ తేషాం , కేషామితి, ఉచ్యతే — యథా గృహస్థానామనేకవిరుద్ధసంవ్యవహారప్రయోజనవత్త్వాత్ జిహ్మం కౌటిల్యం వక్రభావోఽవశ్యంభావి తథా న యేషు జిహ్మం , యథా చ గృహస్థానాం క్రీడాదినిమిత్తమనృతమవర్జనీయం తథా న యేషు తత్ తథా మాయా గృహస్థానామివ న యేషు విద్యతే| మాయా నామ బహిరన్యథాత్మానం ప్రకాశ్యాన్యథైవ కార్యం కరోతి, సా మాయా మిథ్యాచారరూపా| మాయేత్యేవమాదయో దోషా యేష్వేకాకిషు బ్రహ్మచారివానప్రస్థభిక్షుషు నిమిత్తాభావాన్న విద్యంతే, తత్సాధనానురూప్యేణైవ తేషామసౌ విరజో బ్రహ్మలోక ఇత్యేషా జ్ఞానయుక్తకర్మవతాం గతిః| పూర్వోక్తస్తు బ్రహ్మలోకః కేవలకర్మిణాం చంద్రలక్షణ ఇతి||

|| ఇతి ప్రథమప్రశ్నభాష్యం||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

ఏదైతే ఆదిత్యలక్షణం కలిగిన ఉత్తరాయణమనే ప్రాణరూపమైనదో **విరజః** శుద్ధమైనదో, అంటే దోషాలతో నిండి వృద్ధి-క్షయాలతో కూడిన బ్రహ్మలోకం వంటి చంద్రలోకం కాదు, **అసౌ** అటువంటిది **తేషామ్** వారికి. ఎవరికో చెప్తున్నారు. ఏవిధంగా గృహస్థులలో అనేకమైన విరుద్ధ వ్యవహారాలలో ప్రయోజనాన్ని పొందటానికి ఆచరించే **జిహ్మమ్** కుటిలత్వం, వక్రభావం తప్పనిసరిగా ఉంటుందో, ఆ విధంగా 'జిహ్మమ్' అన్నది **న యేషు** ఎవరిలోనైతే ఉండదో. ఏవిధంగా గృహస్థులలో ఆటకాయితనంతోనైనా **అనృతమ్** అబద్ధాన్ని పలకడమనేది ఉంటుందో, ఆ విధంగా **న యేషు** ఎవరిలోనైతే ఉండదో. అదేవిధంగా **మాయా** మాయ అనేది ఎవరియందైతే ఉండదో. అంటే లోపల ఒకటి ఆలోచించి

బయటకు మరొకటిగా వ్యవహరించడమనే మిథ్యాచారమే మాయ అంటే. మాయ వంటి ఈ దోషాలు, వాటిని అనుసరించడానికి తగిన కారణాలు లేనందున, ఒంటరివారైన బ్రహ్మచారులు, వానప్రస్థులు, భిక్షుకులలో కనబడవు. ఆయా సాధనలకు అనుగుణంగా అట్టివారికే దోషరహితమైన బ్రహ్మలోకం. ఉపాసనతో కలిపి కర్మలను ఆచరించే వారి ఇదియే గమ్యస్థానం. కేవలం కర్మలను ఆచరించిన వారికి మాత్రమే పూర్వం చెప్పిన చంద్రలక్షణమైన బ్రహ్మలోకమే గమ్యస్థానం అని గ్రహించాలి.

{క్రిందటి మంత్రంలో చివరగా చెప్పినటువంటి వారికి, శాశ్వతమైన బ్రహ్మలోకం లభ్యమౌతుంది. ఈ బ్రహ్మలోకమనేది, ముందు చెప్పిన చంద్రలోకానికన్నా ప్రత్యేకమైనది. చంద్రలోకం అశాశ్వతం. ఈ బ్రహ్మలోకాన్ని పొందే సాధకునికి, కుటిలత్వం ఉండకూడదు, అబద్ధం పలకడమనేది ఆటకాయితనంగా కూడా ఉండకూడదు, మాయ లేదా వంచన వంటి దోషాలు ఉండకూడదు. ఇటువంటి సదాచార సంపన్నులైన వారు ఏ ఆశ్రమానికి చెందినవారైన సరే, దోషరహితమైన బ్రహ్మలోకాన్ని పొందుతారు.}

|| ప్రథమ ప్రశ్నకు భాష్యానువాదం సంపూర్ణం ||

ద్వితీయ ప్రశ్నః

శంకరుల భాష్యం

ప్రాణోఽత్తా ప్రజాపతిరిత్యుక్తం| తస్య ప్రజాపతిత్వమత్తృత్వం చాస్మిఞ్శరీరేఽవధారయితవ్యమిత్యయం ప్రశ్న ఆరభ్యతే|

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఆహారాన్ని తినే ప్రాణం ప్రజాపతియే అని చెప్పారు. దానికి (ఆ ప్రాణానికి) ఈ శరీరాన్ని ధరించియుండగా ప్రజాపతిత్వం కలగడం మరియు అది ఆహారాన్ని తినడాన్ని గురించిన ప్రశ్న ప్రారంభమౌతోంది.

అథ హైనం భార్గవో వైదర్భిః పప్రచ్ఛ భగవన్కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే కతర ఏతత్ప్రకాశయన్తే కః పునరేషాం వరిష్ఠ ఇతి|| || 2-1 ||

తరువాత, విదర్భ దేశస్థుడైన భృగు వంశజుడు (ఆచార్యుడితో), "హే భగవన్, ప్రాణులకు ఆధారమైన దేవతలు ఎందరు? వారిలో ఎవరు దీనిని ప్రకాశింపచేస్తున్నారు? వారిలో శ్రేష్ఠులు ఎవరు?" అని అడిగాడు.

శంకరుల భాష్యం

అథ అనంతరం హ కిల ఏనం భార్గవః వైదర్భిః పప్రచ్ఛ — హే భగవన్ కత్యేవ దేవాః ప్రజాం శరీరలక్షణాం విధారయంతే విశేషేణ ధారయంతే| కతరే బుద్ధీంద్రియకర్మేంద్రియవిభక్తానాం ఏతత్ ప్రకాశనం స్వమాహాత్మ్యప్రఖ్యాపనం ప్రకాశయంతే| కః అసౌ పునః ఏషాం వరిష్ఠః ప్రధానః కార్యకరణలక్షణానామితి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అథ తరువాత **హ** అయితే **భార్గవః వైదర్భిః** విదర్భ దేశస్థుడైన భృగు వంశానికి చెందినవాడు **ఏనమ్** దీనిని **పప్రచ్ఛ** ప్రశ్నించాడు. "**భగవన్** ఓ పూజనీయుడా **కతి ఏవ దేవాః** నిజానికి ఎందరు దేవతలు **ప్రజామ్** శరీరం లక్షణం కలగియున్న ప్రాణిని **విధారయన్తే** పోషిస్తున్నారు? **కతరే** వారిలో ఎవరు, జ్ఞానేంద్రియ-కర్మేంద్రియాలుగా విడివిడిగా ఉన్న వాటిలో **ఏతత్** ఈ రూపంగా ఏర్పడిన తమ మహాత్మ్యాన్ని **ప్రకాశయన్తే** ప్రకాశింపచేస్తున్నారు? **కః పునః** మరి ఎవరు **ఏషామ్** వీరిలో **వరిష్ఠః** శ్రేష్ఠులు, ఈ దేహం మరియు దాని అవయవాలలో ప్రధానమైనది ఎవరు?" అని ప్రశ్నించాడు.

{సంవత్సర కాలం పాటు గురు శుశ్రూష చేస్తూ విచారణ చేసిన భార్గవుడనే శిష్యుడు తను కలిగిన సందేహాన్ని ఇలా ప్రశ్నిస్తున్నాడు. గురువు ప్రజాపతియే ప్రాణమని చెప్పగా, మరి ఈ ప్రాణం దేహాన్ని ధరించి ఉంటోంది కదా, మరి ఆ శరీరంలో అనేక విభాగాలున్నాయి కదా. వాటిని ఎంతమంది

దేవతలు ఆధారంగా ఉండి పోషిస్తున్నారు? ఎవరెవరు ఏ ఏ కార్యకలాపాలకు కారణమౌతున్నారు? ఆ దేవతలందరిలో ఎవరు ప్రధానం? అనే సందేహాన్ని ఆచార్యుని ముందు వెలిబుచ్చి సమాధానాన్ని కోరుతున్నాడు.}

తస్మై స హోవాచ| ఆకాశో హ వా ఏష దేవో వాయురగ్నిరాపః పృథివీ వాఙ్మనశ్చక్షుః శ్రోత్రం చ| తే ప్రకాశ్యాభివదన్తి వయమేతద్బాణమవష్టభ్య విధారయామః|| || 2-2 ||

వానితో (అలా ప్రశ్నించిన శిష్యునితో) అతడు (ఆచార్యుడైన పిప్పలాదుడు) ఇలా అన్నాడు. ఈ దేవతలే ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి. వాక్కు, మనసు, చక్షువులు, శ్రోత్రాలు కూడా. అవి వాటి గొప్పదనాన్ని 'మేము ఈ దేహాన్ని నిలిపి పోషిస్తున్నాము' అని ప్రకటించాయి.

శంకరుల భాష్యం

ఏవం పృష్టవతే తస్మై స హ ఉవాచ — ఆకాశః హ వై ఏషః దేవః వాయుః అగ్నిః ఆపః పృథివీ ఇత్యేతాని పంచ మహాభూతాని శరీరారంభకాణి వాఙ్మనశ్చక్షుః శ్రోత్రమిత్యాదీని కర్మేంద్రియబుద్ధీంద్రియాణి చ| కార్యలక్షణాః కరణలక్షణాశ్చ తే దేవా ఆత్మనో మాహాత్మ్యం ప్రకాశ్యం ప్రకాశ్యాభివదంతి స్పర్ధమానా అహంశ్రేష్ఠతాయై| కథం వదంతి ? వయమేతత్ బాణం కార్యకరణసంఘాతం అవష్టభ్య ప్రాసాదమివ స్తంభాదయః అవిశిథిలీకృత్య విధారయామః విస్పష్టం ధారయామః| మయైవైకేనాయం సంఘాతో ధ్రియత ఇత్యేకైకస్యాభిప్రాయః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఆ విధంగా ప్రశ్నించిన **తస్మై** అతనితో (శిష్యునితో) **స హ ఉవాచ** ఆచార్యుడు ఇలా అన్నాడు. **ఆకాశః హ వై ఏషః దేవః వాయుః అగ్నిః ఆపః పృథివీ** దేహాన్ని ప్రారంభించిన ఆకాశము, వాయువు, అగ్ని, జలం, భూమి అనే ఈ పంచమహాభూతాలు, **వాక్ మనః చక్షుః శ్రోత్రమ్ చ** వాక్కు, మనసు, చక్షువులు, శ్రోత్రములు మొదలైన కర్మేంద్రియ-జ్ఞానేంద్రియాలు కూడా ఆ దేవతలే. కార్య లక్షణాలు కలవీ, సాధన లక్షణాలు కల **తే** ఆ దేవతలు తమ గొప్పదనాన్ని **ప్రకాశ్య అభివదన్తి** ప్రకటించాలనే ఉద్దేశ్యంతో, వాటిలో అవి నేనే శ్రేష్ఠుడను అనే స్పర్థతో, అన్నాయి. ఏమని అన్నాయి? **వయమ్ ఏతత్ బాణమ్** మేము ఈ కార్యకరణ సంఘాతమైన దేహాన్ని **అవష్టభ్య** శిథిలం కానివ్వకుండా భవనపు స్తంభాలలాగా **విధారయామః** ధరిస్తున్నాము. 'నా ఒక్కని చేతనే ఈ దేహేంద్రియ సంఘాతం నిలబెట్టబడుతోంది' అని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారని అభిప్రాయం.

{శిష్యునికి కలిగిన సందేహానికి సమాధానంగా దేహానికి ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివీ అనే పంచ మహాభూతాలకు అధిష్ఠాన దేవతలే ఆధారమనీ, వాటి చేత ఈ దేహం పోషింపబడుతోందని గురువు చెప్తున్నాడు. ఇవే కాక, వాక్కు, మనసు, చక్షువులు, శ్రోత్రములు

మొదలైన కర్మేంద్రియాలు మరియు జ్ఞానేంద్రియాల వల్ల కూడా శరీరం పోషింపబడుతోంది. అంటే శరీరంలో కేవలం ఆకాశాదుల వంటి కార్యలక్షణాలే కాక, వాక్కు మొదలైన సాధన లక్షణాలు కూడా ఉన్నాయని చెప్తున్నారు. వాటన్నింటిని అధిష్టించి అగ్ని, వాయువు మొదలైన దేవతలు వ్యవహరిస్తున్నారు. ఈ దేవతలందరిలోకి ఎవరు గొప్ప అనే ప్రశ్నకు సమాధానంగా ఒక చిన్న నాటకీయ పరిణామాన్ని ఉదహరిస్తున్నారు. ఒకప్పుడు ఆ దేవతలందరూ శరీరాన్ని పోషింషచడంలో ఎవరికి వారు తామే ప్రధానులమని భావనలో ఉన్నారు.}

తాన్వరిష్ఠః ప్రాణ ఉవాచ మా మోహమాపద్యథాహమేవైతత్పఞ్చధాఽఽత్మానం ప్రవిభజ్యైతద్బాణమవష్టభ్య విధారయామీతి తేఽశ్రద్దధానా బభూవుః|| || 2-3 ||

వాటితో ప్రధానమైన ప్రాణం, “భ్రమ పడకండి. నన్ను నేను ఐదు అంశలుగా విభజించుకొని ఈ దేహాన్ని శిథిలం కాకుండా నిలిపి పోషిస్తున్నది నేనే” అని అన్నది.

<u>శంకరుల భాష్యం</u>

తాన్ ఏవమభిమానవతః వరిష్ఠః ముఖ్యః ప్రాణః ఉవాచ ఉక్తవాన్ — మా మైవం మోహం ఆపద్యథ అవివేకితయాభిమానం మా కురుత ; యస్మాత్ అహమేవ ఏతద్బాణం అవష్టభ్య విధారయామి పంచధా ఆత్మానం ప్రవిభజ్య ప్రాణాదివృత్తిభేదం స్వస్య కృత్వా విధారయామి ఇతి ఉక్తవతి చ తస్మిన్ తే అశ్రద్దధానాః అప్రత్యయవంతః బభూవుః — కథమేతదేవమితి||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

తాన్ ఆ విధంగా భావిస్తున్న వాటితో **వరిష్ఠః** ప్రధానమైన **ప్రాణః** ప్రాణం అన్నది. “ ఆ విధంగా **మోహమ్** భ్రమను **మా ఆపత్యథ** పొందకండి. అవివేకంగా అభిమానాన్ని చేయకండి. ఎందువలనంటే, **పంచధా ఆత్మానమ్ ప్రవిభజ్య** నన్ను నేను ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం మరియు సమానమనే వృత్తి భేదాలు కల ఐదు అంశలుగా విభజించుకొని **ఏతత్ బాణమ్ అవష్టభ్య** ఈ దేహేంద్రియ సంఘాతాన్ని శిథిలం కాకుండా **అహమ్ ఏవ** నేనే **విధారయామి** పోషిస్తున్నాను. ఇలా ప్రాణం చెప్పినప్పటికీ ఆ మాటయందు **తే** అవి (పంచ భూతాలు మొదలైనవి) **అశ్రద్దధానాః** నమ్మకం లేనివై (లెక్కచేయనివై) ‘ఇదెలా అవుతుంది?’ అని భావించాయి.

{అప్పుడు, వాటన్నింటిలోనూ ప్రధానమైన ప్రాణం వాటితో ఇలా అన్నది. “అవివేకంతో, మీలో మీరు ఎవరికి వారు మేము శ్రేష్ఠులమనే భ్రమను పొందకండి. ఎందుకంటే, నన్ను నేను ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమానం అనే 5 అంశలుగా విభజించుకొని 5 రకాల కార్యకలాపాలను నిర్వహిస్తూ

ఈ దేహమనే సముదాయాన్ని శిథిలం కాకుండా పోషిస్తున్నాను” అని అన్నది. ఇలా చెప్పిన ప్రాణం మాటను ఇతర దేవతలు నమ్మకుండా, త్రోసిపుచ్చాయి.}

సోఽభిమానాదూర్ధ్వముత్క్రామత ఇవ తస్మిన్నుత్క్రామత్యథేతరే సర్వ ఏవోత్క్రామన్తే తస్మిꣳశ్చ ప్రతిష్ఠమానే సర్వ ఏవ ప్రాతిష్ఠన్తే| తద్యథా మక్షికా మధుకరరాజానముత్క్రామన్తం సర్వా ఏవోత్క్రామన్తే తస్మిꣳశ్చ ప్రతిష్ఠమానే సర్వా ఏవ ప్రాతిష్ఠన్త ఏవం వాఙ్మనశ్చక్షుః శ్రోత్రం చ తే ప్రీతాః ప్రాణం స్తున్వన్తి|| || 2-4 ||

అది (ఆ ప్రాణం) అభిమానపడినదై (దేహాన్ని విడిచి) పైకి లేస్తున్న దానివలె కన్పించింది. అది పైకి లేస్తుండగానే మిగిలినవన్నీ కూడా పైకి లేస్తున్నాయి. అది యథాస్థితికి రాగానే మిగిలినవన్నీ వాటి వాటి స్థితులకు వచ్చాయి. ఎలాగైతే, తేనెటీగలు వాటి రాజు ఎగురగానే ఎగిరినట్లు మరియు రాజు నిలిచిపోగానే నిలిచిపోయినట్లుగా, ఆ విధంగా వాక్కు, మనసు, చక్షువు, శ్రోత్రం (ప్రాణానికి అనుగుణంగా) ప్రవర్తిస్తున్నాయి. అవి ప్రీతిచెంది ప్రాణాన్ని కీర్తిస్తున్నాయి.

శంకరుల భాష్యం

స చ ప్రాణః తేషామశ్రద్ధధానతామాలక్ష్య అభిమానాత్ ఊర్ధ్వం ఉత్క్రామత ఇవ ఉత్క్రామతీవ ఉత్క్రాంతవానివ స రోషాన్నిరపేక్షః| తస్మిన్నుత్క్రామతి యద్వృత్తం తద్దృష్టాంతేన ప్రత్యక్షీకరోతి — తస్మిన్ ఉత్క్రామతి సతి అథ అనంతరమేవ ఇతరే సర్వ ఏవ ప్రాణాశ్చక్షురాదయః ఉత్క్రామంతే ఉత్క్రామంతి ఉచ్చక్రముః| తస్మింశ్చ ప్రాణే ప్రతిష్ఠమానే తూష్ణీం భవతి అనుత్క్రామతి సతి, సర్వ ఏవ ప్రాతిష్ఠంతే తూష్ణీం వ్యవస్థితా బభూవుః| తత్ యథా లోకే మక్షికాః మధుకరాః స్వరాజానం మధుకరరాజానం ఉత్క్రామంతం ప్రతి సర్వా ఏవ ఉత్క్రామంతే తస్మింశ్చ ప్రతిష్ఠమానే సర్వా ఏవ ప్రాతిష్ఠంతే ప్రతితిష్ఠంతి| యథాయం దృష్టాంతః ఏవం వాఙ్మనశ్చక్షుః శ్రోత్రం చేత్యాదయః తే ఉత్సృజ్యాశ్రద్ధధానతాం బుద్ధ్వా ప్రాణమాహాత్మ్యం ప్రీతాః ప్రాణం స్తున్వంతి స్తువంతి||

కథం ?

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

వాటి లెక్కచేయనితనాన్ని గమనించి **అభిమానాత్** రోషం కలగడం చేత **సః** ప్రాణః ఆ ప్రాణం **ఊర్ధ్వమ్** తాను ఉన్న శరీరంనుండి పైకి (లేదా బయటకు) **ఉత్క్రమతే ఇవ** పోతున్నదా అన్నట్లుగా, అంటే రోషం కారణంగా దేహంనుండి బయటకు వెళ్ళడానికి సిద్ధపడిందా అన్నట్లుగా కన్పించింది. ప్రాణం బయటకు పోతున్నప్పుడు ఏమయింది అన్నదాన్ని ఉదాహరణతో ప్రత్యక్షంగా విశదపరుస్తున్నారు. **తస్మిన్ ఉత్క్రామతి** అది (ఆ ప్రాణం) బయటకు వెళ్ళడం ప్రారంభం కాగానే, **అథ** వెంటనే **ఇతరే సర్వే ఏవ** మిగిలిన చక్షువులు మొదలైనవన్నీ కూడా **ఉత్క్రామన్తే** బయటకు వెళ్ళడం ప్రారంభమైంది. **చ** మరియు

తస్మిన్ ఆ ప్రాణం **ప్రతిష్ఠమానే** ఉదాసీనం కాగానే, అంటే ఉత్క్రమించడం ఆపగానే, **సర్వ ఏవ ప్రాతిష్ఠన్తే** మిగిలినవన్నీ ఉదాసీనంగా ఉన్నాయి, అంటే అవి ఉత్క్రమించడం ఆగిపోయింది. **తత్** అది లోకంలో **యథా** ఏవిధంగా **మక్షికాః** తేనటీగలు **మధుకరరాజానమ్ ఉత్క్రామన్తమ్** తేనెటీగల రాజు ఎగిరినప్పుడు **ఉత్క్రామన్తే** ఎగురుతున్నాయో **చ** మరియు **తస్మిన్** ఆ తేనెటీగల రాజు **ప్రతిష్ఠమానే** విశ్రమించగానే **సర్వ ఏవ ప్రాతిష్ఠన్తే** తేనెటీగలన్నీ విశ్రమిస్తాయో అలా. ఈ ఉదాహరణలో చెప్పినట్లుగా **తే** వాక్కు, మనసు, చక్షువులు, శ్రోత్రములు మొదలైనవి తమ లెక్కచేయనితనాన్ని వదలిపెట్టి, ప్రాణం యొక్క గొప్పదనాన్ని తెలుసుకొని **ప్రీతాః** ప్రీతి చెందినవై, **ప్రాణమ్** ప్రాణాన్ని **స్తున్వన్తి** కీర్తించాయి.

ఏ విధంగా కీర్తించాయి?

{ఇతర దేవతలు తన మాటను తిరస్కరించడంతో కోపించిన ప్రాణం, దేహాన్ని విడిచిపోతున్న దానిలాగా బయటకు వెళ్ళడానికి ఉద్గమించింది. ప్రాణం ఉద్గమించడం ప్రారంభం కాగానే మిగిలిన ఇంద్రియాలన్నీ ప్రాణంతోపాటుగా బయటకు వెళ్లడం ప్రారంభమైంది. ప్రాణం ఉద్గమించడం విరమించగానే అవన్నీ తిరిగి యథాస్థానాన్ని పొందాయి. అప్పుడు, తమ అవివేకత్వాన్ని తెలుసుకొని, తమ కన్నా ప్రాణమే శ్రేష్ఠమైనదని అంగీకరించి, ఆ ప్రాణాన్ని ఇలా స్తుతి చేస్తున్నాయి.}

ఏషోఽగ్నిస్తపత్యేష సూర్య ఏష పర్జన్యో మఘవానేష వాయుః| ఏష పృథివీ రయిర్దేవః సదసచ్చామృతం చ యత్|| || 2-5 ||

ఇదియే అగ్నిగా దహిస్తుంది. ఇదియే సూర్యుడు. ఇదియే మేఘము. ఇదియే ఇంద్రుడు. ఇదియే వాయువు. ఇదియే భూమి మరియు ఆహారం. ఏది స్థూలమో, సూక్ష్మమో మరియు అమృతమో అది ఈ దేవతే.

<u>శంకరుల భాష్యం</u>

ఏషః ప్రాణః అగ్నిః సన్ తపతి జ్వలతి| తథా ఏషః సూర్యః సన్ ప్రకాశతే| తథా ఏషః పర్జన్యః సన్ వర్షతి| కించ మఘవాన్ ఇంద్రః సన్ ప్రజాః పాలయతి జిఘాంసత్యసురరక్షాంసి| కించ, ఏషః వాయుః ఆవహప్రవహాదిభేదః| కించ, ఏషః పృథివీ రయిః దేవః సర్వస్య జగతః సత్ మూర్తం అసత్ అమూర్తం చ అమృతం చ యత్ దేవానాం స్థితికారణం||

కిం బహునా ?

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

ఏషః ఇదియే అంటే ఈ ప్రాణమే **అగ్నిః** అగ్నియై **తపతి** దహిస్తుంది. అదేవిధంగా **ఏషః సూర్యః** ఇదియే సూర్యుడై ప్రకాశిస్తుంది. అలాగా, **ఏషః పర్జన్యః** ఇదియే మేఘమై వర్షిస్తుంది. మరింకా,

మఘవాన్ ఇంద్రునిగా ప్రాణులను రక్షిస్తుంది మరియు అసురులు-రాక్షసులను వధిస్తుంది. మరింకా, **ఏషః వాయుః** ఇదియే వాయువై ఆవహ, ప్రవహాలనే భేదాలుగా వీస్తుంది. ఇంకనూ, **ఏషః దేవః** ఈ దేవతే **పృథివీ** భూమిగా సకలాన్ని ధరిస్తుంది **రయిః** ఆహారంగా సకలాన్ని పోషిస్తుంది, **సత్** స్థూలము **అసత్** సూక్ష్మము **చ** మరియు **యత్ అమృతమ్** అమృతమై దేవతల స్థితికి కారణమైనదేదో అది.

ఇంతెందుకు?

{ప్రాణం యొక్క ఘనతను ఇతర ఇంద్రియాలన్నీ ఇలా స్తుతిస్తున్నాయి. ఈ ప్రాణమే అగ్నిగా దహిస్తుంది, సూర్యునిగా లోకాలను ప్రకాశింపచేస్తుంది, మేఘమై వర్షిస్తుంది, ఇంద్రునిగా ప్రాణులను రక్షించి, అసురులను సంహరిస్తుంది, వాయువుగా సంపీడన, నిష్పీడనాలు కలిగిస్తుంది, భూమిగా సకలాన్ని ధరిస్తుంది, ఆహారమై సకలాన్ని పోషిస్తుంది. ఇదియే స్థూలత్వం, సూక్ష్మత్వం కూడా. దేవతల స్థితికి కారణమైన అమృతం కూడా ఇదే.}

అరా ఇవ రథనాభౌ ప్రాణే సర్వం ప్రతిష్ఠితమ్|

ఋచో యజూꣳషి సామాని యజ్ఞః క్షత్త్రం బ్రహ్మ చ|| || 2-6 ||

చక్రపు ఇరుసునకు అమర్చిన కమ్మీలలాగా, ప్రాణమందే సర్వమూ స్థిరంగా కూర్చబడినాయి. ఋక్కులు, యజుస్సులు, సామలు, యజ్ఞములు, క్షత్రియులు, బ్రాహ్మణులు కూడా (ప్రాణంలోనే నిలిచి ఉన్నాయి).

శంకరుల భాష్యం

అరా ఇవ రథనాభౌ శ్రద్ధాది నామాంతం సర్వం స్థితికాలే ప్రాణే ఏవ ప్రతిష్ఠితం| తథా ఋచః యజూంషి సామాని ఇతి త్రివిధా మంత్రాః తత్సాధ్యశ్చ యజ్ఞః క్షత్త్రం చ సర్వస్య పాలయితృ బ్రహ్మ చ యజ్ఞాదికర్మకర్తృత్వేఽధికృతం చ ఏష ఏవ ప్రాణః సర్వం||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అరా ఇవ రథనాభౌ చక్రపు ఇరుసుకు బిగించిన కమ్మీల లాగా, **సర్వమ్** శ్రద్ధతో మొదలు నామం వరకు సమస్తమూ స్థితికాలంలో **ప్రాణే** ప్రాణమందే **ప్రతిష్ఠితమ్** స్థిరంగా నిలిచి ఉన్నాయి. అదేవిధంగా **ఋచః యజూంషి సామాని** ఋక్కులు, యజుస్సులు, సామలు అనే మూడ విధాలైన మంత్రాలు మరియు వాటిచే చేయబడే **యజ్ఞః** క్రతువులు, అందరిని పరిపాలించే **క్షత్రమ్** సమర్థత కల క్షత్రియులు, యజ్ఞాది కర్మలను నిర్వర్తించడానికి అధికారం కలిగిన **బ్రహ్మ** బ్రహ్మత్వం కల బ్రాహ్మణులు **చ** ఈ సర్వస్వం కూడా ఈ ప్రాణమే.

{ప్రజాపతియే అయిన ఈ ప్రాణంలోనే సమస్త ప్రాణులు ఉనికి కలిగి ఉంటున్నాయి. ప్రాణులే కాదు, వేదాలు మరియు ఆ వేదమంత్రాలను ప్రయోగిస్తూ చేసే సకల యజ్ఞాలు కూడా ఈ ప్రాణ విశేషాలే. ప్రజలను పాలించే ప్రభువులైన క్షత్రియులు మరియు యజ్ఞాది కర్మలను నిర్వర్తించే అధికారం కలిగిన బ్రాహ్మణులు కూడా ఈ ప్రాణం తప్ప మరేమీ కాదు.}

ప్రజాపతిశ్చరసి గర్భే త్వమేవ ప్రతిజాయసే| తుభ్యం ప్రాణ ప్రజాస్త్విమా బలిం హరన్తి యః ప్రాణైః ప్రతితిష్ఠసి|| || 2-7 ||

(తండ్రి, తల్లి గర్భాలలో) ప్రజాపతిగా తిరుగాడేదీ, వారి ప్రతిరూపాలుగా జన్మించేదీ నీవే. ఓ ప్రాణమా! నీయందే తమ అవయవాలతో సహా స్థితి కలిగన ఈ ప్రాణులు నీకొరకే ఆహారాన్ని అందిస్తున్నాయి.

శంకరుల భాష్యం

కించ, యః ప్రజాపతిరపి స త్వమేవ గర్భే చరసి, పితుర్మాతుశ్చ ప్రతిరూపః సన్ ప్రతిజాయసే ; ప్రజాపతిత్వాదేవ ప్రాగేవ సిద్ధం తవ మాతృపితృత్వం ; సర్వదేహదేహ్యాకృతిచ్ఛన్నః ఏకః ప్రాణః సర్వాత్మాసీత్యర్థః| తుభ్యం త్వదర్థాయ ఇమాః మనుష్యాద్యాః ప్రజాస్తు హే ప్రాణ చక్షురాదిద్వారైః బలిం హరంతి, యః త్వం ప్రాణైః చక్షురాదిభిః సహ ప్రతితిష్ఠసి సర్వశరీరేషు, అతస్తుభ్యం బలిం హరంతీతి యుక్తం| భోక్తాసి యతస్త్వం తవైవాన్యత్సర్వం భోజ్యం||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మరింకా, **ప్రజాపతిః** ఏ ప్రజాపతి అయితే **గర్భే చరసి** తండ్రి మరియు తల్లి గర్భంలో తిరుగాడి **ప్రతిజాయసే** వారి ప్రతిరూపాలుగా జన్మిస్తున్నాడో అతడు **త్వమ్ ఏవ** నీవే. నీవు ప్రజాపతివే అయినందునవాటి దేహాల ఆకృతి రూపంగా ఉన్నావు అని అభిప్రాయం. **ప్రాణా** ఓ ప్రాణమా! **తుభ్యమ్** నీ కొరకు **ప్రజాః** ఈ మనుష్యాది ప్రాణులైతే కన్నులు మొదలైన వాటి ద్వారా **బలిమ్ హరన్తి** ఇంద్రియవిషయాలనే ఆహారాన్ని తీసుకొస్తున్నాయి. **యః ప్రాణైః** ప్రాణమైన నీవు కన్నులు మొదలైన వాటితో కలిసి **ప్రతితిష్ఠసి** సకల శరీరాలలో ఉన్నందుచేత, నీ కొరకు ఆహారాన్ని తీసుకొస్తున్నాయి అనడం యుక్తమే. నీవు భోక్తవు కాబట్టి, నీకు అన్యమైన సమస్తమూ ఆహారమే.

ఓ ప్రాణమా! ఏ ప్రజాపతి అయితే ప్రాణుల తల్లిదండ్రుల గర్భంలో చేరి వారి ప్రతిరూపాలుగా జన్మిస్తున్నాడో అది నీవే. ఈ ఇంద్రియాలన్నీ నీ కొరకు విషయాలనే ఆహారాన్ని వాటి వాటి సామర్థ్యం మేరకు సమర్పించుకొంటున్నాయి. ఇంద్రియాదులు నీకై తెచ్చే విషయాదులను అనుభవిస్తావు కాబట్టి, నీకు వేరుగానున్న ప్రతిదీ నీకు ఆహారమే అవుతుంది.

దేవానామసి వహ్నితమః పితౄణాం ప్రథమా స్వధా| ఋషీణాం చరితం సత్యమథర్వాఙ్గిర సామసి|| || 2-8 ||

దేవతలలో నీవు గొప్ప వాహకుడివి (హవిస్సును తీసుకొని పోయే వాడివి). మొదటగా పితృదేవతలకు సమర్పించే ఆహారాన్ని తీసుకుపోయే వాడివి నీవు. అథర్వస్ అనబడే దేహానికి సారమైన ఇంద్రియాల ధార్మిక ప్రవర్తన నీవే,

శంకరుల భాష్యం

కించ, దేవానాం ఇంద్రాదీనాం అసి భవసి త్వం వహ్నితమః హవిషాం ప్రాపయితృతమః| పితౄణాం నాందీముఖే శ్రాద్ధే యా పితృభ్యో దీయతే స్వధా అన్నం సా దేవప్రదానమపేక్ష్య ప్రథమా భవతి| తస్యా అపి పితృభ్యః ప్రాపయితా త్వమేవేత్యర్థః| కించ, ఋషీణాం చక్షురాదీనాం ప్రాణానాం అథర్వాంగిరసాం అంగిరసభూతానామథర్వణాం — 'తేషామేవ ప్రాణో వాథర్వా' (?) ఇతి శ్రుతేః — చరితం చేష్టితం సత్యం అవితథం దేహధారణాద్యుపకారలక్షణం త్వమేవాసి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మరింకా, **దేవానామ్** ఇంద్రాదులలో నీవు **వహ్నితమః అసి** హవిస్సులను అందించేవారిలో గొప్పవాడివి. పితౄణామ్ పితృదేవతలకు నాందీముఖం అనే క్రతువులోనూ శ్రాద్ధకాలంలో పితృదేవతలకు సమర్పణ చేసే **స్వధా** ఆహారం, దేవతలకు సమర్పించే ముందే అది సమర్పించబడటం చేత అది **ప్రథమా.** దానిని కూడా పితృదేవతలకు అందజేసేది నీవే అని అర్థం. మరింకా, **ఋషీణామ్** ప్రాణులలోని కన్నులు మొదలైన వాటిలోని **అథర్వాఙ్గిరసామ్** దేహసారభూతమైన అథర్వాలలో అనగా 'తేషామేవ ప్రాణో వాథర్వా' అన్న శ్రుతి వాక్యానుసారం, **చరితమ్** ధర్మబద్ధమైన నడవడిక, అంటే దేహం పడిపోకుండా నిలబడటానికి సహకరించే లక్షణం **అసి** నీవే అయి ఉన్నావు. [ఇక్కడ ఉటంకించ బడిన శ్రుతి వాక్యం ప్రకారం అథర్వమే ప్రాణమని చెప్తున్నప్పటికీ, ప్రాణం యొక్క పరిణామాలైన జ్ఞానేంద్రియాలను కూడా అథర్వంగా తీసుకొన్నారు. – స్వామి గంభీరానంద]

{ఇంకా ప్రాణం యొక్క కీర్తిని ఇతర ఇంద్రియాలు ఇలా పొగుడుతున్నాయి. దేవతలకు హవిస్సును, పితృదేవతలకు శ్రాద్ధకాలంలో సమర్పణ చేసే ఆహారాన్ని తీసుకొని పోయేది కూడా ఈ ప్రాణమే. దేహధారమైన వాటన్నింటిలోకి ప్రధానమైనది ప్రాణమే.}

ఇన్ద్రస్త్వం ప్రాణ తేజసా రుద్రోఽసి పరిరక్షితా|
త్వమన్తరిక్షే చరసి సూర్యస్త్వం జ్యోతిషాం పతిః|| || 2-9 ||

ఓ ప్రాణమా. నీవే ఇంద్రుడవు. తేజస్సు చేత రుద్రుడవు. సర్వాన్ని రక్షించేవాడవు. అంతరిక్షంలో చరిస్తావు. వెలిగే వాటికే ప్రభువైన సూర్యుడివి నీవే.

శంకరుల భాష్యం

కించ, ఇంద్రః పరమేశ్వరః త్వం హే ప్రాణ, తేజసా వీర్యేణ రుద్రోఽసి సంహరన్ జగత్| స్థితౌ చ పరి సమంతాత్ రక్షితా పాలయితా ; పరిరక్షితా త్వమేవ జగతః సౌమ్యేన రూపేణ| త్వం అంతరిక్షే అజస్రం చరసి ఉదయాస్తమయాభ్యాం సూర్యః త్వమేవ చ సర్వేషాం జ్యోతిషాం పతిః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మరింకా, ఓ ప్రాణమా! **త్వమ్** నీవు **ఇంద్రః** పరమేశ్వరుడవు. **తేజసా** తేజస్సుచేత **రుద్రః అసి** జగత్తును నశింపజేసే రుద్రుడివైనావు. మరియు జగత్తు యొక్క స్థితి కాలంలో **పరి** అన్నివిధాలుగా **రక్షితా** రక్షణచేస్తున్నావు. నీవే జగత్తును అన్ని రకాలుగా పరిరక్షిస్తున్నావు. **త్వమ్** నీవు **అంతరిక్షే** ఆకాశంలో ఎల్లప్పుడూ ఉదయాస్తమయాలలో **చరసి** తిరుగాడుతున్నావు. **జ్యోతిషామ్ పతిః** వెలిగే వాటన్నింటికి ప్రభువైన **సూర్యః** సూర్యుడవు **త్వమ్** నీవే.

యదా త్వమభివర్షసి అథేమాః ప్రాణ తే ప్రజాః|
ఆనన్దరూపాస్తిష్ఠన్తి కామాయాన్నం భవిష్యతీతి||
|| 2-10 ||

ఓ ప్రాణమా! ఎప్పుడు నీవు వర్షిస్తావో అప్పుడు ఈ ప్రాణులు 'కోరిన ఆహారం దొరుకుతుంది' అనే ఆనందంతో పరవశిస్తారు.

శంకరుల భాష్యం

యదా పర్జన్యో భూత్వా అభివర్షసి త్వం , అథ తదా అన్నం ప్రాప్య ఇమాః ప్రజాః ప్రాణతే ప్రాణచేష్టాం కుర్వంతీత్యర్థః| అథవా, హే ప్రాణ, తే తవ ఇమాః ప్రజాః స్వాత్మభూతాస్త్వదన్నసంవర్ధితాస్త్వదభివర్షణదర్శనమాత్రేణ చ ఆనందరూపాః సుఖం ప్రాప్తా ఇవ సత్యః తిష్ఠంతి| కామాయ ఇచ్ఛాతః అన్నం భవిష్యతి ఇత్యేవమభిప్రాయః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

యదా ఎప్పుడు మేఘరూపమై **త్వమ్** నీవు **అభివర్షసి** వర్షాన్ని కురిపిస్తావో, **అథ** అప్పుడు ఆహారాన్ని పొంది **ఇమాః ప్రజాః** ఈ ప్రాణులు **ప్రాణతే** ప్రాణచేష్టను కలిగినవై, అంటే జీవన ఉత్సాహాన్ని పొందినవై అని అర్థం. లేదా, **ప్రాణః** ఓ ప్రాణమా! **తే ఇమాః ప్రజాః** నీ ఈ ప్రాణులు, అంటే నీ పరిణామ రూపాలైనవి, నీవు కురిపించే వర్షాన్ని చూసినంత మాత్రంచేత ఆహారం సమృద్ధిగా దొరుతుందని

కామాయ కోరిన **అన్నమ్ భవిష్యతి** ఆహారమ్ లభించబోతోంది అనే అభిప్రాయం కలిగనవై **ఆనందరూపాః తిష్ఠన్తి** సుఖాన్ని పొందేసినట్లుగా ఉంటున్నాయి.

వ్రాత్యస్త్వం ప్రాణైకర్షిరత్తా విశ్వస్య సత్పతిః|
వయమాద్యస్య దాతారః పితా త్వం మాతరిశ్వ నః || 2-11 ||

ఓ ప్రాణమా! నీవు సంస్కరింపబడేదానివి కావు. ఏకర్షి అన్నపేరుతో అగ్నిగా ఆహారాన్ని స్వీకరిస్తున్నావు. జగత్తులో ఉనికి గల వాటన్నింటికి నీవే ప్రభువు. మేము నీకు ఆహారాన్ని సమర్పించేవారము. ఓ మాతరిశ్వా, నీవు మాకు తండ్రివి.

శంకరుల భాష్యం

కించ, ప్రథమజత్వాదన్యస్య సంస్కర్తురభావాదసంస్కృతో వ్రాత్యః త్వం , స్వభావత ఏవ శుద్ధ ఇత్యభిప్రాయః| హే ప్రాణ, ఏకర్షిః త్వం ఆథర్వణానాం ప్రసిద్ధ ఏకర్షినామా అగ్నిః సన్ అత్తా సర్వహవిషాం| త్వమేవ విశ్వస్య సర్వస్య సతో విద్యమానస్య పతిః సత్పతిః ; సాధుర్వా పతిః సత్పతిః| వయం పునః ఆద్యస్య తవ అదనీయస్య హవిషో దాతారః| త్వం పితా మాతరిశ్వ హే మాతరిశ్వన్ , నః అస్మాకం అథవా, మాతరిశ్వనః వాయోః పితా త్వం| అతశ్చ సర్వస్యైవ జగతః పితృత్వం సిద్ధం||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మరింకా, అన్నింటికన్నా ముందుగా పుట్టినందున సంస్కరించబడటం అనేది లేనివాడవైనందున **త్వమ్** నీవు **వ్రాత్యః** సంస్కారానికి అవకాశమే లేనిదానివి. అంటే (నిన్ను మరింకా శుభ్రపరిచేవారు వేరెవరూ లేనందు చేత) శుద్ధత్వమే స్వభావంగా కలిగిన దానివి అని అభిప్రాయం. ఓ ప్రాణమా! **త్వమ్ ఏకర్షిః** అథర్వణవేదీయులలో ప్రసిద్ధమైన ఏకర్షి అనే పేరుగల అగ్నివి అయినందున **అత్తా** సకలమైన హవిస్సులను స్వీకరిస్తావు. **త్వమేవ** నీవే **విశ్వస్య** సర్వజగత్తులోని **సత్ పతిః** ఉనికి కలిగి తెలియబడే వాటన్నింటికి ప్రభువువు. లేదా **సత్ పతిః** పవిత్రమైన ప్రభువువు. ఇక **వయమ్** మేము **ఆద్యస్య** నీకు ఆహారాన్ని అంటే హవిస్సులను **దాతారః** అందించేవారము. **మాతరిశ్వ** ఓ మాతరిశ్వా! **నః** మాకు లేదా **మాతరిశ్వనః** (వాయువుకు కారణమైన ఆకాశానివి అయినందున) వాయువునకు **పితా త్వమ్** నీవు తండ్రివి. అందువలన కూడా సకల జగత్తు యొక్క పితృత్వం నీయందు కలదు.

యా తే తనూర్వాచి ప్రతిష్ఠితా యా శ్రోత్రే యా చ చక్షుషి|యా చ మనసి సన్తతా శివాం తాం కురు మోత్క్రమీః|| || 2-12 ||

నీ యొక్క ఉనికి ఏ వాక్కునందు, ఏ శ్రోత్రాలలో ఏ చక్షువులలో మరియు ఏ మనసులో వ్యాప్తమై ఉన్నదో దానిని శాంతపరచు. ఉత్క్రమించనీయ వద్దు (శరీరం నుండి పైకి వెడలనీయొద్దు).

శంకరుల భాష్యం

కిం బహునా ? యా తే త్వదీయా తనూః వాచి ప్రతిష్ఠితా వక్తృత్వేన వదనచేష్టాం కుర్వతీ, యా చ శ్రోత్రే యా చక్షుషి యా చ మనసి సంకల్పాదివ్యాపారేణ సంతతా సమనుగతా తనూః, తాం శివాం శాంతాం కురు ; మా ఉత్క్రమీః ఉత్క్రమణేనాశివాం మా కార్షీరిత్యర్థః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఇన్నెందుకు? **తే** నీ యొక్క **తనూః** ఉనికి **యా** ఏదైతే **వాచి ప్రతిష్ఠితా** వాక్కులను పలికేలా చేస్తుందో, **యా చ శ్రోత్రే** ఏదైతే చెవులతో వినేలా **యా చక్షుషి** ఏదైతే కన్నులతో చూచేలా **యా చ** మరియు ఏదైతే **మనసి** మనసునందు **సంతతా** అంతటా వ్యాపించి సంకల్పాది వ్యవహారాలను నిర్వహింపచేస్తుందో **తామ్** దానిని శివామ్ శాంతింప చేయి. **మా ఉత్క్రమీః** శరీరం నుండి బయటకు పోనివ్వద్దు.

ప్రాణస్యేదం వశే సర్వం త్రిదివే యత్ప్రతిష్ఠితమ్|
మాతేవ పుత్రాన్రక్షస్వ శ్రీశ్చ ప్రజ్ఞాం చ విధేహి న ఇతి|| || 2-13 ||

ఇదంతా (ఈ జగత్తులోని సర్వమూ) మరియు స్వర్గంలోని ప్రతిష్ఠితమైన యావత్తూ ప్రాణం యొక్క అధీనమే. తల్లి పుత్రులను రక్షించినట్లుగా కాపాడు. మాకు శ్రేయస్సు మరియు వివేకం కలిగేలా శాసించు.

శంకరుల భాష్యం

కిం బహునా| అస్మింల్లోకే ప్రాణస్యైవ వశే సర్వమిదం యత్కించిదుపభోగజాతం త్రిదివే తృతీయస్యాం దివి చ యత్ ప్రతిష్ఠితం దేవాద్యుపభోగలక్షణం తస్యాపి ప్రాణ ఏవ ఈశితా రక్షితా| అతో మాతేవ పుత్రాన్ అస్మాన్ రక్షస్వ పాలయస్వ| త్వన్నిమిత్తా హి బ్రాహ్మ్యః క్షాత్ర్యశ్చ శ్రియః తాః త్వం శ్రీశ్చ శ్రియశ్చ ప్రజ్ఞాం చ త్వత్స్థితినిమిత్తాం విధేహి నః విధత్స్వేత్యర్థః| ఇత్యేవం సర్వాత్మతయా వాగాదిభిః ప్రాణైః స్తుత్యా గమితమహిమా ప్రాణః ప్రజాపతిరేవేత్యవధృతం||

|| ఇతి ద్వితీయప్రశ్నభాష్యం||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఇంతెందుకు? **సర్వమ్ ఇదమ్** ఈ లోకంలోని విషయానుభవాలతో కూడిన సమస్తమూ **ప్రాణస్య వశే** ప్రాణం యొక్క అధీనమే. **త్రిదివే** మూడవదైన స్వర్గంలో కూడా **యత్** ఏదైతే దేవతలు మరియు ఇతరులచే భోగింపబడే సమస్తమూ **ప్రతిష్ఠితమ్** ఉన్నదో అది కూడా ప్రాణము చేతనే పరిపాలించబడేదే, రక్షించబడేదే. అందువలన, **మాతా ఇవ పుత్రాన్** పుత్రులను కాపాడే తల్లిలాగా **రక్షస్వ** రక్షించు, పాలించు. ఆ కారణంగా బ్రహ్మత్వం మరియు క్షత్రియత్వం అనే శ్రేయస్సులు నీవే కనుక వాటిని నిలుపుకొనేందుకు నీవు శ్రీశ్చ శ్రేయస్సును **ప్రజ్ఞామ్ చ** మరియు మేధస్సును **నః విధేహి** మాకు ప్రసాదించు అని అభిప్రాయం. **ఇతి** ఈ విధంగా ప్రాణం యొక్క ఘనతను తెలుసుకొన్న వాక్కు మొదలైనవి దాని సర్వాత్మత్వాన్ని కీర్తించి, ప్రాణమే ప్రాణున్నింటికి ప్రభువని ధృవీకరించాయి.

|| ద్వితీయ ప్రశ్నకు భాష్యానువాదం సంపూర్ణం||

తృతీయ ప్రశ్నః

అథ హైనం కౌసల్యశ్చాశ్వలాయనః పప్రచ్ఛ భగవన్కుత ఏష ప్రాణో జాయతే కథమాయాత్యస్మింఛరీర ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే కేనోత్క్రమతే కథం బాహ్యమభిధత్తే కథమధ్యాత్మమితి|| || 3-1 ||

తరువాత అశ్వలుని కుమారుడు కౌసల్యుడు (ఆచార్యుడైన పిప్పలాదుడిని), "ఓ పూజనీయుడా! ఈ ప్రాణం ఎక్కడనుండి జనిస్తోంది? ఈ శరీరంలో ఎలా ప్రవేశిస్తోంది? ఎలా తనను తాను విభజించుకొని నిలిచి ఉంటోంది? ఎలా ఉత్క్రమిస్తోంది? తనకు బాహ్యమైన వాటిని ఎలా పోషిస్తోంది? మరియు (దేహాన్ని) భౌతికంగా ఎలా నిలబెడుతోంది?" అని ప్రశ్నించాడు.

శంకరుల భాష్యం

అథ హైనం కౌసల్యశ్చాశ్వలాయనః ప్రపచ్ఛ| ప్రాణైర్వైవం నిర్ధారితతత్త్వః ఉపలబ్ధమహిమాపి సంహతత్వాత్స్యాదస్య కార్యత్వం ; అతః పృచ్ఛామి| హే భగవన్ , కుతః కస్మాత్కారణాత్ ఏషః యథావధృతః ప్రాణః జాయతే| జాతశ్చ కథం కేన వృత్తివిశేషేణ ఆయాతి అస్మిన్ శరీరే ; కింనిమిత్తకమస్య శరీరగ్రహణమిత్యర్థః| ప్రవిష్టశ్చ శరీరే ఆత్మానం వా ప్రవిభజ్య ప్రవిభాగం కృత్వా కథం కేన ప్రకారేణ ప్రాతిష్ఠతే ప్రతితిష్ఠతి| కేన వా వృత్తివిశేషేణాస్మాచ్ఛరీరాత్ ఉత్క్రమతే ఉత్క్రామతి| కథం బాహ్యం అధిభూతమధిదైవతం చ అభిధత్తే ధారయతి ; కథమధ్యాత్మమితి, ధారయతీతి శేషః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అథ హ తరువాత **కౌసల్యః చ అశ్వలాయనః** అశ్వలుని కుమారుడు కౌసల్యుడు **ఏనమ్ పప్రచ్ఛ** (ఆచార్యుడైన పిప్పలాదుడిని) అడిగాడు. ప్రాణం యొక్క గొప్పదనాన్ని ఇతర అవయవాలు నిర్ధారణచేసి చెప్పగా దాని స్వభావం తెలిసినా కూడా, అది దేహ సంఘాతంలోని ఒక అంశమే అయినందుచేత అది కార్యమే అవడం చేత, ఇలా ప్రశ్నిస్తున్నాడు. **భగవన్** ఓ పూజనీయుడా, **కుతః** దేనినుండి అంటే ఏ కారణం నుండి **ఏషః** ఈ నిర్ధారణచేయబడిన **ప్రాణః** ప్రాణం **జాయతే** పుడుతుంది? అలా పుట్టి మరి **కథమ్** ఏవిధంగా ఏ వ్యవహార విశేషం చేత **అస్మిన్ శరీరే** ఈ శరీరంలో **ఆయాతి** ప్రవేశిస్తుంది? అంటే, ఏ కారణం చేత శరీరాన్ని గ్రహిస్తుంది అని అర్థం. మరి అలా శరీరంలో ప్రవేశించి, **ఆత్మానమ్ ప్రవిభజ్య** తనను తాను విభజించుకొని **కథమ్** ఏ ప్రకారంగా **ప్రాతిష్ఠతే** స్థితిని కలిగి ఉంటోంది? **కేన** ఎలా, ఏ వృత్తి విశేషం చేత ఈ శరీరాన్నుండి **ఉత్క్రమతే** బయటకు వెడుతుంది? **కథమ్** ఎలా **బాహ్యమ్**

అధిభూతమైన, అధి దైవికమైన బాహ్య విషయాలకు **అభిధత్తే** ఆధారమౌతుంది? **కథమ్** ఎలా **అధ్యాత్మమ్** తనకు తాను ఆధారమౌతుంది అని పూర్తిచేసుకోవాలి. **ఇతి** ఈ విధంగా (శిష్యుడైన కౌసల్యుడు ఆచార్యుడైన పిప్పలాదుడిని ప్రశ్నించాడు).

తస్మై స హోవాచాతిప్రశ్నాన్పృచ్ఛసి బ్రహ్మిష్ఠోఽసీతి తస్మాత్తేఽహం బ్రవీమి||

|| 3-2 ||

అతనితో (అలా ప్రశ్నించిన కౌసల్యునితో) అతడు (ఆచార్యుడైన పిప్పలాదుడు) “బ్రహ్మనిష్ఠుడ వైనందున పరమోత్కృష్టమైన ప్రశ్నను అడిగావు. అందువలన నీకు నేను బోధిస్తాను” అని అన్నాడు.

శంకరుల భాష్యం

ఏవం పృష్టః తస్మై స హోవాచాచార్యః| ప్రాణ ఏవ తావద్దుర్విజ్ఞేయత్వాద్విషమప్రశ్నార్హః ; తస్యాపి జన్మాది త్వం పృచ్ఛసి ; అతః అతిప్రశ్నాన్పృచ్ఛసి| బ్రహ్మిష్ఠోఽసీతి అతిశయేన త్వం బ్రహ్మవిత్ , అతస్తుష్టోఽహం , తస్మాత్ తే తుభ్యం అహం బ్రవీమి యత్పృష్టం శృణు||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఆ విధంగా ప్రశ్నించిన **తస్మై** కౌసల్యునితో **సః** గురువైన పిప్పలాదుడు **ఉవాచ హ** అన్నాడు. ప్రాణమన్నదాన్ని గురించి తెలుసుకోవడమే కష్టసాధ్యమైన విషయం. కాబట్టి దాని గురించి అడిగే ప్రశ్న చాలా సంక్లిష్టమైనది. అలా అయినప్పటికీ, ఆ ప్రాణం యొక్క పుట్టుకను గురించిన **అతిప్రశ్నాన్** అతి సూక్ష్మమైన విషయాన్ని **పృచ్ఛసి** అడిగావు. కనుక, **బ్రహ్మిష్ఠః అసి ఇతి** అతిశయించిన బ్రహ్మనిష్ఠలో ఉన్నవాడివైనందున నీవు బ్రహ్మము పట్ల జిజ్ఞాస కలవాడివి. [‘అంటే అపరబ్రహ్మకన్నా మిన్నయైన పరబ్రహ్మను గురించి తెలిసుకొనదగినవాడవు’ అని ప్రోత్సాహపరుస్తూ చెప్పినది. – ఆనందగిరి టీక.] నీవు అడిగిన ప్రశ్నకు నేను సంతోషిస్తున్నాను. **తస్మాత్** అందువల్ల **తే** నీకు **అహమ్** నేను **బ్రవీమి** నీకు సమాధానాన్ని బోధిస్తాను విను.

{ప్రాణం గురించి తెలుసుకోవడమే చాలా సూక్ష్మమైన విషయం. అలాంటిది, ఆ ప్రాణం ఎక్కడ నుండి ఉత్పన్నమౌతుంది వంటి నిగూఢమైన విషయాలను గురించి శిష్యుడు ప్రశ్నిస్తున్నాడిక్కడ. యోగ్యుడైన శిష్యుడు అడిగిన ప్రశ్నల యొక్క సంక్లిష్టతను గుర్తించి, అటువంటి సూక్ష్మమైన విషయాలను గ్రహించాలనే శ్రద్ధ కనపరచిన శిష్యుని చూసి గురువు ముచ్చట పడ్డాడు. ఎంతగానో కృషిచేసి బ్రహ్మమును గురించిన విచారణ చేస్తేనే ఇటువంటి అతిసూక్ష్మమైన విషయాల గురించిన

సందేహం కలుగుతుంది కాని, సాధారణంగా కలిగే సందేహం కాదిది. అందుచేత, గురువు తనకు కలిగిన ఆనందాన్ని వ్యక్తపరుస్తూ, దానికి తగిన సమాధానం ఇవ్వబోతున్నాడు.}

ఆత్మన ఏష ప్రాణో జాయతే| యథైషా పురుషే చ్ఛాయైతస్మిన్నేతదాతతం మనోకృతేన యాత్యస్మింఛరీరే|| || 3-3 ||

ఆత్మనుండి ఈ ప్రాణం పుట్టినది. మానవుడికి నీడ ఉన్నట్లుగా ఈ ప్రాణం ఆత్మను అంటిపెట్టుకొని ఉంటుంది. మనసు యొక్క వ్యవహారం చేత ఇది (ఈ ప్రాణం) ఈ శరీరంలోకి వస్తుంది.

శంకరుల భాష్యం

ఆత్మనః పరస్మాత్పురుషాదక్షరాత్సత్యాత్ ఏషః ఉక్తః ప్రాణః జాయతే| కథమిత్యత్ర దృష్టాంతః| యథా లోకే ఏషా పురుషే శిరఃపాణ్యాదిలక్షణే నిమిత్తే ఛ్చాయా నైమిత్తికీ జాయతే, తద్వత్ ఏతస్మిన్ బ్రహ్మణ్యేతత్ప్రాణాఖ్యం ఛాయాస్థానీయమనృతరూపం తత్త్వం సత్యే పురుషే ఆతతం సమర్పితమిత్యేతత్| ఛాయేవ దేహే మనోకృతేన మనఃకృతేన మనఃసంకల్పేచ్ఛాదినిష్పన్నకర్మనిమిత్తేనేత్యేతత్| వక్ష్యతి హి పుణ్యేన పుణ్యమిత్యాది| 'తదేవ సక్తః సహ కర్మణైతి' (బృ. ఉ. 4| 4| 6) ఇతి శ్రుత్యంతరాత్| ఆయాతి ఆగచ్ఛత్యస్మిఞ్శరీరే||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఆత్మనః పరమమైన పురుషునినుండి, నశించడమనేది లేని, సత్యమైన దానినుండి ఈ చెప్పబడిన **ప్రాణః** ఈ ప్రాణం **జాయతే** పుట్టింది (ముండకోపనిషత్తులోని 2-1-2, 2-1-3వ మంత్రాలలో చెప్పబడినట్లుగా). ఎలా పుట్టింది అన్నదానికి ఇక్కడ దృష్టాంతం చెప్తున్నారు. **యథా** ఎలాగైతే లోకంలో **ఏషా ఛాయా** ఈ ఛాయ అంటే నీడ అనే కార్యం **పురుషే** తల, చేతులు మొదలైన లక్షణాలున్న మనిషి కారణంగా ఏర్పడుతుందో, అదేవిధంగా **ఏతస్మిన్** దీనియందు అంటే బ్రహ్మమందు ఈ ప్రాణమనబడే నీడను పోలిన అసత్యరూపమైన తత్త్వం సత్యమైన పురుషునియందు **ఆతతమ్** వ్యాపించింది లేదా ఏర్పడింది. దేహం వల్ల ఏర్పడిన నీడలాగా **మనోకృతేన** మనసు యొక్క వ్యవహారంగా, అంటే మనసు యొక్క ఆలోచనలు కోరికలచే కలిగిన కర్మల కారణంగా ఇది (ఈ ప్రాణం) **అస్మిన్ శరీరే** ఈ దేహంలోకి **ఆయాతి** వచ్చింది. దీనిసే 'పుణ్యేన పుణ్యం' అంటూ రాబోయే 3-7వ మంత్రంలో చెప్పబోతున్నారు. మరొక శ్రుతిలో కూడా 'కర్మ సంగం కలిగిన వాడై (సూక్ష్మశరీరం దేనితోనైతే సంగాన్ని పొందిందో) ఆ ఫలితాన్ని పొందును' ['తదేవ సక్తః సహ కర్మణైతి' (బృ.ఉ. 4-4-6)] అని చెప్పారు.

{ప్రాణం ఎలా ఉత్పన్నమైనదో వివరిస్తున్నారు. మానవాకృతి కారణంగా నీడ అనేది ఏర్పడినట్లుగా, పరమాత్మయందు ఈ ప్రాణమన్నది అసద్రూపంగా ఉద్భవించి వ్యాపిస్తోంది. అంటే

పరమాత్మయే ఈ ప్రాణానికి మూల కారణం. మనిషి లేకపోతే నీడ ఎలాగైతే ఉండదో, అలాగే పరమాత్మ లేకపోతే ఈ ప్రాణమన్నదానికి ఉనికియే ఉండదు. కాబట్టి అది అసత్తు మాత్రమే. మరైతే, ఈ ప్రాణం దేహంలోకి ఎలా ప్రవేశించింది? మనసు యొక్క ఆలోచనల కారణంగా ఈ ప్రాణం దేహంలోకి వచ్చింది. మనసులోని ఆలోచనలు అంటే కోరికలే. ఆ కోరికలను తీర్చుకోవడానికి కర్మలు చేస్తారు. గత జన్మలలో అనుభవించగా మిగిలిన కర్మ శేషాలకు తగిన ఫలితాలను అనుభవించడానికి మరొక దేహం అవసరం కాబట్టి, ప్రాణం అన్నది దేహంలో ప్రవేశించి, కర్మ ఫలాలను అనుభవిస్తుంది. పుణ్యకర్మల వల్ల పుణ్యఫలాలు, పాప కర్మల వల్ల పాప ఫలాలను దేహాన్ని ఆధారం చేసుకొని ప్రాణం అనుభవిస్తుంది. కాబట్టి, ఈ ప్రాణం అన్నది కర్మతో సంగం వల్ల ఆయా ఫలాలను పొందటానికి దేహాన్ని ఆశ్రయిస్తుంది.}

యథా సమ్రాడేవాధికృతాన్వినియుఙ్క్తే ఏతాన్గ్రామా నేతాన్గ్రామా నధితిష్ఠస్వేత్యేవమేవైష ప్రాణ ఇతరా న్ప్రాణాన్పృథక్పృథగేవ సంనిధత్తే|| || 3-4 ||

ఎలాగైతే మహారాజు ఒక్కడే అధికారులను ఈ ఈ గ్రామాలను మీరు పరిపాలించండి అని నియమిస్తాడో అలా ఈ ప్రాణం ఇతర ప్రాణాలను వేర్వేరు కార్యాలలో నియోగిస్తుంది.

<u>శంకరుల భాష్యం</u>

యథా యేన ప్రకారేణ లోకే రాజా సమ్రాడేవ గ్రామాదిష్వధికృతాన్వినియుంక్తే| కథం ? ఏతాన్గ్రామానేతాన్గ్రామానధితిష్ఠస్వేతి| ఏవమేవ యథాయం దృష్టాంతః| ఏషః ముఖ్యః ప్రాణః ఇతరాన్ ప్రాణాన్ చక్షురాదీనాత్మభేదాంశ్చ పృథక్పృథగేవ యథాస్థానం సంనిధత్తే వినియుంక్తే||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

యథా ఏ ప్రకారంగా లోకంలో **సమ్రాట్ ఏవ** మహారాజు ఒక్కడే గ్రామాలకు **అధికృతాన్** అధికారులను **వినియుఙ్క్తే** నియమిస్తాడో అలా. ఎలా? **ఏతాన్ గ్రామాన్** ఈ గ్రామాలు **ఏతాన్ గ్రామాన్** ఈ గ్రామాలు **అధితిష్ఠస్వ** పరిపాలించండి అని. **ఏవమ్ ఏవ** ఈ విధంగానే, ఉదహరించిన విధంగానే. **ఏషః** ఈ ప్రధానమైన **ప్రాణః** ప్రాణం **ఇతరాన్ ప్రాణాన్** తనకు ప్రతిరూపాలైన చక్షువులు మొదలైన వాటిని **పృథక్ పృథక్ ఏవ** వేర్వేరుగా వాటివాటి స్థానాలలో **సంనిధత్తే** నియోగిస్తుంది.

{ఆ విధంగా దేహాన్ని అధిష్టించిన ప్రాణం తనను తాను అంశాలుగా విభజించుకొని దేహేంద్రియ వృత్తులను నియంత్రిస్తోంది. ఏ విధంగా నియంత్రిస్తోంది తర్వాతి మంత్రంలో వివరిస్తున్నారు.}

పాయూపస్థేఽపానం చక్షుఃశ్రోత్రే ముఖనాసికాభ్యాం ప్రాణః స్వయం ప్రాతిష్ఠతే మధ్యే తు సమానః| ఏష హ్యేతద్ధుతమన్నం సమం నయతి తస్మాదేతాః సప్తార్చిషో భవంతి|| || 3-5 ||

పాయువు-ఉపస్థలయందు అపానం, చక్షవులు- శ్రోత్రాలు-ముఖం-నాసికల యందు స్వయంగా ప్రాణం ప్రతిష్ఠితమై ఉన్నది. మధ్యలో అయితే సమానం అన్నది తిన్న ఆహారాన్ని సమంగా అన్నివైపులకూ తీసుకువెడుతుంది. అందువలన, ఇవి ఏడు అగ్నులు అవుతున్నాయి.

శంకరుల భాష్యం

తత్ర విభాగః| పాయూపస్థే పాయుశ్చ ఉపస్థశ్చ పాయూపస్థం తస్మిన్| అపానం ఆత్మభేదం మూత్రపురీషాద్యపనయనం కుర్వన్ సంనిధత్తే తిష్ఠతి| తథా చక్షుఃశ్రోత్రే చక్షుశ్చ శ్రోత్రం చ చక్షుఃశ్రోత్రం తస్మిశ్చక్షుఃశ్రోత్రే| ముఖనాసికాభ్యాం ముఖం చ నాసికా చ ముఖనాసికే తాభ్యాం ముఖనాసికాభ్యాం నిర్గచ్ఛన్ ప్రాణః స్వయం సమ్రాట్స్థానీయః ప్రాతిష్ఠతే ప్రతితిష్ఠతి| మధ్యే తు ప్రాణాపానయోః స్థానయోః నాభ్యాం , సమానః అశితం పీతం చ సమం నయతీతి సమానః| ఏషః హి యస్మాత్ యదేతత్ హుతం భుక్తం పీతం చాత్మాగ్నౌ ప్రక్షిప్తం అన్నం సమం నయతి, తస్మాత్ అశితపీతేంధనాదగ్నే రౌదర్యాద్హృదయదేశం ప్రాప్తాత్ ఏతాః సప్తసంఖ్యాకా అర్చిషః దీప్తయో నిర్గచ్ఛంత్యో భవంతి| శీర్షణ్యప్రాణద్వారా దర్శనశ్రవణాదిలక్షణరూపాదివిషయప్రకాశ ఇత్యభిప్రాయః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఇక్కడ ఆ విభాగాల గురించి చెప్తున్నారు. **పాయూపస్థే** అనగా పాయువు మరియు ఉపస్థ అన్న క్రింది భాగాలలో **అపానం** తన అంశయే అయినట్టిది మూత్ర పురీషాదులను బయటకు నెట్టే పనిని నిర్వహించేది ఉంటుంది. అదేవిధంగా, **చక్షుఃశ్రోత్రే** కన్నులలో-చెవులలో **ముఖనాసికాభ్యామ్** నోరు మరియు నాసికలనే వాటిలో చేరి **ప్రాణః స్వయమ్** స్వయంగా ప్రాణమే సామ్రాజ్యాన్ని అధిష్ఠించినట్లుగా **ప్రాతిష్ఠతే** ప్రతిష్ఠితమై ఉన్నది. **మధ్యే తు** మధ్యలో అయితే, అంటే ప్రాణ-అపాన స్థానాలకు మధ్యలో నాభిప్రదేశంలో **సమానః** తిన్నదాన్ని మరియు తాగినదాన్ని సమంగా (శరీరమంతటా) పంచుతుంది కాబట్టి అది 'సమానం'. **ఏషః హి** ఇదియే **ఏతత్ హుతమ్** తిన్న మరియు తాగిన ఆహారాన్ని ఆత్మాగ్నిలో వ్రేల్చి సమంగా దేహమంతటికీ అందిస్తుంది. అందువలన, తిన్నవి-తాగినవి అనే ఇంధనాలు, ఉదరంలోని అగ్నినుండి హృదయ ప్రదేశాన్ని చేరి **ఏతాః** ఇవి **సప్త అర్చిషః** ఏడు సంఖ్యకలిగిన ప్రకాశాలుగా **భవన్తి** నిర్గమిస్తాయి. తలలోనున్న ప్రాణం ద్వారా చూచుట, వినుట అనే లక్షణాలు కల విషయ ప్రకాశ రూపాలుగా పరిణమిస్తాయని అభిప్రాయం. (ఇక్కడ చెప్తున్న విషయం వివరంగా ఇది. ఉదరంలోని జఠరశక్తియే హోమాగ్ని. తిన్న ఆహారం దానిలో వేసే హవిస్సుత. ఇంద్రియ జ్ఞానమే అగ్ని ప్రజ్వలనం.

తలలోనున్నవి ఏడు అంగాలు, రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు నాసికలు, ఒక నోరు. ఇవి తిన్న ఆహారం ద్వారా పొందిన సామర్థ్యంతో వాటి వాటి కార్యాలలో వ్యవహరిస్తున్నాయి. – స్వామి గంభీరానంద)

{ప్రాణం తనను తాను 5 అంశలుగా విభజించుకొంటుంది అని చెప్పారు కదా! అవి ఏమంటే, ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమాన వాయువులు. వీటన్నింటినీ కలిపి ప్రాణం అని అంటారు. ఇందులో ప్రాణ వాయువు కన్నులు-చెవులు-నోరు-నాసికలలో ప్రతిష్ఠితమై ఉంటుంది. అపాన వాయువు విసర్జనేంద్రియాలైన పాయువు-ఉపస్థలలో ఉండి మూత్ర-పురీషాలను బయటకు నెట్టివేస్తుంది. ఈ ప్రాణ వాయువు సంచరించే ప్రదేశానికి మరియు అపాన వాయువు సంచరించే ప్రదేశానికి మధ్యలో నాభి ప్రదేశంలో సమాన వాయువు ఉండి ఆహార పానీయాదులను శరీరమంతటికీ సమానంగా అందిస్తుంది. తీసుకొన్న ఆహార పానీయాలు అనే ఇంధనాలు ఉదరంలోని అగ్ని సంపర్కంతో శక్తిరూపాలుగా పరిణామం చెంది ఏయే అవయవాలకు ఎలాంటి సామర్థ్యం అవసరమౌతుందో అటువంటి శక్తి సామర్థ్యాలను కలుగచేస్తాయి.}

హృది హ్యేష ఆత్మా| అత్రైతదేకశతం నాడీనాం తాసాం శతం శతమేకైకస్యా ద్వాసప్తతిర్ద్వాసప్తతిః ప్రతిశాఖానాడీసహస్రాణి భవంత్యాసు వ్యానశ్చరతి||

|| 3-6 ||

హృదయమందే దీని ఆత్మ (అంటే సూక్ష్మ శరీరం). అక్కడ 101 నాడులున్నాయి. వాటికి ఒక్కొక్కదానికి (ఒక్కొక్క నాడికి) వంద చొప్పున శాఖలున్నాయి. ఒక్కొక్క శాఖకు 72000 చొప్పున ఉప-శాఖలున్నాయి. వాటిలో వ్యానం సంచరిస్తుంది.

శంకరుల భాష్యం

హృది హ్యేషః పుండరీకాకారమాంసపిండపరిచ్ఛిన్నే హృదయాకాశే ఏషః ఆత్మా ఆత్మసంయుక్తో లింగాత్మా, జీవాత్మేత్యర్థః ; అత్ర అస్మిన్హృదయే ఏతత్ ఏకశతం ఏకోత్తరశతం సంఖ్యయా ప్రధాననాడీనాం భవతి| తాసాం శతం శతం ఏకైకస్యాః ప్రధాననాడ్యా భేదాః ; పునరపి ద్వాసప్తతిర్ద్వాసప్తతిః ద్వే ద్వే సహస్రే అధికే సప్తతిశ్చ సహస్రాణి, సహస్రాణాం ద్వాసప్తతిః, ప్రతిశాఖానాడీసహస్రాణి ప్రతిప్రతినాడీశతం సంఖ్యయా ప్రధాననాడీనాం సహస్రాణి భవంతి| ఆసు నాడీషు వ్యానో వాయుశ్చరతి| వ్యానో వ్యాపనాత్| ఆదిత్యాదివ రశ్మయో హృదయాత్సర్వతోగామినీభిర్నాడీభిః సర్వదేహం సంవ్యాప్య వ్యానో వర్తతే| సంధిస్కంధమర్మదేశేషు విశేషేణ ప్రాణాపానవృత్త్యోశ్చ మధ్యే ఉద్భూతవృత్తిర్వీర్యవత్కర్మకర్తా భవతి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

హి ఏషః ఆత్మా (ఈ వ్యాన వాయువు యొక్క కేంద్రస్థానం) **హృది** హృదయంలోని ఆకాశమే. పద్మాకారంలో ఉన్న మాంసపిండంచేత ఆవరించబడిన హృదయాకాశంలోనే (ఈ వ్యాన

వాయువు కేంద్రీకృతమై) ఉన్నది. **అత్ర** ఆ హృదయంలో, **ఏతత్ ఏకశతమ్** ఈ నూట ఒక్క సంఖ్య గల **నాడీనామ్** ముఖ్యనాడులు ఉన్నాయి. **తాసామ్** ఆ ముఖ్యనాడులకు **శతమ్ శతమ్ ఏకైకస్యాః** ఒక్కొక్కదానికి నూరు చొప్పున శాఖలున్నాయి. మరింకా, **ప్రతిశాఖా** ప్రతి ఒక్క శాఖకు **ద్వాసప్తతిః ద్వాసప్తతిః సహస్రాణి** డెబ్బదిరెండు వేల చొప్పున **భవన్తి** ఉపశాఖలున్నాయి. **ఆసు నాడీషు** ఈ నాడులయందు **వ్యానః** వ్యానం అనబడే వాయువు **చరతి** సంచరిస్తుంది. వ్యాపించేది కాబట్టి 'వ్యానః' అన్నారు. సూర్యకిరణాల వలె, హృదయం నుండి అంతటా వ్యాపించిన నాడులతో సహా దేహమంతటినీ వ్యానం సమంగా వ్యాపించి ఉంటుంది. (ఈ వ్యానమే) ప్రత్యేకించి సంధి ప్రదేశాలలో, భుజాలలో, మర్మస్థానాలలో, ప్రాణ-అపాన వ్యవహారాలకు మధ్య భాగంలో (వ్యాపించి), దేహికి శక్తివంతంగా కర్మలను నిర్వహించే సామర్థ్యాన్ని కలగజేస్తుంది.

{ఈ వ్యాన వాయువు ఎక్కడ ఉండి ఎలా పనిచేస్తుందో ఈ మంత్రంలో వివరిస్తున్నారు. ఇది హృదయాకాశంలో ఉండి నాడుల ద్వారా శరీరంలోని అన్ని మూలలకు వ్యాపించి సంచరిస్తుంది. హృదయ ప్రదేశంలో 101 ముఖ్య నాడులు కేంద్రీకృతమై ఉంటాయి. ఒక్కొక్క ముఖ్యనాడికి 100 చొప్పున శాఖలుంటాయి. ఒక్కొక్క శాఖకు 72000 ఉపశాఖలుంటాయి. ఈ లెక్కన శరీరంలో మొత్తం 72,72,00,000 నాడులు శరీరమంతటా వ్యాప్తమై ఉండి, వీటన్నింటిలోనూ వ్యాన వాయువు సమంగా సంచరిస్తూ ఉంటుంది. ఈ వ్యాన వాయువు యొక్క సంచారం వల్లనే దేహానికి కర్మల నిర్వహణా సామర్థ్యం కలుగుతోంది. ముఖ్యంగా స్కంధాలలో, సంధి ప్రదేశాలలో, మర్మస్థానాలలో, ప్రాణ-అపాన వాయు ప్రదేశాల మధ్యభాగంలో ఈ వ్యాన వాయువు వల్ల దేహికి అమితమైన శక్తి సామర్థ్యాలు కలుగుతున్నాయి.}

అథైకయోర్ధ్వ ఉదానః పుణ్యేన పుణ్యం లోకం నయతి పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకం|| || 3-7 ||

ఇక ఒక (నాడి) ద్వారా పైకి ఉదానం అన్నది పుణ్యం చేత పుణ్యలోకాలకు, పాపం ఫలితంగా పాపలోకాలకు, రెండింటి ఫలంగా మానవలోకానికి తీసుకెడుతుంది.

<u>శంకరుల భాష్యం</u>

అథ యా తు తత్రైకశతానాం నాడీనాం మధ్యే ఊర్ధ్వగా సుషుమ్నాఖ్యా నాడీ, తయా ఏకయా ఊర్ధ్వః సన్ ఉదానః వాయుః ఆపాదతలమస్తకవృత్తిః సంచరన్ పుణ్యేన కర్మణా శాస్త్రవిహితేన పుణ్యం లోకం దేవాదిస్థానలక్షణం నయతి ప్రాపయతి| పాపేన తద్విపరీతేన పాపం నరకం తిర్యగ్యోన్యాదిలక్షణం| ఉభాభ్యాం సమప్రధానాభ్యాం పుణ్యపాపాభ్యామేవ మనుష్యలోకం నయతీత్యనువర్తతే||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అథ ఇకనైతే 101 ముఖ్యనాడుల మధ్యలో **ఏకయా ఊర్ధ్వః** ఒకటి పైకి వెళ్లేది, సుషుమ్న అనబడే నాడి ఉండి దానిలో **ఉదానః** పాదాలనుండి తలవరకు సంచరించే ఉదాన వాయువు **పుణ్యేన** శాస్త్రవిహితమైన కర్మల ఫలితంగా **పుణ్యమ్ లోకమ్** పుణ్యలోకాలకు అంటే దేవతలు ఉండే స్వర్గానికి **నయతి** తీసుకుపోతుంది. (ఆ ఉదాన వాయువే) **పాపేన** వీటికి విపరీతమైన పాపకర్మాచరణం చేత **పాపమ్** నరకం అనే పశు-పక్ష్యాది జన్మలకు కారణమైన లోకానికి (తీసుకు పోతుంది). (ఆ ఉదాన వాయువే) **ఉభాభ్యామ్** పుణ్యపాపాలు రెండూ సమ ప్రధానంగా ఉంటే **మనుష్యలోకమ్** మానవలోకానికి. తీసుకుపోతుంది అని ప్రతిదానికి అనుసంధానించుకోవాలి.

{గత మంత్రంలో చెప్పిన 101 ముఖ్యనాడుల మధ్యలో సుషుమ్న అనబడే నాడి ఒకటి ఉంది. ఆ సుషుమ్న అనే నాడిలో ఉదాన వాయువు సంచరిస్తుంది. ఈ ఉదాన వాయువే, జీవుడిని వాని పుణ్యపాప కర్మలకు అనుగుణంగా ఊర్ధ్వలోకాలకు, అధోలోకాలకు, మానవలోకానికి చేరుస్తుంది. పుణ్యం చేసుకొంటే దేవతలుండే స్వర్గలోకానికి, పాపం చేసుకొంటే పశు-పక్ష్యాది జన్మలుండే నరకాది లోకాలకు చేర్చుతుంది. పుణ్య-పాప కర్మలు రెండూ సమంగా ఉంటే మానవలోకానికి చేరుస్తుంది.}

ఆదిత్యో హ వై బాహ్యః ప్రాణ ఉదయత్యేష హ్యేనం చాక్షుషం ప్రాణమనుగృహ్ణానః|
పృథివ్యాం యా దేవతా సైషా పురుషస్యాపానమవష్టభ్యాంతరా యదాకాశః స సమానో
వాయుర్వ్యానః|| || 3-8 ||

బాహ్యమందు గల ప్రాణమే ఆదిత్యుడు. ఈతడు ఉదయించి చక్షువులలో నున్న ప్రాణాన్ని అనుగ్రహిస్తాడు. పృథివియందు ఏ దేవతయున్నదో అది పురుషునిలోని అపానాన్ని ఆకర్షిస్తుంది. మధ్యలోగల ఆకాశమందు సమంగా వ్యాపించి యున్న ఏ దేవత కలదో అదియే సమాన వాయువు.

శంకరుల భాష్యం

ఆదిత్యః హ వై ప్రసిద్ధో హ్యాధిదైవతం బాహ్యః ప్రాణః స ఏష ఉదయతి ఉద్గచ్ఛతి| ఏష హి ఏనం ఆధ్యాత్మికం చక్షుషి భవం చాక్షుషం ప్రాణం ప్రకాశేన అనుగృహ్ణానః రూపోపలబ్ధౌ చక్షుష ఆలోకం కుర్వన్నిత్యర్థః| తథా పృథివ్యాం అభిమానినీ యా దేవతా ప్రసిద్ధా సైషా పురుషస్య అపానం అపానవృత్తిం అవష్టభ్య ఆకృష్య వశీకృత్యాధ ఏవాపకర్షణేనానుగ్రహం కుర్వతీ వర్తత ఇత్యర్థః| అన్యథా హి శరీరం గురుత్వాత్పతేత్సావకాశే వోద్గచ్ఛేత్| యదేతత్ అంతరా మధ్యే ద్యావాపృథివ్యోః యః ఆకాశః తత్స్థో వాయురాకాశ ఉచ్యతే, మంచస్థవత్| స సమానః సమానమనుగృహ్ణానో వర్తత ఇత్యర్థః| సమానస్యాంతరాకాశస్థత్వసామాన్యాత్| సామాన్యేన చ యో బాహ్యో వాయుః స వ్యాప్తిసామాన్యాత్ వ్యానః వ్యానమనుగృహ్ణానో వర్తత ఇత్యభిప్రాయః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఆదిత్యః హ వై దేవతా సందర్భంగా ప్రసిద్ధమైన సూర్యుడే **బాహ్య ప్రాణః** బాహ్యమందున్న ప్రాణం. **ఏష** ఇది **ఉదయతి** ఉదయిస్తుంది. ఈ ఉదయించే దేవతయే దేహ సందర్భంలో **చాక్షుషమ్** కన్నులయందుండే **ప్రాణమ్** ప్రాణాన్ని ప్రకాశాన్ని **అనుగృహ్ణానః** అనుగ్రహిస్తుంది. అంటే కన్నులచే రూపాలను దర్శించేలా చేస్తుంది అని అభిప్రాయం. అదేవిధంగా, **యా దేవతా పృథివ్యామ్** ఏ దేవత అయితే భూమిగా ప్రసిద్ధి చెందినదో **స ఏషా** అదియే **పురుషస్య అపానమ్** మానవదేహంలోని అపానమనబడే వ్యవహారాన్ని **అవష్టభ్య** ఆకర్షించి, అధీనంలోకి తెచ్చుకొని, క్రిందికి లాగడం ద్వారా అనుగ్రహిస్తుంది అని అభిప్రాయం. అలాకాకపోతే, దేహం బరువు వల్ల పడిపోగలదు లేదా వదిలేస్తే (క్రిందికి లాగడం అనేది వదిలేస్తే) పైకి ఎగిరి పోగలదు. **యత్** ('యః' గా తీసుకోవచ్చు) **అన్తరా** మధ్యలో అంటే దివికి-భువికి మధ్యలోగల **ఆకాశః** ఆ ఆకాశంలో వాయువు సమంగా ఉంటుందో **స సమానః** ఆకాశం అంతటా సమానంగా వ్యవహరిస్తుందో అంటే దేహం మధ్యలోని హృదయాకాశంలో ఉన్నట్లుగానే బాహ్యంలో కూడా దివికి-భువికి మధ్యలో అంతరిక్షంలో ఉండటం అనే సామాన్యత్వం కలిగి ఉంటుంది కాబట్టి అది సమాన వాయువు. (ఇది వాయువుకు గల స్థితిసామాన్యత్వం). బాహ్యంలో వ్యాప్తిసామాన్యత కూడా **వాయుః** వాయువుకు ఉన్నందు చేత అది **వ్యానః** అంతరంలో గల వ్యానం అనబడే ప్రాణవృత్తిని అనుగ్రహిస్తుంది అని అభిప్రాయం.

{ఇప్పటి వరకు దేహానికి అంతరంలో ఉన్న ప్రాణం యొక్క అంశాలను వాటి ఆశ్రయస్థానాలను, అవి చేసే వృత్తులను చెప్పి, ఇక బాహ్యంలో కూడా ప్రాణం ఎలా తన కార్యకలాపాలను నిర్వర్తిస్తోందో వివరిస్తున్నారు. ఆదిత్యుడే బాహ్యంలోని ప్రాణం. సమిష్టిలోని ప్రాణశక్తి. ఇదియే వ్యక్తి సందర్భంలో కన్నులలో ప్రకాశరూపంగా ఉండే ప్రాణశక్తికి సహకరిస్తూ కన్నులతో వస్తువులను చూచే సామర్థ్యాన్ని కలిగిస్తోంది. ఇక పృథివియే బాహ్యంలోని అపానం. ఈ పృథివియే దేహంలోని అపాన వృత్తిని ఆకర్షించి క్రిందికి లాగడమనే క్రియతో దేహాన్ని నిలబెడుతోంది. బాహ్యమందుండే ఈ అపానవృత్తియే లేకపోతే శరీరం పడిపోకుండా నిలిచి ఉండకపోవడమే కాకుండా పైకి ఎగిరిపోయే అవకాశం ఉంటుంది. ఒక విధంగా భూమి యొక్క ఆకర్షణ శక్తిని బాహ్యంలోని అపానవాయు వృత్తిగా ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. ఇక బాహ్యంలోని సమాన వృత్తి గురించి చెప్తున్నారు. దేహం లోపల ఎలాగైతే సమాన వాయువు ప్రాణ-అపాన వృత్తి ప్రదేశాలకు మధ్యలో ఉన్నదో అలాగే, బాహ్యంలో కూడా దివికి-భువికి మధ్య భాగమైన అంతరిక్షంలో సమంగా సంచరిస్తూ ఉంటుంది. దేహం లోపల ఎలాంటి స్థితి ఉన్నదో అలాంటి స్థితే బాహ్యంలో కూడా సమానానికి ఉంటుంది. స్థితి విషయంలో సమానత్వమే కాకుండా, వ్యాప్తి విషయంలో కూడా రెండింటికి సామాన్యత్వాన్ని తెలిపే వ్యాన వృత్తిని కూడా చూడవచ్చు.}

తేజో హ వావ ఉదానస్తస్మాదుపశాన్తతేజాః పునర్భవమిన్ద్రియైర్మనసి సంపద్యమానైః||
|| 3-9 ||

ప్రసిద్ధమైన తేజస్సే ఉదానం. అందుచేతనే, తేజస్సు ఉపశమించినవాడు మనసులో చేరిన ఇంద్రియాలతో సహా తిరిగి జన్మిస్తాడు.

శంకరుల భాష్యం

యద్బాహ్యం హ వావ ప్రసిద్ధం సామాన్యం తేజః తచ్ఛరీరే ఉదానః ఉదానం వాయుమనుగృహ్ణాతి స్వేన ప్రకాశేనేత్యభిప్రాయః| యస్మాత్తేజఃస్వభావో బాహ్యతేజోనుగృహీత ఉత్క్రాంతికర్తా తస్మాత్ యదా లౌకికః పురుషః ఉపశాంతతేజాః భవతి, ఉపశాంతం స్వాభావికం తేజో యస్య సః| తదా తం క్షీణాయుషం ముమూర్షుం విద్యాత్| సః పునః భవం శరీరాంతరం ప్రతిపద్యతే| కథం ? సహ ఇంద్రియైః మనసి సంపద్యమానైః ప్రవిశద్భిర్వాగాదిభిః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

బాహ్యంలో ఏదైతే **తేజః హ వా** తేజస్సుగా సాధారణంగా ప్రసిద్ధమైయున్నదో అది ఆ శరీరంలోని **ఉదానః** ఉదాన వాయువును అనుగ్రహిస్తుంది. అంటే ప్రాణవృత్తి అయిన ఉదానాన్ని ప్రకాశింపచేస్తుంది. దేహాన్ని విడిచిపెట్టుట అనే క్రియయే స్వభావంగాగల తేజస్సును దేహంలోనే ఉండేలా బాహ్యంలోని తేజస్సు అనుగ్రహిస్తుంది. అందువల్లనే లోకంలో ఎప్పుడైతే మానవుని **ఉపశాన్త తేజాః** తేజస్సు ఉపశమిస్తుందో అప్పుడు అతని ఆయువు ముగిసిందని అర్థం చేసుకోవాలి. అతడు **పునః భవమ్** తిరిగి మరొక శరీరాన్ని పొందుతాడు. ఎట్లా? **ఇన్ద్రియైః మనసి సంపద్యమానైః** వాక్కు మొదలైన ఇంద్రియాలన్నీ ప్రవేశించియున్న మనసుతో సహా (మరొక దేహాన్ని పొందుతాడు).

{దేహం లోపల ఉదాన వాయు వృత్తి జీవుడిని కర్మఫలాలకు తగిన లోకాలకు చేరుస్తుందని చూశాం. ఆ ఉదాన వాయు వృత్తిని బాహ్యంలోని ఉదాన వృత్తి ప్రభావితం చేస్తుంది. బాహ్యంలోని ఉదానవృత్తిని తేజస్సుగా ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. దేహం లోపలి తేజస్సు బాహ్య తేజస్సులో విలీనం కాగానే, దేహం తేజోవిహీనం కావడం తెలిసిన విషయమే. ఈ తేజోవిహీనమైన దేహం నుండి మరొక నూతన దేహానికి ఈ తేజస్సును సంక్రమింపచేసే ప్రక్రియకు ఈ బాహ్యంలోని ఉదాన వృత్తి దోహదం చేస్తుంది.}

యచ్చిత్తస్తేనైష ప్రాణమాయాతి ప్రాణస్తేజసా యుక్తః| సహాత్మనా యథాసంకల్పితం లోకం నయతి||
|| 3-10 ||

(జీవుడు ఆఖరి క్షణంలో) ఏ ఆలోచన కలిగి ఉంటాడో, ఆ ఆలోచనతోనే ప్రాణంలో లయిస్తాడు. ఈ ఉదానమే ప్రాణాన్ని ఆత్మతో సహా సంకల్పించిన లోకానికి (జీవుడిని) తీసుకుపోతుంది.

శంకరుల భాష్యం

మరణకాలే యచ్చిత్తో భవతి తేన ఏషః జీవః చిత్తేన సంకల్పేనేంద్రియైః సహ ప్రాణం ముఖ్యప్రాణవృత్తిమాయాతి| మరణకాలే క్షీణేంద్రియవృత్తిః సన్ముఖ్యయా ప్రాణవృత్త్యైవావతిష్ఠత ఇత్యర్థః| తదా హి వదంతి జ్ఞాతయ ఉచ్ఛ్వసితి జీవతీతి| స చ ప్రాణః తేజసా ఉదానవృత్త్యా యుక్తః సన్ సహాత్మనా స్వామినా భోక్తా స ఏవముదాన ఉదానవృత్త్యైవ యుక్తః ప్రాణస్తం భోక్తారం పుణ్యపాపకర్మవశాత్ యథాసంకల్పితం యథాభిప్రేతం లోకం నయతి ప్రాపయతి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మరణ సమయంలో **యచ్చిత్తః** ఏ ఆలోచనైతే ఉంటుందో **తేన** ఆ ఆలోచనతోనే **ఏషః** ఈ జీవుడు మనసులో సంకల్పించిన ఆలోచనతో మరియు ఇంద్రియాలతో సహా **ప్రాణమ్** ముఖ్యప్రాణవృత్తిలో **ఆయాతి** ప్రవేశిస్తాడు లేదా లయమౌతాడు. అంటే, మరణకాలంలో ఇంద్రియవృత్తులు క్షీణించిగా ముఖ్యమైన ప్రాణవృత్తియే మిగిలి ఉంటుందని అభిప్రాయం. అప్పుడు బంధువులు 'శ్వాసిస్తున్నాడు', 'జీవించే ఉన్నాడు' అని అంటుంటారు. మరియు ఆ **ప్రాణః** ప్రాణం **తేజసా యుక్తః** ఉదానంతో కూడినదై, **సహ ఆత్మనా** భోగములను అనుభవించే యజమానితో సహా, అంటే కేవలం ఉదానవృత్తితో మాత్రమే కూడిన ప్రాణం కర్మానుభవాన్ని భోగించే తన యజమానియైన జీవుడిని అతని పుణ్యపాపకర్మల కారణంగా **యథా సంకల్పితమ్** సంకల్పించిన ప్రకారంగా, అభిప్రాయ పడిన **లోకమ్ నయతి** లోకానికి తీసుకుపోతుంది.

{దేహత్యాగం సమయంలో, మనసుతో సహా ఇంద్రియవృత్తులన్నీ ముఖ్యమైన ప్రాణ వృత్తిలో విలీనమై ఉంటాయి. ఆ సమయంలో ప్రాణవృత్తి తప్ప ఇతర వృత్తులనేవి ఏవీ పనిచేయవు. ఆ ఆఖరి క్షణంలో మనసునందు చివరగా ఏ ఆలోచన ఉంటుందో అంటే చివరి వృత్తి ఉంటుందో అది ప్రాణవృత్తిలో సంకల్పమాత్రంగా విలీనమై ఉంటుందే కాని నశించదు. ఎప్పటివరకు ఈ ప్రాణవృత్తి దేహంలో ఉంటుందో అంతవరకూ అతనిలో జీవం ఉన్నదని అంటూ ఉంటారు. దేహంలోని ఆ ప్రాణవృత్తిని చివరి సంకల్పంతో సహా యజమానిని లేదా జీవాత్మను తర్వాతి లోకానికి చేర్చేది బాహ్యంలోని ఉదాన వృత్తియే.}

య ఏవంవిద్వాన్ప్రాణం వేద న హాస్య ప్రజా హీయతేఽమృతో భవతి తదేష శ్లోకః||

|| 3-11 ||

ఆ విధంగా ప్రాణాన్ని తెలుసుకొన్న విద్వాంసుని యొక్క సంతతి విచ్ఛిన్నం కాదు. (ఆ విద్వాంసుడు) మృతిలేని వాడౌతాడు. దీనిని గురించి ఈ క్రింది మంత్రం చెప్పబడింది.

<u>శంకరుల భాష్యం</u>

యః కశ్చిత్ ఏవం విద్వాన్ యథోక్తవిశేషణైర్విశిష్టముత్పత్త్యాదిభిః ప్రాణం వేద జానాతి తస్యేదం ఫలమైహికమాముష్మికం చోచ్యతే| న హ అస్య నైవాస్య విదుషః ప్రజా పుత్రపౌత్రాదిలక్షణా హీయతే చ్ఛిద్యతే| పతితే చ శరీరే ప్రాణసాయుజ్యతయా అమృతః అమరణధర్మా భవతి ; తత్ ఏతస్మిన్నర్థే సంక్షేపాభిధాయక ఏష శ్లోకః మంత్రో భవతి||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

యః ఎవడైతే **ప్రాణమ్** ప్రాణం గురించి **ఏవమ్** ఈ చెప్పబడిన ఉత్పత్తి మొదలైన విశిష్టతలను వివరంగా **వేద** తెలుసుకొంటాడో అతడు **విద్వాన్** విద్వాంసుడు. అతనికి (అటువంటి విద్వాంసునికి) ఈ ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ కలిగే ఫలితం చెప్తున్నారు. **అస్య** అటువంటి విద్వాంసుని యొక్క **ఏవమ్** పుత్రపౌత్రాది లక్షణమైన సంతతి **న హ హీయతే** నిశ్చయంగా విచ్ఛిన్నం కాదు. మరియు, దేహం పడిపోయినప్పటికీ ప్రాణంతో కూడియే ఉండటం చేత **అమృతః** మరణమనేది లేనివాడు **భవతి** అవుతాడు. **తత్** ఇదే అర్థాన్ని సంక్షిప్తంగా వ్యక్తపరిచే **ఏషః శ్లోకః** ఈ క్రింది మంత్రం ఉన్నది.

{ప్రాణం గురించి ఈ చెప్పిన విషయాలను ధ్యానించి గ్రహించాలి. దేహానికి లోపల వ్యష్టిగాను మరియు దేహానికి బయట అంటే సమిష్టిగాను కూడా చెప్పబడిన ప్రాణం యొక్క విశిష్టతలను, ఏకాగ్రతతో ధ్యానించుకొని తద్వారా ప్రాణాన్ని గురించిన సమస్త విషయాలను తెలుసుకొనే విద్వాంసునికి ఇహలోకంలో అవిచ్ఛిన్నమైన సంతతి కలుగుతుంది. దేహం పతనమైనప్పటికీ అతడు ప్రాణంతో కూడినవాడై ఉండటం చేత మృతిలేని వాడే అవుతాడు.}

ఉత్పత్తిమాయతిం స్థానం విభుత్వం చైవ పంచధా|
అధ్యాత్మం చైవ ప్రాణస్య విజ్ఞాయామృతమశ్నుతే విజ్ఞాయామృతమశ్నుత ఇతి||
|| 3-12 ||

ప్రాణం యొక్క పుట్టుక, ప్రవేశం, స్థితి, ఐదు విధాలుగా వ్యాపించడం మరియు భౌతికమైన ఉనికిని తెలుసుకొన్నట్లైతే అమృతత్వం లభిస్తుంది. తెలుసుకొన్నట్లైతే అమృతత్వం లభిస్తుంది.

శంకరుల భాష్యం

ఉత్పత్తిం పరమాత్మనః ప్రాణస్య ఆయతిం ఆగమనం మనోకృతేనాస్మిఞ్శరీరే స్థానం స్థితిం చ పాయూపస్థాదిస్థానేషు విభుత్వం చ స్వామ్యమేవ సమ్రాడివ ప్రాణవృత్తిభేదానాం పంచధా స్థాపనం| బాహ్యమాదిత్యాదిరూపేణాధ్యాత్మం చైవ చక్షురాద్యాకారేణావస్థానం విజ్ఞాయ ఏవం ప్రాణం అమృతమశ్నుతే ఇతి| విజ్ఞాయామృతమశ్నుత ఇతి ద్విర్వచనం ప్రశ్నార్థపరిసమాప్త్యర్థం||

|| ఇతి తృతీయప్రశ్న భాష్యం||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఉత్పత్తిమ్ పరమాత్మనుండి ప్రాణం యొక్క పుట్టుకను, **ఆయతిమ్** మనోవృత్తులచే శరీరంలో ప్రాణం ప్రవేశించడాన్ని, **స్థానమ్** పాయువు, ఉపస్థ మొదలైన స్థానాలలో ఆ ప్రాణం యొక్క స్థితిని, మరియు **విభుత్వమ్** వాటి ప్రభువులాగా అయిదు విధాలైన ప్రాణవృత్తులతో నిండియుండటం, **అధ్యాత్మమ్** బాహ్యంలో సూర్యాదుల రూపంగానూ మరియు కన్నులు మొదలైన ఆకారాలలో ఉండటమనే **ఏవమ్ ప్రాణమ్** ఈ లక్షణాలు కలిగిన ప్రాణాన్ని **విజ్ఞాయ** తెలుసుకొంటే **అమృతమ్ అశ్నుతే** అమతత్వాన్ని పొందుతారు అని. **విజ్ఞాయ అమృతమ్ అశ్నుత ఇతి** తెలుసుకొంటే అమృతత్త్వాన్ని పొందుతారు అని రెండవమారు చెప్పడంతో ప్రశ్నకు సమాధానం చెప్పడం పూర్తయింది అని అర్థం చేసుకోవాలి.

{ఈ విధంగా శిష్యుడు అడిగిన ప్రశ్నలకు సమగ్రమైన సమాధానాన్ని గురువు బోధించాడు. శిష్యునికి కలిగిన సందేహాలేమిటి? దానికి గురువు చెప్పిన సమాధానాలేమిటి? అన్నదాన్ని క్లుప్తంగా ఇక్కడ సమీక్ష చేసుకొందాం.

1) ప్రాణం ఎక్కడ నుండి పుడుతోంది? అన్న ప్రశ్నకు సమాధానంగా, 'పరమాత్మయందే ఈ ప్రాణమన్నది అసద్రూపంగా ఉద్భవించి వ్యాపిస్తోంది. అంటే పరమాత్మయే ఈ ప్రాణానికి మూల కారణం. మనిషి లేకపోతే నీడ ఎలాగైతే ఉండదో, అలాగే పరమాత్మ లేకపోతే ఈ ప్రాణమన్నదానికి ఉనికియే ఉండదు.' అని చెప్పారు.

2) ఈ ప్రాణం దేహంలోకి ఎలా ప్రవేశించింది? అన్న ప్రశ్నకు, 'మనసు యొక్క ఆలోచనల కారణంగా ఈ ప్రాణం దేహంలోకి వచ్చింది. మనసులోని ఆలోచనలు అంటే కోరికలే. ఆ కోరికలను తీరడానికి మానవులు కర్మలు చేస్తారు. గత జన్మలలో అనుభవించగా మిగిలిన కర్మ శేషాలకు తగిన ఫలితాలను అనుభవించడానికి మరొక దేహం అవసరం కాబట్టి, ప్రాణం అన్నది నూతన దేహంలో ప్రవేశించి, తన యజమానియైన జీవునిచే కర్మ ఫలాలను అనుభవించేదుకు తోడ్పడుతుంది.' అని సమాధానం చెప్పారు.

3) ఈ ప్రాణం తనను తాను ఏవిధంగా విభజించుకొని దేహాన్ని నిలిపి ఉంచుతోంది? ఎలా ఉత్క్రమిస్తోంది? అన్న ప్రశ్నలకు సమాధానంగా, 'ప్రాణం తనను తాను ప్రాణ-అపాన-వ్యాన-

ఉదాన-సమానమనే 5 అంశాలుగా విభజించుకొని శరీరంలోని వేర్వేరు స్థానాలను ఆశ్రయించి ఆయా వృత్తులను నిర్వహిస్తుంది. ప్రాణ మనేది కన్నులు-చెవులు-నోరు-నాసికల యందుండి వాటికి క్రియాశీలతను కలిగిస్తుంది. అపానం అన్నది పాయువు-ఉపస్థలను ఆశ్రయించి, విసర్జనాది క్రియలను నిర్వహిస్తుంది. వ్యానం అన్నది హృదయాకాశాన్ని ఆశ్రయించి శరీరంలో విస్తరించిన 72,72,00,000 నాడులలో వ్యాపిస్తూ శరీరానికి పనిచేయగల సామర్థ్యాన్నిస్తుంది. ఉదానం అన్నది సుషుమ్న అనే నాడి ద్వారా జీవుడిని కర్మ శేషానికి అనుగుణమైన లోకాలకు చేరుస్తుంది. సమానం అన్నది నాభి ప్రదేశంలో ఉండి భుజించిన ఆహారాన్ని శరీరం యావత్తుకూ సమానంగా అందించి పోషింపచేస్తుంది.' అని సమాధానమిచ్చారు.

4) ఈ ప్రాణం దేహానికి బాహ్యంలో ఎలా ప్రవర్తిస్తోంది? భౌతికంగా శరీరాన్ని ఎలా నిలబెడుతోంది? అన్న ప్రశ్నలకు ఇలా సమాధానం ఇవ్వబడింది. దేహానికి లోపల ఎలాగైతే ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమాన వాయువు అంశాలుగా విభాగమై ఆయా కార్యాలను నిర్వహిస్తున్నదో, అదే విధంగా దేహానికి బాహ్యంలో కూడా 5 అంశాలుగా విభాగమై ప్రవర్తిస్తున్నది. బాహ్యంలోని ఆదిత్యుడే ప్రాణాంశగా సకల జీవులకు ఆధారమై, దేహంలోని ప్రాణాంశచేత జీవులు తమకు అన్యమైన సకల వస్తువులను దర్శించేలా చేస్తోంది. పృథివియే సకలాన్ని ఆకర్షించి నియంత్రించే అపానంగా, దేహంలోని అపాన శక్తిని తన అధీనంలోకి తెచ్చుకొని జీవులు నిలిచి ఉండేలా చేస్తోంది. దేహంలో అంతటా సమంగా వ్యాపించి ఉన్నట్లే, బాహ్యంలో కూడా సమాన వాయువు సర్వత్రా సమమైన స్థితిని కలిగి ఉంటుంది. అలాగే, సర్వత్రా వ్యాప్తమై ఉండటం అనేది వ్యాన వాయువు లక్షణం. మరణకాలంలో, సకల ఇంద్రియాలు వాటి వృత్తులనుండి విరమించి మనసునందలి చివరి ఆలోచనతో సహా ప్రాణంలో లయం కాగా, ఆ ప్రాణాన్ని జీవాత్మతో సహా, జీవుని కర్మ ఫలాలకు మరియు చివరి సంకల్పానికి తగిన నూతన దేహానికి తీసుకొని వెళ్ళేదే ఉదానం.

5) ఈ విధానం దేహంలోనూ, దేహానికి బాహ్యంలోనూ వ్యాపించి ఉన్న ప్రాణ బేధాలను మరియు దాని కార్యకలాపాలను ధ్యానించి అనుభవానికి తెచ్చుకొన్నవానికి మరణమనేది ఉండదు. అంటే, ఈ ప్రాణమనే దానిలోనే సకల ఇంద్రియాలు, వృత్తులు లయమై పోతాయే కాని, ప్రాణమనేదానికి లయం అనేది ఉండనందున, మృతత్వం సంభవించదని గ్రహించాలి.}

|| తృతీయ ప్రశ్నకు భాష్యానువాదం సంపూర్ణం||

చతుర్థః ప్రశ్నః

అథ హైనం సౌర్యాయణీ గార్గ్యః పప్రచ్ఛ భగవన్నేతస్మిన్పురుషే కాని స్వపన్తి కాన్యస్మింజాగ్రతి కతర ఏష దేవః స్వప్నాన్పశ్యతి కస్యైతత్సుఖం భవతి కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తీతి|| || 4-1 ||

తరువాత, గర్గుని వంశానికి చెందిన సూర్యుని మనుమడు, "ఓ పూజనీయుడా! ఈ పురుషునిలో ఏ అంగాలు నిదురిస్తాయి? ఏ అంగాలు మెలకువతో ఉంటాయి? ఏ దేవత కలలను చూస్తుంది? ఈ సుఖం అనేది దేనికి కలుగుతుంది? దేనిలో సకలం విలీనమౌతాయి?" అని ప్రశ్నించాడు.

శంకరుల భాష్యం

అథ హ ఏనం సౌర్యాయణీ గార్గ్యః పప్రచ్ఛ ప్రశ్నత్రయేణాపరవిద్యాగోచరం సర్వం పరిసమాప్య సంసారం వ్యాకృతవిషయం సాధ్యసాధనలక్షణమనిత్యం| అథేదానీం సాధ్యసాధనవిలక్షణమప్రాణమమనోగోచరమతీంద్రియమవిషయం శివం శాంతమవికృతమక్షరం సత్యం పరవిద్యాగమ్యం పురుషాఖ్యం సబాహ్యాభ్యంతరమజం వక్తవ్యమిత్యుత్తరం ప్రశ్నత్రయమారభ్యతే| తత్ర సుదీప్తాదివాగ్నేర్యస్మాత్పరస్మాదక్షరాత్సర్వే భావా విస్ఫులింగా ఇవ జాయంతే తత్ర చైవాపియంతీత్యుక్తం ద్వితీయే ముండకే ; కే తే సర్వే భావా అక్షరాద్విస్ఫులింగా ఇవ విభజ్యంతే| కథం వా విభక్తాః సంతస్తత్రైవాపియంతి| కింలక్షణం వా తదక్షరమితి| ఏతద్వివక్షయా అధునా ప్రశ్నానుద్భావయతి — భగవన్ , ఏతస్మిన్ పురుషే శిరఃపాణ్యాదిమతి కాని కరణాని స్వపంతి స్వాపం కుర్వంతి స్వవ్యాపారాదుపరమంతే ; కాని చ అస్మిన్ జాగ్రతి జాగరణమనిద్రావస్థాం స్వవ్యాపారం కుర్వంతి| కతరః కార్యకరణలక్షణయోః ఏష దేవః స్వప్నాన్పశ్యతి| స్వప్నో నామ జాగ్రద్దర్శనాన్నివృత్తస్య జాగ్రద్వదంతఃశరీరే యద్దర్శనం| తత్కిం కార్యలక్షణేన దేవేన నిర్వర్త్యతే, కిం వా కరణలక్షణేన కేనచిదిత్యభిప్రాయః| ఉపరతే చ జాగ్రత్స్వప్నవ్యాపారే యత్ప్రసన్నం నిరాయాసలక్షణమనాబాధం సుఖం కస్య ఏతత్ భవతి| తస్మిన్కాలే జాగ్రత్స్వప్నవ్యాపారాదుపరతాః సంతః కస్మిన్ను సర్వే సమ్యగేకీభూతాః సంప్రతిష్ఠితాః| మధుని రసవత్సముద్రప్రవిష్టనద్యాదివచ్చ వివేకానర్హాః ప్రతిష్ఠితా భవంతి సంగతాః సంప్రతిష్ఠితా భవంతీత్యర్థః| నను న్యస్తదాత్రాదికరణవత్స్వవ్యాపారాదుపరతాని పృథక్పృథగేవ స్వాత్మన్యవతిష్ఠంత ఇత్యేతద్యుక్తం ; కుతః ప్రాప్తిః సుషుప్తపురుషాణాం కరణానాం కస్మింశ్చిదేకీభావగమనాశంకాయాః ప్రష్టుః ? యుక్తైవ త్వాశంకా ; యతః సంహతాని కరణాని స్వామ్యర్థాని పరతంత్రాణి చ జాగ్రద్విషయే ; తస్మాత్స్వాపేఽపి సంహతానాం పారతంత్ర్యేణైవ కస్మింశ్చిత్సంగతిర్న్యాయ్యేతి ; తస్మాదాశంకానురూప ఏవ ప్రశ్నోఽయం| అత్ర తు కార్యకరణసంఘాతో యస్మింశ్చ ప్రలీనః సుషుప్తప్రలయకాలయోః, తద్విశేషం బుభుత్సోః స కో ను స్యాదితి కస్మిన్సర్వే సంప్రతిష్ఠితా భవంతీతి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అథ ఆ తరువాత **సౌర్యాయణీ గార్గ్యః** గర్గుని వంశానికి చెందిన సూర్యుని మనుమడు **హ ఏనమ్** వీటిని (ఈ ప్రశ్నలను) **పప్రచ్ఛ** అడిగాడు. అశాశ్వతమైనది సంసారంతో నిండియున్నది, సాధ్య-సాధన లక్షణాలు కలిగిన అపరవిద్యకు సంబంధించిన సమస్తాన్నీ గత మూడు ప్రశ్నలలో పూర్తి చేసియున్నారు. ఆ తర్వాత ఇపుడు సాధ్య-సాధన లక్షణాలకు వేరైనది, ప్రాణం-మనస్సులకు గోచరం కానిది, ఇంద్రియాలకు విషయం కానిది, మంగళకరమైనది, శాంతమైనది, మార్పు-వినాశాలు లేని సత్యమయినట్టిది, పరవిద్యచే చేరగలిగేది, పురుషుడని పిలువబడుతూ బాహ్య-అంతరాలలో పుట్టుకలేనిది అయిన దానిని గురించి తెలుసుకోవడానికై తరువాతి మూడు ప్రశ్నలను ప్రారంభిస్తున్నారు. బాగా మండుతున్న అగ్నినుండి పుట్టే నిప్పు కణికల లాగా అవినాశియైన పరమాత్మనుండే సకల వస్తువులు పుడుతున్నాయని, దానియందే విలీనమౌతున్నాయని, అక్కడ (ముండకోపనిషత్తులోని) ద్వితీయ ముండకంలో చెప్పి ఉన్నారు. అవినాశి నుండి నిప్పు కణికలవలె విడిపడిన ఆ సకల వస్తువులు ఏమిటి? అలా విడిపడినవి దానియందే (ఆ అవినాశియందే) ఏవిధంగా కలిసిపోతున్నాయి? ఆ అవినాశి ఎలాంటిది? వీటిని తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ఇప్పుడు ఈ ప్రశ్నలు వేయబడుతున్నాయి. “**భగవన్** ఓ పూజనీయుడా! **ఏతస్మిన్ పురుషే** తల-చేతులు మొదలైనవి కలిగిన పురుషునిలో **కాని** ఏ ఇంద్రియాలు **స్వపన్తి** వాటి వాటి వ్యాపారాలనుండి విరమించి నిదురిస్తాయి? మరియు **కాని** ఏవి **అస్మిన్ జాగ్రతి** మెలకువ కలిగి తమ వృత్తులను నిర్వహిస్తాయి. ఈ కార్య-కరణాల సమూహంలోని **ఏష దేవః** ఈ దేవతలలో **కతరః** ఏవి **స్వప్నాన్ పశ్యతి** కలలను చూస్తాయి. స్వప్నం అంటే, జాగ్రదవస్థలో దర్శించడం కాకుండా, జాగ్రదవస్థ ముగిసిన తర్వాత శరీరంలోపల కలిగే దర్శనం. అంటే, ఈ స్వప్న దర్శనమనేది కార్యలక్షణం కలిగిన దేవత చేత (దేహం లేదా ప్రాణం చేత) పొందబడుతోందా? లేక, కరణలక్షణం కలిగిన దేవత చేత (అంటే మనసు చేత) పొందబడుతోందా? వీటిలో దేనివల్ల కలుగుతోంది? అని అభిప్రాయం. జాగ్రత్తు మరియు స్వప్న వ్యాపారాలనుండి విరామం పొందిన తర్వాత కలిగే **ఏతత్ సుఖమ్** ప్రసన్నత, శ్రమలేకుండుట, కష్టం తెలియకుండుట అనే లక్షణాలు కల ఈ సుఖం **కస్య భవతి** ఎవరికి కలుగుతుంది? జాగ్రత్తు స్వప్న వ్యాపారాదుల నుండి విరామాన్ని పొందిన ఆ కాలంలో **కస్మిన్ ను సర్వే** ఈ సకలమూ దేనియందు చక్కగా ఒక్కటిగా అయి **సంప్రతిష్ఠితాః** అన్ని పూల రసాలు తేనెలో కలిసినట్లు, సముద్రంలో కలిసిపోయిన నదులలాగా, వాటి భిన్నత్వాలు కోల్పోయి ప్రతిష్ఠితమై ఉండటం **భవన్తి** సంభవిస్తుంది? అనే సందేహాన్ని వెలిబుచ్చుతున్నాడని అభిప్రాయం.

<u>సందేహం</u> : కొడవలి వంటి పనికరాలను వదిలేసినట్లుగా మనిషి నిద్రిస్తున్నప్పుడు ఇంద్రియాలు వాటి వాటి వృత్తులనుండి విరమించి వేటికవి విడివిడిగా విరామాన్ని పొందుతాయని చెప్పారు. అలాంటప్పుడు, నిద్రించేవానిలో ఇంద్రియాలన్నీ వేరొకదానిలో కలిసిపోయి ఒకే భావాన్ని పొందినట్లుగా ఉంటాయనే ప్రశ్న ఎందుకు వస్తుంది?

సమాధానం : అలాంటి సంశయం కలగడం సమంజసమే. జాగ్రత్తులో ఇంద్రియాల సమూహం వాటి యజమాని కొరకు (యజమాని ఆజ్ఞానుసారమే) పనిచేస్తున్నాయే కాని స్వతంత్రంగా వ్యవహరించడం లేదు. అందువలన, నిద్రయందు కూడా ఇంద్రియ సమూహాలు అస్వతంత్రంగానే (వాటికి భిన్నమైన) వేరొక దేనిలో స్థితమై ఉంటాయి అనే సందేహం కలగడం సహజమే. అందుచేత, ఆ సంశయానికి అనుగుణంగానే ఈ విధంగా ప్రశ్నించాడు. ఆ సందర్భంలోనే, సుషుప్తి మరియు ప్రళయ కాలాదులలో కార్య-కరణ సంఘాతం దేనిలో లయమౌతుంది? ఆ విశిష్టమైన తత్త్వం ఎలాంటిది? అనే విషయాలను తెలుసుకోవాలనే కోరికతో (శిష్యుడు), “దేనియందు ఈ సకలమూ ప్రతిష్ఠితమై ఉన్నాయి?” అని ప్రశ్నించాడు.

[ఇక్కడ ప్రధానంగా అయిదు ప్రశ్నలున్నాయి. (1) జాగ్రదవస్థను అనుభవించేది ఎవరు? (2) ఆ జాగ్రదవస్థను అనుభవించే వాని వ్యవహారం ముగియగా స్వప్నావస్థ మరియు సుషుప్తి అవస్థ అనేవి కలుగుతునా కదా! ఈ మూడు అవస్థలలోనూ శరీరాన్ని నిలిపి ఉంచేది ఎవరు? (3) స్వప్నావస్థను అనుభవించేది ఎవరు? (4) సుషుప్తి అవస్థను అనుభవించేది ఎవరు? (5) ఈ మూడు అవస్థలకు అతీతమైన ఆత్మ అనబడే తురీయావస్థ అంటే ఏమిటి? అంటే, ఈ అయిదు ప్రశ్నల ద్వారా శిష్యుడు తెలుసుకోవాలనుకొంటున్నది సకలానికి మూలమైన పరబ్రహ్మ గురించియే కాని, పరిమితులు కల అపరబ్రహ్మను గురించి కాదు. – స్వామి గంభీరానంద.]

తస్మై స హోవాచ యథా గార్గ్య మరీచయోఽర్కస్యాస్తం గచ్ఛతః సర్వా ఏతస్మింస్తేజోమండల ఏకీభవన్తి తాః పునః పునరుదయతః ప్రచరంత్యేవం హ వై తత్సర్వం పరే దేవే మనస్యేకీభవతి| తేన తర్హ్యేష పురుషో న శృణోతి న పశ్యతి న జిఘ్రతి న రసయతే న స్పృశతే నాభివదతే నాదత్తే నానందయతే న విసృజతే నేయాయతే స్వపితీత్యాచక్షతే|| || 4-2 ||

అతనితో ఆచార్యుడిలా అన్నాడు, “ఓ గార్గ్యా! అస్తమించే సూర్యుని యొక్క కిరణాలన్నీ తేజోమండలంలో ఏవిధంగానైతే కేంద్రీకృతమై, మరల (సూర్యుడు) ఉదయించగానే తిరిగి ప్రసరిస్తాయో, అదేవిధంగా అవన్నీ కూడా వాటన్నింటికన్నా గొప్ప దేవతైన మనసునందు ఏకీకృతమౌతాయి. ఆ కారణంగా, ఈ పురుషుడు వినడు, చూడడు, వాసన చూడడు, రుచినెరుగడు, స్పృశించడు, మాట్లాడడు, గ్రహించడు, ఆనందించడు, విసర్జించడు, కదలడు. అతడు నిద్రిస్తున్నాడంటారు.

శంకరుల భాష్యం

తస్మై స హ ఉవాచ ఆచార్యః| శృణు హే గార్గ్య, యత్త్వయా పృష్టం| యథా మరీచయః రశ్మయః అర్కస్య ఆదిత్యస్య అస్తం అదర్శనం గచ్ఛతః సర్వాః అశేషతః ఏతస్మిన్ తేజోమండలే తేజోరాశిరూపే ఏకీభవంతి వివేకానర్హత్వమవిశేషతాం గచ్ఛంతి, తాః మరీచయస్తస్యైవార్కస్య పునః పునః ఉదయతః ఉద్గచ్ఛతః ప్రచరంతి వికీర్యంతే యథాయం దృష్టాంతః| ఏవం హ వై తత్ సర్వం విషయేంద్రియాదిజాతం పరే ప్రకృష్టే దేవే ద్యోతనవతి మనసి చక్షురాదిదేవానాం మనస్తంత్రత్వాత్పరో దేవో మనః, తస్మిన్స్వప్నకాలే ఏకీభవతి మండలే మరీచివదవిశేషతాం గచ్ఛతి| జిజాగరిషోశ్చ రశ్మివన్మండలాన్మనస ఏవ ప్రచరంతి స్వవ్యాపారాయ ప్రతిష్ఠంతే యస్మాత్స్వప్నకాలే శ్రోత్రాదీని శబ్దాద్యుపలబ్ధికరణాని మనస్యేకీభూతానీవ కరణవ్యాపారాదుపరతాని తేన తస్మాత్ తర్హి తస్మిన్స్వాపకాలే ఏషః దేవదత్తాదిలక్షణః పురుషః న శృణోతి న పశ్యతి న జిఘ్రతి న రసయతే న స్పృశతే న అభివదతే న ఆదత్తే న ఆనందయతే న విసృజతే న ఇయాయతే స్వపితి ఇతి ఆచక్షతే లౌకికాః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

తస్మై అతనితో (అలా ప్రశ్నించిన శిష్యునితో) **స హ ఉవాచ** ఆచార్యుడు ఇలా అన్నాడు. **గార్గ్య** ఓ గార్గ్యా! నీవు దేనిని గురించి అడిగావో అది చెప్తున్నా విను. **యథా** ఏ విధంగానైతే **మరీచయః సర్వాః** సూర్యుని యొక్క కిరణాలన్నీ ఏ ఒక్కటీ మిగలకుండా **అర్కస్య** సూర్యుడు **అస్తమ్ గచ్ఛతః** అస్తమించే సమయంలో **ఏతస్మిన్ తేజోమణ్డలే** ఈ తేజోమండలంలో అంటే ఈ సూర్యునియందే తేజోరాశిరూపంగా **ఏకీభవన్తి** ఒక్కటిగా, విడివడకుండా, వివిధత్వమనేదే లేకుండా చేరిపోయి, **తాః** అవి, ఆ కిరణాలు సూర్యుడు **పునః పునః ఉదయతః** మరలా ఉదయించగానే తిరిగి **ప్రచరన్తి** విస్తరిస్తాయో ఆవిధంగా, అని ఉదాహరణ చెప్తున్నారు. **ఏవమ్ హ వై** అదేవిధంగానే **తత్ సర్వమ్** ఆ ఇంద్రియాలు మరియు వాటి విషయాలన్నీ **పరే** (ఇంద్రియాలకన్నా) గొప్పదిగా **దేవే** ప్రకాశించే **మనసి** మనసునందు, కన్నులు మొదలైన దేవతలందరూ మనసు యొక్క అధీనంలో ఉంటారు కనుక వాటన్నింటికన్నా మనసు ఉన్నతమైన దేవత. ఆ మనసునందు ఇంద్రియాలు మరియు వాటి విషయాలన్నీ స్వప్నకాలంలో **ఏకీభవతి** తేజోమండలంలో వివిధత్వాన్ని కోల్పోయి చేరిన కిరణాలలాగా, చేరుతాయి. మెలకువ కలగబోతుండగా, తేజోమండలం నుండి కిరణాలు బయటకు ప్రసరించినట్లుగానే, (ఇంద్రియాలు మరియు వాటి విషయాలు) మనసు నుండి బయటకు వచ్చి వాటి వాటి వృత్తులలో నిమగ్నమౌతాయి. స్వప్నకాలంలో శబ్దాదిజ్ఞానాలకు సాధనాలైన శ్రోత్రాదులు మనసునందు కలసిపోయి ఉండి వాటి వాటి వ్యాపారాలు నిర్వర్తించనందు చేత, **తేన** అందువలన **తర్హి** ఆ నిద్రాకాలంలో **ఏషః** ఈ దేవదత్తుని లాగా పేరు కలిగిన **పురుషః** జీవుడు **న శృణోతి** వినడు **న పశ్యతి** చూడడు **న జిఘ్రతి** వాసన పొందడు **న రసయతే** రుచి తెలియడు **న స్పృశతే** స్పర్శను తెలియడు **న అభివదతే** మాట్లాడడు **న ఆదత్తే** గ్రహించడు **న ఆనన్దయతే** ఆనందించడు **న విసృజతే** విసర్జించడు **న ఇయాయతే** కదలడు. అతడు **స్వపితి ఇతి** నిద్రిస్తున్నాడు అని **ఆచక్షతే** లోకులు అంటారు.

{దేహంలోని ఇంద్రియాలన్నీ జాగ్రత్తు సమయంలో వాటి కార్యకలాపాలు నిర్వహిస్తాయి. స్వప్నావస్థలో అవన్నీ వాటికి నాయకత్వం వహించే మనసులో ఒక్కటిగా కలిసిపోయి ఉంటాయి. విడిగా అవి వాటి వృత్తులను నిర్వహించవు. అందుచేతనే, స్వప్న స్థితిలో ఇంద్రియాలకు సంబంధించిన చూడటం, వినడం వంటివి మనిషికి కలగడం లేదు. తిరిగి మెలకువ వచ్చే సమయంలో ఇంద్రియాలన్నీ ఆ మనసు నుండి బయటకు వచ్చి ఆయా వృత్తి కలాపాలను ప్రారంభిస్తాయి. అంటే స్వప్నావస్థలో కేవలం మనసు మాత్రమే తన కార్యకలాపాలను నిర్వర్తిస్తోంది.}

ప్రాణాగ్నయ ఏవైతస్మిన్పురే జాగ్రతి। గార్హపత్యో హ వా ఏషోఽపానో వ్యానోఽన్వాహార్యపచనో యద్గార్హపత్యాత్ప్రణీయతే ప్రణయనాదాహవనీయః ప్రాణః॥ || 4-3 ||

(స్వప్నకాలంలో) అగ్నులవంటి ప్రాణవృత్తులు ఈ పురమనే దేహంలో మేల్కొంటాయి. ఈ అపానము గార్హపత్యం వంటిది. వ్యానం అన్వాహార్యపచనాన్ని పోలినది. గార్హపత్యం నుండి సేకరించి తెచ్చేది ఆహవనీయం కాబట్టి ప్రాణం ఆహవనీయాన్ని పోలినది.

<u>శంకరుల భాష్యం</u>

సుప్తవత్సు శ్రోత్రాదిషు కరణేషు ఏతస్మిన్ పురే నవద్వారే దేహే ప్రాణాగ్నయః ప్రాణా ఏవ పంచ వాయవోఽగ్నయ ఇవాగ్నయః జాగ్రతి। అగ్నిసామాన్యం హి ఆహ — గార్హపత్యో హ వా ఏషోఽపానః కథమితి, ఆహ। యస్మాత్ గార్హపత్యాత్ అగ్నేరగ్నిహోత్రకాలే ఇతరోఽగ్నిరాహవనీయః ప్రణీయతే ప్రణయనాత్ , ప్రణీయతే అస్మాదితి ప్రణయనో గార్హపత్యోఽగ్నిః, తథా సుప్తస్యాపానవృత్తేః ప్రణీయత ఇవ ప్రాణో ముఖనాసికాభ్యాం సంచరతి అత ఆహవనీయస్థానీయః ప్రాణః। వ్యానస్తు హృదయాద్దక్షిణసుషిరద్వారేణ నిర్గమాద్దక్షిణదిక్సంబంధాత్ అన్వాహార్యపచనః దక్షిణాగ్నిః||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

శ్రోత్రాది ఇంద్రియాలు నిద్రిస్తున్నప్పుడు, **ఏతస్మిన్ పురే** తొమ్మిది ద్వారాలు కల ఈ దేహమనే నగరంలో **ప్రాణాగ్నయః** ప్రాణము వంటివి అయిదు వాయువులు అగ్నులవలె **జాగ్రతి** మేల్కొంటాయి. (ఇక్కడ ప్రాణాన్ని) అగ్నితో పోలిక చేసి చెప్తున్నారు. **గార్హపత్యో హ వా ఏషః అపానః** ఈ అపానమే నిజానికి గార్హపత్యం (గార్హపత్యం అని పిలువబడే అగ్ని). అది ఎలాగో చెప్తున్నారు. **యత్ గార్హపత్యాత్** ఏ గార్హపత్యం నుండి అయితే అగ్నిహోత్ర సమయంలో ఆహవనీయం అనబడే అగ్ని **ప్రణీయతే** గ్రహించబడుతోందో. ఏదాని నుండి సంగ్రహించబడుతోందో ఆ గ్రాహ్యానికి మూలస్థానం గార్హపత్యమనే అగ్ని (దేని నుండైతే గ్రహించబడుతోందో అది 'గార్హపత్యం', ఆ గార్హపత్యం నుండి ఏది గ్రహించబడుతుందో అది

'ఆహవనీయం'). ఆవిధంగా నిదురించిన వానిలో, అపానవృత్తినుండి గ్రహించబడిన ప్రాణం నాసికలోనూ నోటిలోనూ సంచరిస్తుంది. [ఆపానవృత్తి శ్వాసను లోపలికి పీల్చుకొని ఊపిరితిత్తులలో నిండి ఉంటుంది. లోపల ఉన్న ఆ వాయువునుండి ప్రాణం నిశ్వాసగా బయటకు వస్తుంది. – స్వామి గంభీరానంద]. అందుకని, ప్రాణం ఆహవనీయంతో పోల్చబడింది. (ఆపానాన్ని గార్హపత్యంతో పోల్చి చెప్పారు). ఇక వ్యానమైతే హృదయానికి కుడివైపు కవాటం ద్వారా బయటకు వస్తుంది. దక్షిణ దిశతో సంబంధం వల్ల అది అన్వాహార్యపచనమని పిలువబడే దక్షిణాగ్నితో (పోల్చి చెప్పారు).

{మనిషి నిద్రావస్థలో ఉన్నప్పుడు ప్రాణంలోని 5 భాగాలైన ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమాన వాయువులు మేల్కొంటాయి. ఈ 5 ప్రాణాలకు వివిధమైన అగ్నిహోత్ర కర్మలోని అంశాలకు పోలిక చూపించి, తద్వారా మనిషి నిద్రించే సమయంలో ప్రాణం చేత అగ్నిహోత్ర కర్మ నిర్వహించబడుతోంది అన్నట్లుగా చెప్తున్నారు. ఆ సందర్భంలో అపాన వాయువును గార్హపత్యాగ్నిగా, ప్రాణ వాయువును ఆహవనీయాగ్నిగా మరియు వ్యాన వాయువును దక్షిణాగ్నిగా ఈ మంత్రంలో చెప్పారు.}

యదుచ్ఛ్వాసనిఃశ్వాసావేతావాహుతీ సమం నయతీతి స సమానః| మనో హ వావ యజమాన ఇష్టఫలమేవోదానః స ఏనం యజమానమహరహర్బ్రహ్మ గమయతి||

|| 4-4 ||

ఏది ఈ ఉచ్ఛ్వాస-నిశ్వాసాలనే రెండు ఆహుతులను సమంగా నడిపిస్తుందో అది సమాన వృత్తి (అంటే హోత అనబడే ఋత్విక్కు). మనసే (ఆ యజ్ఞానికి) కర్త. కోరిన ఫలమే ఉదానం. అదియే (ఆ ఉదానమే మనసు అనే) కర్తను ప్రతిదినం బ్రహ్మమునకు చేరుస్తుంది.

<u>శంకరుల భాష్యం</u>

అత్ర చ హోతా అగ్నిహోత్రస్య యత్ యస్మాత్ ఉచ్ఛ్వాసనిఃశ్వాసౌ అగ్నిహోత్రాహుతీ ఇవ నిత్యం ద్విత్వసామాన్యాదేవ తు ఏతౌ ఆహుతీ సమం సామ్యేన శరీరస్థితిభావాయ నయతి యో వాయురగ్నిస్థానీయోఽపి హోతా చాహుత్యోర్నేతృత్వాత్| కోఽసౌ ? స సమానః| అతశ్చ విదుషః స్వాపోఽప్యగ్నిహోత్రహవనమేవ| తస్మాద్విద్వాన్నాకర్మీత్యేవం మంతవ్య ఇత్యభిప్రాయః| సర్వదా సర్వాణి చ భూతాని విచిన్వంత్యపి స్వపత ఇతి హి వాజసనేయకే| అత్ర హి జాగ్రత్సు ప్రాణాగ్నిషూపసంహృత్య బాహ్యకరణాని విషయాంశ్చాగ్నిహోత్రఫలమివ స్వర్గం బ్రహ్మ జిగమిషుః మనో హ వావ యజమానః జాగర్తి| యజమానవత్కార్యకరణేషు ప్రాధాన్యేన సంవ్యవహారాత్స్వర్గమివ బ్రహ్మ ప్రతి ప్రస్థితత్వాద్యజమానో మనః కల్ప్యతే| ఇష్టఫలం యాగఫలమేవ ఉదానః వాయుః| ఉదాననిమిత్తత్వాదిష్టఫలప్రాప్తేః| కథం ? సః ఉదానః ఏనం మనఆఖ్యం యజమానం స్వప్నవృత్తిరూపాదపి ప్రచ్యావ్య అహరహః సుషుప్తికాలే స్వర్గమివ బ్రహ్మ అక్షరం గమయతి| అతో యాగఫలస్థానీయః ఉదానః||

ఏవం విదుషః శ్రోత్రాద్యుపరమకాలాదారభ్య యావత్సుప్తోత్థితో భవతి తావత్సర్వయాగఫలానుభవ ఏవ, నావిదుషామివానర్థాయేతి విద్వత్తా స్తూయతే| న హి విదుష ఏవ శ్రోత్రాదీని స్వపంతి, ప్రాణాగ్నయో వా జాగ్రతి| జాగ్రత్స్వప్నయోర్మనః స్వాతంత్ర్యమనుభవదహరహః సుషుప్తం వా ప్రతిపద్యతే| సమానం హి సర్వప్రాణినాం పర్యాయేణ జాగ్రత్స్వప్నసుషుప్తగమనం ; అతో విద్వత్తాస్తుతిరేవేయముపపద్యతే| యత్పృష్టం కతర ఏష దేవః స్వప్నాన్పశ్యతీతి ; తదాహ —

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

మరి ఇక్కడ అగ్నిహోత్రం యొక్క హోత అంటే ప్రధాన ఋత్విక్కు (గురించి ప్రస్తావిస్తున్నారు). **యత్** ఏవైతే **ఏతౌ** ఆహుతౌ అగ్నిహోత్రంలోని రెండు ఆహుతుల వంటి **ఉచ్ఛ్వాసనిఃశ్వాసౌ** ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసాలున్నాయో అవి. (అగ్నిహోత్రంలోని ఆహుతుల సంఖ్య రెండు. మరియు ఉచ్ఛ్వాసనిశ్వాసాలనేవి కూడా రెండే కాబట్టి) రెండు అనే సంఖ్య రెండింటిలోనూ సమానంగా ఉన్నది కాబట్టి **సమం నయతి** ఒకేవిధంగా అంటే హెచ్చుతగ్గులు లేకుండా దేహస్థితిని చెదరకుండా ఉంచేది ఈ సమానమనే ప్రాణవృత్తి. **ఇతి** అలా ఏ వాయువృత్తి అయితే అగ్నిగా (ముందు మంత్రంలో చెప్పారో) అదియే ఆహుతుల సమర్పణకు నేతృత్వం వహించే హోత అనబడే ఋత్విక్కు. ఏమిటది? **సః సమానః** అది సమాన వాయువు. మరి అందుచేత, జ్ఞాని యొక్క నిద్ర కూడా అగ్నిహోత్ర క్రతువే. అందుకనే, జ్ఞాని కర్మలు చేయడని భావించడం సరికాదు అని అభిప్రాయం. ఈ స్థితినే వాజసనేయకం కూడా జ్ఞాని నిద్రిస్తున్నా కూడా అతని సకల అవయవాలు, ఇంద్రియాలు సదా కర్మలను చేస్తూనే ఉంటాయని చెప్పింది. అలాగే, జాగ్రత్తు కాలంలో కూడా బాహ్యేంద్రియాలను మరియు వాటి విషయాలను ప్రాణాలనే అగ్నులలో సమర్పిస్తూ ఆ అగ్నిహోత్ర కర్మకు ఫలంగా స్వర్గాన్ని పొందినట్లుగా, బ్రహ్మమును పొందాలనుకొనే **మనః హ వావ యజమానః** మనస్సే జాగ్రత్తులోని యజమాని లేదా కర్తలాగా ఇక్కడ ప్రవర్తిస్తోంది. యజమాని లాగా, దేహేంద్రియ సంఘాతం మరియు ఇంద్రియాలలో ప్రధానమై వ్యవహరించేది, స్వర్గం లాగా బ్రహ్మను పొందటాన్ని లక్ష్యంగా చేసుకొనేది, మనసు కాబట్టి, మనసును యజమానిగా పోల్చారు. **ఇష్టఫలమ్ ఏవ** యాగఫలమే **ఉదానః** ఉదాన వాయువు. ఎందుకంటే, ఉదాన వాయువు కారణంగానే కోరిన ఫలం లభిస్తుంది కాబట్టి. అదెలా? **సః ఉదానః** ఆ ఉదాన వాయువే **యజమానమ్** మనసు అనబడే యజమానిని స్వప్నవృత్తి రూపాలనుండి కూడా విరమింపచేసి **అహః అహః** ప్రతిదినమూ సుషిప్తి కాలంలో స్వర్గం వంటి **బ్రహ్మ** అవినాశియైన బ్రహ్మవద్దకు **గమయతి** చేరుస్తుంది. అందువలన, యాగఫలంగా ఉదానాన్ని పోల్చారు.

ఈ విధంగా జ్ఞాని మాత్రమే శ్రోత్రాదులు విశ్రమించినది మొదలు నిద్రనుండి మేల్కొనే వరకు సర్వాన్నీ యాగఫలంగానే అనుభవిస్తాడు కాని, అజ్ఞానిలాగా అనర్థాలను పొందడు అని చెప్తూ, జ్ఞానం యొక్క గొప్పదనాన్ని కీర్తిస్తున్నారు. శ్రోత్రాదులు వాటి వృత్తులనుండి విరమించడం, నిద్రించడం, ప్రాణాగ్నులు మేల్కొనడం, జాగత్తు మరియు స్వప్న కాలంలో మనసు స్వేచ్ఛతో వ్యవహరించడం, ప్రతిదినం సుషుప్తిని అనుభవించడం అనేవి కేవలం జ్ఞానియందు మాత్రమే సంభవించవు. సకల ప్రాణులలో కూడా జాగ్రత్తు-స్వప్నం-సుషుప్తి అనే అవస్థలను పొందటమనేది సమానమే. (అయితే, జ్ఞాని

మాత్రమే మూడు అవస్థలనూ సమంగా అగ్నిహోత్ర క్రతువుగానే భావించ గలుగుతాడు). అందుచేత, ఇది కేవలం జ్ఞానం యొక్క ఘనతను కీర్తించడానికి చెప్తున్నారు.

'ఏ దేవత ఈ స్వప్నాన్ని దర్శిస్తుంది?' అనే ప్రశ్నకు సమాధానాన్ని ఇక చెప్తున్నారు.

అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి| యద్దృష్టం దృష్టమనుపశ్యతి శ్రుతం శ్రుతమేవార్థమనుశృణోతి దేశదిగన్తరైశ్చ ప్రత్యనుభూతం పునః పునః ప్రత్యనుభవతి దృష్టం చాదృష్టం చ శ్రుతం చాశ్రుతం చానుభూతం చాననుభూతం చ సచ్చాసచ్చ సర్వం పశ్యతి సర్వః పశ్యతి|| || 4-5 ||

స్వప్న స్థితిలో ఈ (మనసు అనే) దేవతయే మహిమను (స్వప్నాన్ని) అనుభవిస్తుంది. ఏది కనబడుతుందో దానిని తిరిగి చూస్తుంది. వినబడేదానిని తిరిగి వింటుంది. వేర్వేరు ప్రదేశాలు దిక్కులు అనుభవానికి వస్తాయో వాటిని మరలా మరలా అనుభవిస్తుంది. కనుపించేదాన్ని కనుపించనిదాన్ని, వినబడేదాన్ని వినబడనిదాన్ని, అనుభవానికి వచ్చే దాన్ని అనుభవానికి రాని దాన్ని, సత్ ను అసత్ నూ, సకలాన్నీ దర్శిస్తుంది. తానే సకలమై దర్శిస్తుంది.

శంకరుల భాష్యం

అత్ర ఉపరతేషు శ్రోత్రాదిషు దేహరక్షాయై జాగ్రత్సు ప్రాణాదివాయుషు ప్రాక్సుషుప్తిప్రతిపత్తేః ఏతస్మిన్నంతరాల ఏషః దేవః అర్కరశ్మివత్స్వాత్మని సంహృతశ్రోత్రాదికరణః స్వప్నే మహిమానం విభూతిం విషయవిషయిలక్షణమనేకాత్మభావగమనం అనుభవతి ప్రతిపద్యతే| నను మహిమానుభవనే కరణం మనోఽనుభవితుః ; తత్కథం స్వాతంత్ర్యేణానుభవతీత్యుచ్యతే ? స్వతంత్ర హి క్షేత్రజ్ఞః| నైష దోషః| క్షేత్రజ్ఞస్య స్వాతంత్ర్యస్య మనఉపాధికృతత్వాత్| న హి క్షేత్రజ్ఞః పరమార్థతః స్వతః స్వపితి జాగర్తి వా| మనఉపాధికృతమేవ తస్య జాగరణం స్వప్నశ్చ| ఉక్తం వాజసనేయకే 'సధీః స్వప్నో భూత్వా' (బృ. మా. 4| 3| 7) 'ధ్యాయతీవ లేలాయతీవ' (బృ. ఉ. 4| 3| 7) ఇత్యాది| తస్మాన్మనసో విభూత్యనుభవే స్వాతంత్ర్యవచనం న్యాయ్యమేవ| మనఉపాధిసహితత్వే స్వప్నకాలే క్షేత్రజ్ఞస్య స్వయంజ్యోతిష్ట్వం బాధ్యేత ఇతి కేచిత్| తన్న| శ్రుత్యర్థాపరిజ్ఞానకృతా భ్రాంతిస్తేషాం| యస్మాత్స్వయంజ్యోతిష్ట్వాదివ్యవహారోఽప్యామోక్షాంతః సర్వోఽప్యవిద్యావిషయ ఏవ మనఆద్యుపాధిజనితః ; 'యత్ర వా అన్యదివ స్యాత్తత్రాన్యోఽన్యత్పశ్యేన్మాత్రాసంసర్గస్త్వస్య భవతి' (బృ. ఉ. 4| 3| 31), (బృ. మా. 4| 5| 14) 'యత్ర త్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం పశ్యేత్' (బృ. ఉ. 4| 5| 15) ఇత్యాదిశ్రుతిభ్యః| అతో మందబ్రహ్మవిదామేవేయమాశంకా, న త్వేకాత్మవిదాం| నన్వేవం సతి 'అత్రాయం పురుషః స్వయంజ్యోతిః' (బృ. ఉ. 4| 3| 14) ఇతి విశేషణమనర్థకం భవతి| అత్రోచ్యతే| అత్యల్పమిదముచ్యతే 'య ఏషోఽన్తర్హృదయ ఆకాశస్తస్మిఞ్ఛేతే' (బృ. ఉ. 2| 1| 17) ఇతి అంతర్హృదయపరిచ్ఛేదకరణే సుతరాం స్వయంజ్యోతిష్ట్వం బాధ్యేత| సత్యమేవం ; అయం దోషో యద్యపి స్యాత్స్వప్నే కేవలతయా స్వయంజ్యోతిష్ట్వేనార్థం తావదపనీతం భారస్యేతి చేత్ ,

న ; తత్రాపి 'పురీతతి నాడీషు శేతే' ఇతి శ్రుతేః పురీతన్నాడీసంబంధాదత్రాపి పురుషస్య స్వయంజ్యోతిష్ట్వేనార్ధభారాపనయాభిప్రాయో మృషైవ| కథం తర్హి 'అత్రాయం పురుషః స్వయంజ్యోతిః' (బృ. ఉ. 4| 3| 14) ఇతి ? అన్యశాఖాత్వాదనపేక్షా సా శ్రుతిరితి చేత్ , న ; అర్థైకత్వస్యేష్టత్వాత్| ఏకో హ్యాత్మా సర్వవేదాంతానామర్థో విజిజ్ఞాపయిషితో బుభుత్సితశ్చ| తస్మాద్యుక్తా స్వప్న ఆత్మనః స్వయంజ్యోతిష్ట్వోపపత్తిర్వక్తుం , శ్రుతేర్యథార్థతత్త్వప్రకాశకత్వాత్| ఏవం తర్హి శృణు శ్రుత్యర్థం హిత్వా సర్వమభిమానం ; న హ్యభిమానేన వర్షశతేనాపి శ్రుత్యర్థో జ్ఞాతుం శక్యతే సర్వైః పండితంమన్యైః| యథా హృదయాకాశే పురీతతి నాడీషు చ స్వపతస్తత్సంబంధాభావాత్తతో వివిచ్య దర్శయితుం శక్యత ఇతి ఆత్మనః స్వయంజ్యోతిష్ట్వం న బాధ్యతే| ఏవం మనస్యవిద్యాకామకర్మనిమిత్తోద్భూతవాసనావతి కర్మనిమిత్తా వాసనా అవిద్యయా అన్యద్వస్త్వంతరమివ పశ్యతః సర్వకార్యకరణేభ్యః ప్రవివిక్తస్య ద్రష్టుర్వాసనాభ్యో దృశ్యరూపాభ్యోఽన్యత్వేన స్వయంజ్యోతిష్ట్వం సుదర్పితేనాపి తార్కికేణ కేన వారయితుం శక్యతే ? తస్మాత్సాధూక్తం మనసి ప్రలీనేషు కరణేష్వప్రలీనే చ మనసి మనోమయః స్వప్నాన్పశ్యతీతి| కథం మహిమానమనుభవతీతి ఉచ్యతే| యన్మిత్రం పుత్రాది వా పూర్వం దృష్టం తద్వాసనావాసితః పుత్రమిత్రాదివాసనాసముద్భూతం పుత్రం మిత్రమివ వా అవిద్యయా పశ్యతీత్యేవం మన్యతే| శృణోతి తథా శ్రుతమర్థం తద్వాసనయాను శృణోతీవ| దేశదిగంతరైశ్చ దేశాంతరైర్దిగంతరైశ్చ ప్రత్యనుభూతం పునః పునస్తత్ప్రత్యనుభవతీవ అవిద్యయా| తథా దృష్టం చాస్మింజన్మన్యదృష్టం చ జన్మాంతరదృష్టమిత్యర్థః| అత్యంతాదృష్టే వాసనానుపపత్తేః| ఏవం శ్రుతం చాశ్రుతం చానుభూతం చాస్మింజన్మని కేవలేన మనసా అననుభూతం చ మనసైవ జన్మాంతరేఽనుభూతమిత్యర్థః| సచ్చ పరమార్థోదకాది| అసచ్చ మరీచ్యుదకాది| కిం బహునా, ఉక్తానుక్తం సర్వం పశ్యతి సర్వః పశ్యతి సర్వమనోవాసనోపాధిః సన్నేవం సర్వకరణాత్మా మనోదేవః స్వప్నాన్పశ్యతి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అత్ర శ్రోత్రాదులు వాటి కార్యక్రమాలనుండి విరామం చెందగా, దేహాన్ని రక్షించేందుకు ప్రాణం మొదలైన వాయువులు మేల్కొనినప్పుడు, అంటే జాగ్రత్తుకు సుషుప్తికి మధ్యనుండే, ఈ కాలంలో, **ఏషః దేవః** ఈ దేవతయే (ఈ మనసు అనే దేవతయే) సూర్యకిరణాలలాగా శ్రోత్రాది ఇంద్రియాలను తనలోనికి ఉపసంహరింపచేసుకొని **స్వప్నే** స్వప్నకాలంలో **మహిమానమ్** మహిమలను, అంటే విషయ-విషయి లక్షణం కలిగిన అనేక భావాలను (స్వప్న రూపంగా) తనయందు **అనుభవతి** అనుభవిస్తుంది లేదా పొందుతుంది.

<u>సందేహం :</u> క్షేత్రజ్ఞుడే మనసు అన్న సాధనంతో మహిమలను అనుభవిస్తాడు కదా! అలాంటి (క్షేత్రజ్ఞునికి) సాధనమైన మనసు స్వతంత్రంగా తనకు తానే అనుభవాలను పొందడం ఎలా సాధ్యం?

<u>సమాధానం :</u> స్వతంత్రత అన్నది క్షేత్రజ్ఞునికి (ఆపాదించబడింది) కాబట్టి ఇందులో దోషం ఏమీ లేదు. క్షేత్రజ్ఞునికి స్వాతంత్ర్యం మనసును ఉపాధిగా చేసుకొనడం వల్ల కలిగింది కాబట్టి. నిజానికి క్షేత్రజ్ఞుడు స్వయంగా స్వప్నాన్ని లేదా మెలకువను కలిగిన వాడు కాదు. మనసును ఉపాధిగా చేసుకోవడం వల్లనే వానికి జాగ్రదవస్థ కాని స్వప్నావస్థ కాని కలుగుతోంది. వాజసనేయకంలో ఈ విషయాన్నే ఇలా చెప్తున్నారు. 'ఆ బుద్ధి కలవాడే స్వప్నమై' ['సధీః స్వప్నో భూత్వా' (బృ.మా. 4-3-7)] అనీ; 'ధ్యానించే దానివలె, ఊగిసలాడే దానివలె' ['ధ్యాయతీవ లేలాయతీవ' (బృ.ఉ. 4-3-7)] అనీ చెప్పారు. అందుచేత మనసు మహిమలను (స్వప్న విషయాలను) స్వతంత్రంగా అనుభవిస్తుంది అనే వాక్యం సమంజసమే.

అయితే, స్వప్నకాలంలో మనసును ఉపాధిగా కలిగి ఉండటం చేత క్షేత్రజ్ఞుని యొక్క స్వయంప్రకాశకత్వానికి లోపం కలుగుతుందని కొందరు అంటారు. కాని, అది సరికాదు. ఉపనిషత్తుల అర్థం సరిగా తెలియనందువల్ల వారికి ఈ భ్రాంతి కలుగుతోంది. స్వయంప్రకాశకత్వం మొదలుకొని మోక్షం వరకు గల వ్యవహారాలన్నీ కూడా మనసు మొదలైన ఉపాధుల వల్ల కలిగిన అవిద్యావిషయాలే. ఈ విషయాన్నే 'ఎక్కడ తాను కాక మరొకటి ఉంటుందో అక్కడ ఒకటి మరొకదాన్ని చూడటం జరుగుతుంది. అలా ఇతరమనేది ఏదీ లేనప్పుడు, ఇంద్రియాల ద్వారా అనుభవమనేదే సంభవం కాదు.' ['యత్ర వా అన్యదివ స్యాత్తత్రాన్యోఽన్యత్పశ్యేన్మాత్రాసంసర్గస్త్వస్య భవతి' (బృ.ఉ. 4-3-31), (బృ.మా. 4-5-14)]: 'అయితే సర్వాన్నీ తానుగా భావించే బ్రహ్మజ్ఞాని దేనితో దేనిని చూస్తాడు?' ['యత్ర త్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం పశ్యేత్' (బృ.ఉ. 4-5-15)] అన్న ఈ శ్రుతి వాక్యాలు వివరిస్తున్నాయి. అందుచేత, (ఉపాది కారణంగా క్షేత్రజ్ఞుని స్వయంప్రకాశకత్వానికి లోపం కలుగుతందనే అనుమానం) సరియైన బ్రహ్మజ్ఞానం లేని వానికి కలుగుతుందే కాని, బ్రహ్మజ్ఞానం పొందిన వారికి కలుగదు.

సందేహం : అలా అయినట్లైతే, 'ఈ స్థితిలో (అంటే స్వప్నావస్థలో) పురుషుడు స్వయంప్రకాశకుడు అవుతాడు' ['అత్రాయం పురుషః స్వయంజ్యోతిః భవతి' (బృ. ఉ. 4-3-14)] అని విశేషించి చెప్పిన శ్రుతివాక్యం అర్థం లేనిదా?

సమాధానం : దానికి సమాధానం చెప్తున్నాం. ఇది చాలా సూక్ష్మమైన విషయం. క్షేత్రజ్ఞుడు హృదయం లోపల పరిచ్ఛిన్నంగా ఉండటం అనేది అతని స్వయం ప్రకాశకత్వానికి ఎలాంటి లోపం కలిగించదు. ఎందుకంటే, ఈ అభిప్రాయాన్నే 'హృదయమందలి ఏ పరమాత్మయున్నదో దానిలోనే ఇది ఉంటుంది' ['య ఏషోఽన్తర్హృదయ ఆకాశస్తస్మిఞ్ఛేతే' (బృ. ఉ. 2-1-17)] అన్న శ్రుతి వాక్యం సమర్థిస్తోంది. కాబట్టి అది (ఉపాధిచేత పరిమితం కాబడినంత మాత్రం చేత ఆత్మ యొక్క స్వయం ప్రకాశకత్వానికి లోపం కలగదు అనడం) సత్యమే.

సందేహం : ఇలా శ్రుతి వాక్యం ఉన్నప్పటికీ కూడా, (క్షేత్రజ్ఞుని యొక్క స్వయం ప్రకాశకత్వానికి లోపమనే) ఈ దోషం స్వప్నంలో (మనసు స్వతంత్రంగా వ్యవహరించడం చేత) స్వయం ప్రకాశత్వంగా ఉన్నంతవరకు మాత్రమే అవడం చేత సగం దోషభారం తొలగినట్లౌతుంది కదా!

సమాధానం : కాదు. ఆ తర్వాత కూడా 'దేహంలోని నాడులలో తిరిగి వ్యాపిస్తుంది' 'పురీతతి నాడీషు శేతే' (బృ.ఉ. 2-1-19) అని శ్రుతి చెప్తోంది. దేహగతమైన నాడులతో సంబంధం చేత అప్పుడు కూడా ఆ పురుషుని యొక్క స్వయం ప్రకాశత్వానికి సగం దోషం తొలగిపోవడమనే అభిప్రాయం భ్రమ మాత్రమే.

సందేహం : అయితే, 'ఈ స్థితిలో (అంటే స్వప్నావస్థలో) పురుషుడు స్వయంప్రకాశకుడు అవుతాడు' ['అత్రాయం పురుషః స్వయంజ్యోతిః భవతి' (బృ. ఉ. 4-3-14)] అని శ్రుతి ఎందుకు చెప్పినట్లు? అది వేరే సందర్భానుసారం చెప్పినది కాబట్టి ఇక్కడ అన్వయించదని అనుకొందామంటే, వేద పాఠాలన్నీ అంతిమంగా ఒకే అర్థాన్ని సూచించడమే సమంజసం కాబట్టి అలా అనుకోలేము. ఒక్కటే అయిన ఆత్మను గురించి తెలియచెప్పడమే సకల వేదాంతాల అభిప్రాయం అని గ్రహించాలి. అందువలన,

శ్రుతులు యదార్థమైన తత్త్వాన్ని ప్రకటిస్తాయి కాబట్టి, స్వప్నంలో ఆత్మ యొక్క స్వయం ప్రకాశకత్వాన్ని ఒప్పుకోవలసియే ఉంది. (వేదములు ఆత్మ తత్త్వాన్ని నిర్ణయించి చెప్పాయి కాబట్టి, దానిని భిన్నమైన అభిప్రాయాలు విలువలేనివే).

సమాధానం : ఆ విధంగానైతే, సకలమైన ఇతర అభిప్రాయాలను విడిచిపెట్టి, శ్రుతి అభిప్రాయాన్ని వినండి. పండితులం అని అనుకొనేవారందరూ, వారి వారి అభిప్రాయాలతో అంటకాగుతూ ఉంటే, వంద సంవత్సరాలు శ్రమించినా కూడా, శ్రుతి అభిప్రాయాన్ని తెలుసుకోలేరు. ఎలాగైతే నిద్రావస్థలో హృదయాకాశంలో ఉండి, దేహమంతటా నాడులయందు వ్యాప్తమై ఉండికూడా వాటితో ఎటువంటి సంబంధం లేకుండా సాక్షిగా చూడగలిగిన ఆత్మయందు స్వయం ప్రకాశకత్వానికి ఎటువంటి దోషం కాని లోపం కాని ఉండదో, అదేవిధంగా (స్వప్నావస్థలో) మనసునందు అవిద్య-కోరిక-కర్మల కారణంగా కలిగిన వాసనలు ఉన్నప్పటికీ, ఆ కర్మల కారణంగా కలిగిన వాసనలు అవిద్యారూపాలయినందున క్షేత్రజ్ఞుడు వాటిని తనకు వేరుగానే చూస్తాడు. సకల కార్య, కరణాలకు భిన్నమైన ద్రష్ట, వాసనలకు దృశ్యరూపాలకు భిన్నంగా ఉండటం చేత ఆత్మ యొక్క స్వయం ప్రకాశకత్వానికి ఎంత గొప్ప తార్కికుడైనా లోపాన్ని ఆపాదించగలడా? అందువలన, మనసునందు ఇంద్రియాలు లీనమైయున్నప్పుడు, మనసు మాత్రం అప్రమత్తంగా ఉండగా, ఆ మనసునందు నిండియున్న ఆత్మ స్వప్నాన్ని దర్శిస్తుంది.

అది ఏ విధంగా వివిధ స్వప్న దృశ్యాలను అనుభవిస్తుందో చెప్తున్నారు. **యత్ దృష్టమ్** పుత్రుడు లేదా మిత్రుడు వంటి వాటిని వేటినైతే పూర్వం చూశాడో, ఆ యా వాసనలచే ప్రభావితమైన వాడు అంటే పుత్రుడు మిత్రుడు వంటి వాసనలనుండి పుట్టిన **ద్రష్టమ్** పుత్రుడు మిత్రుడు వంటి చూడబడిన రూపాలనే అవిద్య కారణంగా **అనుపశ్యతి** (స్వప్నంలో) తిరిగి దర్శిస్తాడు అని భావించాలి. అలాగే **శ్రుతమ్** గతంలో విన్నదాన్నే **శ్రుతమ్ అర్థమ్** దాని వాసనా రూపంగా **అను శృణోతి** (స్వప్నంలో) వింటాడు. అలాగే **దేశదిగన్తరైః చ** వేర్వేరు ప్రదేశాలలో వేర్వేరు దిక్కులలో (గతంలో) అనుభవంలోకి వచ్చినవి కూడా **ప్రత్యనుభూతమ్ పునః పునః** అవిద్య కారణంగా (స్వప్నంలో) మరలా మరలా అనుభవానికి వస్తాయి. అలాగే, **దృష్టమ్ చ** ఈ జన్మలో చూచినవి **అదృష్టమ్ చ** మరియు అసలే చూడబడని వాటికి వాసనలుండే అవకాశం లేదు కాబట్టి గతజన్మలలో చూచినవి అదృష్టమని అభిప్రాయం. అదేవిధంగా **శ్రుతమ్ చ అశ్రుతమ్ చ** విన్నవీ, విననివీ కూడా, **అనుభూతమ్ చ** ఈ జన్మలో కేవలం మనసు ద్వారా మాత్రమే అనుభవానికి వచ్చినవీ, **అననుభూతమ్ చ** గతజన్మలలో కూడా కేవలం మనసు ద్వారా మాత్రమే అనుభవానికి వచ్చినవీ. **సత్ చ** జలం మొదలైన వాటి లాగా ఏది సత్తుగా ఉన్నదో అదీ, **అసత్ చ** ఎండమావులు మొదలైన వాటి లాగా ఏది అసత్తుగా కనబడుతోందో అది కూడా. ఇంతెందుకు, పైన చెప్పిన మరియు చెప్పని **సర్వమ్** సకలమునూ **పశ్యతి** దర్శిస్తుంది. **సర్వః పశ్యతి** సకలమునూ, మనోవాసనలను ఉపాధిగా చేసుకొని మనసు అనే దేవత సకల ఇంద్రియాలతో కూడి ఒక్కటే అయినదై, స్వప్నాన్ని దర్శిస్తుంది.

స యదా తేజసాభిభూతో భవతి| అత్రైష దేవః స్వప్నాన్న పశ్యత్యథైతదస్మిఞ్శరీరే ఏతత్సుఖం భవతి|| || 4-6 ||

ఎప్పుడైతే ఆ (మనసు అనబడే) దేవత తేజస్సుగా పరిణమిస్తుందో, అప్పుడిక ఆ దేవత స్వప్నాన్ని దర్శించదు. ఆ సమయంలో ఈ దేహంలో సుఖం కలుగుతుంది.

శంకరుల భాష్యం

సః యదా మనోరూపో దేవో యస్మిన్కాలే సౌరేణ పిత్తాఖ్యేన తేజసా నాడీశయేన సర్వతః అభిభూతో భవతి తిరస్కృతవాసనాద్వారో భవతి, తదా సహ కరణైర్మనసో రశ్మయో హృద్యుపసంహృతా భవంతి| యదా మనో దార్వగ్నివదవిశేషవిజ్ఞానరూపేణ కృత్స్నం శరీరం వ్యాప్యావతిష్ఠతే, తదా సుషుప్తో భవతి| అత్ర ఏతస్మిన్కాలే ఏషః మనఆఖ్యో దేవః స్వప్నాన్ న పశ్యతి దర్శనద్వారస్య నిరుద్ధత్వాత్తేజసా| అథ తదా ఏతస్మిన్ శరీరే ఏతత్సుఖం భవతి యద్విజ్ఞానం నిరాబాధమవిశేషేణ శరీరవ్యాపకం ప్రసన్నం భవతీత్యర్థః||

ఏతస్మిన్కాలే అవిద్యాకామకర్మనిబంధనాని కార్యకరణాని శాంతాని భవంతి| తేషు శాంతేష్వాత్మస్వరూపముపాధిభిరన్యథా విభావ్యమానమద్వయమేకం శివం శాంతం భవతీత్యేతామేవావస్థాం పృథివ్యాద్యవిద్యాకృతమాత్రానుప్రవేశేన దర్శయితుం దృష్టాంతమాహ —

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

సః మనోరూపమైన ఆ దేవత **యదా** ఏ సమయంలోనైతే **అభిభూతః భవతి** (స్వప్నాన్ని చూపించే) వాసనల ద్వారాలను మూసివేసి, సమస్త నాడులలో శయనించే పిత్తమనబడే సూర్య తేజస్సు చేత ముంచెత్తబడుతుందో, అప్పుడు ఇంద్రియాలతో సహా మనసు యొక్క కిరణాలు హృదయంలోకి ఉపసంహారమౌతాయి. ఎప్పుడైతే మనసు, కట్టెలోని నిప్పులాగా, ఎటువంటి ప్రత్యేకలు లేకుండా దేహాన్నంతటినీ వ్యాపించి సుప్తమై ఉంటుందో అప్పుడు సుషుప్తి సంభవమౌతుంది. **అత్ర** ఈ కాలంలో **ఏషః దేవః** ఈ మనసనబడే దేవత **స్వప్నాన్ న పశ్యతి** దర్శనాన్ని కలిగించే ద్వారాలు మూసుకుపోయినందున స్వప్నాలను ఇక దర్శించదు. **అథ** తరువాత **తదా** అప్పుడు **అస్మిన్ శరీరే** ఈ దేహంలో **ఏతత్ సుఖమ్** ఈ దేహాన్ని వ్యాపించిన ప్రసన్నమైన, ఎటువంటి అడ్డంకులు విశిష్టతలు లేని స్వభావం కల సుఖం **భవతి** కలుగుతుంది అని అభిప్రాయం.

ఈ సుషుప్తి కాలంలో అవిద్య-కామం-కర్మలచే నిబద్ధమైన దేహము మరియు ఇంద్రియాలు శాంతిస్తాయి. అవి శాంతించగా, ఉపాధుల కారణంగా పరిమితత్వాని కలిగినట్లుగా కనిపించే ఆత్మ స్వరూపం తన స్వభావమైన అవిభాజ్యత్వాన్ని, అద్వయత్వాన్ని, ఏకత్వాన్ని, మంగళకరత్వాన్ని, శాంత స్థితిని సంతరించుకొంటుంది. అవిద్యా కల్పితాలైన పృథివ్యాదులు వాటి సూక్ష్మ భూతాలతో సహా ఒక నిర్దిష్ట క్రమంలో లీనమవడం ద్వారా ఈ స్థితి కలిగే విధానాన్ని సూచించడం కోసం ఒక ఉదాహరణను తర్వాత మంత్రంలో శ్రుతి ఇలా చెప్తోంది.

స యథా సోమ్య వయాగ్ంసి వాసోవృక్షం సంప్రతిష్ఠన్త ఏవం హ వై తత్సర్వం పర ఆత్మని సంప్రతిష్ఠతే|| || 4-7 ||

ఓ సౌమ్యుడా! పక్షులు వాటికి ఆశ్రయమైన వృక్షాలను చేరినట్లుగా, ఇవన్నీ కూడా పరమాత్మ యందు విశ్రమిస్తాయి.

శంకరుల భాష్యం

స దృష్టాంతః యథా యేన ప్రకారేణ హి సోమ్య ప్రియదర్శన, వయాంసి పక్షిణః వాసార్థం వృక్షం వాసోవృక్షం ప్రతి సంప్రతిష్ఠంతే గచ్ఛంతి, ఏవం యథా దృష్టాంతః హ వై తత్ వక్ష్యమాణం సర్వం పరే ఆత్మని అక్షరే సంప్రతిష్ఠతే||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

స ఆ ఉదాహరణ ఇది. **యథా** ఏ ప్రకారంగానైతే, **సోమ్య** ఓ సౌమ్యుడా! చూడగనే ఆహ్లాదాన్నిచ్చేవాడా, **వయాంసి** పక్షులు **వాసోవృక్షం** ఆశ్రయాన్నిచ్చే చెట్లను **సంప్రతిష్ఠన్తే** చేరతాయో, **ఏవమ్ హ వై** ఆ విధంగానే, ఉదహరించినట్లుగానే **తత్ సర్వమ్** ఈ చెప్పబోయే సకలమూ **పరే ఆత్మని** పరమాత్మయందు **సంప్రతిష్ఠతే** చేరి ఉంటాయి.

పృథివీ చ పృథివీమాత్రా చాపశ్చాపోమాత్రా చ తేజశ్చ తేజోమాత్రా చ వాయుశ్చ వాయుమాత్రా చాకాశశ్చాకాశమాత్రా చ చక్షుశ్చ ద్రష్టవ్యం చ శ్రోత్రం చ శ్రోతవ్యం చ ఘ్రాణం చ ఘ్రాతవ్యం చ రసశ్చ రసయితవ్యం చ త్వక్చ స్పర్శయితవ్యం చ వాక్చ వక్తవ్యం చ హస్తౌ చాదాతవ్యం చోపస్థశ్చానన్దయితవ్యం చ పాయుశ్చ విసర్జయితవ్యం చ పాదౌ చ గన్తవ్యం చ మనశ్చ మన్తవ్యం చ బుద్ధిశ్చ బోద్ధవ్యం చాహఙ్కారశ్చాహఙ్కర్తవ్యం చ చిత్తం చ చేతయితవ్యం చ తేజశ్చ విద్యోతయితవ్యం చ ప్రాణశ్చ విధారయితవ్యం చ|| || 4-8 ||

పృథివి మరియు పృథివీ తన్మాత్ర (దాని కారణంతో సహా), జలం మరియు జల తన్మాత్ర, అగ్ని మరియు అగ్ని తన్మాత్ర, వాయువు మరియు వాయు తన్మాత్ర, ఆకాశం మరియు ఆకాశ తన్మాత్ర, చక్షువులు మరియు దృశ్యవిషయాలు, శ్రోత్రములు మరియు శ్రోత్రవిషయాలు, నాసిక మరియు ఘ్రాణవిషయాలు, నాలుక మరియు రుచి విషయాలు, చర్మం మరియు స్పర్శ విషయాలు, వాక్కు మరియు వాగ్విషయాలు, చేతులు మరియు వాటితో ఇవ్వబడేవి, ఉపస్థ మరియు దానిచే

పొందబడే ఆనందం, పాయువు మరియు దానిచే విసర్జింపబడేవి, పాదములు మరియు వాటిచే చేరబడేవి, మనసు మరియు దానిచే ఆలోచించబడే విషయాలు, బుద్ధి మరియు దానిచే తెలుసుకోబడే విషయాలు, అహంకారం మరియు దానిచే నిర్వర్తించబడే కర్తవ్యాలు, చిత్తం మరియు దానిచే ఎరుకలోకి వచ్చేవి, తేజస్సు మరియు దానిచే ప్రకాశింపబడేవి మరియు ప్రాణం, ప్రాణాన్ని ఆధారం చేసుకొనేవి కూడా.

శంకరుల భాష్యం

కిం తత్సర్వం ? పృథివీ చ స్థూలా పంచగుణా తత్కారణం చ పృథివీమాత్రా గంధతన్మాత్రా, తథా ఆపశ్చ ఆపోమాత్రా చ, తేజశ్చ తేజోమాత్రా చ, వాయుశ్చ వాయుమాత్రా చ, ఆకాశశ్చాకాశమాత్రా చ, స్థూలాని చ సూక్ష్మాణి చ భూతానీత్యర్థః| తథా చక్షుశ్చ ఇంద్రియం రూపం చ ద్రష్టవ్యం చ, శ్రోత్రం చ శ్రోతవ్యం చ, ఘ్రాణం చ ఘ్రాతవ్యం చ, రసశ్చ రసయితవ్యం చ, త్వక్చ స్పర్శయితవ్యం చ, వాక్చ వక్తవ్యం చ, హస్తౌ చ ఆదాతవ్యం చ, ఉపస్థశ్చ ఆనందయితవ్యం చ, పాయుశ్చ విసర్జయితవ్యం చ, పాదౌ చ గంతవ్యం చ ; బుద్ధీంద్రియాణి కర్మేంద్రియాణి తదర్థాశ్చోక్తాః| మనశ్చ పూర్వోక్తం| మంతవ్యం చ తద్విషయః| బుద్ధిశ్చ నిశ్చయాత్మికా| బోద్ధవ్యం చ తద్విషయః| అహంకారశ్చ అభిమానలక్షణమంతఃకరణం| అహంకర్తవ్యం చ తద్విషయః| చిత్తం చ చేతనావదంతఃకరణం| చేతయితవ్యం చ తద్విషయః| తేజశ్చ త్వగింద్రియవ్యతిరేకేణ ప్రకాశవిశిష్టా యా త్వక్| తయా నిర్భాస్యో విషయో విద్యోతయితవ్యం| ప్రాణశ్చ సూత్రం యదాచక్షతే తేన విధారయితవ్యం సంగ్రథనీయం| సర్వం హి కార్యకరణజాతం పారార్థ్యేన సంహతం నామరూపాత్మకమేతావదేవ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

(పరమాత్మలో లయమయ్యే) అవన్నీ ఏమిటి? **పృథివీ** అయిదు గుణాలు (శబ్ద స్పర్శ రూప రస గంధాలనే గుణాలు) కలిగి స్థూలంగా కనబడే భూమి **చ** మరియు **పృథివీమాత్రా చ** పృథివికి సూక్ష్మకారణమైన గంధ తన్మాత్ర. అలాగే **ఆపః చ ఆపో-మాత్రా** చ జలము మరియు జలానికి సూక్ష్మకారణమైన రసతన్మాత్ర, **తేజః చ తేజో-మాత్రా చ** అగ్ని మరియు అగ్నికి సూక్ష్మకారణమైన రూపతన్మాత్ర, **వాయుః చ వాయు-మాత్రా చ** వాయువు మరియు వాయువుకు సూక్ష్మకారణమైన స్పర్శతన్మాత్ర, **ఆకాశః చ ఆకాశ-మాత్రా చ** ఆకాశము మరియు ఆకాశమునకు సూక్ష్మకారణమైన శబ్దతన్మాత్ర. అంటే స్థూలమైన సూక్ష్మమైన భూతాలన్నీ (పరమాత్మలో లయమౌతాయి అని అర్థం). అలాగే, **చక్షుషః చ** కన్నులు మరియు **రూపమ్** కంటికి విషయమైన రూపము, **శ్రోత్రమ్ చ శ్రోతవ్యమ్** చెవులు మరియు వాటితో వినేది, **ఘ్రాణమ్ చ ఘ్రాతవ్యమ్** నాసిక మరియు దానితో గ్రహించే వాసన, **రసః చ రసయితవ్యమ్** నోరు మరియు దానితో గ్రహించే రుచి, **త్వక్ చ స్పర్శయితవ్యమ్** చర్మము మరియు దానితో గ్రహింపబడే స్పర్శ, **వాక్ చ వక్తవ్యమ్** వాక్కు మరియు వాక్కుచే చెప్పబడేది, **హస్తౌ చ**

ఆదాతవ్యమ్ రెండు చేతులు మరియు వాటితో ఇవ్వబడేది, **ఉపస్థః చ ఆనన్దయితవ్యమ్** జననేంద్రియం మరియు దానిచే పొందబడే ఆనందం, **పాయుః చ విసర్జయితవ్యమ్** విసర్జనేంద్రియం మరియు దానితో వదలిపేయబడేది, **పాదౌ చ గన్తవ్యమ్** పాదద్వయము మరియు వాటితో చేరేది. ఇంతవరకు, జ్ఞానేంద్రియాలు మరియు కర్మేంద్రియాల గురించి చెప్పారు. **మనః చ** పూర్వం ప్రస్తావించబడిన మనసు మరియు **మన్తవ్యమ్** ఆ మనసుచే ఆలోచించబడేది, **బుద్ధిః చ** నిర్ణయించేది లేదా తెలుసుకొనేది మరియు **బోద్ధవ్యమ్** దానిచే తెలియబడే విషయం, **అహంకారః చ** అభిమాన లక్షణం కలిగిన అంతఃకరణం మరియు **అహంకర్తవ్యమ్** అది నిర్వహించేది, **చిత్తమ్ చ** చేతనత్వం కలిగిన అంతఃకరణం మరియు **చేతయితవ్యమ్** దానిచే ప్రకటనమయ్యేది, **తేజః** త్వగింద్రియానికి భిన్నమైనది, ప్రకాశమే స్వభావంగా కలది మరియు **విద్యోయితవ్యమ్** దానిచే ప్రకాశింపబడేది. **ప్రాణః చ** సూత్రాత్మ (అంటే సమస్తాన్ని సూత్రంగా కలిపి ఉంచే సమిష్ఠి తత్వమైన హిరణ్యగర్భుడు) మరియు **విధారయితవ్యమ్** దానిని ఆధారంగా చేసుకొని నిలిచియున్న సమస్తమూ. ఈ కార్య-కరణ జనితమైనదీ, నామరూపాత్మకమైనదీ అయిన ఈ సమస్తమూ, వాటికి భిన్నమైన వేరొకని కొరకు (ఏర్పాటు అయిన ఇవన్నీ పరమాత్మలోనే లయమౌతాయని అభిప్రాయం).

ఏష హి ద్రష్టా స్ప్రష్టా శ్రోతా ఘ్రాతా రసయితా మన్తా బోద్ధా కర్తా విజ్ఞానాత్మా పురుషః|
స పరేఽక్షర ఆత్మని సంప్రతిష్ఠతే|| || 4-9 ||

ఇదియే చూచే, స్పృశించే, వినే, వాసనను రుచిని గ్రహించే, ఆలోచించే, నిశ్చయించే, కర్తవ్యాలను నిర్వహించే, జ్ఞానమే స్వభావంగాగల పురుషుడు. అతడు పరమమైన అవినాశిత్వమైన ఆత్మలో స్థితుడై ఉంటాడు.

శంకరుల భాష్యం

అతః పరం యదాత్మస్వరూపం జలసూర్యకాదివద్భోక్తృత్వ కర్తృత్వేనేహానుప్రవిష్టం , ఏషః హి ద్రష్టా స్ప్రష్టా శ్రోతా ఘ్రాతా రసయితా మంతా బోద్ధా కర్తా విజ్ఞానాత్మా, విజ్ఞానం విజ్ఞాయతేఽనేనేతి కరణభూతం బుద్ధ్యాది, ఇదం తు విజానాతీతి విజ్ఞానం కర్తృకారకరూపం , తదాత్మా తత్స్వభావో విజ్ఞాతృస్వభావ ఇత్యర్థః| పురుషః కార్యకరణసంఘాతోక్తోపాధిపూరణాత్పురుషః| స చ జలసూర్యకాదిప్రతిబింబస్య సూర్యాదిప్రవేశవజ్జలాద్యాధారశోషే పరే అక్షరే ఆత్మని సంప్రతిష్ఠతే||

తదేకత్వవిదః ఫలమాహ —

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఇక ఆపైన, నీటిలో సూర్యుడు ప్రవేశించినట్లుగా, కర్తృత్వ భోక్తృత్వాలతో దేహంలో ప్రవేశించిన ఆత్మయొక్క యదార్థ స్వరూపం (చెప్తున్నారు). **ఏషః హి** ఇదియే **ద్రష్టా** చూచే **స్ప్రష్టా**

స్పృశించే **శ్రోతా** వినే **ఘ్రాతా** వాసనను గ్రహించే **రసయితా** రుచిని గ్రహించే **మన్తా** ఆలోచించే **బోద్ధా** నిశ్చయించే **కర్తా** కర్తృత్వాలను నిర్వహించే. **విజ్ఞానాత్మా** సాధారణంగా 'దేనిచే ఏదైనా తెలియబడుతుందో అది విజ్ఞానం' ['విజ్ఞాయతే అనేన ఇతి విజ్ఞానం'] అనే వ్యుత్పత్తి అర్థాన్ని గ్రహించినప్పుడు అది విజ్ఞాన సాధన రూపమైన (కరణ కారకమైన) బుద్ధి మొదలైన వాటిని సూచిస్తుంది. కాని, ఇక్కడ 'ఏది తెలుసుకొంటుందో అదే విజ్ఞానం ' ['విజానాతి ఇతి విజ్ఞానం'] అనే కర్తృకారక అర్థాన్ని గ్రహించాలి. అటువంటి **విజ్ఞానాత్మా** అంటే విజ్ఞత్వమే (తెలివిడియే లేదా ఎరుకయే) స్వభావంగా కలిగిన ఆత్మయే అని అభిప్రాయం. **పురుషః** కార్య-కరణ సంఘాతంగా పిలువబడే దేహాన్ని పూర్తిగా నిండియున్న పురుషుడు. మరియు **సః** ఆ పురుషుడు, నీరు మొదలైన వాటిలోని సూర్యుని ప్రతిబింబాలు, నీరు ఎండిపోగానే తిరిగి సూర్యునిలో ప్రవేశించినట్లుగా, **పరే అక్షరే ఆత్మని** అవినాశిత్వమైన పరమాత్మయందు **సంప్రతిష్ఠతే** స్థితిని కలిగి ఉంటాడు.

ఆ పరమాత్మతో ఐక్యతను సాధించిన వానికి కలిగే ఫలితాన్ని గురించి వివరిస్తున్నారు.

పరమేవాక్షరం ప్రతిపద్యతే స యో హ వై తదచ్ఛాయమశరీరమలోహితం శుభ్రమక్షరం వేదయతే యస్తు సోమ్య| స సర్వజ్ఞః సర్వో భవతి తదేష శ్లోకః||

|| 4-10 ||

ఎవడైతే ఆ ఛాయలేని, శరీరంలేని, వర్ణములేని, స్వచ్ఛమైన అవినాశిత్వాన్ని తెలుసుకొంటాడో అతడు పరమమైన అవినాశిత్వాన్నే పొందిన వాడవుతాడు. ఓ సౌమ్యుడా! అతడు సర్వస్వాన్ని తెలిసినవాడై, సర్వము తానే అయి ఉంటాడు. దీనిని వివరించే శ్లోకం ఉన్నది.

<u>శంకరుల భాష్యం</u>

పరమేవ అక్షరం వక్ష్యమాణవిశేషణం ప్రతిపద్యతే ఇతి| ఏతదుచ్యతే — స యో హ వై తత్ సర్వైషణావినిర్ముక్తః అచ్ఛాయం తమోవర్జితం , అశరీరం నామరూపసర్వోపాధిశరీరవర్జితం , అలోహితం లోహితాదిసర్వగుణవర్జితం , యత ఏవమతః శుభ్రం శుద్ధం , సర్వవిశేషణరహితత్వాదక్షరం , సత్యం పురుషాఖ్యమప్రాణమమనోగోచరం శివం శాంతం సబాహ్యాభ్యంతరమజం వేదయతే విజానాతి యస్తు సర్వత్యాగీ హే సోమ్య, సః సర్వజ్ఞః న తేనావిదితం కించిత్సంభవతి| పూర్వమవిద్యయా అసర్వజ్ఞ ఆసీత్| పునర్విద్యయా అవిద్యాపనయే సర్వః భవతి| తత్ అస్మిన్నర్థే ఏషః శ్లోకః మంత్రో భవతి ఉక్తార్థసంగ్రాహకః||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

పరమేవ అక్షరమ్ ఈ చెప్పబోయే లక్షణాలు కలిగిన పరమమైన అవినాశిత్వాన్ని **ప్రతిపద్యతే** పొందుతాడు. (వాటిని) ఆ లక్షణాలను చెప్తున్నారు. **స యో హ వై తత్** ఎవడు సకలమైన

కోర్కెలనుండి విముక్తుడౌతాడో అతడు నిశ్చయంగా, **అచ్ఛాయమ్** తమస్సనే చీకటిలేని **అశరీరమ్** నామ-రూపాలనే సకల దేహ ఉపాధి రూపాలు లేనట్టి **అలోహితమ్** ఎరుపు మొదలుగాగల సకల గుణాలు లేని, ఇలాంటివి ఏవీ లేనందుచేత **శుభ్రమ్** స్వచ్ఛమైన, ఎటువంటి విశేషణాలు లేని **అక్షరమ్** అవినాశిత్వము, సత్యము, పురుషుడనబడేది, అప్రాణం, మనసుకు గోచరం కానిది, మంగళకరమైనది, శాంతమైనది, బాహ్యంలో అంతరంలోనూ ఉన్నట్టిదీ, పుట్టుకలేనిదీ అయిన దాన్ని **యః తు** సకలాన్నీ త్యజించిన వాడు ఎవడైతే **వేదయతే** తెలుసుకొంటాడో, **సోమ్య** ఓ సౌమ్యా, **సః సర్వజ్ఞః** అతనికి తెలియనిది ఏదీ ఉండదు. పూర్వం అజ్ఞానం వల్ల తెలియనివాడై ఉన్నవాడు, తిరిగి జ్ఞానం చేత అజ్ఞాన నివృత్తి కాగా సర్వజ్ఞత్వం కలిగిన వాడౌతాడు. **తత్** ఈ అభిప్రాయాన్ని చెప్పే **ఏషః శ్లోకః** ఈ (క్రింది) మంత్రం ఉన్నది.

విజ్ఞానాత్మా సహ దేవైశ్చ సర్వైః ప్రాణా భూతాని సంప్రతిష్ఠన్తి యత్ర|
తదక్షరం వేదయతే యస్తు సోమ్య స సర్వజ్ఞః సర్వమేవావివేశేతి|| || 4-11 ||

ఓ సోమ్యుడా! అన్ని అవయవముల యొక్క సూక్ష్మాంశలు మరియు వాటి దేవతలతో సహా ఏ జ్ఞానమే స్వభావంగా గల దానిలో నిలిచి ఉంటాయో, ఆ అవినాశిత్వాన్ని ఎవడైతే తెలుసుకొంటాడో అతడు సర్వజ్ఞుడు, అన్నింటా ప్రవేశించి యుంటాడు.

<u>శంకరుల భాష్యం</u>

విజ్ఞానాత్మా, సహ దేవైశ్చ అగ్న్యాదిభిః ప్రాణాః చక్షురాదయః భూతాని పృథివ్యాదీని సంప్రతిష్ఠంతి ప్రవిశంతి యత్ర యస్మిన్నక్షరే, తత్ అక్షరం వేదయతే యస్తు హే సోమ్య ప్రియదర్శన, స సర్వజ్ఞః సర్వమేవ ఆవివేశ ఆవిశతీత్యర్థః||

|| ఇతి చతుర్థప్రశ్నభాష్యం||

<u>శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం</u>

సోమ్య ఓ సోమ్యుడా! **యత్ర విజ్ఞానాత్మా** జ్ఞానమే స్వభావంగా గల ఏ తత్వంలో **ప్రాణః** కన్ను మొదలైన ఇంద్రియాలు మరియు **భూతాని** పృథివి మొదలైన పంచభూతాలు **సహ దైవైః చ సర్వైః** అగ్ని మొదలుగా గల సకల దేవతలతో సహా **సంప్రతిష్ఠన్తి** విలీనమై ఉంటాయో **తత్ అక్షరమ్** ఆ అవినాశిత్వాన్ని **యః తు** ఎవడైతే **వేదయతే** తెలుసుకొంటాడో **సః** అతడు **సర్వజ్ఞః** సకలాన్నీ తెలిసినవాడు, **సర్వమ్ ఆవివేశ** సర్వస్వాన్ని ప్రవేశించిన వాడు.

|| చతుర్థ ప్రశ్నకు భాష్యానువాదం సంపూర్ణం||

పంచమః ప్రశ్నః

అథ హైనం శైబ్యః సత్యకామః పప్రచ్ఛ| స యో హ వై తద్భగవన్మనుష్యేషు ప్రాయణాంతమోంకారమ్ అభిధ్యాయీత కతమం వావ స తేన లోకం జయతీతి||

|| 5-1 ||

ఆ తరువాత శైబ్యుని కుమారుడైన సత్యకాముడు ఇలా ప్రశ్నించాడు. “ఓ పూజనీయుడా! మానవులలో ఎవడైతే మరణకాలం వరకు ఓంకారాన్నే ఉపాసిస్తాడో అతడు ఎటువంటి లోకాన్ని (ఆ ఉపాసన ద్వారా) జయిస్తాడు?”

శంకరుల భాష్యం

అథ హ ఏనం శైబ్యః సత్యకామః పప్రచ్ఛ| అథేదానీం పరాపరబ్రహ్మప్రాప్తిసాధనత్వేన ఓంకారస్యోపాసనవిధిత్సయా ప్రశ్న ఆరభ్యతే| సః యః కశ్చిత్ హ వై భగవన్ , మనుష్యేషు మనుష్యాణాం మధ్యే తత్ అద్భుతమివ ప్రాయణాంతం మరణాంతం యావజ్జీవమిత్యేతత్ ; ఓంకారం అభిధ్యాయీత ఆభిముఖ్యేన చింతయేత్| బాహ్యవిషయేభ్య ఉపసంహృతకరణః సమాహితచిత్తో భక్త్యావేశితబ్రహ్మభావే ఓంకారే ఆత్మప్రత్యయసంతానావిచ్ఛేదో భిన్నజాతీయప్రత్యయాంతరాఖిలీకృతోనివాతస్థదీపశిఖాసమోఽభిధ్యాన శబ్దార్థః| సత్యబ్రహ్మచర్యాహింసాపరిగ్రహత్యాగ సంన్యాసశౌచసంతోషామాయావిత్వా ద్యనేకయమనియమానుగృహీతః సః ఏవం యావజ్జీవవ్రతధారణః, కతమం వావ, అనేకే హి జ్ఞానకర్మభిర్జేతవ్యా లోకాస్తిష్ఠంతి ; తేషు తేన ఓంకారాభిధ్యానేన కతమం సః లోకం జయతీతి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అథ హ ఆ తరువాత **శైబ్యః సత్యకామః** శైబ్యుని కుమారుడైన సత్యకాముడు **ఏనమ్ పప్రచ్ఛ** ఇలా ప్రశ్నించాడు. ఇక ఇప్పుడు పరబ్రహ్మమును మరియు అపరబ్రహ్మమును పొందటానికి సాధనమైన ఓంకారాన్ని ఉపాసించే విధానం గురించిన ప్రశ్న ప్రారంభించబడుతోంది. “**భగవన్** ఓ పూజనీయుడా, **మనుష్యేషు** మానవులయందు **సః యః హ వై** అరుదుగా ఎవడైతే, **తత్** అద్భుతమైనట్టి ఆ **ఓంకారమ్** ఓంకారాన్ని **ప్రాయణాంతం** మరణించేంతవరకు, అంటే జీవించియున్నంతవరకు, **అభిధ్యాయీత** తీవ్రంగా ధ్యానిస్తాడో, అంటే, బాహ్యవిషయాలనుండి ఇంద్రియాలను విరమింపచేసి, ఏకాగ్రమైన చిత్తంతో ఓంకారమునందు బ్రహ్మము ఆవేశించియున్నట్లుగా భక్తితో భావనచేస్తూ, నిరంతరాయంగా అదియే తన ఆత్మయని, ఇందుకు భిన్నమైన ఇతరమైన భావనలన్నింటినీ నిర్మూలనం చేసి, గాలి వీచని ప్రదేశంలో స్థిరంగా నిలిచిన దీప శిఖలాగా, ధ్యానించాలి అని ‘అభిధ్యాయీత’ అన్న శబ్దానికి అర్థం. సత్యము, బ్రహ్మచర్యము, అహింస, అపరిగ్రహము, త్యాగము, సంన్యాసము, శౌచము, సంతోషము, కపటం లేకుండుట వంటి అనేక యమ నియమాలను జీవించియున్నంతవరకు స్వీకరించిన

సః అతడు, ఉపాసన మరియు కర్మలచేత జయించబడే లోకాలు అనేకం ఉన్నాయి కనుక, వాటిలో **కతమమ్ వావ లోకమ్** ఏ లోకాలను ఓంకారాన్ని తీవ్రంగా ఉపాసించినవాడు **జయతి ఇతి** జయిస్తాడు?" అని ప్రశ్నించాడు.

తస్మై స హోవాచ| ఏతద్వై సత్యకామ పరం చాపరం చ బ్రహ్మ యదోంకారః|
తస్మాద్విద్వానేతేనైవాయతనేనైకతరమన్వేతి|| || 5-2 ||

అతనితో (అలా ప్రశ్నించిన సత్యకామునితో) అతడు (ఆచార్యుడైన పిప్పలాదుడు) ఇలా అన్నాడు. ఓ సత్యకామా! అవి పరబ్రహ్మము మరియు అపరబ్రహ్మము అనే లోకాలు. అందువలన విద్వాంసుడు వీటిలో ఏదో ఒక దానిని పొందుతాడు.

శంకరుల భాష్యం

పృష్టవతే తస్మై స హ ఉవాచ పిప్పలాదః — ఏతద్వై సత్యకామ| ఏతత్ బ్రహ్మ వై పరం చ అపరం చ బ్రహ్మ పరం సత్యమక్షరం పురుషాఖ్యం అపరం చ ప్రాణాఖ్యం ప్రథమజం యత్ తదోంకార ఏవ ఓంకారాత్మకం ఓంకారప్రతీకత్వాత్| పరం హి బ్రహ్మ శబ్దాద్యుపలక్షణానర్హం సర్వధర్మవిశేషవర్జితం , అతో న శక్యమతీంద్రియగోచరత్వాత్కేవలేన మనసావగాహితుం| ఓంకారే తు విష్ణ్వాదిప్రతిమాస్థానీయే భక్త్యావేశితబ్రహ్మభావే ధ్యాయినాం తత్ప్రసీదతీత్యవగమ్యతే శాస్త్రప్రామాణ్యాత్| తథా పరం చ బ్రహ్మ| తస్మాత్పరం చాపరం చ బ్రహ్మ యదోంకార ఇత్యుపచర్యతే| తస్మాదేవం విద్వాన్ ఏతేనైవ ఆత్మప్రాప్తిసాధనేనైవ ఓంకారాభిధ్యానేన ఏకతరం పరమపరం వా అన్వేతి బ్రహ్మానుగచ్ఛతి ; నేదిష్ఠం హ్యాలంబనమోంకారో బ్రహ్మణః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

తస్మై అతనిచే (సత్యకామునిచే) అలా ప్రశ్నించబడగా, అతనితో **సః** (ఆచార్యుడైన) పిప్పలాదుడు **ఉవాచ హ** ఇలా అన్నాడు. **సత్యకామ** ఓ సత్యకామా! **ఏతత్ బ్రహ్మ పరమ్ చ అపరమ్ చ** అవి పరబ్రహ్మ మరియు అపరబ్రహ్మ. పరబ్రహ్మ అనగా సత్యము, అవినాశత్వము, పురుషుడు అని పిలువబడేది. అపరబ్రహ్మ అనగా ప్రాణం అని పిలువబడేది, మొదటగా పుట్టినది. **యత్ ఓంకారః వై** అవి ఓంకారమే. ఓంకారము వాటికి ప్రతీక లేదా చిహ్నము కాబట్టి, (పరబ్రహ్మ మరియు అపరబ్రహ్మ అన్నవి) ఓంకారంతో సమానత్వం కలవి. పరబ్రహ్మమైతే ఏవిధమైన ధర్మవిశేషాలు లేనందుచేత శబ్దాదులతో సూచించబడేది కాదు. అందుచేత, ఇంద్రియాలకు గోచరమవడం సాధ్యం కాదు కాబట్టి, కేవలం మనసు చేత కూడా గ్రహింపబడదు. ప్రతిమలో విష్ణువు మొదలైనవాటిని భావించినట్లుగా, భక్తితో బ్రహ్మభావాన్ని ఓంకారం నందు ప్రతిష్ఠించుకొనే ఉపాసకునకు బ్రహ్మమే తనంత తాను అనుగ్రహిస్తాడు లేదా తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. ఇది వేదప్రమాణం చేత చెప్పబడిన విషయం. అదే

విధంగా అపరబ్రహ్మ విషయంలో కూడా (సంభవిస్తుంది). అందువలన, పరబ్రహ్మ మరియు అపరబ్రహ్మ అన్నవి రెండూ ఓంకారమే అని గౌణంగా చెప్పారు. **తస్మాత్** అందుచేత **విద్వాన్** ఆ విధంగా తెలుసుకొన్నవాడు **ఏతేన ఏవ** వీటిలో **ఏకతరమ్** ఆత్మప్రాప్తికి సాధనమైన ఓంకారాన్ని తీవ్రంగా ధ్యానించడం ద్వారా పరము లేదా అపరములలో ఒక దానిని, **అన్వేతి** బ్రహ్మముగా పొందుతాడు. ఓంకారానికి ఆలంబనం బ్రహ్మమే కాబట్టి, అది బ్రహ్మకు అత్యంత సామీప్యంగా ఉన్నట్టిది.

స యద్యేకమాత్రమభిధ్యాయీత స తేనైవ సంవేదితస్తూర్ణమేవ జగత్యామభిసంపద్యతే| తమృచో మనుష్యలోకముపనయంతే స తత్ర తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా సంపన్నో మహిమానమనుభవతి|| || 5-3 ||

ఎవరైతే ఓంకారమనే ఒక్క వర్ణాన్ని ధ్యానిస్తారో, అంత మాత్రం చేతనే అతడు జ్ఞానవంతుడై వెంటనే భువియందు జన్మిస్తాడు. ఋక్ మంత్రాలు అతనిని మానవలోకానికి తీసుకు వెడతాయి. అక్కడ అతడు తపస్సు, బ్రహ్మచర్యం, శ్రద్ధ అనేవి సమృద్ధిగా కలిగినవాడై గొప్పదనాన్ని అనుభవిస్తాడు.

శంకరుల భాష్యం

స యద్యప్యోంకారస్య సకలమాత్రావిభాగజ్ఞో న భవతి, తథాప్యోంకారాభిధ్యానప్రభావాద్విశిష్టామేవ గతిం గచ్ఛతి ; ఏతదేకదేశజ్ఞానవైగుణ్యతయోంకారశరణః కర్మజ్ఞానోభయభ్రష్టో న దుర్గతిం గచ్ఛతి ; కిం తర్హి, యది ఏవమోంకారమేవ ఏకమాత్రావిభాగజ్ఞ ఏవ కేవలః అభిధ్యాయీత ఏకమాత్రం సదా ధ్యాయీత, స తేనైవ ఏకమాత్రావిశిష్టోంకారాభిధ్యానేనైవ సంవేదితః సంబోధితః తూర్ణం క్షిప్రమేవ జగత్యాం పృథివ్యాం అభిసంపద్యతే| కిం ? మనుష్యలోకం| అనేకాని హి జన్మాని జగత్యాం సంభవంతి| తత్ర తం సాధకం జగత్యాం మనుష్యలోకమేవ ఉపనయంతే ఉపనిగమయంతి ఋచః| ఋగ్వేదరూపా హ్యోంకారస్య ప్రథమా ఏకమాత్రా| తేన స తత్ర మనుష్యజన్మని ద్విజాగ్ర్యః సన్ తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా చ సంపన్నః మహిమానం విభూతిం అనుభవతి న వీతశ్రద్ధో యథేష్టచేష్టో భవతి ; యోగభ్రష్టః కదాచిదపి న దుర్గతిం గచ్ఛతి||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

యది సః అతడు ఓంకారంలో ఉన్న అన్ని వర్ణ విశేషాలను తెలియని వాడైనప్పటికీ కూడా, ఓంకారాన్ని ధ్యానం చేసిన ప్రభావం చేత విశిష్టమైన గతిని పొందుతాడు. ఇట్టి పాక్షికమైన విజ్ఞానంతో (ఓంకారం గురించిన పూర్తి జ్ఞానం లేకుండా) ఓంకారాన్ని ఆశ్రయించినవాడు, కర్మ-జ్ఞానమార్గాలనుండి ఉభయభ్రష్టత్వం పొందడం అనే దుర్గతిని చేరడు. మరి ఏమౌతాడు? **ఏకమాత్రమ్** ఓంకారంలో మొదటి అక్షరాన్నే ప్రధానంగా చేసుకొని **అభిధ్యాయీత** సదా ధ్యానించిన **సః** వానికి, **తేన ఏవ** ఏకవర్ణంగా, ఎటువంటి విశేషాలు లేని, ఆ ఓంకార ధ్యానం మాత్రాననే **సంవేదితః** విజ్ఞానం కలిగిన వాడై

తూర్ణమ్ వెంటనే **జగత్యామ్** భూమిమీద **అభిసంపద్యతే** సంపాదిస్తాడు. దేనిని సంపాదిస్తాడు? మానవలోకాన్ని. భూమిమీద అనేక రకాలైన జన్మలు సంభవిస్తాయి కాబట్టి (ఓంకారాన్ని పూర్తిగా తెలియకుండా అందులో కేవలం ఒక్క అక్షరాన్నే ధ్యానం చేసిన వాడు భూమి మీద కలిగే అనేక జన్మలలో మానవ జన్మను పొందుతాడు). అప్పుడు **ఋచః** ఋక్ మంత్రాలు **తమ్** ఆ సాధకుడిని భూమియందలి **మనుష్యలోకమ్** మానవలోకానికి మాత్రమే **ఉపనయన్తే** తీసుకుపోతాయి. (ఎందుకు ఋక్ మంత్రాలు అతడిని మానవలోకానికి తీసుకుపోతాయంటే) ఓంకారం యొక్క మొదటి వర్ణమైన అ-కారమనే ఏకమాత్ర ఋగ్వేద రూపమైనది కాబట్టి. అందుచేత **స తత్ర** అతడు అక్కడ మానవలోకంలో బ్రాహ్మణ శ్రేష్ఠుడై **తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా చ** యమ నియమాలు, బ్రహ్మచర్యం, శ్రద్ధలనే సాధనలు **సంపన్న** సమృద్ధిగా కలిగినవాడై **మహిమానమ్** విభూతులను లేదా భోగాలను **అనుభవతి** అనుభవిస్తాడు. అంటే శ్రద్ధ కోల్పోయినవాడు, ఇష్టవచ్చిన రీతిగా ప్రవర్తించే వాడు కాడు. ఎన్నడైననూ యోగభ్రష్టుడై దుర్గతిని పొందడు.

అథ యది ద్విమాత్రేణ మనసి సంపద్యతే సోఽన్తరిక్షం యజుర్భిరున్నీయతే సోమలోకమ్| స సోమలోకే విభూతిమనుభూయ పునరావర్తతే|| || 5-4 ||

తర్వాత, (ఓంకారంలోని) రెండవ వర్ణాన్ని మాత్రమే మనసునందు ధ్యానించినట్లైతే, అతడు యజుర్మంత్రాలచేత పైన ఉన్న అంతరిక్షంలోని చంద్రలోకానికి తీసుకుపోబడతాడు. అతడు చంద్రలోకంలో భోగాలను అనుభవించి తిరిగి వస్తాడు.

శంకరుల భాష్యం

అథ పునః యది ద్విమాత్రావిభాగజ్ఞో ద్విమాత్రేణ విశిష్టమోంకారమభిధ్యాయీత స్వప్నాత్మకే మనసి మననీయే యజుర్మయే సౌమదైవత్యే సంపద్యతే ఏకాగ్రతయాత్మభావం గచ్ఛతి, స ఏవం సంపన్నో మృతః అంతరిక్షం అంతరిక్షాధారం ద్వితీయమాత్రారూపం ద్వితీయమాత్రారూపైరేవ యజుర్భిః ఉన్నీయతే సోమలోకం సౌమ్యం జన్మప్రాపయంతి తం యజూంషిత్యర్థః| స తత్ర విభూతిమనుభూయ సోమలోకే మనుష్యలోకం ప్రతి పునరావర్తతే||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అథ మరింకా, (ఓంకారంలోని) రెండవ వర్ణాన్ని గురించి తెలుసుకొన్నవాడు **యది ద్విమాత్రేణ** ప్రత్యేకించి రెండవ వర్ణ ప్రధానంగా (ఉ-కారంతో) ఓంకారాన్ని ఏకాగ్రతతో ధ్యానించినట్లైతే, ఆ ఏకాగ్రతచేత స్వప్నస్థితిగా భావించే **మనసి** చంద్రుడు అదిష్ఠాన దేవత అయిన మనసునందు, యజుర్మంత్రాత్మకమైన చంద్రుడే దేవత అయిన ఆత్మతో ఏకత్వం కలిగిన దానిని **సంపద్యతే** పొందుతాడు. **సః** ఆ విధంగా పొందిన అతడు మరణించి మీదట **యజుర్భిః** ఓంకారంలోని రెండవ వర్ణమైన ఉ-కారమే

రూపంగా కలిగిన యజుర్మంత్రాలు **అన్తరిక్షమ్** (భువిని-దివినీ రెండింటికీ) ఆధారమైన అంతరిక్షంలోని **సోమలోకమ్** చంద్రలోకంలో జన్మించేలా చేస్తాయి. అంటే వానిని (ఓంకారంలోని రెండవ వర్ణమైన ఉ-కారాన్ని ప్రధానం చేసుకొని ధ్యానం చేసిన సాధకుడిని అతడు మరణించిన తర్వాత) యజుర్మంత్రాలు **ఉన్నీయతే** పైకి (చంద్రలోకానికి) తీసుకుపోతాయి అని అభిప్రాయం. **సః** అతడు అక్కడ **సోమలోకే** చంద్రలోకంలో **విభూతిమ్ అనుభూయ** భోగాలను అనుభవించిన మీదట **ఆవర్తతే పునః** మానవలోకానికి తిరిగి వస్తాడు.

యః పునరేతం త్రిమాత్రేణోమిత్యేతేనైవాక్షరేణ పరం పురుషమభిధ్యాయీత స తేజసి సూర్యే సంపన్నః| యథా పాదోదరస్త్వచా వినిర్ముచ్యత ఏవం హ వై స పాప్మనా వినిర్ముక్తః స సామభిరున్నీయతే బ్రహ్మలోకం స ఏతస్మాజ్జీవఘనాత్పరాత్పరం పురిశయం పురుషమీక్షతే| తదేతౌ శ్లోకౌ భవతః|||| 5-5 ||

మరి, ఎవడైతే మూడు వర్ణాలతో కూడిన ఓంకారం సహాయంతో పరమ పురుషుడిని ధ్యానం చేస్తాడో వాడు సూర్యునియందు తేజస్సంపదతో కూడినవాడౌతాడు. పాము కుబుసాన్ని విడిచిపెట్టిన విధంగా అతడు పాపం నుండి వినిర్ముక్తుడౌతాడు. అతడిని సామమంత్రాలు పైకి బ్రహ్మలోకానికి చేరుస్తాయి. అతడు ఈ ప్రాణుల సమిష్ఠి స్వరూపంకన్నా మిన్నయైన (హిరణ్యగర్భుని కన్నా మించిన) ఉన్నతుడైన, సకల ప్రాణుల దేహాలలో ప్రవేశించియున్న పరమపురుషుడిని దర్శిస్తాడు. దీని గురించిన రెండు మంత్రాలను ఇక చెప్తున్నారు.

శంకరుల భాష్యం

యః పునః ఏతం ఓంకారం త్రిమాత్రేణ త్రిమాత్రావిషయవిజ్ఞానవిశిష్టేన ఓమిత్యేతేనైవ అక్షరేణ పరం సూర్యాంతర్గతం పురుషం ప్రతీకత్వేన అభిధ్యాయీత తేనాభిధ్యానేన ప్రతీకత్వేన హ్యాలంబనత్వం ప్రకృతమోంకారస్య పరం చాపరం చ బ్రహ్మేతి అభేదశ్రుతేః, ఓంకారమితి చ ద్వితీయానేకశః శ్రుతా బాధ్యేతాన్యథా| యద్యపి తృతీయాభిధానత్వేన కరణత్వముపపద్యతే, తథాపి ప్రకృతానురోధాత్త్రిమాత్రం పరం పురుషమితి ద్వితీయైవ పరిణేయా 'త్యజేదేకం కులస్యార్థే' ఇతి న్యాయేన| సః తృతీయమాత్రారూపే తేజసి సూర్యే సంపన్నో భవతి ధ్యాయమానః, మృతోఽపి సూర్యాత్సోమలోకాదివన్న పునరావర్తతే ; కింతు సూర్యే సంపన్నమాత్ర ఏవ| యథా పాదోదరః సర్పః త్వచా వినిర్ముచ్యతే జీర్ణత్వగ్వినిర్ముక్తః స పునర్నవో భవతి| ఏవం హ వై ఏష యథా దృష్టాంతః స పాప్మనా సర్పత్వక్స్థానీయేనాశుద్ధిరూపేణ వినిర్ముక్తః సః సామభిః తృతీయమాత్రారూపైః ఊర్ధ్వమున్నీయతే బ్రహ్మలోకం హిరణ్యగర్భస్య బ్రహ్మణో లోకం సత్యాఖ్యం| సః హిరణ్యగర్భః సర్వేషాం సంసారిణాం

జీవానామాత్మభూతః| స హ్యంతరాత్మా లింగరూపేణ సర్వభూతానాం| తస్మిన్ హి లింగాత్మని సంహతాః సర్వే జీవాః| తస్మాత్స జీవఘనః స విద్వాంస్త్రిమాత్రోంకారాభిజ్ఞః ఏతస్మాజ్జీవఘనాత్ హిరణ్యగర్భాత్పరాత్పరం పరమాత్మాఖ్యం పురుషమీక్షతే పురిశయం సర్వశరీరానుప్రవిష్టం పశ్యతి ధ్యాయమానః| తత్ ఏతౌ అస్మిన్నర్థోక్తార్థప్రకాశకౌ శ్లోకౌ మంత్రౌ భవతః||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

యః పునః ఏతమ్ మరియు ఎవడైతే ఈ ఓంకారాన్ని **త్రిమాత్రేణ** ప్రత్యేకమైన మూడు మాత్రల విషయంగా తెలుసుకొని **ఓమ్ ఇతి ఏతేన ఏవ అక్షరేణ** ఓంకారం అనే ఈ అక్షరం సహాయంతో **పరమ్ పురుషమ్** దానిని సూర్యునిలోనున్న పరమ పురుషునికి ప్రతీకగా **అభిధ్యాయీత** ధ్యానం చేస్తాడో, ఆ ప్రతీకను ఆధారంగా చేసుకొని ధ్యానం చేయగా అతనికి లభించే ఫలం ఓంకారమేననీ అదియే పర బ్రహ్మము మరియు అపర బ్రహ్మమూ అని [పరం చాపరం చ బ్రహ్మ (5-2)] అంటూ పర బ్రహ్మకు మరియు అపర బ్రహ్మకు అభేదత్వాన్ని ఉపనిషత్తు ఈ 5వ ప్రశ్నలోని 2వ మంత్రంలో తెలియచేప్పింది. ఇలా అనేక చోట్ల చెప్పే 'ఓంకారమ్' అన్న ద్వితీయా విభక్తి రూపాన్ని గురించి వేరొక విధంగా వ్యాఖ్యానించడం సమంజసం కాదు. 'త్రిమాత్రేణ' అన్న తృతీయవిభక్తి రూపాన్ని చెప్పడం ద్వారా, సాధనంగా చూపడం సక్రమమే అయినా కూడా, సందర్భాన్ని బట్టి 'త్రిమాత్రేణ' అన్న దాన్ని ద్వితీయా విభక్తి రూపంగా అంటే 'త్రిమాత్రమ్ పరమ్ పురుషమ్'గా స్వీకరించాలి. అపుడు మూడు మాత్రల గురించిన విజ్ఞానంతో కూడిన ఓంకారాన్ని పరమ పురుషునికి ప్రతీకగా భావించి 'కుల శ్రేయస్సు కోసం వ్యక్తిని త్యజించాలి' [త్యజేత్ ఏకం కులస్యార్థే (మ.నా. 37-17)] అనే న్యాయం ప్రకారం ధ్యానం చేయాలి. {అంటే, ఓంకారాన్ని పర-అపర బ్రహ్మన్ని పొందేందుకు సాధనంగా కాకుండా, అది పర-అపర బ్రహ్మమునకు ప్రతీకగా ధ్యానం చేయాలి}. అలా ధ్యానం చేయగా **సః** అతడు మూడవ మాత్రారూపమైన అంటే మ్-కారంతో ఏకత్వాన్ని పొంది **తేజసి సూర్యే** సూర్యుని తేజస్సు **సంపన్నః** కలిగినవాడౌతాడు లేదా సూర్య తేజస్సే అవుతాడు. మృతి చెందినా కూడా, గత సందర్భంలో చంద్రలోకం నుండి తిరిగి వచ్చినట్లుగా, సూర్యలోకంనుండి తిరిగి రాడు. ఎందుకంటే, సూర్యుడే తానవుతాడు కాబట్టి. **యథా** ఎలాగైతే **పాదోదరః** ఉదరమే పాదాలుగా గలది, అంటే సర్పం **వినిర్ముచ్యతే త్వచా** జీర్ణమైన చర్మాన్ని అంటే కుబుసాన్ని విడిచిపెట్టి కొత్త చర్మాన్ని పొందుతుందో, **ఏవమ్ హ వై** ఆ విధంగానే అంటే ఉదాహరణలో చెప్పిన విధంగానే, **సః** అతడు **పాప్మనా** పాము కుబుసం వంటి అశుద్ధమైన పాపాన్నుండి **వినిర్ముక్తః** విడివడతాడు. **సః** అతడు **సామభిః** తృతీయమాత్రారూపమైన (అంటే ఓంకారంలోని మూడవ మాత్ర అయిన మ్-కారంతో ఏకత్వం కలిగిన) సామమంత్రాలచే **బ్రహ్మలోకమ్** బ్రహ్మలోకానికి, అంటే హిరణ్యగర్భుని యొక్క లోకానికి లేదా సత్యలోకం అనబడే బ్రహ్మ యొక్క లోకానికి **ఉన్నీయతే** పైకి తీసుకుపోబడతాడు లేదా ఉద్ధరింపబడతాడు. ఆ హిరణ్యగర్భుడు అన్నివేళలా సంసారులైన జీవులలో ఆత్మ రూపంగా ఉన్నట్టివాడు. అతడే సకలప్రాణులలో సూక్ష్మరూపంగా ఉన్న అంతరాత్మ. ఆ సూక్ష్మరూపంతోనే సకల ప్రాణులు ముడిపడి ఉన్నాయి. అందుచే అతడు 'జీవఘనమ్' ప్రాణుల సమిష్టి

రూపం. **సః** ఓంకారాన్ని మూడు మాత్రలుగా తెలుసుకొన్నవాడు **ఏతస్మాత్ జీవఘనాత్** ఈ ప్రాణుల సమిష్టి రూపం అనే హిరణ్యగర్భుని కన్నా **పరాత్ పరమ్** పరమాత్మ అనబడే పురిశయమ్ సకలదేహాలలో ప్రవేశించియున్న **పురుషమ్** పురుషుడిని **ఈక్షతే** ధ్యానంచేసి దర్శిస్తాడు. **ఏతౌ** ఇదే భావాన్ని ప్రకటించే **శ్లోకౌ** రెండు మంత్రాలు **భవతః** ఉన్నవి.

తిస్రో మాత్రా మృత్యుమత్యః ప్రయుక్తా అన్యోన్యసక్తా అనవిప్రయుక్తాః|

క్రియాసు బాహ్యాభ్యన్తరమధ్యమాసు సమ్యక్ప్రయుక్తాసు న కంపతే జ్ఞః|||| 5-6 ||

మూడు మాత్రలు వేటికవి మృత్యువుకు లోబడినవే అయినా వాటిలో అవి ఒకదాని కొకటి కలిసిపోయి, వేర్వేరు విషయాలతో సంబంధాలు లేకుండా, బాహ్యం-అంతరం-మధ్యమం అనే క్రియలకు చక్కగా అన్వయం చేసుకొన్న జ్ఞాని చలించడు.

<u>శంకరుల భాష్యం</u>

తిస్రః త్రిసంఖ్యాకా అకారోకారమకారాఖ్యాః ఓంకారస్య మాత్రాః| మృత్యుమత్యః మృత్యుర్యాసాం విద్యతే తా మృత్యుమత్యః మృత్యుగోచరాదనతిక్రాంతాః మృత్యుగోచరా ఏవేత్యర్థః| తా ఆత్మనో ధ్యానక్రియాసు ప్రయుక్తాః| కించ, అన్యోన్యసక్తాః ఇతరేతరసంబద్ధాః| అనవిప్రయుక్తాః విశేషేణైకైకవిషయ ఏవ ప్రయుక్తా విప్రయుక్తాః, న తథా విప్రయుక్తా అవిప్రయుక్తాః, న అవిప్రయుక్తా అనవిప్రయుక్తాః| కిం తర్హి, విశేషేణైకస్మింధ్యానకాలే తిసృషు క్రియాసు బాహ్యాభ్యంతరమధ్యమాసు జాగ్రత్స్వప్నసుషుప్తస్థానపురుషాభిధ్యానలక్షణాసు యోగక్రియాసు యుక్తాసు సమ్యక్ప్రయుక్తాసు సమ్యగ్ధ్యానకాలే ప్రయోజితాసు న కంపతే న చలతి జ్ఞః యోగీ యథోక్తవిభాగజ్ఞః ఓంకారస్యేత్యర్థః| న తస్యైవంవిదశ్చలనముపపద్యతే| యస్మాజ్జాగ్రత్స్వప్నసుషుప్తపురుషాః సహ స్థానైర్మాత్రాత్రయరూపేణ ఓంకారాత్మరూపేణ దృష్టాః ; స హ్యేవం విద్వాన్సర్వాత్మభూత ఓంకారమయః కుతో వా చలేత్కస్మిన్వా||

తిస్రః అ-కార, ఉ-కార, మ-కారాలు అనేవి ఓంకారానికి చెందిన మూడు **మాత్రాః** మాత్రలు లేదా వర్ణాలు. **మృత్యుమత్యః** ఏవైతే మృత్యువుచే ఆవరించబడి ఉంటాయో అవి 'మృత్యుమత్యః', మృత్యువు యొక్క దృష్టి పథానికి బాహ్యామైనవి కావు అంటే మృత్యువు చేత ఆక్రమించబడే లేదా మృత్యువుకు లోబడే ఉంటాయి. ['విశ్వ' అనే జాగ్రదవస్థలోని ఆత్మ చైతన్యమే వైశ్వానరునితో ఏకత్వాన్ని కలిగి జాగ్రదవస్థలో స్థూల శరీరంలో ఉంటుంది. 'తైజస' అనేది హిరణ్యగర్భునితో ఏకత్వాన్ని కలిగి స్వప్నావస్థలో సూక్ష్మ శరీరంలో ఉంటుంది. 'ప్రజ్ఞ' అనేది ఈశ్వరునితో సామ్యాన్ని కలిగి సుషిప్తి అవస్థలో అవ్యక్తంగా ఉంటుంది. యోగ మార్గంలో వీటిని అ-కార, ఉ-కార, మ-కారాలను ప్రతీకలుగా చేసుకొని ధ్యానం చేసే ప్రక్రియలున్నాయి. వీటిని ఇలా విడివిడిగా, బ్రహ్మమనే భావన లేకుండా, సాధన చేసేటట్లైతే అవి ఆ సాధకుడిని మృత్యువు నుండి దాటించలేవు – స్వామి గంభీరానంద]. కాని, వాటిని **క్రియాసు** క్రియలయందు అంటే ఆత్మను గురించిన ధ్యానంలో **ప్రయుక్తాః** సంధానం చేసుకోవాలి. మరింకా,

అన్యోన్యసక్తాః ఒకదానితో మరొకదానిని అనుసంధానం చేసుకొంటూ, **అనవిప్రయుక్తాః** – ఒక్కొక్క దానికి ఒక్కొక్క ప్రత్యేక విషయాన్ని అనుసంధానించడాన్ని విప్రయుక్తాః అంటారు. అలా ఒక్కొక్క దానికి ఒక్కొక్క విషయాన్ని అనుసంధానించకుండా ఉండటమే 'అవిప్రయుక్తాః'. 'అవిప్రయుక్తాః' అంటే 'అనవిప్రయుక్తాః' అనే గ్రహించాలి. {ఒక్కొక్క వర్ణానికి ఒక్కొక్క విషయాన్ని విడివిడిగా జతపరిచి ధ్యానం చేయకూడదు. మూడు వర్ణాలను కలిపి, ఓంకారాన్ని బ్రహ్మానికి దాన్ని ప్రతీకగా భావనచేసి ధ్యానం చేయాలి}. అందువల్ల ఏమౌతుంది? ప్రత్యేకించిన ఒకేఒక్కదానిని ధ్యానించే కాలంలో క్రియాసు మూడు క్రియలతో **బాహ్యాభ్యన్తరమధ్యమాసు** జాగ్రత్తు-స్వప్న-సుషుప్తులనే అవస్థలలో ఉన్న పురుషుల గురించిన ధ్యాన లక్షణం కల యోగప్రక్రియలతో కలిపి **సమ్యక్ ప్రయుక్తాసు** చక్కగా అనుసంధానించుకొవడంతో **జ్ఞః** యోగి, ఓంకారం యొక్క విభాగాలను తెలిసిన యోగి **న కమ్పతే** చలించడు అని అభిప్రాయం. అంటే ఆ విధంగా తెలిసిన వాడు ఆ స్థితినుండి చలనాన్ని పొందడు. జ్ఞాగ్రత్తు-స్వప్న-సుషుప్తులలోని పురుషులు వారి వారి స్థితులతో సహా ఈ మూడు మాత్రల రూపమేనని గ్రహించి, వాటికి ఓంకారంతో సామ్యత్వాన్ని దర్శించినందువల్ల అతడు చలించడు. ఆ విధంగా తానే సర్వానికి ఆత్మభూతుడనని, ఓంకారమయుడనని తెలిసిన విద్వాంసుడు ఎక్కడికి వెడతాడు లేదా ఎందులో చరిస్తాడు?

ఋగ్భిరేతం యజుర్భిరన్తరిక్షం
సామభిర్యత్తత్కవయో వేదయన్తే|
తమోంకారేణైవాఽఽయతనేనాన్వేతి విద్వాస్
యత్తచ్ఛాన్తమజరమమృతమభయం పరం చేతి|| || 5-7 ||

వివేకం కలవారు ఈ లోకం ఋక్, యజు, సామమంత్రాలచేత పొందబడుతుందని తెలుసుకొంటారు. ఏది శాంతమో, క్షీణత- మృతత్వం-భయం కూడా లేని పరమమైనదో దానిని జ్ఞాని ఓంకారం ద్వారా మాత్రమే, ఆ ఓంకారాన్నే సాధనంగా చేసుకొని పొందుతాడు.

శంకరుల భాష్యం

సర్వార్థసంగ్రహార్థో ద్వితీయో మంత్రః — ఋగ్భిః ఏతం లోకం మనుష్యోపలక్షితం| యజుర్భిః అంతరిక్షం సోమాధిష్ఠితం| సామభిః యత్ తద్బ్రహ్మలోక ఇతి తృతీయం కవయః మేధావినో విద్యావంత ఏవ నావిద్వాంసః వేదయంతే| తం త్రివిధం లోకమోంకారేణ సాధనేనాపరబ్రహ్మలక్షణం అన్వేతి అనుగచ్ఛతి విద్వాన్| తేనైవోంకారేణ యత్తత్పరం బ్రహ్మాక్షరం సత్యం పురుషాఖ్యం శాంతం విముక్తజాగ్రత్స్వప్నసుషుప్తాదివిశేషం సర్వప్రపంచవివర్జితం , అత ఏవ అజరం జరావర్జితం అమృతం మృత్యువర్జితమత ఏవ| యస్మాజ్జరాదివిక్రియారహితమతః అభయం|

యస్మాదేవాభయం తస్మాత్ పరం నిరతిశయం| తదప్యోంకారేణైవాయతనేన గమనసాధనేనాన్వేతీత్యర్థః| ఇతిశబ్దో వాక్యపరిసమాప్త్యర్థః||

|| ఇతి పంచమప్రశ్నభాష్యం||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఈ చెప్పిన విషయాలన్నింటినీ సంగ్రహంగా ఈ రెండవ మంత్రంలో చెప్తున్నారు. **ఋగ్భిః** ఋక్ మంత్రాల ద్వారా **ఏతమ్** మానవులతో కూడిన ఈ భూలోకాన్ని, **యజుర్భిః** యజుర్ మంత్రాల ద్వారా **అన్తరిక్షమ్** చంద్రుడు అధిష్టాన దేవత అయిన అంతరిక్షాన్ని, **సామభిః** సామ మంత్రాలచే **తత్** బ్రహ్మలోకమనే మూడవదాన్ని **కవయః** వివేకం కలిగినవారు, మేధావులు, విద్యావంతులు మాత్రమే, అవిద్యావంతులు కాదు. వేదయన్తే తెలుసుకొంటారు. **తమ్** దానిని, అపర బ్రహ్మను సూచించే ఆ మూడు విధాలైన లోకాలను ఓంకారాన్నే ఆధారంగా చేసుకొని **విద్వాన్** విద్వాంసుడు **అన్వేతి** పొందుతాడు. ఆ ఓంకారం ఆధారంగానే క్షయమనేది లేని, సత్యమైన, పురుషుడు అనబడే, **శాంతమ్** జాగ్రత్తు-స్వప్న-సుషుప్తులనే విశేషాలే లేనందున శాంతమే స్వభావంగాగలది, **అజరమ్** సకల జగత్తును వదిలివేసినందు చేత కృశించనిది లేదా క్షీణతలేనిది, **అమృతమ్** మృతత్వమనేది లేనందున అమృతమైనట్టిది, **అభయమ్** జర అనేది లేనందు చేత భయమనేది లేనట్టిది, **పరమ్** అభయమైనందు వల్ల అన్నింటికీ అదియే మూలమైనట్టిది, దానిని మించినది మరొకటి లేనట్టిది అయినప్పటికీ ఆ పరబ్రహ్మ పొందబడుతుంది అని అభిప్రాయం. 'ఇతి' అన్న శబ్దం వాక్యం ముగింపును తెలియచేస్తోంది.

|| పంచమ ప్రశ్నకు భాష్యానువాదం సంపూర్ణం||

షష్ఠః ప్రశ్నః

అథ హైనం సుకేశా భారద్వాజః పప్రచ్ఛ| భగవన్హిరణ్యనాభః కౌసల్యో రాజపుత్రో మాముపేత్యైతం ప్రశ్నమపృచ్ఛత షోడశకలం భారద్వాజ పురుషం వేత్థ| తమహం కుమారమబ్రవం నాహమిమం వేద యద్యహమిమమవేదిషం కథం తే నావక్ష్యమితి, సమూలో వా ఏష పరిశుష్యతి యోऽనృతమభివదతి తస్మాన్నార్హామ్యనృతం వక్తుమ్|స తూష్ణీం రథమారుహ్య ప్రవవ్రాజ| తం త్వా పృచ్ఛామి క్వాసౌ పురుష ఇతి|| || 6-1 ||

తరువాత భారద్వాజుని కుమారుడైన సుకేశుడు ఇలా ప్రశ్నించాడు. "ఓ పూజనీయుడా! కౌసల్య దేశపు రాజపుత్రుడైన హిరణ్యనాభుడు నావద్దకు చేరి ఇలా ప్రశ్నించాడు. 'భరద్వాజా, పదహారు కళలున్న పురుషుడిని నీవు ఎరుగుదువా?' అని. ఆ రాజకుమారునితో 'అతనిని నేనెరుగను. తెలిసి ఉంటే నీకు చెప్పకుండా ఎలా ఉంటాను? ఎవడైతేఅసత్యాన్ని పలుకుతాడో వాడు సమూలంగా శుష్కించిపోతాడు. అందుచేత నేను అసత్యాన్ని చెప్పలేను' అని అన్నాను. అతడు మౌనంగా రథమెక్కి వెళ్ళిపోయాడు. ఆ పురుషుడు ఎవరు? ఎక్కడ ఉంటాడని? మిమ్ములను అడుగుతున్నాను" అని అన్నాడు.

శంకరుల భాష్యం

అథ హ ఏనం సుకేశా భారద్వాజః పప్రచ్ఛ సమస్తం జగత్కార్యకారణలక్షణం సహ విజ్ఞానాత్మనా పరస్మిన్నక్షరే సుషుప్తికాలే సంప్రతిష్ఠత ఇత్యుక్తం| తత్సామర్థ్యాత్ప్రలయేऽపి తస్మిన్నేవాక్షరే సంప్రతిష్ఠతే జగత్తత ఏవోత్పద్యత ఇతి చ సిద్ధం భవతి| న హ్యకారణే కార్యస్య సంప్రతిష్ఠానముపపద్యతే| ఉక్తం చ 'ఆత్మన ఏష ప్రాణో జాయతే' (ప్ర. ఉ. 3| 3) ఇతి| జగతశ్చ యన్మూలం తత్పరిజ్ఞానాత్పరం శ్రేయ ఇతి సర్వోపనిషదాం నిశ్చితోऽర్థః| అనంతరం చోక్తం 'స సర్వజ్ఞః సర్వో భవతి' (ప్ర. ఉ. 4| 10) ఇతి| వక్తవ్యం చ క్వ తర్హి తదక్షరం సత్యం పురుషాఖ్యం విజ్ఞేయమితి ; తదర్థోऽయం ప్రశ్న ఆరభ్యతే| వృత్తాన్వాఖ్యానం చ విజ్ఞానస్య దుర్లభత్వజ్ఞాపనేన తల్లబ్ధ్యర్థం ముముక్షూణాం యత్నవిశేషోపాదానార్థం| హే భగవన్ , హిరణ్యనాభః నామతః కోసలాయాం భవః కౌసల్యః రాజపుత్రః జాతితః క్షత్రియః మాం ఉపేత్య ఉపగమ్య ఏతం ఉచ్యమానం ప్రశ్నం అపృచ్ఛత| షోడశకలం షోడశసంఖ్యాకాః కలా అవయవా ఇవాత్మన్యవిద్యాధ్యారోపితరూపా యస్మిన్పురుషే, సోऽయం షోడశకలః ; తం షోడశకలం హే భారద్వాజ, పురుషం వేత్థ త్వం విజానాసి| తం అహం రాజపుత్రం కుమారం పృష్టవంతం అబ్రవం ఉక్తవానస్మి — నాహమిమం వేద యం త్వం పృచ్ఛసీతి| ఏవముక్తవత్యపి మయ్యజ్ఞానమసంభావయంతం తమజ్ఞానే కారణమవాదిషం — యది కథంచిత్ అహం ఇమం త్వయా పృష్టం పురుషం అవేదిషం విదితవానస్మి, కథం అత్యంతశిష్యగుణవతేऽర్థినే తే

తుభ్యం న అవక్ష్యం నోక్తవానస్మి న బ్రూయామిత్యర్థః| భూయోఽప్యప్రత్యయమేవాలక్ష్య ప్రత్యాయయితుమబ్రవం — సమూలః సహ మూలేన వై ఏషః అన్యథా సంతమాత్మానమన్యథా కుర్వన్ యః అనృతం అయథాభూతార్థం అభివదతి, స పరిశుష్యతి శోషముపైతి ఇహలోకపరలోకాభ్యాం విచ్ఛిద్యతే వినశ్యతి| యత ఏవం జానే తస్మాత్ న అర్హామి అహం అనృతం వక్తుం మూఢవత్| స రాజపుత్రః ఏవం ప్రత్యాయితః తూష్ణీం వ్రీడితః రథం ఆరుహ్య ప్రవవ్రాజ ప్రగతవాన్ యథాగతమేవ| అతో న్యాయత ఉపసన్నాయ యోగ్యాయ జానతా విద్యా వక్తవ్యైవ ; అనృతం చ న వక్తవ్యం సర్వాస్వప్యవస్థాస్విత్యేతత్సిద్ధం భవతి| తం పురుషం త్వా త్వాం పృచ్ఛామి మమ హృది విజ్ఞేయత్వేన శల్యమివ స్థితం , క్వ అసౌ వర్తతే విజ్ఞేయః పురుష ఇతి ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అథ హ ఆ తరువాత **సుకేశా భారద్వాజః** భారద్వాజుని కుమారుడైన సుకేశుడు **ఏనమ్** అతనిని (ఆచార్యుడైన పిప్పలాదుడిని) **పప్రచ్ఛ** అడిగాడు. కార్య-కరణ లక్షణమైన సమస్త జగత్తూ విజ్ఞానమయమైన ఆత్మతో సహా సుషుప్తికాలంలో దానికి పరమైన అక్షరంలో (అంటే అవినాశిత్వంలో) నిలిచి ఉంటాయి అని ఈ ఉపనిషత్తులోనే 4-2వ మంత్రంలో చెప్పారు. (సకల జగత్తునూ తనలోనే ఇముడ్చుకోగలిగిన) సామర్థ్యంతోనే ప్రళయకాలంలో కూడా జగత్తు ఈ అక్షరంలో విలీనమై, దాని నుండే తిరిగి ఉత్పన్నమౌతోందనేది స్పష్టమౌతోంది. (ఎందుకంటే,) కార్యమనే దానికి తనకు కారణంకాని దానిలో విలీనం కావడమనేది సంభవించదు కదా. 'ఈ ప్రాణం నుండియే ఆత్మ పుడుతుంది' ['ఆత్మన ఏష ప్రాణో జాయతే' (ప్ర.ఉ. 3-3)] అని కూడా ఈ ఉపనిషత్తులోనే చెప్పారు కూడా. జగత్తునకు ఏది మూలమో దానిని విశేషించి తెలుసుకోవడమే పరమమైన శ్రేయస్సు అని సర్వ ఉపనిషత్తులయొక్క నిశ్చితమైన అభిప్రాయం. అందుకే తరువాత 'అతడు సర్వాన్ని తెలిసి, సర్వమే అవుతాడు' ['స సర్వజ్ఞః సర్వో భవతి' (ప్ర.ఉ. 4-10)] అని చెప్పారు. ఇక, సత్యం, పురుషుడు అనబడే ఆ అక్షరాన్ని (అవినాశిత్వం) ఎక్కడ తెలుసుకోవాలి అనేది చెప్పవలసి ఉంది. అందుకొరకే, ఈ 6వ ప్రశ్న ప్రారంభించబడుతోంది. జ్ఞానాన్ని తెలుసుకోవడంలో ఉన్న సంక్లిష్టతను జ్ఞాపకం చేయడం ద్వారా దానిని పొందేందుకు సాధకులు చేయవలసిన విశేషమైన ప్రయత్నాలను వివరించేందుకు ఇక్కడొక వృత్తాంతాన్ని చెప్తున్నారు. "**భగవన్** ఓ పూజనీయుడా! **కౌసల్యః** కోసల దేశంలో పుట్టిన **రాజపుత్రః** క్షత్రియజాతికి చెందిన **హిరణ్యనాభః** హిరణ్యనాభుడనే పేరు గలవాడు **మామ్ ఉపేత్య** నా వద్దకు వచ్చి **ఏతమ్** ఈ చెప్పబోయే **ప్రశ్నమ్ అపృచ్ఛత** ప్రశ్నను అడిగాడు. '**భారద్వాజ** ఓ భరద్వాజా! **షోడశకలమ్** అవిద్యచే అధ్యారోపితం కాబడిన పదహారు విభాగాలు అంటే రూపాలు ఏ పురుషినియందు ఉన్నాయో అతడు 'షోడశకలః'. అట్టి **షోడశకలమ్** పదహారు అధ్యారోపిత విభాగాలు కలిగిన **పురుషమ్** పురుషుడిని **వేత్థ** నీవు ఎరుగుదువా?' అని అడిగాడు. **తమ్ కుమారమ్** అలా ప్రశ్నించిన ఆ రాజపుత్రునితో **అహమ్ అబ్రువమ్** నేను ఇలా అన్నాను. '**న అహమ్ ఇమమ్ వేద** నీవు ఏదైతే అడిగావో అది నాకు తెలియదు.' అలా చెప్పినప్పటికీ, నాకు తెలియకుండా ఉండే అవకాశం లేదని భావించిన అతనితో (ఒకవేళ నేను తెలిసికూడా తెలియదని చెప్పానేమో అని భావించిన అతనితో) నేను అలా చెప్పడానికి గల కారణాన్ని

ఇలా చెప్పాను. '**యది** ఒకవేళ **ఇమమ్** నీవు అడిగిన పురుషుని గురించి **అహమ్** నేను **అవేదిషమ్** తెలిసినవాడనే అయితే అత్యంత గుణవంతుడవు శిష్యుడవు అయిన **తే** నీకు **కథం** ఎందుకు **న అవక్ష్యమ్** చెప్పకుండా ఉంటాను' ఇతి అని అన్నాను. అంటే తెలిసినదాన్ని బోధించకుండా ఎందుకు ఉంటాను అని అభిప్రాయం. అయినా కూడా అతడు నమ్మకపోవడాన్ని గమనించి, నమ్మకం కలిగించడానికి తిరిగి అతనితో ఇలా అన్నాను. '**యః అనృతమ్ అభివదతి** ఎవడైతే యథార్థం కాని దాన్ని చెప్తాడో, యదార్థానికి తాను ఒకవిధంగా ఉండి తన గురించి వేరుగా చెప్పుకొనడం అనృతం. **ఏషః** అలాంటి వాడు **సమూలః** మూలంతో సహా **వై పరిశుష్యతి** నిశ్చయంగా శుష్కించిపోతాడు అంటే ఈలోకంలో పరలోకంలోనూ కూడా విచ్ఛిత్తిని వినాశాన్ని పొందుతాడు. **తస్మాత్** అందువలన, దీనిని తెలుసుకొన్నవాడనైనందున మూఢునిలాగా **అనృతమ్** అసత్యాన్ని **వక్తుమ్** చెప్పేందుకు **న అర్హామి** నాకు అర్హత లేదు.' ఆ విధంగా చెప్పబడిన **సః** ఆ రాజపుత్రుడు **తూష్ణీమ్** మౌనంగా నిరాశతో **రథమ్ ఆరుహ్య ప్రవ్రవాజ** రథాన్ని ఎక్కి ఎలా వచ్చాడో అలా వెళ్లాడు. ఈ వృత్తాంతం వల్ల, సమీపించిన యోగ్యుడైన శిష్యునికి తెలిసిన విద్యను భోధించాలే కాని, ఎట్టి సందర్భంలోనూ, ఏ విధంగానూ అసత్యాన్ని బోధించరాదు అని అంతిమంగా తేలింది. **తమ్ పురుషమ్** ఆ పురుషుడి గురించి **త్వాం** మిమ్ములను **పృచ్ఛామి** అడుగుతున్నాను. ఆ ప్రశ్నను తెలుసుకోవాలనే కోరిక నా హృదయంలో ముల్లులాగా ఉంది. **క్వ** ఎక్కడ **అసౌ పురుష ఇతి** ఆ పురుషుడు తెలియబడతాడు అన్నది ఆ ప్రశ్న.

తస్మై స హోవాచేహైవాంతఃశరీరే సోమ్య స పురుషో యస్మిన్నేతాః షోడశ కలాః ప్రభవన్తీతి|| || 6-2 ||

అతనితో (శిష్యుడైన సుకేశునితో) అతడు (ఆచార్యుడైన పిప్పలాదుడు) ఇలా బదులిచ్చాడు. "ఓ సౌమ్యుడా! ఇక్కడే ఈ శరీరం లోపలే ఆ పురుషునిలోని ఈ పదహారు అంశాలు ప్రభవిస్తున్నాయి"

శంకరుల భాష్యం

తస్మై స హోవాచ| ఇహైవ అంతఃశరీరే హృదయపుండరీకాకాశమధ్యే హే సోమ్య స పురుషః, న దేశాంతరే విజ్ఞేయః| యస్మిన్ ఏతాః ఉచ్యమానాః షోడశ కలాః ప్రాణాద్యాః ప్రభవంతి ఉత్పద్యంత ఇతి షోడశభిః కలాభిరుపాధిభూతాభిః సకల ఇవ నిష్కలః పురుషో లక్ష్యతేఽవిద్యయేతి ; తదుపాధికలాధ్యారోపాపనయనేన విద్యయా స పురుషః కేవలో దర్శయితవ్య ఇతి కలానాం తత్ప్రభవత్వముచ్యతే ప్రాణాదీనాం| అత్యంతనిర్విశేషే హ్యద్వయే విశుద్ధే తత్త్వే న శక్యోఽధ్యారోపమంతరేణ ప్రతిపాద్యప్రతిపాదనాదివ్యవహారః కర్తుమితి కలానాం ప్రభవస్థిత్యప్యయా ఆరోప్యంతేఽవిద్యావిషయాః| చైతన్యావ్యతిరేకేణైవ హి కలా జాయమానాస్తిష్ఠంత్యః ప్రలీయమానాశ్చ సర్వదా లక్ష్యంతే| అత ఏవ భ్రాంతాః కేచిత్ — అగ్నిసంయోగాత్ ఘృతమివ ఘటాద్యాకారేణ చైతన్యమేవ ప్రతిక్షణం జాయతే నశ్యతీతి| తన్నిరోధే శూన్యమేవ సర్వమితి అపరే| ఘటాదివిషయం చైతన్యం

చేతయిదుర్నిత్యస్యాత్మనోఽనిత్యం జాయతే వినశ్యతీత్యపరే| చైతన్యం భూతధర్మ ఇతి లౌకాయతికాః| అనపాయోపజనధర్మకచైతన్యమాత్మైవ నామరూపాద్యుపాధిధర్మైః ప్రత్యవభాసతే ‘సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ’ (తై. ఉ. 2| 1| 1) ‘ప్రజ్ఞానం బ్రహ్మ’ (ఐ. ఉ. 3| 1| 3) ‘విజ్ఞానమానందం బ్రహ్మ’ (బృ. ఉ. 3| 9| 28) ‘విజ్ఞానఘన ఏవ’ (బృ. ఉ. 2| 4| 12) ఇత్యాదిశ్రుతిభ్యః| స్వరూపవ్యభిచారిషు పదార్థేషు చైతన్యస్యావ్యభిచారాద్యథా యథా యో యః పదార్థో జ్ఞాయతే, తథా తథా జ్ఞాయమానత్వాదేవ తస్య తస్య చైతన్యస్యావ్యభిచారిత్వం| వస్తుతత్త్వం భవతి కించిత్ , న జ్ఞాయత ఇతి చానుపపన్నం ; రూపం చ దృశ్యతే, న చాస్తి చక్షురితి యథా| వ్యభిచరతి తు జ్ఞేయం ; న జ్ఞానం వ్యభిచరతి కదాచిదపి జ్ఞేయం , జ్ఞేయాభావేఽపి జ్ఞేయాంతరే భావాజ్జ్ఞానస్య| న హి జ్ఞానేఽసతి జ్ఞేయం నామ భవతి కస్యచిత్ ; సుషుప్తేఽదర్శనాత్ — జ్ఞానస్యాపి సుషుప్తేఽభావాజ్జ్ఞేయవజ్జ్ఞానస్వరూపస్య వ్యభిచార ఇతి చేత్ , న ; జ్ఞేయావభాసకస్య జ్ఞానస్యాలోకవజ్జ్ఞేయాభివ్యక్త్యర్థత్వాత్స్వవ్యంగ్యాభావే ఆలోకాభావానుపపత్తివత్ అప్రతీతేషు వస్తుషు సుషుప్తే విజ్ఞానాభావానుపపత్తేః| న హ్యంధకారే చక్షుషో రూపానుపలబ్ధౌ చక్షుషోఽభావః శక్యః కల్పయితుమవైనాశికేన| వైనాశికో జ్ఞేయాభావే జ్ఞానాభావం కల్పయత్యేవేతి చేత్ , యేన తదభావం కల్పయేత్తస్యాభావః కేన కల్ప్యత ఇతి వక్తవ్యం వైనాశికేన ; తదభావస్యాపి జ్ఞేయత్వాజ్జ్ఞానాభావే తదనుపపత్తేః| జ్ఞానస్య జ్ఞేయావ్యతిరిక్తత్వాజ్జ్ఞేయాభావే జ్ఞానాభావ ఇతి చేత్ , న ; అభావస్యాపి జ్ఞేయత్వాభ్యుపగమాత్ — అభావోఽపి జ్ఞేయోఽభ్యుపగమ్యతే వైనాశికైర్నిత్యశ్చ| తదవ్యతిరిక్తం చేజ్జ్ఞానం నిత్యం కల్పితం స్యాత్| తదభావస్య చ జ్ఞానాత్మకత్వాదభావత్వం చ వాఙ్మాత్రమేవ ; న పరమార్థతోఽభావత్వమనిత్యత్వం చ జ్ఞానస్య| న చ నిత్యస్య జ్ఞానస్యాభావనామమాత్రాధ్యారోపే కించిన్నశ్ఛిన్నం| అథాభావో జ్ఞేయోఽపి సన్ జ్ఞానవ్యతిరిక్త ఇతి చేత్ , న తర్హి జ్ఞేయాభావో జ్ఞానాభావః| జ్ఞేయం జ్ఞానవ్యతిరిక్తం ; న తు జ్ఞానం జ్ఞేయవ్యతిరిక్తమితి చేత్ , న ; శబ్దమాత్రత్వాద్విశేషానుపపత్తేః| జ్ఞేయజ్ఞానయోరేకత్వం చేదభ్యుపగమ్యతే, జ్ఞేయం జ్ఞానవ్యాతిరిక్తం , న జ్ఞేయవ్యతిరిక్తం జ్ఞానం ఇతి తు శబ్దమాత్రమేవ తత్ — వహ్నిరగ్నివ్యతిరిక్తః, అగ్నిర్న వహ్నివ్యతిరిక్త ఇతి యద్వత్ — అభ్యుపగమ్యం| జ్ఞేయవ్యతిరేకే తు జ్ఞానస్య జ్ఞేయాభావే జ్ఞానాభావానుపపత్తిః సిద్ధా| జ్ఞేయాభావేఽదర్శనాదభావో జ్ఞానస్యేతి చేత్ , న ; సుషుప్తే జ్ఞప్త్యభ్యుపగమాత్ — వైనాశికైరభ్యుపగమ్యతే హి సుషుప్తేఽపి విజ్ఞానాస్తిత్వం| తత్రాపి జ్ఞేయత్వమభ్యుపగమ్యతే జ్ఞానస్య స్వేనైవేతి చేత్ , న ; భేదస్య సిద్ధత్వాత్ — సిద్ధం హ్యాభావవిజ్ఞేయవిషయస్య జ్ఞానస్యాభావజ్ఞేయవ్యతిరేకాజ్జ్ఞేయజ్ఞానయోరన్యత్వం| న హి తత్సిద్ధం మృతమివోజ్జీవయితుం పునరన్యథా కర్తుం శక్యతే వైనాశికశతైరపి| జ్ఞానస్య స్వాజ్ఞేయత్వే తదప్యన్యేన తదప్యన్యేనేతి త్వత్పక్షేఽతిప్రసంగ ఇతి చేత్ , న ; తద్విభాగోపపత్తేః సర్వస్య — యదా హి సర్వం జ్ఞేయం కస్యచిత్ , తదా తద్వ్యతిరిక్తం జ్ఞానం జ్ఞానమేవేతి ద్వితీయో విభాగ ఏవాభ్యుపగమ్యతేఽవైనాశికైః| న తృతీయస్తద్విషయ ఇత్యనవస్థానుపపత్తిః| జ్ఞానస్య స్వేనైవావిజ్ఞేయత్వే సర్వజ్ఞత్వహానిరితి చేత్ , సోఽపి దోషస్తస్యైవాస్తు ; కిం తన్నిబర్హణేనాస్మాకం ? అనవస్థాదోషశ్చ జ్ఞానస్య జ్ఞేయత్వాభ్యుపగమాత్ — అవశ్యం చ వైనాశికానాం జ్ఞానం జ్ఞేయం| స్వాత్మనా చావిజ్ఞేయత్వేనానవస్థా అనివార్యా| సమాన ఏవాయం దోష ఇతి చేత్ , న ; జ్ఞానస్యైకత్వోపపత్తేః — సర్వదేశకాలపురుషాద్యవస్థాస్వేకమేవ జ్ఞానం నామరూపాద్యనేకోపాధిభేదాత్ సవిత్రాదిజలాదిప్రతిబింబవదనేకధావభాసత ఇతి| నాసౌ దోషః| తథా చేహేదముచ్యతే| నను శ్రుతేరిహైవాంతఃశరీరే పరిచ్ఛిన్నః కుండబదరవత్పురుష ఇతి, న ; ప్రాణాదికలాకారణత్వాత్ — న హి శరీరమాత్రపరిచ్ఛిన్నః ప్రాణశ్రద్ధాదీనాం కలానాం కారణత్వం ప్రతిపత్తుం శక్నుయాత్| కలాకార్యత్వాచ్చ శరీరస్య — న హి పురుషకార్యాణాం కలానాం కార్యం సచ్ఛరీరం కారణకారణం స్వస్య పురుషం కుండబదరమివాభ్యంతరీకుర్యాత్| బీజవృక్షాదివత్స్యాదితి చేత్ — యథా బీజకార్యం వృక్షస్తత్కార్యం చ ఫలం

స్వకారణకారణం బీజమభ్యంతరీకరోత్యామ్రాది, తద్వత్పురుషమభ్యంతరీకుర్యాచ్ఛరీరం స్వకారణకారణమపీతి చేత్ , న ; అన్యత్వాత్సావయవత్వాచ్చ — దృష్టాంతే కారణాద్బీజాద్వృక్షఫలసంవృత్తాన్యన్యాన్యేవ బీజాని ; దార్ష్టాంతికే తు స్వకారణకారణభూతః స ఏవ పురుషః శరీరేఽభ్యంతరీకృతః శ్రూయతే| బీజవృక్షాదీనాం సావయవత్వాచ్చ స్యాదాధారాధేయత్వం ; నిరవయవశ్చ పురుషః, సావయవాశ్చ కలాః శరీరం చ| ఏతేనాకాశస్యాపి శరీరాధారత్వమనుపపన్నం ; కిముతాకాశకారణస్య పురుషస్య ? తస్మాదసమానో దృష్టాంతః| కిం దృష్టాంతేన ? వచనాత్స్యాదితి చేత్ , న ; వచనస్యాకారకత్వాత్ — న హి వచనం వస్తునోఽన్యథాకరణే వ్యాప్రియతే ; కిం తర్హి, యథాభూతార్థావద్యోతనే| తస్మాదంతఃశరీర ఇత్యేతద్వచనం 'అండస్యాంతర్వ్యోమ' ఇతివద్ద్రష్టవ్యం| ఉపలబ్ధినిమిత్తత్వాచ్చ — దర్శనశ్రవణమననవిజ్ఞానాదిలింగైరంతఃశరీరే పరిచ్ఛిన్న ఇవ హ్యుపలభ్యతే పురుష ఉపలభ్యతే చాత్ర| అత ఉచ్యతే — అంతఃశరీరే సోమ్య స పురుష ఇతి| న పునరాకాశకారణభూతః సన్కుండబదరవచ్ఛరీరపరిచ్ఛిన్న ఇతి మనసాపీచ్ఛతి వక్తుం మూఢోఽపి ; కిముత ప్రమాణభూతా శ్రుతిః ||

యస్మిన్నేతాః షోడశ కలాః ప్రభవంతీత్యుక్తః పురుషవిశేషణార్థః కలానాం ప్రభవః, స చాన్యార్థోఽపి శ్రుతః కేన క్రమేణ స్యాదిత్యత ఇదముచ్యతే| చేతనపూర్వికా చ సృష్టిరిత్యేవమర్థం చ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

తస్మై అతనికి (సుకేశునికి) **సః** ఆ పిప్పలాదుడు **ఉవాచ హ** అన్నాడు. **సోమ్య** ఓ సౌమ్యుడా యస్మిన్ ఏతాః ఎవనిలో అయితే ఈ చెప్పబోయే **షోడశ కలాః** ప్రాణం మొదలైన పదహారు అంశములు **ప్రభవన్తి** ఉత్పన్నమౌతున్నాయో **సః పురుషః** ఆ పురుషుడు **ఇహ ఏవ** ఇక్కడనే **అంతఃశరీరే** హృదయపుండరీకంలోని ఆకాశమధ్యంలోనే తెలియబడతాడు కాని వేరొక ప్రదేశంలో తెలియబడేవాడు కాదు **ఇతి** అని అన్నాడు. విభాగాలు లేని నిష్కల పురుషుడే అవిద్య కారణంగా పదహారు అంశాలనే ఉపాధి పరిమితులు కల పురుషునిగా కన్పిస్తున్నాడు. ఆ ఉపాధి అంశల అధ్యారోపాన్ని జ్ఞానం చేత తొలగించినట్లైతే, కేవలం ఆ పురుషుడే దర్శితమౌతాడు కాబట్టి ఆ ప్రాణం మొదలైన ఉపాధి అంశలు ఆ పురుషుని నుండే ఉత్పన్నమౌతున్నాయని చెప్తున్నారు. ఎటువంటి విశేషాలు ఏమాత్రమూ లేని, కేవలం అద్వయమైన విశుద్ధ తత్వంలో సాధ్యంకావడం-సాధించడం వంటి వ్యవహారాలు అసాధ్యం కాబట్టి, అవిద్యా విషయాలైన ప్రాణాది విభాగాల పుట్టుక-స్థితులను ఆ పురుషునియందు ఆరోపించడం జరుగుతోంది. ఈ విభాగాలు ఉత్పన్నమై, వ్యవహరించి, లీనమవుతున్నంత కాలం చైతన్యంతో సామ్యత్వాన్ని కలిగే ఉంటాయి. అందువల్ల భ్రాంతికి లోనైన కొంతమంది, 'అగ్ని సంపర్కంతో కరిగిపోయిన నేయి లాగా, కుండ వంటి ఆకారాలు ఉత్పన్నమై నశించినట్లుగా చైతన్యం కూడా ప్రతిక్షణం పుడుతోంది నశిస్తోంది', అని అంటారు. ఇంకొందరు (శూన్యవాదులు) 'ఆ చైతన్యం ఆగిపోగానే మిగిలినదంతా శూన్యమే' అని అంటారు. మరి కొందరు (తార్కికులు) 'కుండ మొదలైన వాటి గురించిన జ్ఞానం వాటితో పాటు పుట్టి వాటితో పాటుగా నశించే, తాత్కాలిక పరిణామమే' అని అంటారు. (లోకాయతులు) 'చైతన్యమనేది వస్తు ధర్మం' అని అంటారు. కాని, వృద్ధి క్షీణతలు లేని చైతన్యం నామరూపాది ఉపాధి ధర్మాలు కలదిగా కన్పిస్తోంది, అదియే ఆత్మ అని 'సత్యము, జ్ఞానము, అనంతమే బ్రహ్మ' ['సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' (తై.ఉ. 2-1-1)]; 'ప్రకృష్టమైన జ్ఞానమే బ్రహ్మ' ['ప్రజ్ఞానం బ్రహ్మ' (ఐ.ఉ. 3-1-3)]; 'విజ్ఞానం, ఆనందమే

బ్రహ్మ' ['విజ్ఞానమానందం బ్రహ్మ' (బృ.ఉ. 3-9-28)]; 'సమిష్టి విజ్ఞాన రాశియే బ్రహ్మ' ['విజ్ఞానఘన ఏవ' (బృ.ఉ. 2-4-12)] వంటి అనేక శ్రుతి వాక్యాలు చెప్తున్నాయి. ఎలా ఎలా ఏఏ పదార్థాలు తెలియబడే స్వభావాన్ని కలిగి ఉన్నవో అలా అలా అవి తెలుస్తున్నందు చేత వాటి వాటి చైతన్యంలో ఎటువంటి మార్పు ఉండనందు చేత, ఉపాధులు వాటి స్వరూపాలలో మార్పులను పొందినప్పటికీ, చైతన్యంలో ఎటువంటి మార్పు ఉండనందు చేత, బాహ్యంలో ఉన్న వస్తువును తెలియబడకపోవడం అన్నది సంభవం కాదు. ఎందుకంటే రూపం అనేది ఉంటే, ఆది చూడబడుతుంది కాని కన్ను ఉన్నంత మాత్రాన రూపంలేకపోతే చూడలేం కదా. అంటే తెలియబడేదే మార్పు చెందుతుంది కాని జ్ఞానం అంటే ఎరుక లేదా తెలివిడి అన్నదానిలో మార్పులేదు. ఒకప్పుడు తెలియబడేది తెలియబడకుండా పోయినప్పటికీ తెలియబడేదాని గురించిన భావం జ్ఞానంలో ఉంటూనే ఉంటుంది. అసలు జ్ఞానమనేదే కనుక లేకపోతే తెలియబడే వస్తువు ఉన్నదని గుర్తించడం ఎలా కుదురుతుంది? (అంటే జ్ఞానం సర్వదా సర్వత్రా ఉన్నదే అవుతుంది).

సందేహం : సుషుప్తిలో ఏమీ తెలియబడటం లేదు కాబట్టి. సుషుప్తిలో జ్ఞానము యొక్క అభావం వల్ల జ్ఞేయం లాగానే జ్ఞానంకూడా దాని స్వరూపం నుండి తొలగిపోతోంది కదా (లేకుండా పోతోంది కదా)!

సమాధానం : కాదు. జ్ఞానం యొక్క ప్రకాశం వలన జ్ఞేయం తెలియబడటం చేత, జ్ఞేయం అభివ్యక్తం కాకపోవడం అన్నది జ్ఞేయ వస్తువు లేకపోవడం వల్ల కలుగుతోందే కాని జ్ఞానం లేకపోవడం వల్ల కాదు. అందుచేత, సుషుప్తిలో వస్తువులు ప్రకాశించక పోవడమనేది జ్ఞానం యొక్క అభావం వల్ల కాదని నిరూపితమౌతోంది. చీకటిలో కన్నులకు రూపాలు కనబడకపోయినంత మాత్రాన, కన్నులు లేవని భావించడం శూన్యవాదులకైనా నిశ్చయంగా సాధ్యపడదు.

సందేహం : శూన్యవాది జ్ఞేయ వస్తువు లేకపోవడమే జ్ఞానం లేకపోవడమని భావిస్తున్నాడు అనుకోవచ్చు కదా!

సమాధానం : ఈ జ్ఞానం లేకపోవడమనే అభావాన్ని, ఏ భావంతో భావిస్తున్నాడో శూన్యవాది చెప్పాలి. ఆ అభావం కూడా తెలియబడుతోంది అంటే జ్ఞానం యొక్క అభావం నిరూపితం కానట్లే.

సందేహం : జ్ఞానానికి, జ్ఞేయానికి వైరుధ్యం లేకపోవడం చేత, జ్ఞేయం యొక్క అభావమే జ్ఞానం యొక్క అభావం కావచ్చు కదా!

సమాధానం : కాదు. ఎందుకంటే, అభావం కూడా తెలియబడేదని అంగీకరించ బడింది కాబట్టి. అభావం కూడా తెలియబడేదే అని, ఆ అభావం నిత్యమని శూన్యవాదుల అభిప్రాయం. జ్ఞేయమైన అభావానికి జ్ఞానంతో వ్యతిరేకత లేకుంటే, ఆ జ్ఞానం కూడా శాశ్వతమే కావలసి ఉంటుంది (అంటే జ్ఞానం లేకపోవడమనే స్థితి ఉండదు). ఆ అభావం తెలియబడటం అనేది తప్పనిసరిగా జ్ఞానమే అవుతుంది కాబట్టి, జ్ఞానం ఉండకపోవడం అనేది అర్థంలేని వాక్యమే అవుతుంది. నిజానికి జ్ఞానమనేది అభావమూ కాదు, అనిత్యమూ కాదు. నిత్యమైన జ్ఞానం మీద నామమాత్రంగా అభావాన్ని అధ్యారోపణం చేసినంత మాత్రాన జ్ఞానానికి జరిగే నష్టమేమీ లేదు.

అభావం తెలియబడేదే అయినా జ్ఞానానికి వ్యతిరేకం అని భావిస్తే, అలాంటప్పుడు జ్ఞేయం యొక్క అభావం ఏర్పడినందువల్ల జ్ఞాన యొక్క అభావం కలుగదు.

సందేహం : జ్ఞేయ వస్తువు జ్ఞానానికి వ్యతిరేకమైనది కావచ్చేమో కాని, జ్ఞానం దాని విషయమైన జ్ఞేయ వస్తువుకు వ్యతిరేకమైనది కాదు కదా!

సమాధానం : కాదు. కేవలం అది అర్థంలేని వాక్యం మాత్రమే అయినందున విశేషం ఏమీ లేదు. ఎందుకంటే, వస్తువు మరియ జ్ఞానం ఒక్కటే అనేటట్లైతే, జ్ఞానం దాని విషయమైన జ్ఞేయానికి భిన్నం కాదని ప్రాప్తించగా, జ్ఞేయం జ్ఞానానికి వ్యతిరేకం అన్న వాక్యం అర్థ రహితమైనది అవుతుంది కాబట్టి. ఇది ఎలా ఉందంటే, వహ్ని అనేది అగ్నికి వ్యతిరేకమైనదే కాని, అగ్ని వహ్నికి వ్యతిరేకమైనది కాదు అన్నట్లుంది. కాబట్టి, జ్ఞేయం జ్ఞానాన్ని వ్యతిరేకించినట్లైతే, జ్ఞేయం యొక్క అభావం వల్ల జ్ఞానానికి అభావం కలగదు అని నిరూపణ అవుతోంది.

సందేహం : వస్తువు యొక్క అభావం చేత దర్శించ దగినది లేకపోడంతో జ్ఞానం కూడా లేకుండా పోతుంది కదా!

సమాధానం : కాదు. ఎందుకంటే, సుషుప్తిలో జ్ఞప్తి అనేది ఉన్నదని అంగీకరించబడింది కాబట్టి. సుషుప్తిలో కూడా విజ్ఞానం (తెలియుట) అన్నది ఉన్నదని శూన్యవాదులు కూడా అంగీకరించారు.

సందేహం : అక్కడ కూడా జ్ఞానం తనను తాను జ్ఞేయ వస్తువుగా తెలుసుకొంటుంది అన్నారు కదా!

సమాధానం : కాదు. ఎందుకంటే జ్ఞానానికి జ్ఞేయానికి కల తారతమ్యం స్పష్టం. జ్ఞేయ వస్తువు యొక్క అభావాన్ని విషయంగా తెలుసుకొనే జ్ఞానానికి మరియు జ్ఞేయవస్తువు యొక్క అభావానికి తేడా ఉన్నందుచేత, జ్ఞేయానికి జ్ఞానం అన్నది భిన్నమేనని సిద్ధిస్తోంది. వందమంది శూన్యవాదులకు కూడా అలా నిరూపించబడిన దానికి, మరణించిన వానికిలాగా, మరలా జీవంపోయడం గాని వ్యతిరేకంగా చెప్పడం గాని సాధ్యపడదు.

సందేహం : మీ వాదన వల్ల, జ్ఞానం తనను తాను తెలుసుకొనకపోతే, ఆ జ్ఞానాన్ని తెలుసుకొనేందుకు మరొక జ్ఞానం, ఆ మరొక జ్ఞానాన్ని తెలుసుకొనేందుకు ఇంకొక జ్ఞానం, ఇలా అనంతంగా (ఒక ముగింపు లేకపోవడం అనే స్థితి. దీనినే అనవస్థ అని అంటున్నారు.) కలుగుతోంది కదా!

సమాధానం : కాదు. ఎందుకంటే, ఆ విభాగతకు ముగింపు సాధ్యమే కాబట్టి. సకల జ్ఞేయవస్తువులూ ఏదో ఒక జ్ఞానానికి తెలియబడేవే (జ్ఞేయములే) అయినట్లుగా, జ్ఞానాన్ని తెలుసుకో మరో జ్ఞానం కూడా ఎప్పుడూ జ్ఞానమే అవుతుంది కాని జ్ఞేయం కాదు). వాదనలోని ఈ రెండవ భాగాన్ని, శూన్యవాదులు కాని వారందరూ అంగీకరిస్తున్నారు. దీనికి మరో తృతీయ భాగమనేది (ఇంకొక మూడవ వాదన అనేది) ఉండే అవకాశమే లేనందుచేత, మీరు భావించినట్లుగా అనంతంగా ముగింపు లేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉండదు.

సందేహం : జ్ఞానం తనను తాను తెలుసుకొనలేకపోవడం సర్వజ్ఞత్వానికి లోపం అవుతుంది కదా!

సమాధానం : ఆ దోషం కూడా (శూన్యవాదులు కల్పించినదే) శూన్యవాదానిదే. (మేము ఏక్కడా జ్ఞానం యొక్క సర్వజ్ఞత్వానికి లోపం ఉంటుందని చెప్పలేదు). దానిని నివారించే బాధ్యత మాకెందుకు? జ్ఞానమే జ్ఞేయమనే శూన్యవాదం నుండే ఈ అనవస్థా దోషం కూడా జ్ఞానమే జ్ఞేయమని అంగీకరించడం వల్ల తప్పనిసరిగా కలుగుతోంది. తనను తాను తెలుసుకొనలేకపోవడం వల్లనే ఈ అనివార్యమైన అనవస్థాదోషం (ఒక ముగింపు అనేది లేని పరిస్థితి) కలుగుతోంది.

సందేహం : ఈ (అనవస్థా) దోషం మీ వాదనలో కూడా సమానంగా ఉన్నది కదా!

సమాధానం : (మా వాదనలో ఈ దోషం) లేదు. ఎందుకంటే, (మా దృష్టిలో) జ్ఞానం ఒక్కటే అని నిరూపితమవుతోంది కాబట్టి. సకల దేశ-కాల-పురుషాది అవస్థలలో ఒక్కటే జ్ఞానం నామరూపాదులనే అనేక ఉపాధి భేదాల వల్ల, వేర్వేరు జలాశయాలలో వేర్వేరు ప్రతిబింబాలుగా భాసించే ఒకే సూర్యుని వలె, అనేకంగా భాసిస్తోంది. కాబట్టి, ఈ దోషం మా వాదనలో లేదు. ఆవిధంగానే ఇది ఇక్కడ చెప్పబడింది.

సందేహం : అయితే, శ్రుతి ఈ మంత్రంలోనే 'ఇహైవాన్తఃశరీరే' పురుషుడు కుండలోని బదరీఫలం లాగా విడిగా ఉన్నాడని అంటోంది కదా!

సమాధానం : అలా కాదు. ఎందుకంటే, ప్రాణాది అంశలకు (పురుషుడు) కారణం కాబట్టి. అంతేకాక, ప్రాణము, శ్రద్ధ మొదలైన అంశలకు కారణమైన పురుషుడిని, కేవలం దేహానికి పరిమితమైన వానిగా ప్రతిపాదిస్తే, అర్థంచేసుకోవడం సాధ్యపడదు కూడా కాబట్టి. మరియు ఈ ప్రాణాది అంశల యొక్క కార్యం దేహమే కాబట్టి కూడా. పురుషుని యొక్క కార్యమైన అంశలు, ఆ అంశల యొక్క కార్యమైన శరీరంలో ఆ కారణానికే కారణమైన పురుషుడు రేగుపండులాగా కుండలోపల ఉండడు.

సందేహం : విత్తు, చెట్టు మొదలైన వాటి లాగా ఉండవచ్చు కదా! విత్తు యొక్క కార్యం చెట్టు, ఆ చెట్టుకు కార్యం ఫలం లాగా, ఉదాహరణకు మామిడిపండులాగా, తన కారణానికి కారణమైన విత్తు తనలో ఉన్నట్లుగా, శరీరం తన కారణానికి కారణమైన పురుషుడిని తనలోనే ఉంచుకోవచ్చు కదా!

సమాధానం : కాదు. ఎందుకంటే, అవి వేరైనవి, అంశములైనవి కాబట్టి. ఉదాహరణలో వృక్షానికి కారణమైన విత్తనం, ఆ వృక్షానికి కలిగిన ఫలాలలోని విత్తనాలు వేర్వేరే కాని ఒకటి కావు. దేనికి ఈ ఉదాహరణను అన్వయింప చేస్తున్నారో ఆవిషయంలో అయితే, శరీరం కలగడానికి కారణమైన దానికే కారణమైన పురుషుడే శరీరంలో ఉన్నాడని ఉపనిషత్తు చెప్తోంది. విత్తు-వృక్షం మొదలైన ఉదాహరణలలో అవి ఒకదానిలో మరొకటి అంతర్భాగాలు. పురుషునిలో ఏ విభాగాలు లేవు కాని, అంశలు మరియు శరీరం మాత్రం విభాగాలు కలవై ఉన్నాయి. దీనిని బట్టి, కనీసం ఆకాశం కూడా శరీరంపై ఆధారపడి దానిలో ఉన్నదని చెప్పడానికి వీలులేదు. ఇక పురుషుడు శరీరంపై ఆధారపడి శరీరంలో ఉన్నాడని ఎలా చెప్పగలం? (అలా చెప్పలేం). కనుక ఈ ఉదాహరణ (కుండలో బదరీ ఫలం ఉన్నట్లుగా అని చెప్పిన ఉదాహరణ) సరియైనది కాదు.

సందేహం : ఉదాహరణ ఎందుకు (దానిని విడిచిపెట్టండి)? 'ఇహైవాన్తఃశరీరే' అని ఉపనిషత్ వాక్యమే ఉన్నది కదా?

సమాధానం : కాదు. ఎందుకంటే, ఉపనిషత్ వాక్యం కొత్త రూపాన్ని సృష్టించదు కాబట్టి. ఉపనిషత్తు వాక్యం ఉన్న వస్తువును వేరొకదానిగా మార్చదు. మరి ఏం చేస్తుంది అంటే, ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా ప్రకటిస్తుంది. అందువలన 'అంతఃశరీర' అన్న వాక్యాన్ని 'బ్రహ్మాండంలోని ఆకాశం' ['అండస్యాంతర్వ్యోమ'] అన్నట్లుగా గ్రహించాలి. మిథ్యానుభవాన్ని కలిగించే నిమిత్తంగా, దర్శన-శ్రవణ-మనన-విజ్ఞానాదులకు సూచనగా శరీరం లోపల పరిమితులు కలవాని వలె పురుషుడు అక్కడ అనుభవానికి వస్తున్నాడు. అందుకనే 'అంతఃశరీరే సోమ్య స పురుష' అని అంటున్నారు. ఆకాశానికి కారణమై యున్నవాడు, కుండలోని రేగుపండులాగా, శరీరంలో పరిమితుడై పడి ఉంటాడని ఏ మూర్ఖుడు కూడా మనసులోనైనా తలచడు. ఇక, పరమ ప్రమాణమైన వేదాన్ని గురించి చెప్పేదేముంది?

యస్మిన్నేతాః షోడశ కలాః ప్రభవన్తి అటువంటి పురుష విశేషం నుండియే ఈ పదహారు అంశాలు ప్రభవించాయి. అలా పదహారు అంశాలు పురుషుడి నుండి ఉత్పన్నమైనాయని ఇక్కడ ప్రస్తావించిన విషయాన్ని, గతంలో 2-2వ మంత్రలో మరో సందర్భంలో చెప్పినప్పటికీ, అవి ఒక క్రమంలో ఏర్పడినాయని ఇక్కడ చెప్పబడుతోంది. అంతేకాదు, వాటన్నింటి సృష్టికి పూర్వమే చైతన్యం ఉన్నదనే అభిప్రాయాన్ని కూడా వెల్లడిచేస్తోంది.

స ఈక్షాంచక్రే కస్మిన్నహముత్క్రాన్త ఉత్క్రాన్తో భవిష్యామి కస్మిన్వా ప్రతిష్ఠితే ప్రతిష్ఠాస్యామీతి|| || 6-3 ||

అతడు "ఎవరు నిర్గమిస్తే నేను నిర్గమిస్తాను. లేదా ఎవరు నిలిచియుంటే నేను నిలిచియుంటాను" అని ఆలోచించాడు.

శంకరుల భాష్యం

స పురుషః షోడశకలః పృష్టో యో భారద్వాజేన సః ఈక్షాంచక్రే ఈక్షణం దర్శనం చక్రే — కృతవానిత్యర్థః — సృష్టిఫలక్రమాదివిషయం| కథమితి, ఉచ్యతే — కస్మిన్ కర్తృవిశేషే దేహాదుత్క్రాంతే ఉత్క్రాంతో భవిష్యామి అహమేవ ; కస్మిన్వా శరీరే ప్రతిష్ఠితే అహం ప్రతిష్ఠాస్యామి ప్రతిష్ఠితః స్యామిత్యర్థః| నన్వాత్మా అకర్తా ప్రధానం కర్తృ ; అతః పురుషార్థం ప్రయోజనమురరీకృత్య ప్రధానం ప్రవర్తతే మహదాద్యాకారేణ ; తత్రేదమనుపపన్నం పురుషస్య స్వాతంత్ర్యేణేక్షాపూర్వకం కర్తృత్వవచనం , సత్త్వాదిగుణసామ్యే ప్రధానే ప్రమాణోపపన్నే సృష్టికర్తరి సతి ఈశ్వరేచ్ఛానువర్తిషు వా పరమాణుషు సత్సు ఆత్మనోఽప్యేకత్వేన కర్తృత్వే సాధనాభావాదాత్మన ఆత్మన్యనర్థకర్తృత్వానుపపత్తేశ్చ| న హి చేతనావాన్బుద్ధిపూర్వకారీ ఆత్మనః అనర్థం కుర్యాత్ తస్మాత్పురుషార్థేన ప్రయోజనేనేక్షాపూర్వకమివ నియతక్రమేణ ప్రవర్తమానేఽచేతనేఽపి ప్రధానే చేతనవదుపచారోఽయం స ఈక్షాంచక్రే ఇత్యాదిః ; యథా రాజ్ఞః సర్వార్థకారిణి భృత్యే రాజేతి, తద్వత్| న ; ఆత్మనో భోక్తృత్వవత్కర్తృత్వోపపత్తేః — యథా సాంఖ్యస్య చిన్మాత్రస్యాపరిణామినోఽప్యాత్మనో భోక్తృత్వం , తద్వద్వేదవాదినామీక్షాపూర్వకం జగత్కర్తృత్వముపపన్నం శ్రుతిప్రామాణ్యాత్| తత్త్వాంతరపరిణామాదాత్మనోఽనిత్యత్వాశుద్ధత్వానేకత్వనిమిత్తం చిన్మాత్రస్వరూపవిక్రియాతః పురుషస్య స్వాత్మన్యేవ భోక్తృత్వే చిన్మాత్రస్వరూపవిక్రియా న దోషాయ| భవతాం

పునర్వేదవాదినాం సృష్టికర్తృత్వే తత్త్వాంతరపరిణామ ఏవేత్యాత్మనోఽనిత్యత్వాదిసర్వదోషప్రసంగ ఇతి చేత్ , న ; ఏకస్యాప్యాత్మనోఽవిద్యావిషయ నామరూపోపాధ్యనుపాధికృతవిశేషాభ్యుపగమాత్| అవిద్యాకృతనామరూపోపాధినిమిత్తో హి విశేషోఽభ్యుపగమ్యతే ఆత్మనో బంధమోక్షాదిశాస్త్రకృతసంవ్యవహారాయ| పరమార్థతోఽనుపాధికృతం చ తత్త్వమేకమేవాద్వితీయముపాదేయం సర్వతార్కికబుద్ధ్యనవగమ్యం హ్యజమభయం శివమిష్యతే| న తత్ర కర్తృత్వం భోక్తృత్వం వా క్రియాకారకఫలం వాస్తి, అద్వైతత్వాత్సర్వభావానాం| సాంఖ్యాస్త్వవిద్యాధ్యారోపితమేవ పురుషే కర్తృత్వం క్రియాకారకం ఫలం చేతి కల్పయిత్వా ఆగమబాహ్యత్వాత్పునస్తతస్త్రస్యంతః పరమార్థత ఏవ భోక్తృత్వం పురుషస్యేచ్ఛంతి| తత్త్వాంతరం చ ప్రధానం పురుషాద్వ్యాహ్యం పరమార్థవస్తుభూతమేవ కల్పయంతోఽన్యతార్కికకృతబుద్ధివిషయాః సంతో విహన్యంతే| తథేతరేతార్కికాః సాంఖ్యైః ; ఇత్యేవం పరస్పరవిరుద్ధార్థకల్పనాత ఆమిషార్థిన ఇవ ప్రాణినోఽన్యోన్యవిరుధ్యమానార్థదర్శిత్వాత్పరమార్థతత్త్వాద్దూరమేవాపకృష్యంతే| అతస్తన్మతమనాదృత్య వేదాంతార్థతత్త్వమేకత్వదర్శనం ప్రత్యాదరవంతో ముముక్షవః స్యురితి తార్కికమతదోషప్రదర్శనం కించిదుచ్యతేఽస్మాభిః ; న తు తార్కికవత్తాత్పర్యేణ| తథైతదత్రోక్తం — వివదత్స్వేవ నిక్షిప్య విరోధోద్భవకారణం| త్రైః సంరక్షితసద్బుద్ధిః సుఖం నిర్వాతి వేదవిత్ || కించ, భోక్తృత్వకర్తృత్వయోర్విక్రియయోర్విశేషానుపపత్తిః| కా నామాసౌ కర్తృత్వాజ్జాత్యంతరభూతా భోక్తృత్వవిశిష్టా విక్రియా, యతో భోక్తైవ పురుషః కల్ప్యతే న కర్తా ; ప్రధానం తు కర్త్రేవ న భోక్తృ ఇతి| నను ఉక్తం పురుషశ్చిన్మాత్ర ఏవ ; స చ స్వాత్మస్థో విక్రియతే భుంజానః, న తత్త్వాంతరపరిణామేన| ప్రధానం తు తత్త్వాంతరపరిణామేన విక్రియతే ; అతో నైకమశుద్ధమచేతనం చేత్యాదిధర్మవత్| తద్విపరీతః పురుషః| నాసౌ విశేషః, వాఙ్మాత్రత్వాత్| ప్రాగ్భోగోత్పత్తేః కేవలచిన్మాత్రస్య పురుషస్య భోక్తృత్వం నామ విశేషో భోగోత్పత్తికాలే చేత్ జాయతే, నివృత్తే చ భోగే పునస్తద్విశేషాదపేతశ్చిన్మాత్ర ఏవ భవతీతి చేత్ ; మహదాద్యాకారేణ చ పరిణమ్య ప్రధానం తతోఽపేత్య పునః ప్రధానస్వరూపేణ వ్యవతిష్ఠత ఇతి అస్యాం కల్పనాయాం న కశ్చిద్విశేష ఇతి వాఙ్మాత్రేణ ప్రధానపురుషయోర్విశిష్టవిక్రియా కల్ప్యతే| అథ భోగకాలేఽపి చిన్మాత్ర ఏవ ప్రాగ్వత్పురుష ఇతి చేత్ , న తర్హి పరమార్థతో భోగః పురుషస్య| అథ భోగకాలే చిన్మాత్రస్య విక్రియా పరమార్థైవ, తేన భోగః పురుషస్యేతి చేత్ , న ; ప్రధానస్యాపి భోగకాలే విక్రియావత్త్వాద్భోక్తృకత్వప్రసంగః| చిన్మాత్రస్యైవ విక్రియా భోక్తృత్వమితి చేత్ , ఔష్ణ్యాద్యసాధారణధర్మవతామగ్న్యాదీనామభోక్తృత్వే హేత్వనుపపత్తిః| ప్రధానపురుషయోర్ద్వయోర్యుగపద్భోక్తృత్వమితి చేత్ , న ; ప్రధానస్య పారార్థ్యానుపపత్తేః — న హి భోక్త్రోర్ద్వయోరితరేతరగుణప్రధానభావ ఉపపద్యతే ప్రకాశయోరివేతరేతరప్రకాశనే| భోగధర్మవతి సత్త్వాంగిని చేతసి పురుషస్య చైతన్యప్రతిబింబోదయాదవిక్రియస్య పురుషస్య భోక్తృత్వమితి చేత్ , న ; పురుషస్య విశేషాభావే భోక్తృత్వకల్పనానర్థక్యాత్| భోగరూపశ్చేదనర్థః పురుషస్య నాస్మి సదా నిర్విశేషత్వాత్పురుషస్య, కస్యాపనయనార్థం మోక్షసాధనం శాస్త్రం ప్రణీయతే ? అవిద్యాధ్యారోపితానర్థాపనయనాయ శాస్త్రప్రణయనమితి చేత్ , పరమార్థతః పురుషో భోక్తైవ, న కర్తా ; ప్రధానం కర్త్రేవ న భోక్తృ పరమార్థసద్వస్త్వంతరం పురుషాచ్చ ఇతీయం కల్పనా ఆగమబాహ్యా వ్యర్థానిర్హేతుకా చ ఇతి నాదర్తవ్యా ముముక్షుభిః| ఏకత్వేఽపి శాస్త్రప్రణయనాద్యానర్థక్యమితి చేత్ , న ; అభావాత్ — సత్సు హి శాస్త్రప్రణేత్రాదిషు తత్ఫలార్థిషు చ శాస్త్రస్య ప్రణయనమర్థవదనర్థకం వేతి వికల్పనా స్యాత్| న హ్యాత్మైకత్వే శాస్త్రప్రణేత్రాదయస్తతో భిన్నాః సంతి ; తదభావే ఏవం వికల్పనైవానుపపన్నా| అభ్యుపగతే ఆత్మైకత్వే ప్రమాణార్థశ్చాభ్యుపగతో భవతా యదాత్మైకత్వమభ్యుపగచ్ఛతా| తదభ్యుపగమే చ వికల్పానుపపత్తిమాహ శాస్త్రం 'యత్ర త్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం పశ్యేత్' (బృ. ఉ. 4| 5| 14) ఇత్యాది ; శాస్త్రప్రణయనాద్యుపపత్తిం చాహ అన్యత్ర

పరమార్థవస్తుస్వరూపాదవిద్యావిషయే 'యత్ర హి ద్వైతమివ భవతి' (బృ. ఉ. 4| 5| 14) ఇత్యాది విస్తరతో వాజసనేయకే| అత్ర చ విభక్తే విద్యావిద్యే పరాపరే ఇత్యాదావేవ శాస్త్రస్య| అతో న తార్కికవాదభటప్రవేశో వేదాంతరాజప్రమాణబాహుగుప్తే ఇహాత్మైకత్వవిషయే ఇతి| ఏతేనావిద్యాకృతనామరూపాద్యుపాధికృతానేకశక్తిసాధనకృతభేదవత్త్వాద్బ్రహ్మణః సృష్ట్యాదికర్తృత్వే సాధనాద్యభావో దోషః ప్రత్యుక్తో వేదితవ్యః, పరైరుక్త ఆత్మానర్థకర్తృత్వాదిదోషశ్చ| యస్తు దృష్టాంతో రాజ్ఞః సర్వార్థకారిణి కర్తరి భృత్యే ఉపచారో రాజా కర్తేతి, సోఽత్రానుపపన్నః ; 'స ఈక్షాంచక్రే' ఇతి శ్రుతేర్ముఖ్యార్థబాధనాత్ప్రమాణభూతాయాః| తత్ర హి గౌణీ కల్పనా శబ్దస్య, యత్ర ముఖ్యార్థో న సంభవతి| ఇహ త్వచేతనస్య ముక్తబద్ధపురుషవిశేషాపేక్షయా కర్తృకర్మదేశకాలనిమిత్తాపేక్షయా చ బంధమోక్షాదిఫలార్థా నియతా పురుషం ప్రతి ప్రవృత్తిర్నోపపద్యతే ; యథోక్తసర్వజ్ఞేశ్వరకర్తృత్వపక్షే తు ఉపపన్నా| ఈశ్వరేణైవ సర్వాధికారీ ప్రాణః పురుషేణ సృజ్యతే| కథం ? ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

సః ఎవని గురించైతే భారద్వాజుడు ప్రశ్నించాడో ఆ షోడశకళలు గల పురుషుడు **ఈక్షాంచక్రే** - 'ఈక్షణం' సృష్టి-ఫలం-క్రమం గురించి లోతైన ఆలోచనను 'చక్రే' చేసినవాడైనాడని అభిప్రాయం. (సృష్టి అనగా ప్రాణం మొదలైన వాటి యొక్క సృష్టి, ఫలం అంటే ఈ ప్రాణాదులు శరీరాన్నుండి ఉత్క్రమించడం, క్రమం అంటే ప్రాణం గురించిన నమ్మిక మొదలైనవి అని. లోకానికి దానిలోని నామరూపాలకు ఉన్నటువంటి సంబంధాన్ని గురించి ఆలోచన చేశాడని అభిప్రాయం – స్వామి గంభీరానంద). ఎలా ఆలోచన చేశాడనేది చెప్తున్నారు. **కస్మిన్ ఉత్క్రాన్తే** శరీరం నుండి ఏ కర్తృవిశేషం (ప్రాణాదులలో ఏది) నిర్గమిస్తే **అహమ్** నేను **ఉత్క్రాన్తః భవిష్యామి** నిర్గమించినవాడనౌతాను? **వా** లేదా **కస్మిన్** ఏది దేహంలో **ప్రతిష్ఠితే** స్థితిని కలిగి ఉండగా నేను **ప్రతిష్ఠాస్యామి** స్థితిని కలిగినట్లుగా ఉంటున్నాను అని అలోచించాడని అర్థం.

<u>సందేహం :</u> అయితే ఆత్మ కర్తయే కాదు, ప్రధానమే కర్త. కాబట్టి ప్రధానమే మహత్తు మొదలైనవిగా పరిణమించి పురుషుని ప్రయోజనం కొరకు కార్యాలను తానే నిర్వర్తిస్తోంది. సత్వ-రజ-తమో గుణాలు సమంగా ఉన్న స్థితిని కలిగిన ప్రధానమే సృష్టి కర్త అని ప్రామాణికంగా తేలినప్పుడు, ఈశ్వరుని ఇచ్ఛకు అనుగుణంగా వ్యవహరించే సూక్ష్మమైన పరమాణువులున్నప్పుడు, ఆత్మ కూడా ఒక్కటే అయినందున కర్తృత్వానికి అవసరమైన సాధనాలేవీ ఆత్మకు లేనందున, కర్తృత్వం వహించే సామర్థ్యం లేదని తేలుతున్నప్పుడు మరియు బుద్ధిపూర్వకంగా పనిచేసే చైతన్యం తనకు తాను హాని కలిగించుకోదు కనుక ఆత్మ తనకు తాను అనర్థాన్ని కొని తెచ్చుకోవడం కూడా సాధ్యం కానప్పుడు, పురుషుడు స్వతంత్రంగా ఆలోచించాడు అని ఆత్మకు కర్తృత్వాన్ని ఆపాదించే ఈ వాక్యం ఇక్కడ పొసగదు. అందువల్ల పురుషునికి ప్రయోజనం కలిగించాలనే ఉద్దేశ్యంతో, రాజు యొక్క సకలమైన కార్యాలను నడిపించే సేవకుడిని రాజే అని అన్నట్లుగా, ప్రధానం అచేతనమైనప్పటికీ చైతన్యం కలదానిలాగా ఆలోచించడం వంటి వాటిని నిర్వహించి తద్వారా ఒక క్రమంలో పరిణామాలను పొంది అవసరానికి తగిన కార్యాలను నిర్వర్తిస్తోంది.

<u>**సమాధానం**</u> : కాదు. ఎందుకంటే, ఆత్మకు భోక్తృత్వాన్ని చెప్పడం సహేతుకమైనప్పుడు, కర్తృత్వాన్ని చెప్పడం కూడా సహేతుకమే అవుతుంది కాబట్టి. సాంఖ్యుల సిద్ధాంతం ప్రకారం, కేవలం పరిణామరహితమైన చైతన్యమే భోక్త కాగలదు. కాని, వేదవాదుల అభిప్రాయంలో, (పురుషుడు) జగత్తు గురించి ఆలోచించిన మీదట జగత్తును సృష్టించడం కూడా వేదప్రమాణానికి తగినదే.

<u>**సందేహం**</u> : (సాంఖ్య వాదుల ప్రకారం) ఏ పరిణామం అయినా ఆత్మయొక్క తత్వాన్ని మార్పుచేయడం ద్వారా అశాశ్వతత్వాన్ని, అశుద్ధత్వాన్ని, అనేకత్వాన్ని కలుగుచేస్తోందే కాని, దాని స్వభావమైన చైతన్యస్వరూపానికి ఏవిధమైన మార్పును కలిగించదు. అదేవిధంగా, పురుషునికి భోక్తృత్వం అన్నది తన స్వభావంలోనే ఉన్నందువల్ల, ఆత్మతత్త్వంలో కలిగే మార్పు ఆ చైతన్యస్వరూపాన్ని ప్రభావితం చేయదు. వేదవాదులైన మీరు ఆత్మకు సృష్టికర్తృత్వాన్ని చెప్పడం వల్ల, ఆ కర్తృత్వం ఆత్మతత్త్వంలో మార్పును కలిగించి అనిత్యత్వాది దోషాలను కలిగిస్తోంది కదా!

<u>**సమాధానం**</u> : కాదు. ఎందుకంటే, ఆత్మ ఒకటే అయినప్పటికీ, అవిద్యా విషయాలైన నామరూపాలచే ఉపాధులు కలగటం ఉపాధులు లేకపోవడం అనే విశేషాలు ఆత్మకు ఆపాదింపబడుతున్నాయి కాబట్టి. అవిద్యవల్ల కలిగిన నామరూప ఉపాధుల కారణంగానే ఆత్మయందు విశేషణాలను ఆరోపించడంవల్ల, బంధము-మోక్షము వంటి శాస్త్ర వ్యవహారాలు సంభవమౌతున్నాయి. నిజానికి ఉపాధుల ప్రమేయం లేని, రెండవదనేదే లేని తత్త్వం ఒక్కటే పొందవలసినది. అదియే సకల తార్కిక బుద్ధికి అందనిది, పుట్టుకలేనిది, భయరహితమైనది, మంగళకరమైనది. అక్కడ కర్తృత్వం, భోక్తృత్వం లేదా క్రియ-కారకం-ఫలం అనేవి కూడా లేవు, సకల భావనలూ ఆ అద్వయ తత్త్వంలో ముగుస్తాయి. సాంఖ్యులైతే, మొదట పురుషునియందు అవిద్యచే కర్తృత్వమూ మరియు క్రియ-కారకం-ఫలాలనేవి అధ్యారోపితమైనవనే భావించినప్పటికీ, వేదబాహ్యమైనందుచేత వారు ఆ భావననుండి వెనుతిరిగి భోక్తృత్వం అనేది పురుషుని యొక్క యదార్థమైన స్వభావమే అని అన్నారు. పురుషునికి బాహ్యంగా భిన్నతత్త్వమైన ప్రధానాన్ని యదార్థవస్తువుగా భావించి, ఇతర తార్కికులచే అల్లబడిన బుద్ధి కల్పనలలో మునిగిపోయి, వారి స్థితినుండి తప్పిపోయారు. అదేవిధంగా ఇతర తర్కవాదులు కూడా సాంఖ్యులవల్ల ఎటూకాని వారైనారు. ఈ విధంగా పరస్పర విరుద్ధమైన వాదనలు కల్పించుకొన్నవారై, మాంసం కోసం పోరాడుకొనే మృగాలలాగా, ప్రామాణికమైన వాక్యాలకు ఒకదాని కొకటి వైరుధ్యమైన వ్యాఖ్యానాలను చేస్తూ ముందుకు సాగలేక, వారు పరమార్థ తత్వానికి దూరంగా తీసుకుపోబడుతున్నారు. అందుచేత, అటువంటి అభిప్రాయాలను నిరాకరించి ఉపనిషత్తుల యదార్థతత్త్వమైన ఆత్మ యొక్క అద్వయ స్థితిని ముముక్షువులు అందుకోవాలనే ఉద్దేశ్యంతో తార్కిక మత సిద్ధాంతాలలోని కొన్ని దోషాలను తెలియచెప్తున్నామే కాని, తార్కిక మతాలను నిందించడం మా ఉద్దేశ్యం కాదు. ఆవిధంగానే ఈ సందర్భంలో ఇలా చెప్పబడింది. 'వేదవేత్త వివాదాలలో విరోధాలు ఏర్పడటానికి మూలమైన వాటిని విస్మరించి మరియు వాటిలోని సదుద్దేశ్యాలను సంరక్షించుకొంటూ సుఖంగా ఉంటాడు' ['వివదత్స్వేవ నిక్షిప్య విరోధోద్భవకారణం తైః సంరక్షిసద్బుద్ధిః సుఖం నిర్వాతి వేదవిత్'].

మరింకా, భోక్తృత్వం-కర్తృత్వం అనే మార్పులలో తేడా ఉండే అవకాశం కూడా లేదు. పురుషుడు భోక్తయే కాని కర్త కాదని, ప్రధానం కర్త మాత్రమే కాని భోక్త కాదనీ చెప్పడానికి కర్తృత్వ, భోక్తృత్వాలనే మార్పులలో ఏ విభిన్నత ఉంది కనుక?

సాంఖ్యవాది : పురుషుడంటే చైతన్యం మాత్రమేనని, అతని తత్వంలో మార్పేమీ జరగదని, తన స్వస్థితిలో ఉంటూనే అనుభవ రూపంగా మార్పును పొందుతాడని మేము చెప్పాం కదా! దానిని భిన్నంగా ప్రధానమైతే వేరొక తత్త్వంగా పరిణామం చెందడమనే మార్పును పొందుతుంది. అందుచేత, ప్రధానం అనేదానికి అనేకత్వం, అశుద్ధత్వం, అచేతనం వంటి ధర్మాలు కలుగుతున్నాయి. పురుషుడు దీనికి భిన్నం.

వేదాంతవాది : ఆ తేడా కేవలం మాటలోనే కాని, నిజానికి లేదు. భోగమనేది పుట్టక మునుపు కేవలం చేతనం మాత్రమే అయిన పురుషునికి భోక్తృత్వం అనే అనుభవ విశేషం భోగం ఉత్పన్నమయ్యే కాలంలో కలిగి, ఆ భోగం పూర్తి కాగానే తిరిగి ఆ అనుభవ విశేషంనుండి స్వేచ్ఛను పొందటం అనేది సంభవించేటట్లైతే, మహత్తు రూపంగా పరిణమించిన ప్రధానం ఆ పరిణామంనుండి వెనుతిరిగి తన ప్రధాన స్వరూపంలోకి చేరుతుంది అని భావించినట్లైతే, (పురుషునికి కలిగి తొలగిపోయే అనుభవ విశేషానికి, ప్రధానానికి కలిగి తొలగిపోయే పరిణామానికి మధ్య) వాటి మధ్య నిజానికి తేడా ఏముంది? కేవలం వాక్కులో మాత్రమే పురుషునికి ప్రధానానికి కలిగే మార్పులకు తేడా చెప్తున్నారు తప్ప.

ఇక భోగకాలంలో కూడా పూర్వం లాగానే పురుషుడు కేవలం చేతనంగానే ఉంటాడని చెప్పినా, అప్పుడు కూడా నిజానికి భోగానుభవమనేది ఉండదు.

సాంఖ్యవాది : భోగకాలంలో శుద్ధ చైతన్యంలో మార్పు అనేది యదార్థమే, ఆ భోగం పురుషునిదే.

వేదాంతవాది : కాదు. ఎందుకంటే, భోగకాలంలో ప్రధానం కూడా మార్పుకు లోనయి, దానికి కూడా భోక్తృత్వం సంభవం కావచ్చు.

సాంఖ్యవాది : భోక్తృత్వం కేవలం చైతన్యంలోని అనుభవమే (ఆ భోక్తృత్వం అనే అనుభవం ప్రధానానిది కాదు).

వేదాంతవాది : అలాగైతే, ఉష్ణం వంటి అసాధారణ ధర్మాలు కలిగిన అగ్ని వంటివాటికి భోక్తృత్వం లేకపోవడం అనే అహేతుకం ఏర్పడుతోంది.

సందేహం : పురుషునికి మరియు ప్రధానానికి రెండింటికి కూడా భోక్తృత్వం ఉండేటట్లైతే?

వేదాంతవాది : కాదు. ఎందుకంటే, ప్రధానం తనకు పరమైనదాని కొరకు పనిచేయడం అన్నది కుదరదు. (సాంఖ్యుల సిద్ధాంతం ప్రకారం ప్రధానం అన్నది పురుషుని ప్రయోజనాలకోసం పనిచేస్తోంది. కాబట్టి, పురుషుడు మరియు ప్రధానం రెండూ ఒకే అనుభవాన్ని పొందటం అనేది సాంఖ్యుల సిద్ధాంతానికి వ్యతిరేకమౌతుంది). రెండు ప్రకాశాలు ఎలాగైతే ఒకదానినొకటి ప్రకాశింప చేసుకోవో, అలాగా ఇద్దరు సహభోక్తలు ఉండేటట్లైతే వారిలో ఒకరు మిన్న మరొకరు తక్కువ అనేది చెప్పటడం కుదరదు.

<u>సందేహం</u> : పురుషుని యొక్క చైతన్య ప్రతిబింబం, సత్వ గుణ ప్రధానమైన మనసులో ఉత్పన్నం కావడం వల్ల మార్పులేని పురుషునికి భోక్తృత్వం కలుగుతోంది అనుకోవచ్చు కదా!

<u>వేదాంతవాది</u> : కాదు. ఎందుకంటే, పురుషునికి ఎటువంటి విశేషణాలు లేనందున, భోక్తృత్వాన్ని కల్పించడమనేది అర్థరహితం కాబట్టి. పురుషునికి భోగరూపంగా ఎటువంటి దోషం లేకపోతే, ఎల్లప్పుడూ ఎటువంటి విశేషణాలు లేని పురుషుని నుండి దేనిని తొలగించడానికి మోక్షాన్ని సాధనంగా వేదం చెప్పింది?

<u>సందేహం</u> : అవిద్యచేత ఆరోపించబడిన దోషాన్ని తొలగించడానికని శాస్త్రాలు చెప్పాయి కదా!

<u>సమాధానం</u> : అలాగయితే, నిజానికి పురుషుడు భోక్తయేనని కర్త కాదని, ప్రధానం కర్తమాత్రమేనని భోక్త కాదని, ఆ ప్రధానం నిజానికి పురుషునికన్నా భిన్నమనే ఈ వాదనలన్నీ వేదబాహ్యమైనవి, వ్యర్థమైనవి మరియు హేతుత్వం లేనివి కాబట్టి, మోక్షాన్ని కోరేవారు ఈ భావనలను పరిగణించరాదు.

<u>సందేహం</u> : ఏకమే అయినప్పుడు కూడా శాస్త్ర నిర్మాణమే అర్థంలేనిదే అవుతుంది కదా!

<u>సమాధానం</u> : కాదు. ఎందుకంటే, అద్వయస్థితిలో అటువంటి విషయమే సంభవించదు కాబట్టి. శాస్త్ర నిర్మాణం ఉపయుక్తమా కాదా అన్న ప్రశ్న, దాని నుండి ఏదైనా ప్రయోజనాన్ని ఆశించి శాస్త్రాన్ని నిర్మించేవారు కాని మరి ఎవరైనా కానీ ఉన్నప్పుడు మాత్రమే, రేకెత్తుతుంది. కాని, అద్వయ స్థితిలో, ఆత్మకు భిన్నంగా శాస్త్రనిర్మాతలు కాని మరింకెవరుగానీ ఉండరు. అలా లేనప్పుడు, ఏ విధమైన వికల్పానికి అంటే సందేహానికి అవకాశం లేదు. ఆత్మయొక్క ఏకత్వమందు మీకు స్థిరమైన నిశ్చయం కలిగినందున, ఆవిధమైన అనుభవానికి శాస్త్రం సరియైన ప్రమాణమని మీరు అంగీకరించినట్లైంది. అలా అంగీకరించబడిన ఆత్మయొక్క అద్వయస్థితిలో సందేహం ఉండదని 'ఎక్కడైతే సకలమూ ఆత్మగా అవుతోందో, అపుడు ఏది దేనిని చూస్తుంది' ['యత్ర త్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం పశ్యేత్' (బృ.ఉ. 4-5-14)] శాస్త్రం చెప్తోంది. పరమార్థ వస్తు స్వరూపానికి వేరుగా అవిద్య ప్రభావం వల్ల కలిగే విషయాలలో శాస్త్రాన్ని నిర్మించడం వంటివాటికి అవకాశం ఉన్నదని 'ఎక్కడైతే ద్వైతం ఉన్నట్లుగా ఉంటుందో' ['యత్ర హి ద్వైతమివ భవతి' (బృ. ఉ. 4| 5| 14) చాలా విస్తృతంగా వాజసనేయకంలో చెప్పింది. ప్రారంభంలో ఇక్కడ కూడా (అథర్వ వేదంలోని ముండకోపనిషత్తులోని 1-1-4వ మంత్రంలో కూడా) విద్య-అవిద్య అనీ పరం-అపరం (ఉన్నతమైన జ్ఞానం, దానికి ఇతరమైన జ్ఞానం) అని విభజించి చూపారు. అందుచేత, తార్కిక వాద సేనలకు, వేదాంతమనే రాజు యొక్క హస్తాలతో సంరక్షించ బడుతోన్న ఈ ఆత్మయొక్క అద్వయం అనే విషయంలోకి, ప్రవేశంలేదు. నామ-రూపాది ఉపాధుల వల్ల కలిగిన అనేక శక్తి సాధనాలచే ఉత్పన్నమైన భేదాలనే అవిద్య కారణంగా బ్రహ్మమునందు సృష్ట్యాది కర్తృత్వాలు మరియు సాధనలు లేకపోవడం వంటి దోషాలు కల్పించబడినాయని తెలిసికొని, వాటిని తిరస్కరించాలి. ఆపైన ఆత్మ తనకు తాను దోషాన్ని కల్పించుకొంటోంది అనే ఇతరుల వాదాన్ని కూడా త్రోసిపుచ్చాలి.

రాజుకు సేవలనందించే అధికారిని మర్యాదకు రాజుగా అభివర్ణించడమనే ఉదాహరణ ఇక్కడ సరిపడదు. ఎందుకంటే, 'స ఈక్షాంచక్రే' అన్న శ్రుతి వాక్యం ప్రామాణికమైన జ్ఞానాన్ని

అందించడమనే ముఖ్యార్థానికి ఈ ఉదాహరణ వ్యతిరేకంగా ఉన్నది కాబట్టి. వాక్యం యొక్క ముఖ్యార్థం సంభవం కాకపోతేనే గౌణార్థాన్ని స్వీకరించాలి. కాని ఇక్కడైతే, పురుషుని యొక్క ముక్తత్వం-బద్ధత్వం అనే ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకొని, బంధం-మోక్షం వంటి ప్రయోజనాలను కర్త-కర్మ-దేశ-కాల నిమిత్తాలకు అనుగుణంగా ఆ పురుషునికి అచేతనమైన ప్రధానం యొక్క ప్రవృత్తి కలిగించడమనేది సంభవించదు. {ఉదాహరణలో చెప్పిన అధికారి రాజులాగా వ్యవహరించి అసలైన రాజుకు సేవలందించడం అనే పోలిక ఇక్కడ సంభవంకాదు. కాబట్టి, ఉదాహరణ సరియైనది కాదని అభిప్రాయం}. ఇదంతా సర్వజ్ఞుడైన ఈశ్వరుని యొక్క కర్తృత్వమే అని ముందు చెప్పినదే సమంజసం.

రాజులాగా, పురుషునిచే మాత్రమే, సర్వాధికారియైన ప్రాణం సృజించబడింది. ఎలా?

స ప్రాణమసృజత ప్రాణాచ్ఛ్రద్ధాం ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీన్ద్రియం మనః|
అన్నమన్నాద్వీర్యం తపో మన్త్రాః కర్మ లోకా లోకేషు చ నామ చ|| || 6-4 ||

అతడు ప్రాణాన్ని సృజించాడు. ప్రాణం నుండి శ్రద్ధను, ఆకాశాన్ని, వాయువును, అగ్నిని, జలాన్ని, పృథివిని, ఇంద్రియాలను, మనసును, అన్నాన్ని (సృజించాడు). అన్నం నుండి వీర్యాన్ని, తపస్సును, మంత్రాలను, కర్మలను, లోకాలను మరియు లోకాలలోని నామాలను కూడా (సృజించాడు).

<u>శంకరుల భాష్యం</u>

సః పురుషః ఉక్తప్రకారేణేక్షిత్వా సర్వప్రాణం హిరణ్యగర్భాఖ్యం సర్వప్రాణికరణాధారమంతరాత్మానం అసృజత సృష్టవాన్| తతః ప్రాణాత్ శ్రద్ధాం సర్వప్రాణినాం శుభకర్మప్రవృత్తిహేతుభూతాం ; తతః కర్మఫలోపభోగసాధనాధిష్ఠానాని కారణభూతాని మహాభూతాని అసృజత — ఖం శబ్దగుణకం , వాయుః స్వేన స్పర్శగుణేన శబ్దగుణేన చ విశిష్టో ద్విగుణః, తథా జ్యోతిః స్వేన రూపేణ పూర్వగుణాభ్యాం చ విశిష్టం శబ్దస్పర్శాభ్యాం త్రిగుణం , తథా ఆపో రసగుణేనాసాధారణేన పూర్వగుణానుప్రవేశేన చ చతుర్గుణాః, తథా గంధగుణేన పూర్వగుణానుప్రవేశేన చ పంచగుణా పృథివీ, తథా తైరేవ భూతైరారబ్ధం ఇంద్రియం ద్విప్రకారం బుద్ధ్యర్థం కర్మార్థం చ దశసంఖ్యాకం , తస్య చేశ్వరమంతఃస్థం సంశయవికల్పాదిలక్షణం మనః| ఏవం ప్రాణినాం కార్యం కరణం చ సృష్ట్వా తత్స్థిత్యర్థం వ్రీహియవాదిలక్షణం అన్నం , తతశ్చ అన్నాత్ అద్యమానాత్ వీర్యం సామర్థ్యం బలం సర్వకర్మప్రవృత్తిసాధనం , తద్వీర్యవతాం చ ప్రాణినాం తపః విశుద్ధిసాధనం సంకీర్యమాణానాం , మంత్రాః తపోవిశుద్ధాంతర్బహిఃకరణేభ్యః కర్మసాధనభూతా ఋగ్యజుఃసామాథర్వాంగిరసః ; తతః కర్మ అగ్నిహోత్రాదిలక్షణం , తతో లోకాః కర్మణాం ఫలం , తేషు చ లోకేషు సృష్టానాం ప్రాణినాం నామ చ దేవదత్తో యజ్ఞదత్త ఇత్యాది| ఏవమేతాః కలాః ప్రాణినామవిద్యాదిదోషబీజాపేక్షయా సృష్టాస్తైమిరికదృష్టిసృష్టా ఇవ ద్విచంద్రమశకమక్షికాద్యాః స్వప్నదృక్సృష్టా ఇవ చ సర్వపదార్థాః పునస్తస్మిన్నేవ పురుషే ప్రలీయంతే హిత్వా నామరూపాదివిభాగం ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

సః ఆ పురుషుడు ముందు చెప్పిన విధంగా ఆలోచన చేసి హిరణ్యగర్భుడని పిలువబడే సమిష్టి ప్రాణాన్ని, అంటే సకల ప్రాణుల అవయవాలకు ఆధారమై వాటి అంతరాత్మగా ఉండేదాన్ని, **అసృజత** సృష్టిచేశాడు. ఆ తరువాత, **ప్రాణాత్** ప్రాణం నుండి **శ్రద్ధామ్** శుభకర్మల ప్రవృత్తికి కారణమైన శ్రద్ధను, తరువాత కర్మ ఫల భోగానికి సాధనాలైన వాటి అధిష్టానాలకు కారణరూపాలైన పంచ మహాభూతాలను సృజించాడు. **ఖమ్** శబ్ద గుణంగల ఆకాశాన్ని, **వాయుః** తన స్వగుణమైన స్పర్శ మరియు దాని కారణమైన ఆకాశానికి సంబంధించిన శబ్ద గుణ విశేషంతో కలిపి (శబ్ద-స్పర్శ) లనే రెండు గుణాలు కల వాయువును, అదే విధంగా జ్యోతిః తన స్వగుణమైన రూపంతోనూ, శబ్ద-స్పర్శలనే పూర్వగుణ విశేషాలతో కలిసి (శబ్ద-స్పర్శ-రూపాలనే) మూడు గుణాలు గల అగ్నిని, అలాగే **ఆపః** తన సాధరణ గుణమైన రసాన్ని మరియు శబ్ద-స్పర్శ-రూపాలనే పూర్వగుణ విశేషాలతో కలిసి (శబ్ద-స్పర్శ-రూప-రసాలనే) నాలుగు గుణాలు కల నీటిని, అలాగే **పృథివీ** గంధ గుణంతో పాటుగా శబ్ద-స్పర్శ-రూప-రసాలనే పూర్వగుణ విశేషాలతో కలిసి (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాలనే) ఐదు గుణాలు కల భూమిని, అదేవిధంగా **ఇన్ద్రియమ్** ఆ పంచ మహాభూతాలతో కూర్చబడి జ్ఞానం కోసం మరియు కర్మల కోసం రెండు రకాలైన అవయవాలను, (5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలను) మొత్తం పదింటిని, **మనః** వాటి యొక్క అధిపతిగా శరీరం లోపల సంశయం మరియు ఆలోచనా ప్రవృత్తి గల మనస్సును (సృజించాడు). ఈ విధంగా ప్రాణుల యుందు కార్య-కారణాలను సృష్టించి, వాటిని నిలబెట్టడం కోసం **అన్నమ్** వరి, బార్లీ ధాన్యాలవంటి అన్నాన్ని (సృజించాడు). మరి తరువాత, **అన్నాత్** తినబడేటటువంటి వాటినుండి **వీర్యమ్** సకల కర్మలను నిర్వర్తించడానికి సాధనమైన సామర్థాన్ని, బలాన్ని, మరియు ఆ సామర్థ్యం నుండి **తపః** సంక్లిష్టత కలిగిన జీవులు తమను తాము సంస్కరించుకొనేందుకు సాధనమైన ఆత్మ నిగ్రహ రూపమైన తపస్సును, **మన్త్రాః** తపస్సు చేత బాహ్య-అంతర ఇంద్రియాలను నిగ్రహించుకొనిన వానికి, సాధనాలైన ఋుక్, యజుస్సు, సామ, అథర్వాంగిరసాది మంత్రాలను, తరువాత **కర్మ** అగ్నిహోత్రాది లక్షణమైన కర్మలను, తరువాత **లోకాః** కర్మలకు ఫలితాలైన లోకాలను, **లోకేషు చ** మరి ఆ సృష్టించబడిన లోకాలలోని ప్రాణులలో **నామ చ** దేవదత్తుడు, యజ్ఞదత్తుడు వంటి పేర్లను (సృజించాడు). ఇవియే అవిద్యవంటి దోష కారణంగా - తిమిరత్వమనే దోష దృష్టి చేత రెండు చంద్రులు, దోమలు, ఈగలు మొదలైనవి కనబడినట్లుగా లేదా స్వప్నంలో సకల వస్తువులనూ చూసినట్లుగా - ప్రాణులలో సృష్టించబడిన కళలు లేద అంశలు. మరలా ఇవన్నీ ఈ నామరూపాది విభాగాలను విడిచిపెట్టి ఆ పురుషునియందే విలీనమౌతున్నాయి.

స యథేమా నద్యః స్యన్దమానాః సముద్రాయణాః సముద్రం ప్రాప్యాస్తం గచ్ఛన్తి భిద్యేతే తాసాం నామరూపే సముద్ర ఇత్యేవం ప్రోచ్యతే| ఏవమేవాస్య పరిద్రష్టురిమాః షోడశ

కలాః పురుషాయణాః పురుషం ప్రాప్యాస్తం గచ్ఛన్తి భిద్యేతే చాసాం నామరూపే పురుష ఇత్యేవం ప్రోచ్యతే స ఏషోఽకలోఽమృతో భవతి తదేష శ్లోకః|| || 6-5 ||

ఎలాగైతే ఈ నదులు సముద్రమే గమ్యంగా ప్రవహించి, సముద్రాన్ని చేరి తమ నామ రూపాలను కోల్పోయి దానిలోనే కలిసిపోయి, సముద్రంగాచే పిలువబడతాయో, అదేవిధంగా, సర్వద్రష్టైన పురుషునియొక్క ఈ పదహారు కళలు, పురుషుడినే చేరి, వాటి నామరూపాలను నిర్మూలించుకొని అతనిలోనే లీనమై పురుషుడనే పిలువబడుతాయి. అటువంటి మానవుడు కళలనుండి స్వేచ్ఛనుపొంది అమృతుడౌతాడు. దీని గురించి ఈ మంత్రం ఒకటి ఉన్నది.

శంకరుల భాష్యం

సః దృష్టాంతః, యథా లోకే ఇమా నద్యః స్యందమానాః స్రవంత్యః సముద్రాయణాః, సముద్ర ఏవ అయనం గతిరాత్మభావో యాసాం తాః సముద్రాయణాః, సముద్రం ప్రాప్య ఉపగమ్య అస్తం అదర్శనం నామరూపతిరస్కారం గచ్ఛంతి ; తాసాం చాస్తం గతానాం భిద్యేతే వినశ్యేతే నామరూపే గంగా యమునేత్యాదిలక్షణే ; తదభేదేన సముద్ర ఇత్యేవం ప్రోచ్యతే తద్వస్తూదకలక్షణం ; ఏవం యథాయం దృష్టాంతః ఉక్తలక్షణస్య ప్రకృతస్య అస్య పురుషస్య పరిద్రష్టుః పరి సమంతాద్ద్రష్టుర్దర్శనస్య కర్తుః స్వరూపభూతస్య| యథా అర్కః స్వాత్మప్రకాశస్య కర్తా సర్వతః, తద్వత్ ఇమాః షోడశ ప్రాణాద్యా ఉక్తాః కలాః పురుషాయణాః నదీనామివ సముద్రః పురుషోఽయనమాత్మభావగమనం యాసాం కలానాం తాః పురుషాయణాః పురుషం ప్రాప్య పురుషాత్మభావముపగమ్య తథైవాస్తం గచ్ఛంతి| భిద్యేతే చ ఆసాం నామరూపే కలానాం ప్రాణాద్యాఖ్యా రూపం చ యథాస్వం| భేదే చ నామరూపయోర్యదనష్టం తత్తత్త్వం పురుషః ఇత్యేవం ప్రోచ్యతే బ్రహ్మవిద్భిః| య ఏవం విద్వాన్గురుణా ప్రదర్శితకలాప్రలయమార్గః, స ఏషః విద్యయా ప్రవిలాపితాస్వవిద్యాకామకర్మజనితాసు ప్రాణాదికలాసు అకలః అవిద్యాకృతకలానిమిత్తో హి మృత్యుః ; తదపగమేఽకలత్వాదేవ అమృతః భవతి| తదేతస్మిన్నర్థే ఏషః శ్లోకః ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

సః ఉదాహరణగా లోకంలో, **యథా** ఎలాగైతే **ఇమాః స్యన్దమానాః నద్యః** ఈ ప్రవహించే నదులు **సముద్రాయణాః** సముద్రమే గమ్యంగా పయనించేవి, **సముద్రమ్ ప్రాప్య** సముద్రాన్ని చేరి **అస్తమ్ గచ్ఛన్తి** కనపడకుండా పోతాయి. **తాసామ్** కనుపించకుండా పోయిన వాటి యొక్క **నామరూపే** గంగ-యమున అనే నామ రూప లక్షణాలు **భిద్యేతే** పూర్తిగా నశిస్తాయి. ఆ కలిసిపోవడం అనే అభేదం వల్ల వాటి వస్తుపైన జలాన్ని **సముద్ర ఇత్యేవం ప్రోచ్యతే** సముద్రమనే అంటారు. **ఏవమ్ ఏవ** ఈ ఉదాహరణలో చెప్పిన మాదిరిగానే, **పరిద్రష్టుః** అన్నింటా సమానమై దృష్టి కలిగి కర్తగా ఉన్నట్టి **అస్య** ఆ పురుషుని యొక్క. ఎలాగైతే సూర్యుడు తన ఆత్మవంటి స్వప్రకాశానికి తాను కర్తగా అన్నింటిని దర్శిస్తున్నాడో, ఆ

విధంగా **ఇమాః షోడశ కలాః** ఈ చెప్పబడిన ప్రాణం మొదలైన పదహారు కళలు **పురుషాయణాః** సముద్రంలో కలిసే నదులలాగా, **పురుషమ్ ప్రాప్య** పురుషుడే తామనే భావాన్ని పొంది అలాగే **అస్తమ్ గచ్ఛన్తి** కనిపించకుండా పోతాయి. **చ ఆసామ్** వాటి యొక్క, ఆ కళల యొక్క **నామరూపే** ప్రాణం మొదలుగా గల పేర్లు, రూపాలు కూడా **భిద్యేతే** నశిస్తాయి. ఎప్పుడైతే నామరూపాలు తొలగిపోతాయో, అప్పుడు నశించకుండా మిగిలి ఉన్న తత్త్వాన్ని **పురుషః ఇతి ఏవమ్ ప్రోచ్యతే** పురుషుడనే బ్రహ్మవేత్తలు అంటారు. ఎవడైతే ఈ పదహారు కళలు పురుషునియందు కలిసిపోయే విధానాన్ని గురువు ద్వారా తెలుసుకొంటాడో **స ఏషః** ఆ విద్వాంసుడు ఆ జ్ఞానంచేత తన యొక్క అవిద్య-కామం-కర్మల వల్ల పుట్టిన ప్రాణాది కళలను విలీనంచేసుకొన్నందున **అకలః** కళలు లేనివాడై **అమృతః భవతి** మృతిలేని వాడౌతాడు. అవిద్యవల్ల కలిగినదే కళ. ఆ కళ కారణంగా కలిగేదే మృత్యువు. ఆ కళ తొలగిపోవడమే అకళత్వం కాబట్టి, మృత్యువు కూడా తొలగిపోతుంది. ఆవిధంగా అమృతుడౌతాడు అని అభిప్రాయం. ఇదే భావాన్ని ప్రకటించే ఈ మంత్రం చెప్పబోతున్నారు.

అరా ఇవ రథనాభౌ కలా యస్మిన్ప్రతిష్ఠితాః| తం వేద్యం పురుషం వేద యథా మా వో మృత్యుః పరివ్యథా ఇతి|| || 6-6 ||

రథనాభికి కూర్చబడిన కమ్మీలలాగా ఎవనియందు కళలు ప్రతిష్ఠితమై ఉన్నాయో, ఆ పురుషుడిని నీవు తెలుసుకొంటే, నిన్ను మృత్యువు నిశ్చయంగా బాధించదు.

శంకరుల భాష్యం

అరా ఇవ రథచక్రపరివారా ఇవ రథనాభౌ రథచక్రస్య నాభౌ యథాప్రవేశితాః తదాశ్రయా భవంతి యథా, తథేత్యర్థః| కలాః ప్రాణాద్యాః యస్మిన్ పురుషే ప్రతిష్ఠితాః ఉత్పత్తిస్థితిలయకాలేషు, తం పురుషం కలానామాత్మభూతం వేద్యం వేదనీయం పూర్ణత్వాత్పురుషం పురి శయనాద్వా వేద జానాతి ; యథా హే శిష్యాః, మా వాః యుష్మాన్ మృత్యుః పరివ్యథాః మా పరివ్యథయతు| న చేద్విజ్ఞాయేత పురుషో మృత్యునిమిత్తాం వ్యథామాపన్నా దుఃఖిన ఏవ యూయం స్థ| అతస్తన్మాభూద్యుష్మాకమిత్యభిప్రాయః ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

అరా ఇవ కమ్మీలు మరియు రథానికి సంబంధించిన ఇతర అమరికలు, **రథనాభౌ** రథచక్రానికి మధ్యలో ఎలాగైతే కూర్చబడి, ఆ రథచక్రంపైనే ఆధారపడి ఉంటాయో అదేవిధంగా అని అర్థం. **కలాః** ప్రాణాది కళలు **యస్మిన్** ఉత్పత్తి-స్థితి-లయ కాలాలలో ఏ పురుషునియందైతే **ప్రతిష్ఠితాః** స్థిరంగా ఉంటాయో, **తమ్ పురుషమ్** కళలలోని ఆత్మగా ఉన్న ఆ పురుషుడే **వేద్యమ్** తెలియవలసినవాడని,

పూర్ణుడైనందున పురుషుడని లేదా పురంలో శయనించేవాడైనందున పురుషుడని **వేద** తెలుసుకో. **యథా** అలాగైతే ఓ శిష్యులారా, **మృత్యుః** మృత్యువు **వాః** మిమ్ములను **మా పరివ్యథాః** ఏ విధంగానూ బాధించదు. ఆ పురుషుని గురించి తెలుసుకొనలేక పోయినట్లైతే, మృత్యువు కారణంగా బాధను పొంది మీరు దుఃఖితులౌతారు. అందుచేత, మీరు అలా కాకుందురు గాక అని అభిప్రాయం.

తాన్హోవాచైతావదేవాహమేతత్పరం బ్రహ్మ వేద నాతః పరమస్తీతి|| || 6-7 ||

వారితో (శిష్యులతో) పిప్పలాదుడు "పరబ్రహ్మమును గురించి నాకు తెలిసింది ఇంతమాత్రమే. ఇంతకు మించి మరేమీ లేదు" అని అన్నాడు.

శంకరుల భాష్యం

తాన్ ఏవమనుశిష్య శిష్యాన్ తాన్ హోవాచ పిప్పలాదః కిల ఏతావదేవ వేద్యం పరం బ్రహ్మ వేద విజానామ్యహమేతత్| న అతః అస్మాత్ పరం అస్తి ప్రకృష్టతరం వేదితవ్యం ఇత్యేవముక్తవాన్ శిష్యాణామవిదితశేషాస్తిత్వాశంకానివృత్తయే కృతార్థబుద్ధిజననార్థం చ ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఆ విధంగా శిష్యులకు బోధించిన పిమ్మట, **తాన్** ఆ శిష్యులతో పిప్పలాదుడు **ఉవాచ హ** ఇలా అన్నాడు. "**ఏతావత్ ఏవ** ఇంత మాత్రమే **ఏతత్ పరమ్ బ్రహ్మ** తెలియదగిన ఈ పరబ్రహ్మను గురించి **అహమ్ వేద** నాకు తెలిసింది. అతః పరమ్ ఇంతకన్నా మించినది తెలియదగినది **న అస్తి** లేదు." శిష్యులకు తెలియతగినది ఇంతేకాక ఇంకా ఏదైనా ఉన్నదేమో అనే సంశయాన్ని నివృత్తి చేయడానికి మరియు వారిలో కృతార్థులమైనామనే భావనను కలిగించడానికే అచార్యుడు ఇలా చెప్పాడు.

తే తమర్చయన్తస్త్వం హి నః పితా యోఽస్మాకమవిద్యాయాః పరం పారం తారయసీతి| నమః పరమఋషిభ్యో నమః పరమఋషిభ్యః|| || 6-8 ||

వారు ఆయనను (పిప్పలాదుడిని) పూజించి అతనితో ఇలా అన్నారు. "మమ్ములనుఅవిద్యనుండి దాటించి ఆవలి తీరానికి చేర్చిన మీరే నిజానికి మాకు తండ్రి. పరమ ఋషులకు నమస్కారము. పరమ ఋషులకు నమస్కారము."

శంకరుల భాష్యం

తతః తే శిష్యా గురుణానుశిష్టాః తం గురుం కృతార్థాః సంతో విద్యానిష్క్రయమన్యదపశ్యంతః కిం కృతవంత ఇత్యుచ్యతే — అర్చయంతః పూజయంతః పాదయోః పుష్పాంజలిప్రకిరణేన ప్రణిపాతేన చ శిరసా| కిమూచురిత్యాహ — త్వం హి నః అస్మాకం పితా బ్రహ్మశరీరస్య విద్యయా జనయితృత్వాన్నిత్యస్యాజరామరణస్యాభయస్య| యః

త్వమేవ అస్మాకం అవిద్యాయాః విపరీతజ్ఞానాజ్జన్మజరామరణరోగదుఃఖాదిగ్రాహాదపారాదవిద్యామహోదధేర్విద్యాప్లవేన పరం అపునరావృత్తిలక్షణం మోక్షాఖ్యం మహోదధేరివ పారం తారయసి అస్మానిత్యతః పితృత్వం తవాస్మాన్ప్రత్యుపపన్నమితరస్మాత్| ఇతరోఽపి హి పితా శరీరమాత్రం జనయతి, తథాపి స పూజ్యతమో లోకే ; కిము వక్తవ్యమాత్యంతికాభయదాతురిత్యభిప్రాయః| నమః పరమఋషిభ్యః బ్రహ్మవిద్యాసంప్రదాయకర్తృభ్యః| నమః పరమఋషిభ్య ఇతి ద్విర్వచనమాదరార్థం ||

శంకరుల భాష్యానికి తెలుగు అనువాదం

ఆ శిష్యులు వారి అభీష్టం తీరిన వారై, గురువు బోధించిన జ్ఞానానికి తగిన ప్రతిఫలంగా ఇవ్వదగినదేదీ కనిపించక, ఏం చేశారో చెప్తున్నారు. తరువాత గురువుచే బోధించబడిన **తే** వారు, అంటే శిష్యులు **తమ్** గురువును అర్చయన్తః ఆచార్యుని పాదాలకు పుష్పాంజలు సమర్పించి, శిరసుతో సహా సాష్టాంగ ప్రణామం చేసి పూజించారు. తరువాత ఆ శిష్యులు గురువుతో ఏమి అన్నారో చెప్తున్నారు. **త్వమ్ హి నః** మీరే మాకు **పితా** తండ్రి, జ్ఞానంద్వారా నిత్యమైన, జర-మరణ-భయం లేని పరబ్రహ్మలోనే మేము జన్మించేలా చేసిన మీరే మాకు తండ్రి. జ్ఞానమనే తెడ్డు సహాయంతో, **అవిద్యాయాః** దోషపూరితమైన జ్ఞానం వల్ల కలిగిన జర-మరణ-రోగ-దుఃఖాల వంటి మొసళ్ళలతో నిండిన విశాలమైన అజ్ఞానమనే మహాసాగరం యొక్క **పరమ్** తిరిగి జన్మించపోవడమనే లక్షణం కలిగిన మోక్షమనబడే **పారమ్** ఆవలి తీరానికి **తారయసి** మమ్ములను చేర్చారు కనుక మీరు మాపట్ల ప్రదర్శించిన పితృత్వం ఇతరముల కన్నా మిన్నయైనది. ఇతర తండ్రులు కేవలం శరీరాన్ని మాత్రమే ఇచ్చిన సాధారణ తండ్రులే లోకంలో పూజనీయులు. ఇక దురితాలనుండి కడతేర్చి అభయాన్ని ప్రసాదించిన మీగురించి ఏమి చెప్పగలం? అదీ అభిప్రాయం (దేహాన్నిచ్చిన సాధారణ తండ్రులే పూజనీయులై ఉండగా, అంతకన్నా మించిన బ్రహ్మపదానికి చేర్చిన ఆచార్యులైన మీరు ఎన్నో రెట్లు ఆరాధనీయులు అని అభిప్రాయం). **పరమ ఋషిభ్యః** పరమ ఋషివరులకు **నమః** నమఃస్కారములు. బ్రహ్మవిద్యను సంప్రదాయానుసారంగా అందించడంలో మూలపురుషులైన వారికి నమఃస్కారములు. **నమః పరమ ఋషిభ్యః** అని రెండవ మారు చెప్పడం వారికి మర్యాదను ప్రకటించడమే.

ప్రార్థన

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవా భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః | స్థిరైరఙ్గైస్తుష్టువాగ్ంసస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః ||

స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః | స్వస్తి నః పూషా విశ్వవేదాః | స్వస్తి నస్తార్ క్ష్యో అరిష్టనేమిః | స్వస్తి నో బృహస్పతిర్దధాతు||

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః||

-: ఓం తత్సత్:-